అనుదినం... జనస్వరం

నవతెలంగాణ

శనివారం 20-5-2023

సమగ్ర తెలుగు దినపత్రిక





బీజేపీ ఎంపీని అరెస్టు చేయాల్సిందే

కొనసాగుతున్న రెజ్లర్ల ఆందోళన

వివరాలు 5లో..

- బ్రిజ్‌భూషణ్ అరెస్టుకు రేపటితో ముగియనున్న అల్టిమేటం
- ఆందోళనకు సచిన్ పైలట్, మహిళా సంఘాల సంఘీభావం

సంపుటి : 9 | సంచిక : 139 | Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar | www.navatelangana.com | 10 పేజీలు | వెల : 6.50

రూ.2,000 నోట్లు వెనక్కి

సెప్టెంబర్ 30 వరకు గడువు

- అప్పటి వరకు చలామణీలోనే..
- ఆర్‌బీఐ కీలక ఆదేశాలు





ముంబయి : రూ.2,000 నోట్లను ఉపసంహరించుకుంటున్నట్టు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) ప్రకటించింది. ఈ నోట్లను 2023 సెప్టెంబర్ 30 లోగా బ్యాంక్‌ల్లో మార్చుకోవచ్చని శుక్రవారం కీలక ఆదేశాలు జారీ చేసింది. అయితే అప్పటి వరకు పెద్ద నోట్లను లావాదేవీలకు ఉపయోగించుకోవచ్చని వెల్లడించింది. ఇకపై ఎవరికీ రూ.2వేల నోట్లను జారీ చేయవద్దని బ్యాంక్‌లకు ఆర్‌బీఐ ఆదేశాలు జారీ చేసింది. మే 23 నుంచి ఏ బ్యాంక్ శాఖలో అయినా ఈ నోట్లను మార్చుకోవడానికి ప్రజలకు వీలు కల్పించింది. అయితే.. ఒకసారి రూ.20,000 వరకు మాత్రమే ఈ నోట్లను మార్చుకునేందుకు వీలుంది. ఎలాంటి నిబంధన లేకుండా ఎంత మొత్తం అయినా డిపాజిట్ చేసుకునే అవకాశం ఉంది. దేశంలోని 19 ఆర్‌బీఐ ప్రాంతీయ కార్యాలయాల్లోనూ రూ.2వేల నోట్లు మార్చుకునే సౌలభ్యం కల్పించింది.

2016 నవంబర్ 8న ప్రధాని మోడీ అనుహ్యంగా రూ.500, రూ.1000 పెద్ద నోట్లను రద్దు చేస్తున్నామని ప్రకటించారు. వాటికంటే పెద్ద నోటు రూ.2000 తెచ్చిన విషయం తెలిసిందే. దీంతో నల్లధనం దాచుకునే వారికి మరింత సులభం అయ్యిందనే ఆరోపణలు వెల్లువెత్తాయి. ఆర్‌బీఐ యాక్ట్ 1934లోని సెక్షన్ 24(1) ప్రకారం.. 2016 నవంబర్‌లో రూ.2వేల నోటును ఆర్‌బీఐ చలామణిలోకి తీసుకొచ్చింది. మార్చి 2017 నాటికి మొత్తం కరెన్సీలో రూ.2000 నోట్ల వాటా విలువ 89 శాతంగా ఉంది. 2018 మార్చి 31 నాటికి రూ.6.73 లక్షల కోట్లు (37.3శాతం), 2023 మార్చి 31 నాటికి రూ.3.62 లక్షల కోట్లు లేదా 10.8 శాతానికి పెద్ద నోట్ల చలామణి తగ్గింది. 2018-19 నుంచి ఈ నోట్ల ముద్రణను ఆర్‌బీఐ పూర్తిగా నిలిపివేసింది. క్లీన్ నోట్ పాలసీలో భాగంగా రూ.2,000 నోట్లను చలామణీని వెనక్కి తీసుకోవాలని నిర్ణయించినట్టు ఆర్‌బీఐ ప్రకటించింది.

నకిలీ నోట్ల హల్‌చల్

రూ.2000 నోట్లను చలామణిలోకి తెచ్చిన తర్వాత దేశంలో నకిలీ నోట్ల బెడద వంద శాతం పైగా పెరిగింది. 2016లో రూ.500, రూ.1,000 నోట్లను రద్దు చేసి రూ.2 వేల నోట్లను ప్రవేశ పెట్టిన తర్వాత నకిలీ నోట్ల చలామణి ఏకంగా 107 రెట్లు పెరిగిందని స్వయంగా కేంద్ర ప్రభుత్వ గణంకాలే పేర్కొంటున్నాయి. 2016లో దేశవ్యాప్తంగా నకిలీ రూ.2వేల ...5లో

మతరాజ్యంతో సమాజ విచ్ఛిన్నం

రాజ్యాంగ సవరణతో అధ్యక్ష తరహా పాలన వచ్చే ప్రమాదం

బీజేపీతో పార్లమెంటరీ ప్రజాస్వామ్యానికే ముప్పు

- ప్రాథమిక హక్కులు రద్దయ్యే అవకాశం
- నిస్తేజంగా మారితే ఫాసిజమే

హైదరాబాద్‌లో ఘనంగా సుందరయ్య 38వ స్మారకోపన్యాసం

"బీజేపీకి మెజార్టీ ఉన్నందున పార్లమెంటరీ ప్రజాస్వామ్యం స్థానంలో అధ్యక్ష తరహా పాలన వచ్చే ప్రమాదం లేకపోలేదు. ఈ దిశగా రాజ్యాంగాన్ని సవరించే అవకాశముంది. ప్రాచీన కాలంలో మనుషులంతా సమానం కాదని, పుట్టుకను బట్టే మనుషులను చీల్చిన మూడువేల ఏండ్ల వారసత్వం దేశంలో ఉంది. దీన్నే సనాతన ధర్మ సాంప్రదాయం అంటారు. పవిత్ర గ్రంథాలుగా చెప్పేవన్నీ అమానవీయ విలువలకు పట్టం కట్టేవే. ఇలాంటి ధర్మశాస్త్రాలే ప్రాచీన భారతంలో చట్టాలు. ప్రపంచంలో ఈ దేశంలోనే దేవుడు మనుషులంతా సమానం కాదంటూ స్వయంగా ప్రకటించారు. అటువంటి దేశంలో ప్రజలందరికీ సమానత్వం, స్వేచ్ఛ, సౌభ్రాతృత్వం, న్యాయం వంటి భావనలను రాజ్యాంగం అందించింది. భారతదేశాన్ని ఆధునిక ప్రపంచంలోకి నడిపించిన ఆయుధం రాజ్యాంగం. దేశానికి పార్లమెంటరీ ప్రజాస్వామ్యమే మెరుగైన పరిపాలన అందిస్తుంది. ఇప్పుడది ప్రమాదంలో పడింది"



- లోక్‌సభ పూర్వ సెక్రెటరీ జనరల్ పిడిటి ఆచారి



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

శుక్రవారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో పుచ్చలపల్లి సుందరయ్య 38వ వర్ధంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. సుందరయ్య చిత్రపటానికి పిడిటి ఆచారి, బివి రాఘవులు పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం 'భారత పార్లమెంటరీ ప్రజాస్వామ్యం- సవాళ్ల రాజ్యాంగ విలువలు'అనే అంశంపై స్మారకోపన్యాసంలో ఆచారి కీలకోపన్యాసం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో కమ్యూనిస్టు ఐకాన్ సుందరయ్య అని అన్నారు. కేరళలో తాను చదువుకునే రోజుల్లో ఈఎంఎస్ నంబూద్రిపాద్, ఏకే గోపాలన్, పి సుందరయ్య పేర్లు బలంగా వినిపించేవని గుర్తు చేశారు. కమ్యూనిస్టు పార్టీని నిర్మించడంలో సుందరయ్య కీలకపాత్ర పోషించారని చెప్పారు.

ప్రతిపక్షాలను శత్రువులుగా భావిస్తున్న పాలకులు

పార్లమెంటు తొలినాళ్లలో ప్రతిపక్ష సభ్యులు ఎక్కువగా మాట్లాడేవారని, ప్రభుత్వాన్ని ప్రశ్నించే వారని పిడిటి ఆచారి గుర్తు చేశారు. ప్రతిపక్షాల నిర్మాణాత్మక సూచనలను గౌరవించేవారని చెప్పారు. విస్తృతంగా చర్చించి చట్టాలను రూపొందించే వారని వివరించారు. అందులో భాగంగానే అనేక చట్టాలొచ్చాయని చెప్పారు. కానీ ఇప్పుడు పార్లమెంట్కు.. 10లో



ఎన్నాళ్లీ తన్లాట?

రైతుల గోస తీరాలంటే బీఆర్ఎస్ అధికారంలోకి రావాలి

- దేశంలో పుష్కలంగా వనరులున్నా వాడుకొనే తెలివి లేదు
- దశాబ్దాలుగా కాంగ్రెస్ పార్టీ గెలిస్తే.. ఏం జరిగింది?
- నాందేడ్ శిక్షణా తరగతుల్లో సీఎం కేసీఆర్

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

గిట్టుబాటు ధరలు, వ్యవసాయరంగ సమస్యల పరిష్కారం కోసం దేశంలో రైతాంగం ఇంకెంతకాలం తన్లాడాలని భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) జాతీయ అధ్యక్షులు, ముఖ్యమంత్రి కే చంద్రశేఖరరావు అన్నారు. దేశంలో వనరులు పుష్కలంగా ఉన్నాయనీ, వాటిని వినియోగించుకొనే తెలివి కేంద్రంలోని ప్రభుత్వాలకు లేదని విమర్శించారు. దేశాన్ని దశాబ్దాలపాటు కాంగ్రెస్ పరిపాలించిందనీ, రైతాంగ సమస్యల ...5లో

జీ7 సమ్మిట్‌కు నిరసన సెగ

ఆందోళనల నడుమ కార్యక్రమం ప్రారంభం

- జపాన్‌లోని హిరోషిమాలో వార్షిక శిఖరాగ్ర సమావేశం

న్యూఢిల్లీ : జపాన్‌లో నిర్వహిస్తున్న జీ7 దేశాల సమావేశానికి నిరసనల సెగ తగిలింది. నిరసనల హెూరు నడుమే జీ7 నాయకుల వార్షిక శిఖరాగ్ర సమావేశం ప్రారంభమైంది. హిరోషిమాలో ఈ సమావేశం మొదలైంది. శిఖరాగ్ర వేదికకు సమీపంలోని ఫునైరీ డైచి పార్క్‌లో వందలాది మంది నిరసనకారులు గుమిగూడారు. 'జంక్ జీ7', 'జపాన్-యూఎస్ మిలటరీ కూటమి వద్దు' వంటి రాతలతో బ్యానర్లు, ప్లకార్డులు నిరసన ప్రదేశం వద్ద కనిపించాయి. "యూఎస్ సామ్రాజ్య వాదులు, నంబర్ వన్ టెర్రరిస్టు!" వంటి నినాదాలు వినిపించారు. 'అబద్దాలు ఆపండి', 'యుద్ధం ఆపండి', 'క్వాడ్ కూటమిని ఆపండి', 'నాటో కూటమిని ఆపండి' వంటి నినాదాలు చేశారు. ఉద్రిక్తతలను సృష్టించే ధనిక దేశాల గుంపు యూఎస్ నేతృత్వంలోని జీ7 సమ్మిట్ అని ఆందోళనాకారుడు కోడి అర్బన్ ...5లో



దశాబ్ది ఉత్సవాలు ఎన్నికల స్టంట్

ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి ఎద్దేవా



నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

'దశాబ్ది కాలంలో శతాబ్ది అభివృద్ధి' అనేది ఎన్నికల స్టంట్ అని కాంగ్రెస్ ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి ఎద్దేవా చేశారు. కేసీఆర్ హయాంలో రాష్ట్రాభివృద్ధి కాదు... రాష్ట్రాన్ని వంద సంవత్సరాల వెనక్కి తీసుకెళతున్నారని విమర్శించారు. శుక్రవారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో ఆయన విలేకర్లతో మాట్లాడారు. రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చారని చెప్పారు. రాష్ట్రంలో ఉద్యోగులకు జీతాలు ఇచ్చే పరిస్థితి లేదన్నారు. రాష్ట్రం ఏర్పడిన తర్వాత కల్వకుంట్ల కుటుంబమే బాగుపడిందన్నారు. కేసీఆర్ చేసే అభివృద్ధి ...5లో

ఢిల్లీలో దోస్తీ..గల్లీలో కుస్తీ

అందుకే ప్రజల్లో నమ్మకం తగ్గుతున్నది

- లిక్కర్ కేసులో బీజేపీ బ్లేమ్ అవుతున్నది : కొండా



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

బీఆర్ఎస్, బీజేపీలు ఢిల్లీలో దోస్తీ చేస్తూ గల్లీలో కుస్తీ పడుతున్నాయనే భావన రాష్ట్ర ప్రజల్లో బలంగా నాటుకుపోతున్నదనీ, అందుకే తమ పార్టీపై నమ్మకం తగ్గుతున్నదని బీజేపీ నేత, మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వరరెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. శుక్రవారం ఢిల్లీలో ఆయన మీడియాతో మాట్లాడారు. లిక్కర్ స్కామ్ కేసులో కవిత జైలుకెళ్తుందని ...5లో

ఎర్రటెండలు.. వడగాల్పులు

ఉక్కపోతతో అల్లాడుతున్న జనాలు

- దామరచర్ల, వీణవంకలో 45.4 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు
- ఒకట్రెండు ప్రాంతాల్లో తేలికపాటి జల్లులు పడే అవకాశం



నవతెలంగాణబ్యూరో -హైదరాబాద్


ఓవైపు ఎర్రటెండలు..మరోవైపు వడగాల్పులు..ఇంకోవైపు తీవ్ర ఉక్కపోతతో రాష్ట్ర ప్రజలు అల్లాడిపోతున్నారు. ఉదయం 9 గంటల నుంచే భానుడు తన ప్రతాపాన్ని మొదలుపెట్టి మధ్యాహ్నానికల్లా తీవ్రస్థాయిలో చూపెడుతున్నాడు. ఇండ్లల్లో ఫ్యాన్లు, కూలర్లు పెట్టుకున్నా వేడిగాడ్పు తప్ప ఉపశమనం దక్కట్లేదు. ఇండ్లల్లోని బండలూ హీటెక్కిపోతున్నాయి. చెప్పుల్లేకుండా పట్టుమని పది అడుగులు వేస్తే కాళ్లకు బొగ్గలొస్తున్న పరిస్థితి ఉంది. కోల్‌బెల్ట్(సింగరేణి విస్తరించిన ప్రాంతం), నల్లగొండ, సూర్యాపేట జిల్లాలోనూ వరుసగా ఎనిమిదో రోజూ 45 డిగ్రీలకుపైగా ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. అయితే, ఎండవేడిమి, వడగాల్పులతో అంతకంటే ఎక్కువే ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయన్న భావన కలుగుతున్నది. ఎన్ని నీళ్లు తాగినా దూప తీరడం లేదు. నల్లగొండ జిల్లా దామరచర్లలో, కరీంనగర్ జిల్లా వీణవంకలో అత్యధికంగా 45.4 డిగ్రీల చొప్పున గరిష్ట ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. వచ్చే నాలుగైదు రోజులు కూడా ఉష్ణోగ్రతలు ఇదే స్థాయిలో నమోదయ్యే అవకాశముంది. హైదరాబాద్‌లోనూ చాలా ప్రాంతాల్లో ఉష్ణోగ్రతలు 40 డిగ్రీలకు పైనే నమోదయ్యాయి. జీహెచ్ఎంసీ పరిధిలోని గణనాయక భవన్ ప్రాంతంలో అత్యధికంగా 42.5 డిగ్రీల గరిష్ట ఉష్ణోగ్రత రికార్డయింది. అయితే, తూర్పు, దక్షిణ తెలంగాణ జిల్లాల్లో అక్కడక్కడా ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు పడే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం ప్రధాన అధికారి కె.నాగరత్న తెలిపారు. ఉష్ణోగ్రతలు, వడగాల్పులు పెరుగుతున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ...5లో

జానెడు జాగా కోసం.. అలుపెరుగని సమరం..!

ప్రభుత్వ భూమిలో స్థలాల కోసం చెన్నూర్‌లో పేదల పోరాటం

- పంపిణీపై నోరు మెదపని ప్రభుత్వం.. అధికారులు
- ప్రభుత్వ భూమిని కాజేసేందుకు కబ్జాదారుల పన్నాగం
- నిరుపేదలకు అండగా నిలిచిన సీపీఐ(ఎం)

ఇంటి స్థలం ఇస్తే గుడిసె వేసుకుంటాం



కుటుంబ పోషణ కోసం మా ఆయన బతానీలు అమ్ముతుండగా, నేను కూలీ పనిచేస్తాను. మాకు ఇల్లు కట్టుకునేందుకు జాగా లేదు. ఇతరత్రా ఆస్తిపాస్తులంటూ ఏమీ లేవు. ఇంటి స్థలం ఇస్తే గుడిసె వేసుకొని జీవిస్తాం.

- టేకం సారక్క

అద్దె ఇంట్లో జీవిస్తున్నాం



భర్త, ఇద్దరు పిల్లలతో ఇరుకైన అద్దె ఇంట్లో ఏండ్లుగా నివాసం ఉంటున్నాం. ఇప్పటికీ మాకంటూ సొంత ఇల్లు లేదు. ఇరువై రోజుల నుంచి ఆకలిదప్పులు మాని ఇంటి స్థలం కోసం పోరాటం చేస్తున్నాం. ప్రజాప్రతినిధులు, అధికారులు ఎవరూ పట్టించుకోవడం లేదు. ఎలాంటి భరోసా కల్పించడం లేదు. ప్రభుత్వం వెంటనే ఇంటి స్థలం కేటాయించాలి.

- బండారి రాజేశ్వరి



నవతెలంగాణ- జైపూర్

వారంతా నిరుపేదలు. రెక్కాడితేగాని డొక్కాడని బతుకులు. రోజువారీ కూలీనాలి చేసుకొని జీవనం సాగించే ఈ బీదల నివాసానికి సొంత జాగా లేదు. కుటుంబాలతో అద్దె ఇండ్లు.. గుడిసెల్లో బతుకీడుస్తున్నారు. ఏండ్ల తరబడి ఇక్కడే ఉంటున్నా కనీసం జానెడు జాగాకు నోచుకోలేని దీనస్థితిలో ఉన్న వీరు ఇంటి స్థలం కోసం అలుపెరగని పోరాటం సాగిస్తున్నారు. మండుతున్న ఎండను లెక్కచేయకుండా ఎడారిలాంటి పడావు భూమిలో గుడారాలు వేసుకొని అక్కడే ఉంటున్నారు. ఇంటి స్థలాలు పంపిణీ చేయాలని కోరుతున్నారు. మరోపక్క నిరుపేదలకు చెందాల్సిన ఈ అసైన్డ్ భూమిని కాజేసేందుకు కబ్జాదారులు కాచుకూర్చున్నారు. అదే భూమిలో ఇంటి స్థలాలు పంపిణీ చేయాలని నిరుపేదలు చేస్తున్న పోరాటానికి సీపీఐ(ఎం) అండగా నిలిచింది.

మంచిర్యాల జిల్లా చెన్నూర్ మండలం బావురావుపేట శివారులో సర్వే నెం.8లో 27 ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. అనేక ఏండ్లుగా పడావుగా ఉన్న ఈ అసైన్డ్ భూమిలో ఇంటి స్థలాలు కేటాయించాలని నిరుపేదలు డిమాండ్ చేస్తున్నారు. 20రోజులుగా అక్కడే గుడిసెలు వేసుకుని పోరాటం సాగిస్తున్నారు. వీరంతా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ సామాజిక తరగతులకు చెందిన అత్యంత నిరుపేదలు. ఏండ్లుగా స్థిరనివాసం ఉంటున్నా సొంత జాగా లేక.. ప్రభుత్వ భూమిలో స్థలాలు కేటాయించాలని కోరుతున్నారు. ఏండ్ల తరబడి అగ్గిపెట్టెలాంటి అద్దె ఇండ్లలో ఉంటూ జీవనం ...5లో



కూలిబంధు పథకం ప్రవేశపెట్టాలి

- అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి బి.వెంకట్

నవతెలంగాణ- నల్లగొండ

తెలంగాణ రాష్ట్రంలో కూలిబంధు పథకం ప్రవేశపెట్టాలని అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి బి.వెంకట్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఉపాధి హామీ చట్టం రక్షణ కోసం పోరాడాలని పిలుపునిచ్చారు. శుక్రవారం నల్లగొండ జిల్లా తిప్పర్తి మండలం దుప్పలపల్లి గ్రామంలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను ఆయన పరిశీలించి కూలీల సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశంలో కేంద్ర పాలిత ప్రాంతాలను కలుపుకొని 716 జిల్లాలు, 7168 బ్లాకులు, 269,453 గ్రామపంచాయతీలలో ఉపాధి పనులు అమలు అవుతున్నాయన్నారు. 6కోట్ల 77 లక్షల కుటుంబాలకు చెందిన 15 కోట్లా 78 లక్షల మంది జాబ్ కార్డులు కలిగి ఉన్నారని తెలిపారు. ఈ జాబ్ కార్డులలో 32 కోట్ల మంది కూలీలు తమ పేర్లు నమోదు చేసుకొని ఉన్నారని తెలిపారు. వీరందరూ పనిచేయడానికి సిద్ధంగా ఉన్నా ప్రభుత్వం 9.95 కోట్ల జాబు కార్డులలోని 15.78 కోట్ల మంది కూలీలకు మాత్రమే గత సంవత్సరం పని కల్పించినట్టు ప్రభుత్వ లెక్కలు చెబుతున్నాయని తెలిపారు. అంటే 50శాతం మంది కూలీలకు కూడా ప్రభుత్వం పని చూపడం లేదన్నారు. రాష్ట్రంలో కూడా ఇదే పరిస్థితి ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. మోడీ ప్రభుత్వం గత సంవత్సరం కేటాయించిన రూ.73 వేల కోట్ల బడ్జెట్‌ను ఈసారి రూ.63 వేల కోట్లకు అంటే 21.66శాతం కుదించిందని, బడ్జెట్లో కోత విధించడం అంటే పని కల్పించే బాధ్యత నుంచి తప్పుకోవడమేనన్నారు. కూలీల పని దినాలను తగ్గించుకోవడం కోసం కొత్త విధానాలను ముందుకు తీసుకొస్తుందన్నారు. ఈ విధానాలను వ్యతిరేకిస్తూ కూలీలు పెద్ద ఎత్తున పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. అంతకు ముందు మండల కేంద్రంలో సుందరయ్య వర్ధంతి కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈయన వెంట వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి నారి ఐలయ్య, తిప్పర్తి మండల అధ్యక్ష, కార్యదర్శులు మన్యం బిక్షం, గండమల్ల రాములు గ్రామ నూతన అధ్యక్ష, కార్యదర్శులు సహిన, సరిత తదితరులు పాల్గొన్నారు.

యం.వి రమణను పరామర్శించిన పల్లె రవికుమార్ గౌడ్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

తెలంగాణ కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎంవీ రమణను గీత పారిశ్రామిక ఆర్థిక సహకార సంస్థ చైర్మెన్ పల్లె రవికుమార్ గౌడ్, సుప్రజా ఆస్పత్రి ఎండీ శిగ విజయ్ కుమార్ గౌడ్‌తో కలిసి శుక్రవారం పరామర్శించారని కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బెల్లంకొండ వెంకటేశ్వర్లు ఒక ప్రకటనలో తెలిపారు. ఇటీవల సుప్రజా ఆస్పత్రిలో చెవి కర్ణభేరికి ఆపరేషన్ చేయించుకున్న రమణ ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. గౌడ కల్లు గీత సంఘాల సమన్వయ కమిటీ రాష్ట్ర చైర్మెన్ బాలగౌని బాలరాజు గౌడ్, గౌడ హాస్టల్ చైర్మెన్ పల్లె లక్ష్మణ్ గౌడ్ , తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ ట్రెజరర్ పుల్లెంల రవీందర్ , గోపా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ బండి సాయన్న , గీత పనివారాల సంఘం రాష్ట్ర అధ్యక్షులు బొమ్మగాని ప్రభాకర్, వివిధ సంఘాల నాయకులు అయిలి వెంకన్న గౌడ్, యెలికట్టె విజయ్ కుమార్ గౌడ్, అంబాల నారాయణ గౌడ్, సినీ డైరెక్టర్ పులి అమత్ గౌడ్, విగ్నేష్ ,రాళ్ల బండి కుమారస్వామి, చెన్నారం మల్లేష్ , జ్యోతి ఉపేందర్, పల్లె ఉపేందర్ గౌడ్, వంగ రాములు గౌడ్, ముద్దగౌని రామ్మోహన్ గౌడ్, కోల జనార్ధన్, మిట్టపల్లి విజయ్ , పాముకుంట్ల రవీందర్ గౌడ్, పండరి గౌడ్, మాటూరి బాలరాజ్ గౌడ్ తదితరులు పరామర్శించారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

అవినీతి బీజేపీ

కర్నాటక ఎన్నికలతో సుస్పష్టం

- పలు రాష్ట్రాల్లోనూ పార్టీపై మరకలే
- రాజకీయనాయకులు, విశ్లేషకులు, నిపుణుల అభిప్రాయం

న్యూఢిల్లీ : బీజేపీ ఇప్పటి వరకు చెప్పుకుంటూ వస్తున్న అవినీతి వ్యతిరేక ట్యాగ్ ఉట్టిమాటలేనని తేలింది. కర్నాటక రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో ఆ పార్టీ ఘోర ఓటమే దీనికి నిదర్శనమని విశ్లేషకులు, నిపుణులు తెలిపారు. 40 శాతం కమీషన్ సర్కారుగా అపఖ్యాతిని మూటగట్టుకొని అక్కడి ప్రజల ఆగ్రహానికి గురైన బీజేపీ.. రాష్ట్రంలో అధికారాన్ని కోల్పోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని చెప్పారు. అయితే, బీజేపీ అవినీతి ఒక్క కర్నాటకకు మాత్రమే పరిమితం కాలేదనీ, ఆ పార్టీ అవినీతి లీలలు అనేక రాష్ట్రాల్లో ఉన్నాయని అన్నారు. బీజేపీ పార్టీ అవినీతిపై పలు రాజకీయ పార్టీల అధినేతలు, నాయకులు సైతం పలు సందర్భాల్లో వెల్లడించారు.

ప్రముఖ వ్యాపార సంస్థ రిలయన్స్‌కు సంబంధించిన రెండు ఫైళ్లను క్లియర్ చేసేందుకు తనకు రూ.300 కోట్ల లంచం ఆఫర్ చేశారని జమ్మూ కాశ్మీర్ సహా నాలుగు రాష్ట్రాల మాజీ గవర్నర్ సత్యపాల్ మాలిక్ ఇటీవల చేసిన ఆరోపణలతో స్టాలిన్ బీజేపీపై అవినీతి ఆరోపణలు చేశారు. అంతకు ముందు, ఢిల్లీ సీఎం, ఆప్ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ ప్రధాని మోడీ, బీజేపీని "భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చిన 75 సంవత్సరాలలో అత్యంత అవినీతిపరులు" అని అభివర్ణించారు.



రాష్ట్రీయ జనతాదళ్ (ఆర్జేడీ) అధికార ప్రతినిధి, రాజ్యసభ సభ్యుడు మనోజ్ ఝా కూడా బీజేపీ తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అవినీతిపై పోరాడుతున్న పార్టీగా చెప్పుకుంటున్న బీజేపీ వాదనను కర్నాటక ఫలితాలు తప్పని రుజువు చేశాయని తెలిపారు. ప్రభుత్వ పథకాల్లో 40 శాతం కమీషన్‌ను దోచుకుంటున్న అత్యంత అవినీతిపరుల నేతలకు కర్నాటక ప్రజలు తమ ఓటు హక్కుతో రుజువు చేశారని తెలిపారు.

కర్నాటక అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు వెలువడిన వెంటనే, సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ (సీబీఐ) పాట్నా, అరా, ఢిల్లీ, నోయిడా, గురుగ్రామ్‌లలోని తొమ్మిది ఆర్జేడీ నాయకుల ఇండ్లు, కార్యాలయాలపై దాడులు, సోదాలు నిర్వహించడం ప్రారంభించింది. రాజ్యసభలోని పార్టీ పార్లమెంటు సభ్యుడు ప్రేమ్ గుప్తా, శాసన సభ సభ్యులు సందేశ్, కిరణ్ దేవి తదితరుల ఆస్తులపై దర్యాప్తు సంస్థ దాడులు చేసింది. అదే సమయంలో సత్యపాల్ మాలిక్ మాజీ మీడియా సలహాదారు సౌనక్ బాలి ఆస్తులతో సహా జమ్మూ కాశ్మీర్, ఢిల్లీ మరియు రాజస్థాన్‌లోని పలు ప్రాంతాల్లో సీబీఐ సోదాలు చేసింది. ఢిల్లీ, రాజస్థాన్‌లో ఉన్న ఓ చార్టెడ్ అకౌంటెంట్(సీఏ) ప్రయివేటు వ్యక్తుల వద్ద కూడా సోదాలు జరగటం గమనార్హం. ఫైళ్లను క్లియర్ చేసేందుకు లంచం ఇచ్చారని మాలిక్ చేసిన ఆరోపణలపై సీబీఐ గత నెలలో ఆయనకు సమన్లు జారీ చేసింది.

ఎంపీ బ్రిజ్ భూషణ్‌ను కఠినంగా శిక్షించాలి

- ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఎంప్లాయిస్ యూనియన్ హైదరాబాద్ డివిజన్ అధ్యక్షులు ఎల్.మద్దిలేటి
- యూనియన్ మహిళా విభాగం ఆధ్వర్యంలో సంతకాల సేకరణ



నవతెలంగాణ-హిమాయత్‌నగర్

మహిళా రెజ్లర్లపై లైంగిక వేధింపులకు పాల్పడిన డబ్ల్యూఎఫ్ఐ చైర్మెన్, ఎంపీ బ్రిజ్ భూషణ్ శరణ్ సింగ్‌ను వెంటనే అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఎంప్లాయిస్ యూనియన్ (ఎల్ఐసీ) హైదరాబాద్ డివిజన్ అధ్యక్షులు ఎల్.మద్దిలేటి డిమాండ్ చేశారు. మహిళా రెజ్లర్లు న్యూఢిల్లీలో నిర్వహిస్తున్న నిరసన కార్యక్రమాలకు సంఘీభావంగా యూనియన్ మహిళా విభాగం ఆధ్వర్యంలో శుక్రవారం సంతకాల సేకరణ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇలాంటి ఘటనలు జరగకుండా చూడాల్సిన అధికారులు, పాలన యంత్రాంగం కండ్లు మూసుకుని, చేష్టలుడిగి వ్యవహరించడం దారుణమన్నారు. ఇలాంటివి భవిష్యత్తులో పునరావృతం కాకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలని, బాధ్యులైన వారిపై కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

ఈ కార్యక్రమాన్ని ప్రారంభించిన కార్మిక ఉద్యమ నాయకులు పద్మశ్రీ మాట్లాడుతూ.. మహిళా రెజ్లర్లు లైంగిక వేధింపులకు గురై రోడ్డు మీదకు వచ్చి రోజుల తరబడి ధర్నా చేయాల్సి రావడం అత్యంత దారుణమన్నారు. 'బేటి బచావో-బేటి పడావో'లాంటి ఆకర్షణీయ నినాదాల వరకే పరిమితమవుతున్నాయని, కేంద్ర ప్రభుత్వ పాలకులు ఆచరణ వరకు వచ్చేసరికి పూర్తి విరుద్ధంగా వ్యవహరిస్తున్నారన్నారు. బ్రిజ్ భూషణ్‌లాంటి వ్యక్తుల దారుణాలపై సరైన విచారణ జరిపి కఠినంగా శిక్షించి మహిళలకు మనోధైర్యం, భద్రత చేకూర్చే విధంగా కేంద్ర ప్రభుత్వం చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి జి.తిరుపతయ్య, మహిళా సబ్ కమిటీ కన్వీనర్ వి.మైథిలి, ఆల్ ఇండియా ఇన్సూరెన్స్ ఎంప్లాయిస్ అసోసియేషన్ నాయకులు, కార్యకర్తలు, సభ్యులు పాల్గొన్నారు.

సచివాలయంలో మీడియాపై ఆంక్షలతో సర్కారుకే నష్టం

ఆంధ్రజ్యోతి సంపాదకులు కే శ్రీనివాస్

నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్

కొత్త సచివాలయంలో మీడియా ప్రవేశంపై ఆంక్షలు తొలుత ప్రజలు, భవిష్యత్తులో రాష్ట్ర ప్రభుత్వానికి నష్టం కలిగిస్తాయని ఆంధ్రజ్యోతి పత్రికా సంపాదకులు కే. శ్రీనివాస్ వాఖ్యానించారు. పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వ విద్యాలయంలో శుక్రవారం నిర్వహించిన రెండో సంవత్సరం పీజీ జర్నలిజం విద్యార్థులకు వీడ్కోలు కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సచివాలయంలో మీడియాని అనుమతించకపోవడంపై కొంత విమర్శలు వ్యక్తం అవుతున్నా, జరగాల్సిన స్థాయిలో చర్చ జరగడం లేదన్నారు. ఇందిరా పార్క్ లోని ధర్నాచౌక్‌లో నిరసనలపై రాష్ట్ర ప్రభుత్వం గతంలో నిషేధం విధించినా కొద్ది మందే స్పందించారన్నారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు మీడియా అవసరం ఉంటుం దనీ, అధికారంలోకి వచ్చాక దూరంగా ఉంచుతున్నారని విమర్శించారు. ఏక మార్గంలో ప్రభుత్వం విడుదల చేసే సమాచారాన్ని మాత్రమే పత్రికలు ప్రచురించాలని ప్రభుత్వాలు కోరుకుంటున్నాయనీ, మీడియా ప్రభుత్వం నుంచి సమాచారాన్ని రాబట్టుకోకుండా దారులు మూసేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. దీంతో ప్రభుత్వానికి వాస్తవాలు తెలుసుకునే అవకాశం ఉండదనీ చివరకు ప్రభుత్వమే నష్టపోవాల్సి ఉంటుందన్నారు. నేటి జర్నలిజం కోర్సులు, జర్నలిజం వత్తి మధ్య పొంతన లేకుండా పోయిందనీ, కోర్సులను నవీకరించాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. విభిన్న ప్రసార మాధ్యమాలకు రాసే విధంగా నైపుణ్యాలను సంపాదించుకోవాలని విద్యార్థులకు సూచించారు.



వార్తాసేకరణ, రచన, ప్రజా సంబంధాలు, కార్పొరేట్ కమ్యూనికేషన్స్ తదితర రంగాల్లో జర్నలిజం విద్యార్థులకు అపార అవకాశాలు ఉన్నాయని చెప్పారు. ప్రస్తుతం డిజిటల్ మీడియా కీలకంగా మారిందనీ, అందులో ఎన్నో అవకాశాలు ఉన్నాయని గుర్తు చేశారు. పరిస్థితులకు అనుగుణంగా మార్పులను అవగాహన చేసుకుని మన నైపుణాన్ని పెంచుకోవాలని సూచించారు. జర్నలిజం విద్యార్థులు అడిగిన పలు ప్రశ్నల కు సమాధానం ఇచ్చా రు. విశిష్ట అతిథిగా సాక్షి చీఫ్ కార్టూనిస్టు శంకర్ మాట్లాడుతూ కార్టునిస్టులకు మీడియాలో అత్యంత ప్రాధాన్యత ఉన్న ఈ నేపథ్యంలో వారికి రాజకీయాలపై పూర్తి అవగాహన ఉండాలని సూచిం చారు. జర్నలిస్టులతో పాటు కార్టూనిస్టులు కూడా విస్తృతంగా పుస్తక పఠనం చేయాలనీ, ఇందుకు గ్రంథాలయాలను ఉపయోగించుకోవాలని కోరారు. బొమ్మలు గీయడం బాగా వచ్చినా, రాజకీయ అవగాహన లేకుం టే కార్టూనిస్టులుగా రాణించడం కష్టమని వ్యాఖ్యానించారు. ఈ కార్య క్రమంలో వర్సిటీ జర్నలిజం శాఖ అధిపతి మారుపు వెంకటేశం, అధ్యాపకులు సుధీర్ కుమార్, రామాంజని కుమారి, హసీనా ప్రసంగించారు.

జర్నలిస్ట్‌లకు ఇచ్చిన హామీలను అమలు చేయాలి : ఏఐఎస్ఎఫ్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

జర్నలిస్ట్‌లకు రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర సమితి డిమాండ్ చేసింది. ఈ మేరకు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కసిరెడ్డి మణికంఠరెడ్డి, కార్యదర్శి పుట్ట లక్ష్మణ్ శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. 2014 ఎన్నికల్లో జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలు ఇస్తామంటూ హామీ ఇచ్చినా ఇప్పటికీ నెరవేరలేదని తెలిపారు. వారిని రాష్ట్ర ప్రభుత్వం చిన్నచూపు చూడడం సరైంది కాదని పేర్కొన్నారు. జర్నలిస్టులకు సంక్షేమ నిధిని ఏర్పాటు చేయాలని, ఇండ్లస్థలాలు ఇవ్వాలని, ఆరోగ్య కార్డులు అందరికీ ఇవ్వాలని కోరారు. అక్రిడిటేషన్ కార్డుల జారీలో జాప్యం తగదని తెలిపారు.

కేజీబీవీ సిబ్బంది బదిలీలకు నేటినుంచి వెబ్ ఆప్షన్లు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో నడుస్తు న్న కస్తూర్బా (కేజీ బీవీ)ల్లో తాత్కాలిక పద్ధతిపై పనిచేస్తున్న సిబ్బంది బదిలీల కోసం శనివారం నుంచి వెబ్ ఆప్షన్ల నమోదు ప్రక్రియ ప్రారంభం కానుంది. ఈ మేర కు పాఠశాల విద్యాశాఖ సం చాలకులు శ్రీదేవసేన శుక్రవారం సవరణ షెడ్యూల్‌ను విడుదల చేశారు. కేజీబీవీల్లో పని చేస్తున్న స్పెషల్ ఆఫీసర్లు, పీజీసీఆర్టీలు, సీఆర్టీ లు, ఏఎన్ఎంలు, అకౌంటెంట్లు, పీఈటీలు ప్రస్తు తమున్న కేజీబీవీ నుంచి అదే జిల్లాలో, ఇతర జిల్లాల్లోని కేజీబీవీలకు మార్పుకోరే వారితోపాటు స్పౌజ్ వారికీ ఈ అవకాశాన్ని కల్పిస్తున్నామని తె లిపారు. ఈనెల 27 నుంచి 29 వరకు కొత్త కేజీబీవీల్లో చేరేందుకు కొత్త కాంట్రాక్టును ఆఫ్ లైన్‌లో అందజేస్తామని వివరించారు.

27న బీసీసీఐ ఎస్‌జీఎం

ఆటలు

ముంబయి : భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) ఈ నెల 27న కీలక సమావేశం కానుంది. 2023 ఐసీసీ వన్డే వరల్డ్‌కప్‌కు భారత్‌కు ఆతిథ్యం ఇవ్వనున్న సంగతి తెలిసిందే. ఈ ఏడాది అక్టోబర్-నవంబర్‌లో మెగా ఈవెంట్ నిర్వహణకు బీసీసీఐ వర్కింగ్ గ్రూప్ ఏర్పాటు చేయనుంది. ఈ సమావేశంలో వర్కింగ్ గ్రూప్ ఏర్పాటుపై చర్చతో పాటు సభ్యులను సైతం నియమించే అవకాశం కనిపిస్తుంది. మే 28న ఐపీఎల్ 16 ఫైనల్ అహ్మదాబాద్‌లో జరుగనుంది. ఐపీఎల్ ఫైనల్ ముందు రోజు అహ్మదాబాద్‌లోనే బీసీసీఐ ప్రత్యేక సర్వ సభ్య సమావేశం (ఎస్‌జీఎం) భేటీ కానుంది. ఐదు పాయింట్లతో కూడిన ఎజెండాతో బీసీసీఐ కార్యదర్శి జై షా రాష్ట్ర క్రికెట్ సంఘాలకు నోటీసు పంపించారు. మౌళిక సదుపాయల అభివృద్ధి అండ్ సబ్సిడి కమిటీ ఏర్పాటు, రాష్ట్ర క్రికెట్ జట్లకు ఫిజియోథెరపిస్ట్‌లు, ట్రైనర్ల నియామకాలపై మార్గదర్శకాలు, 2023 ఐసీసీ ప్రపంచకప్ వర్కింగ్ గ్రూప్ ఏర్పాటు, మహిళల ప్రీమియర్ లీగ్ కమిటీ ఏర్పాటు సహా లైంగిక వేధింపుల నిరోధక విధానంపై ప్రత్యేక సర్వ సభ్య సమావేశంలో చర్చించనున్నారు.

వరల్డ్‌కప్ వర్కింగ్ గ్రూప్ ఏర్పాటుపై చర్చ



వరల్డ్‌కప్ వర్కింగ్ గ్రూప్ ఏర్పాటు వాయిదా పడుతూ వచ్చింది. ఈ కమిటీ ఏర్పాటుతో ప్రపంచకప్ వేదికల ఖరారు ప్రక్రియ పూర్తి కానుంది. ఇక ప్రపంచకప్ ముంగిట పలు స్టేడియాల ఆధునీకరణకు బీసీసీఐ భారీగా నిధులు వెచ్చించనుంది. స్టేడియాల ఆధునీకరణ పనులపై ఓ కమిటీ ఏర్పాటు చేయనున్నారు. మహిళల ప్రీమియర్ లీగ్ పర్యవేక్షణకు ప్రత్యేకంగా ఓ కమిటీని నియమించేందుకు బోర్డు సిద్ధమవుతోంది. ఇక భారత రెజ్లింగ్ క్రీడాకారుల ఆందోళన నేపథ్యంలో అంతర్గత ఫిర్యాదుల కమిటీ ఏర్పాటు చేయకపోవటాన్ని ప్రశ్నిస్తూ ఇటీవల జాతీయ మానవ హక్కుల కమిషన్ బీసీసీఐకి నోటీసులు ఇచ్చింది. దీంతో బీసీసీఐలో లైంగిక వేధింపుల నిరోధక వ్యవస్థను ప్రవేశపెట్టనున్నారు. రాష్ట్ర క్రికెట్ జట్ల ఫిజియోలు, ట్రైనర్ల నియామకాలకు కనీస అర్హత, అనుభవాన్ని బోర్డు నిర్దేశించే అవకాశం కనిపిస్తుంది.

రేసులోనే రాజస్థాన్!

- పంజాబ్ కింగ్స్‌పై రాయల్స్ గెలుపు
- ఛేదనలో జైస్వాల్, పడిక్కల్ మెరుపుల్



ధర్మశాల : ఐపీఎల్ 16 ప్లే ఆఫ్స్ రేసులో రాజస్థాన్ రాయల్స్ ఆశలు సజీవం. సీజన్లో తమ చివరి లీగ్ దశ మ్యాచ్‌లో పంజాబ్ కింగ్స్‌పై రాజస్థాన్ రాయల్స్ 4 వికెట్ల తేడాతో గెలుపొందింది. 188 పరుగుల లక్ష్యాన్ని రాజస్థాన్ రాయల్స్ 19.4 ఓవర్లలోనే ఊదేసింది. ఛేదనలో ఓపెనర్ యశస్వి జైస్వాల్ (50, 36 బంతుల్లో 8 ఫోర్లు), దేవదత్ పడిక్కల్ (51, 30 బంతుల్లో 5 ఫోర్లు, 3 సిక్స్‌లు) అర్ధ సెంచరీలకు తోడు షిమ్రోన్ హెట్‌మయర్ (46, 28 బంతుల్లో 4 ఫోర్లు, 3 సిక్స్‌లు) కదం తొక్కాడు. జోశ్ బట్లర్ (0), కెప్టెన్ సంజు శాంసన్ (2) నిరాశపరిచినా.. యువ ఆటగాళ్లు అదరగొట్టారు. రియాన్ పరాగ్ (20, 12 బంతుల్లో 1 ఫోర్, 2 సిక్స్‌లు), ధ్రువ్ జురెల్ (10 నాటౌట్, 4 బంతుల్లో 1 సిక్స్) ఒత్తిడిలో ఆకట్టుకునే ప్రదర్శన చేశారు. పంజాబ్ కింగ్స్ క్రమం తప్పకుండా వికెట్లు పడగొట్టి మ్యాచ్ రేసులో నిలిచినా.. రాజస్థాన్ రాయల్స్ మరో 2 బంతులు ఉండగానే ఉత్కంఠ ఛేదనను విజయవంతంగా ముగించింది. పంజాబ్ కింగ్స్ బౌలర్లలో కగిసో రబాడ (2/40) రెండు వికెట్లు పడగొట్టాడు. ఈ గెలుపుతో సీజన్లో ఏడో విజయం నమోదు చేసిన రాజస్థాన్ 14 పాయింట్లతో నిలిచింది. ప్లే ఆఫ్స్ ఆశలు నిలుపుకున్న రాజస్థాన్ ముందుకెళ్లేందుకు ఇతర మ్యాచ్‌ల ఫలితాలపై ఆధారపడనుంది. ఇక సీజన్లో ఎనిమిదో పరాజయంతో పంజాబ్ కింగ్స్ ఐపీఎల్16 నుంచి నిష్క్రమించింది.

తొలుత బ్యాటింగ్ చేసిన పంజాబ్ కింగ్స్ 20 ఓవర్లలో 5 వికెట్లకు 187 పరుగులు చేసింది. ప్రభుసిమ్రన్ (2), ధావన్ (17), లివింగ్‌స్టోన్ (9) వైఫల్యంతో 50 పరుగులకే నాలుగు వికెట్లు చేజార్చుకున్న పంజాబ్ ఒత్తిడిలో పడింది. ఈ సమయంలో శామ్ కరణ్ (49 నాటౌట్, 31 బంతుల్లో 4 ఫోర్లు, 2 సిక్స్‌లు), జితేశ్ శర్మ (44, 28 బంతుల్లో 3 ఫోర్లు, 3 సిక్స్‌లు), షారుక్ ఖాన్ (41, 23 బంతుల్లో 4 ఫోర్లు, 2 సిక్స్‌లు) పంజాబ్‌కు మంచి స్కోరు అందించారు. రాజస్థాన్ బౌలర్లలో నవదీప్ సైని (3/40) మూడు వికెట్ల ప్రదర్శన చేశాడు.



ఆసీస్‌కే కాస్త మొగ్గు!

డబ్ల్యూటీసీ ఫైనల్‌పై రికీ పాంటింగ్

న్యూఢిల్లీ : ఐసీసీ 2023 ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్ ఫైనల్లో ఆస్ట్రేలియాకు కాస్త అనుకూలత ఉండనుందని ఆ జట్టు మాజీ కెప్టెన్ రికీ పాంటింగ్ అభిప్రాయం వ్యక్తం చేశారు. ' ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్ ఫైనల్ వేదిక లండన్‌లోని ది ఓవల్ మైదానం. అక్కడి పరిస్థితులు ఆస్ట్రేలియాను పోలి ఉంటాయి. ఇది ఆసీస్‌కు కాస్త మొగ్గు. ఈ మ్యాచ్ భారత్, ఆస్ట్రేలియాలో ఎక్కడ జరిగినా ఆతిథ్య జట్టు ఫేవరేట్‌గా ఉండేది. కానీ వేదిక ఇంగ్లాండ్ కావటంతో సరసమైన పోటీకి అవకాశం ఏర్పడింది' పాంటింగ్ అన్నారు. 1990-2000 భారత జట్లతో పోల్చితే ప్రస్తుత టీమ్ ఇండియా విదేశీ గడ్డపై ఎంతో మెరుగ్గా రాణిస్తుంది. బ్యాటింగ్ నైపుణ్యం, వికెట్ల వేటలో పదును బాగున్నాయి. గత 10-15 ఏండ్లలో భారత్ నాణ్యమైన పేసర్లను తయారు చేసింది. బుమ్రా లేకపోవటం లోటే, కానీ ఇంగ్లాండ్ పరిస్థితుల్లో మహ్మద్ షమి ప్రమాకర పేసర్. విరాట్ కోహ్లికి బౌలింగ్ చేయటం ఏ బౌలర్‌కైనా సవాలే. ఇటీవల బెంగళూర్‌లో కోహ్లితో మాట్లాడాను. కెరీర్ ఉత్తమ దశలోకి మళ్లీ వచ్చినట్టు అతడు చెప్పాడు. సన్‌రైజర్స్‌పై మ్యాచ్‌లో అందరం అది చూశాం. డబ్ల్యూటీసీ ఫైనల్లో ఉత్కంఠ పోటీ కోసం ఎదురు చూస్తున్నాను' అని పాంటింగ్ అన్నారు.

శాట్స్ పరిధిలోకి మండల క్రీడా ప్రాంగణాలు

అధికారులకు క్రీడామంత్రి, శాట్స్ చైర్మెన్ ఆదేశం

హైదరాబాద్ : మండల స్థాయిలో క్రీడా ప్రాంగణాలు ఇక నుంచి రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ (శాట్స్) పర్యవేక్షణలోకి రానున్నాయి. ఈ మేరకు మండల కేంద్రాల్లో క్రీడా ప్రాంగణాలు గుర్తించి, వాటిని శాట్స్ పరిధిలోకి తీసుకురావాలని క్రీడాశాఖ మంత్రి శ్రీనివాస్ గౌడ్, శాట్స్ చైర్మెన్ ఆంజనేయ గౌడ్ ఆదేశించారు. రాష్ట్ర సచివాలయంలో శుక్రవారం క్రీడామంత్రిత్వ శాఖ సిఎం కప్ నిర్వహణపై ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించింది. '18 క్రీడాంశాల్లో పోటీలు విజయవంతం చేసేందుకు సంబంధిత క్రీడ రాష్ట్ర సంఘాల ప్రతినిధులు బాధ్యత తీసుకోవాలి. మండల స్థాయిలో క్రీడా ప్రాంగణాలను గుర్తించి వాటిని శాట్స్ పరిధిలోకి తీసుకురావాలి. జిహెచ్ఎంసీ స్పోర్ట్స్ విభాగం శాట్స్ యంత్రాంగంతో సమన్వయం చేసుకుని సిఎం కప్‌ను విజయవంతం చేయాలని' అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో క్రీడాశాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా సహా శాట్స్ ఉన్నతాధికారులు, సాంస్కృతిక శాఖ అధికారులు, క్రీడా సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.



చాలెంజర్ ట్రోఫీలో భారత్ సత్తా

జూనియర్స్‌లో పసిడి, యూత్‌లో సిల్వర్ కైవసం



హైదరాబాద్ : ఐహెచ్ఎఫ్ చాలెంజర్ ట్రోఫీలో భారత్ సత్తా చాటింది. అంతర్జాతీయ హ్యాండ్‌బాల్ సమాఖ్య నిర్వహించిన ప్రతిష్టాత్మక టోర్నీలో భారత మహిళల జట్టు అదరగొట్టింది. జూనియర్ విభాగంలో చాంపియన్‌గా, యూత్ విభాగంలో రన్నరప్‌గా నిలిచింది. ఈ నెల 13-18న ఢాకాలో జరిగిన టోర్నీలో భారత్ సహా నాలుగు దేశాలు పోటీపడ్డాయి. జూనియర్ విభాగం ఫైనల్లో 48-17తో బంగ్లాదేశ్‌పై భారత్ గెలుపొందగా.. యూత్ విభాగంలో 43-46తో బంగ్లాదేశ్‌కు భారత్ పసిడి కోల్పోయింది. చాలెంజర్ ట్రోఫీలో పతకాలు సాధించిన భారత మహిళల జట్లకు జాతీయ హ్యాండ్‌బాల్ సంఘం అధ్యక్షుడు జగన్ మోహన్ రావు అభినందనలు తెలిపారు.

జపాన్‌లో మోడీ



హిరోషిమా:జి-7 సదస్సు కోసం భారత ప్రధానమంత్రి నరేంద్ర మోడీ శుక్రవారం జపాన్‌కు చేరుకున్నారు. జపాన్ అధ్యక్షతన హిరోషిమా పట్ట ణంలో జరుగుతోన్న ఈ సదస్సులో భారత్ ప్రత్యేక ఆహ్వానిత దేశంగా ఉంది. హిరోషిమా చేరుకున్న మోడీ ఇక్కడ భారతీయులతో సమావేశంలో పాల్గొన్నారు. శుక్రవారం నుంచి ఆరు రోజుల పాటు మోడీ విదేశీ పర్యటన లో ఉంటారు. జపాన్‌తో పాటు పపౌ న్యూ గునియా, ఆస్ట్రేలియా దేశాల్లో పర్యటిస్తారు. జపాన్ పర్యటనలో భాగంగా మోడీ హిరోషిమాలో మహా త్మాగాంధీ విగ్రహాన్ని ఆవిష్కరించనున్నారు. హిరోషియా చేరుకున్నాను.

ఇక్కడ జరుగుతున్న జి-7 దేశాల సద స్సులో పాల్గొంటున్నాని మోడీ ట్వీట్ చేశారు. జి-7లో అమెరికాతో పాటు కెనడా, ఫ్రాన్స్, జర్మనీ, ఇటలీ, జపాన్, బ్రిటన్ సభ్యదేశాలుగా ఉన్నాయి. భా రత్, ఆస్ట్రేలియా, బ్రెజిల్, ఇం డోనేసియా,దక్షిణకొరియా,వియత్నాం లాంటి మరికొన్ని దేశాల అధినేతలు ఈ సదస్సుకు ఆహ్వానితులుగా వస్తున్నారు. ఐక్యరాజ్యసమితి, అంతర్జాతీయ ఇం ధన సంస్థ, అంతర్జాతీయ ద్రవ్యనిధి, ప్రపంచ బ్యాంకు, ప్రపంచ ఆరోగ్య సంస్థ, ప్రపంచ వాణిజ్య సంస్థల నా యకులూ సదస్సులో పాల్గొంటారు.

తాగునీటి లెక్కను తేల్చండి

20 శాతం లెక్కించాలి : కర్నాటక • కేంద్రానికి లేఖ రాస్తాం: తుంగభద్ర బోర్డు నిర్ణయం

- 40 ఏండ్లుగా లేనిది ఇప్పుడెందుకు ? : ఏపీ
- ఆర్డీఎస్ ఆధునీకరణ చేపట్టాలి: తెలంగాణ



నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్

తాగునీటి అవసరాల కోసం తీసుకునే నీటిని 20 శాతం మాత్రమే లెక్కించాలని కర్నాటక విజ్ఞప్తి చేసింది. బచావత్ ట్రిబ్యునల్ ప్రకారం తాగునీటికి 10 టీఎంసీలు నీటిని తీసుకుంటే, ఆ నీటిలో ఎనిమిది టీఎంసీల రిటర్న్ ఫ్లో ఉంటుందనీ, ఈనేపథ్యంలో 20 శాతం మాత్రమే లెక్కలోకి తీసుకోవాలని కర్నాటక గట్టివాదనను వినిపించింది. తుంగభద్ర నదీ యాజమాన్య బోర్డు(టీఆర్ఎంబీ) సమావేశం చైర్మెన్ డీఎం రాయ్‌పురే అధ్యక్షతన శుక్రవారం హైదరాబాద్‌లో జరిగింది . ఏపీ ఈఎన్సీ సి.నారాయణరెడ్డి , కర్నాటక జలవనరుల శాఖ ఈఎన్సీతో పాటు తెలంగాణ ఈఎన్సీ సి.మురళీధర్ తదితరులు పాల్గొన్నారు. తాగునీటి అవసరాలకు 20 శాతం లెక్కించాలనే అంశంపై ఏపీ అభ్యంతరాలు వ్యక్తం చేసింది. 40 ఏండ్లుగా లేనిది, ఇప్పుడు లేవనెత్తడం ఎందుకని ఏపీ కూడా ప్రశ్నించింది. బచావత్ ట్రిబ్యునల్ అమల్లోకి వచ్చినప్పటికి పరిస్థితులు వేరు, ఇప్పటి పరిస్థితులు వేరని చెప్పారు. నీటి అవసరాలు పెరిగాయని అందువల్లే ఈ అంశాన్ని లేవనెత్తుతున్నామని కర్నాటక అభిప్రాయపడింది. 20 శాతం మాత్రమే లెక్కించాలంటే రిటర్న్ ఫ్లోను కూడా పరిగణనలోకి తీసుకోవాల్సి ఉంటుందనీ, ఆ ఏర్పాట్లు లేకుండా 20 శాతం వాదనకు అర్థం లేదని ఏపీ సైతం తన అభిప్రాయాన్ని స్పష్టం చేసింది. రెండు రాష్ట్రాల వాదలను విన్న టీఆర్ఎంబీ చైర్మెన్ రాయ్‌పురే మాట్లాడుతూ కష్టా బోర్డు సమావేశంలోనూ ఈ అంశాన్ని తెలంగాణ ప్రస్తావించిందనీ, తుంగభద్ర బోర్డు సమావేశంలో కర్నాటక లేవనెత్తిన అంశాలతో పాటు కష్టాబోర్డు సమావేశంలో తెలంగాణ లేవనెత్తిన అంశంపై తగిన నిర్ణయం తీసుకోవాలని కేంద్ర నీటి వనరుల శాఖకు లేఖ రాయనున్నట్టు ప్రకటించారు . ఇక ఆర్డీఎస్ ఆధునీకరణ పనులు వెంటనే చేపట్టాలనీ, వాటా మేరకు నీరు తెలంగాణకు రావడం లేదని తెలంగాణ ఈఎన్సీ సి.మురళీధర్ బోర్డు దృష్టికి తెచ్చారు. దీనిపై తుంగభద్ర బోర్డు చైర్మన్ రాయ్‌పురే స్పందిస్తూ ఆర్డీఎస్ ఆధునీకరణకు ముందు, కేంద్రం నీటి , విద్యుత్ పరిశోధన సంస్థ (సీడబ్ల్యూపీఆర్ఎస్)తో అధ్యయనం చేయించాలంటూ కష్టాబోర్డులో నిర్ణయం తీసుకోవడం జరిగిందని చెప్పారు. ఆ అధ్యయనం అనంతరం నివేదిక అందిన తర్వాతే ఆధునీకరణపై నిర్ణయం తీసుకుంటామని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా టీఆర్ఎంబీ బడ్జెట్ పై చర్చ జరిగింది.

రియల్ ఎస్టేట్ వ్యాపారుల చేతుల్లో కేసీఆర్ బందీ

ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

రియల్ ఎస్టేట్ వ్యాపారుల చేతుల్లో కేసీఆర్ ప్రభుత్వం బందీ అయ్యిందని బహుజన్ సమాజ్ పార్టీ (బీఎస్పీ)రాష్ట్ర అధ్యక్షులు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో విమర్శించారు. హైదరాబాద్ చుట్టు పక్కల వేల ఎకరాల భూములను అక్రమంగా కొనుగోలు చేసి బినామీలు, రియల్ ఎస్టేట్ వ్యాపారులు, రాజకీయ నేతలు, సినీ ప్రముఖుల మెప్పు కోసమే 111 జీవోను ఎత్తేశారని విమర్శించారు. దీంతో ఉస్మాన్ సాగర్, హిమాయత్ సాగర్ జంట జలాశయాలు పర్యావరణ సమతుల్యత దెబ్బతింటుందని తెలిపారు. ప్రభుత్వ జోక్యంతోనే కాకతీయ వర్సిటీ భూముల ఆక్రమణ వెనుక ప్రభుత్వ పెద్దల హస్తం ఉందని యూనివర్సిటీ భూములను కాపాడాల్సిన పోలీసులే రాజకీయనేతల అండతో దర్జాగా కబ్జా చేస్తున్నారని పేర్కొన్నారు. తక్షణమే ప్రభుత్వం స్పందించి వర్సిటీ భూముల ఆక్రమణపై హైకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపాలని డిమాండ్ చేశారు. భూ అక్రమార్కులపై చర్యలు తీసుకోని పక్షంలో కాకతీయ వర్సిటీ భూముల పరిరక్షణ కోసం బీఎస్పీ ఆధ్వర్యంలో ఆందోళన చేపడతామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. తొమ్మిదేండ్లుగా బీసీ సబ్ ప్లాన్ నిధులను దారి మళ్లించి, బీసీ కమిషన్ కోరలు తీసేశారని తెలిపారు. కేసీఆర్‌కు బీసీల అభివృద్ధిపై మాట్లాడే నైతిక అర్హత లేదని విమర్శించారు.

అసైన్డ్ భూముల్లో 'రియల్' వ్యాపారాన్ని ఆపాలి : బండి

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

రాష్ట్రంలో ఎన్నో ఏండ్ల కిందట దళితులకు, గిరిజనులకు అసైన్ చేసిన భూముల్లో రియల్ ఎస్టేట్ వ్యాపారాలను ఆపాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు, ఎంపీ బండి సంజయ్‌కుమార్ డిమాండ్ చేశారు. శుక్రవారం ఈ మేరకు ఆయన రాష్ట్ర ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావుకు లేఖను రాశారు. వారి జీవనవిధానాన్ని దెబ్బతీస్తూ రియల్‌ఎస్టేట్ వ్యాపారాన్ని ప్రోత్సహించడం దారుణమని విమర్శించారు. వారికి మూడెకరాల సాగు భూమిని ఇస్తామన్న హామీని రాష్ట్ర సర్కారు మరిచిపోయిందని విమర్శించారు. సిద్దిపేటలో రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించిన వెంచర్ దళితుల భూముల్లోనే ఉందని గుర్తుచేశారు. శంషాబాద్‌లో రియల్ ఎస్టేట్ వ్యాపారానికి ప్రయత్నిస్తున్నది గిరిజన భూముల్లోనే అని తెలిపారు. వారికి ఇచ్చిన భూములను లాక్కోవడం ఎంతవరకు సబబు అని ప్రశ్నించారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇవ్వకుండా ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థులు చదువులకు దూరమయ్యే పరిస్థితిని రాష్ట్ర సర్కారు కల్పిస్తున్నదని విమర్శించారు. దళితులకు న్యాయబద్ధంగా దక్కిన భూములను రక్షించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు.

దశాబ్ది ఉత్సవాలు ఘనంగా నిర్వహించాలి

- అధికారులకు మంత్రి నిరంజన్‌రెడ్డి ఆదేశం

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

దశాబ్ది ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. శుక్రవారం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో తెలంగాణ దశాబ్ది ఉత్సవాల సన్నాహక సమావేశంలో మంత్రి మాట్లాడారు. తెలంగాణలో దాదాపు 55 నుంచి 60 శాతం వ్యవసాయ రంగంపై ఆధారపడి ఉన్నారని తెలిపారు. వరి, పత్తి, వేరుశనగ ఉత్పత్తి, నాణ్యతలో నంబర్ వన్‌గా నిలిచిందని గుర్తుచేశారు. సమావేశంలో వ్యవసాయ శాఖ ప్రత్యేక కమీషనర్ కె. హన్మంతు, మార్కెటింగ్ డైరెక్టర్ లక్ష్మీబాయి, అన్ని శాఖల ఎండీలు, కార్పొరేషన్ల బాధ్యులు ఉన్నారు.

విద్యార్థులకు ఎంతో ఉపయోగకరం

- పుస్తకావిష్కరణలో బోయినపల్లి

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

'తెలంగాణ సామాజిక ఆర్థిక ముఖచిత్రం 2023' అనే పుస్తకం విద్యార్థులకు ఎంతో ఉపయోగపడుతుందని రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షులు బోయినపల్లి వినోద్ కుమార్ అన్నారు. శుక్రవారం హైదరాబాద్‌లోని మంత్రుల నివాస ప్రాంగణంలో ఈపుస్తకాన్ని ఆయన ఆవిష్కరించారు. వివిధ రంగాల మేధావులు, సామాజికవేత్తలు, ప్రజలు, పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే విద్యార్థులకు ఈ పుస్తకం ఉపయోగకరమనీ, ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎకనామిక్స్ స్టాటిస్టికల్ శాఖ డైరెక్టర్ జి. దయానంద్, టీఎస్‌డీపీఎస్ కార్యనిర్వాహక అధికారి రామకష్ణ పాల్గొన్నారు.

సంపాదకీయం

'ఎండ' ప్రచండం...

సూర్యుడు ఉగ్రరూపం దాల్చాడు. తన ప్రతాపంతో ఎండప్రచండం చేస్తున్నాడు. జనం బయట అడుగు పెట్టాలంటేనే జంకుతున్నారు. వేడిగాలులకు తోడు ఉక్కపోతతో అల్లాడిపోతున్నారు. చిన్నాపెద్దా తేడా లేకుండా ఇంటికే పరిమితమవుతున్నారు. వారం రోజులుగా రాష్ట్రంలో ఉష్ణోగ్రతలు 46 డిగ్రీలు దాటుతుండటం ఆందోళన కలిగించే అంశం.

> రాష్ట్రంలో ఇప్పటికే వడదెబ్బతో ఇరవై రెండు మందికి పైగా చనిపోయినట్టు వార్తలు. గురువారం ఒక్కరోజే ఎనిమిది మంది మృతిచెందారు. ఎండలు మండిపోతుండడంతో దాహార్తిని తట్టుకోలేక దప్పిక తీర్చుకునేందుకు శీతల పానీయాలను ఎక్కువగా సేవిస్తున్నారు. వడగాలులకు భయపడి దుకాణదారులు కూడా మధ్యాహ్నం షాపులు మూసి వేసి మళ్లీ సాయంత్రం తెరుస్తున్నారు. తప్పనిసరిగా ఒక వేళ ఎండలో వెళ్లాల్సి వస్తే తలకు టోపి, కాటన్‌తో తయారు చేసిన తెల్లటి వస్త్రాలు ధరించాలి. ప్రధానంగా చిన్న పిల్లలు, వృద్ధులు బయటకు వచ్చినప్పుడు జాగ్రత్త అవసరం. నీరు ఎక్కువగా తీసుకోవడం, కొబ్బరి నీళ్లు, నిమ్మరసం, మజ్జిగ వంటివి తాగితే ఎండదెబ్బ నుంచి ఉపశమనం పొందొచ్చు.

ఇటీవల అకాల వర్షాల వల్ల కొంత ఉపశమనం లభించినప్పటికీ నాలుగు రోజులుగా మళ్లీ నిప్పుల వర్షం కురుస్తోంది. రోజురోజుకూ ఈ తీవ్రత పెరుగుతుండటంతో జాగ్రత్తలు పాటించాలని అధికారులు సూచిస్తున్నారు. ఉదయం పదకొండు గంటల నుంచి మధ్యాహ్నం మూడు గంటల వరకు బయట తిరగొద్దని హెచ్చరిస్తున్నారు. కొన్ని జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ కూడా జారీ చేశారు. అత్యధిక ఉష్ణోగ్రతలను దృష్టిలో పెట్టుకుని ప్రజలు వీలైనంత వరకు ఉదయం, సాయంత్రం వేళల్లో తమ పనుల్ని పూర్తి చేసుకుంటున్నారు. కార్యాలయాలకు వెళ్లే ఉద్యోగులు నానాతంటాలు పడాల్సి వస్తోంది. చాలామంది దూర ప్రయాణాలు, బంధువుల కార్యక్రమాలను కూడా వాయిదా వేసుకోవలసిన పరిస్థితి ఏర్పడింది. ఈ ఎండ తీవ్రత ప్రజల ఉపాధిపైనా ప్రభావం చూపుతుండటం విచారకరం.



పగటిపూట ఎండవేడి తట్టుకోలేక జనం ఇండ్లల్లోనే ఉండటంతో రహదారులు, చౌరస్తాలు వెలవెల బోతున్నాయి. నిత్యం వేలాది మందితో రద్దీగా ఉండే ప్రాంతాలైన హైదరాబాద్‌లోని ట్యాంక్‌బండ్ పరిసరాలు, పార్కులు, సిగ్నల్ కూడళ్లు, అబిడ్స్, కోఠి, మదీనా మార్కెట్, సుల్తాన్‌బజార్‌లు సైతం నిర్మానుష్యంగా మారాయి. ఎండ తీవ్రతకు గ్రామీణ ప్రాంతాల్లో దినసరి కూలీల పరిస్థితి దయనీయంగా మారింది. ఉపాధి పనులకు వెళ్లే కూలీలు చాలా అవస్థలు పడుతున్నారు. పని ప్రదేశాల్లో కనీస సౌకర్యాలు కరువయ్యాయి. తాగేందుకు మంచినీళ్లు కూడా లేవు. అలసట తీర్చుకునేందుకు నిలువ నీడ లేక ఇబ్బందులు పడుతున్న పరిస్థితి ఉంది. ఉపాధి కూలీలకు పని ప్రదేశాల్లో టెంట్లు వేయాలని, అవసరమైన సౌకర్యాలు కల్పించాలని కార్మిక సంఘాల డిమాండ్. కానీ పాలకులు పట్టించుకున్న దాఖలాలు లేవు. భవన నిర్మాణ కార్మికులు, వ్యవసాయ కూలీలు, చిరు వ్యాపారులకు రోజూ పని చేస్తే తప్ప పూట గడవదు. వీరంతా ఎండలో పనిచేస్తూ అస్వస్థతకు గురై ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు.

రాష్ట్రంలో ఇప్పటికే వడదెబ్బతో ఇరవై రెండు మందికి పైగా చనిపోయినట్టు వార్తలు... గురువారం ఒక్కరోజే ఎనిమిది మంది మరణాలను చూస్తుంటే ఎండ తీవ్రతకు నిదర్శనం. ఈ పరిస్థితిని చూస్తుంటే మున్ముందు ఇంకెన్ని చావులు చూడాలోననే ఆందోళన కలుగుతోంది. ఎండలు మండిపోతుండడంతో దాహార్తిని తట్టుకోలేక దప్పిక తీర్చుకునేందుకు శీతల పానీయాలను ఎక్కువగా సేవిస్తున్నారు. వడగాలులకు భయపడి దుకాణదారులు మధ్యాహ్నం షాపులు మూసి వేసి మళ్లీ సాయంత్రం తెరుస్తున్నారు. షాపింగ్ చేసేవాళ్లు కూడా రాత్రి సమయంలో తమకు కావాల్సిన వస్తువుల్ని కొనుగోలు చేస్తున్నారు. తప్పనిసరిగా ఒక వేళ ఎండలో వెళ్లాల్సి వస్తే తలకు టోపి, కాటన్‌తో తయారు చేసిన తెల్లటి వస్త్రాలు ధరించాలి. ప్రధానంగా చిన్న పిల్లలు, వృద్ధులు బయటకు వచ్చినప్పుడు జాగ్రత్త అవసరం. నీరు ఎక్కువగా తీసుకోవడం, కొబ్బరి నీళ్లు, నిమ్మరసం, మజ్జిగ వంటివి తాగితే ఎండదెబ్బ నుంచి ఉపశమనం పొందొచ్చు. అయితే ఈ అధిక ఉష్ణోగ్రతలను అంతర్జాతీయ పర్యావరణ శాస్త్రవేత్తలు ఎప్పటికప్పుడు వెల్లడిస్తూనే ఉన్నారు. ఈ ఏడాది అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశాలున్నాయని ప్రభుత్వాలను ముందే హెచ్చరించారు. అధిక వేడి తగలకుండా ముందస్తు ప్రణాళికలు, తగినచర్యలు తీసుకోవాల్సిన సూచనలూ చేశారు.

ప్రధానంగా వాతావరణ మార్పులకు ప్రపంచ వ్యాప్తంగా సంభవిస్తున్న విపత్తులు కారణంగా చెప్పొచ్చు. పరస్పర విరుద్ధ వాతావరణాలైన ఎల్‌నీనో, లానీనా! (ఇవి రెండు స్పానిష్ పేర్లు) భూమధ్య రేఖ వెంబడి పసిఫిక్ మహా సముద్రం ఉపరితలంపై అసాధారణ వేడి, చల్లదనం నమోదవుతుంటాయి. దీన్ని సదరన్ ఆసిలేషన్ సిస్టమ్ (ఈఎన్ఎస్ఓ) అంటారు. ఎల్‌నీనో అయితే అత్యధిక వేడి, తక్కువ వర్షపాతం, లానినాలో వర్షాలు అధికం. ఈ రెండు పరిస్థితులకు అనుగుణంగా ప్రతి నాలుగైదేండ్లకు భ్రమణంలో ఈ రెండు పరిణామాలు ఒకదాని తర్వాత ఒకటి సంభవిస్తాయని శాస్త్రవేత్తల విశ్లేషణ. ఆ రకంగా భారత్‌లో 90శాతం భూభాగం వేడికి గురయ్యే అవకాశముందని అంచనా. అయితే అధిక వేడి రక్షణకు తగిన జాగ్రత్తలు తీసుకోవాల్సిన పాలకులు పెడచెవిన పెడుతూ వస్తున్నారు. సహజ వనరులు కార్పొరేట్లకు అప్పగించడంతో అడవుల నరికివేత, పర్యావరణ విధ్వంసం, మైనింగ్ తవ్వకాలు విచ్చలవిడిగా పెరిగాయి. అదేస్థాయిలో వాతావరణంలోనూ మార్పులు చోటుచేసుకుని అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి.

గవర్నర్ల పెత్తనం, ప్రభుత్వాల కూల్చివేతపై సుప్రీం కొరడా

పదిరోజుల కిందట గురువారం ఒక్కరోజే సుప్రీం కోర్టు రాష్ట్రాల హక్కులనూ రాజ్యాంగ విలువలనూ కాపాడే కీలకమైన తీర్పులిచ్చింది. జాతీయ రాజధాని ప్రాంతం ఢిల్లీ (ఎన్‌సిటిడి)లో అధికారాల విభజన పైనా మహారాష్ట్రలో ఉద్ధవ్ థాకరే నాయకత్వంలోని మహా వికాస్ అగాధీ (ఎంవిఎ) సర్కారు పతనానికి కారణమైన అప్పటి గవర్నర్ భగత్ సింగ్ కోష్యారీ నిర్ణయాలపైన ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ చంద్రచూడ్ నాయకత్వంలోని రాజ్యాంగ ధర్మాసనం ఇచ్చిన ఈ తీర్పులు రాబోయే కాలానికి మార్గదర్శకాలుగా ఉంటాయి. ఇటీవలి కాలంలో కేంద్రంలోని నరేంద్రమోడీ సర్కారు రాష్ట్రాల అధికారాలను కాలరాసి, కత్తెరేసి నిరంకుశాధిపత్యం సాగించడానికి గవర్నర్లనూ రాజ్‌భవన్‌లనూ ఘోరంగా దుర్వినియోగపరుస్తున్న పూర్వరంగంలో ఈ తీర్పులకు ప్రత్యేక ప్రాధాన్యత ఏర్పడింది. ప్రతిపక్షాలు, రాజ్యాంగ నిపుణులు వీటిని స్వాగతించడానికి కారణమదే. ఈ క్రమంలోనే అత్యున్నత న్యాయవ్యవస్థలో కానవచ్చే విపరీత పోకడలూ వివాదాస్పద తీర్పుల తీరును కూడా ఇవి బహిర్గతం చేశాయి. అందుకే ఇవి చారిత్రాత్మకమైనవి.

మొదటగా ఢిల్లీ విషయం తీసుకుందాం. ఢిల్లీ దేశ రాజధానిగా చాలా కాలం పాటు మెట్రోపాలిటన్ కౌన్సిల్ పాలనలో ఉండేది. తర్వాత దాన్ని కేంద్రపాలిత ప్రాంతంగా మార్చారు. వాజ్‌పేయి హయాంలో ఎన్‌సిటిడి ఏర్పడింది. శాసనసభతో కూడిన కేంద్రపాలిత ప్రాంతమైంది. అయితే కొన్ని విషయాల్లో కేంద్రానికి నిర్ణయాధికారం కల్పించ బడింది. కాంగ్రెస్, బీజేపీలే ఢిల్లీలో పాలన చేసినంత కాలం ఇదేం సమస్య కాలేదు. కాని వారిద్దరికీ భిన్నమైన ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) అధికారంలోకి వచ్చాక పరిస్థితి మారింది. కేజ్రీవాల్ వరుసగా రెండు సార్లు అధికారంలోకి రావడమే గాక కొన్ని ప్రజానుకూల చర్యలతో ప్రజాదరణ పొందడం, క్రమంగా పంజాబ్‌లోనూ ఆప్ అధికారంలోకి రావడం, మోడీ స్వంత రాష్ట్రమైన గుజరాత్‌లోనూ ఓట్లు సంపాదించి జాతీయ పార్టీగా ఎదగడం బీజేపీ భరించలేని పరిణామం. అందుకే చాలా కాలంగా కేజ్రీవాల్ సర్కారును నిబంధనలు అడ్డుపెట్టుకుని వేధిస్తూనే ఉన్నారు. ఇప్పటికి ఇద్దరు లెఫ్టినెంట్ గవర్నర్లు మారినా ఈ పెత్తనం పెరిగిందే గాని తగ్గలేదు. పేరుకే అధికారం గాని ఢిల్లీ సర్కారుకు ఏ అధికారం లేదన్నది కేంద్రం వాదన. తాము నియమించే లెఫ్టినెంట్ గవర్నర్లు (కేంద్రపాలిత ప్రాంతాలకే ఇలా అంటారు) నిజమైన అధినేతలని విడ్డూరమైన వాదన తెచ్చారు. ప్రభుత్వం ఆమోదించిన అనేక శాసనాలను ఆమోదించకుండా తిప్పి పంపారు. ముఖ్యమంత్రి కార్యాలయ అధికారులపైనా దాడులు చేశారు. ఇవన్నీ కేంద్ర దురహం కారానికి నిదర్శనాలు. ఇక కేజ్రీ రెండవసారి అధికారంలోకి వచ్చాక జాతీయ పార్టీగా విస్తరించడం బీజేపీ అసలు భరించలేక పోయింది. ఢిల్లీ లిక్కర్ స్కామ్ అనే దాంతో సహా ఏవేవో ముందుకు తెచ్చి అప్పటి ఉప ముఖ్యమంత్రి మనీష్ సిసోడియాతో సహా పలువురిని వెంటాడింది. ముఖ్యమంత్రిపైనా విచారణ జరిపింది. (ఈ కేసులోనే బీఆర్ఎస్ ఎంఎల్‌సి కవితనూ ఏపీలో వైసీపీ నేతలనూ వారి బంధువులను కూడా చేర్చింది). ఇదంతా ఆప్‌ను దెబ్బ తీసే కుట్ర అని స్పష్టమైపోయింది. అసలు ఈ కుంభకోణానికి ఆధారాలేమిటని ఢిల్లీ ప్రత్యేక కోర్టు న్యాయమూర్తి నాగ్ చివాట్లు పెట్టడంతో బండారం బహిర్గతమైంది.

వాస్తవానికి ఢిల్లీ ప్రభుత్వ పాలనాధికారాల గురించిన ఈ కేసు అంతకన్నా ముందుది. 2019లో దీనిపై సుప్రీం కోర్టు ద్విసభ్య ధర్మాసనం తీర్పు ఇవ్వలేకపోయింది. 2019 ఫిబ్రవరిలో ధర్మాసనంలోని ఇద్దరూ చెరో తీర్పు ఇవ్వడంతో ప్రతిష్టంభన ఏర్పడింది. ఆ కేసులో జస్టిస్ సిక్రీ ఢిల్లీ ప్రభుత్వానికి జాయింట్ కార్యదర్శి హోదాకు లోపున ఉన్నవారిపైనే అజమాయిషీ కలిగివుందని తీర్పు చెప్పారు. అప్పటి లెఫ్టినెంట్ గవర్నర్ ఐఎఎస్‌లు, ఐపిఎస్‌లు తనకే లోబడి ఉండాలని చేస్తున్న వాదనను బలపర్చింది. కాగా మరో జడ్జి అశోక్ భూషణ్ అసలు ఢిల్లీ ప్రభుత్వానికి ఏ అధికారమూ లేదని తీర్పు చెప్పారు. ఇద్దరూ రెండు తీర్పులు చెప్పడం వల్ల అప్పటి ప్రధాన న్యాయమూర్తి ఎన్‌వి రమణ, జస్టిస్ డివై చంద్రచూడ్ ఆధ్వర్యంలో మరో ధర్మాసనం నియమించారు. ఈలోగా చంద్రచూడ్ ప్రధాన న్యాయమూర్తి అయ్యారు. కేంద్రం, రాష్ట్రం తమ వాదనలు వినిపించాయి. చివరకు గురువారంనాడు సంచలన తీర్పు వెలువరించారు. ఢిల్లీ రాష్ట్ర పాలనాధికారం ప్రజలెన్నుకున్న రాష్ట్ర ప్రభుత్వానిదేనని తేల్చి చెప్పారు. ఎంతటి ఉన్నతాధికారులైనా ప్రభుత్వానికి జవాబుదారిగా ఉండాల్సిందేనని ఆదేశించారు. ఎన్‌సిటిడి చట్టం సెక్షన్ 239 ఎఎలో 1,2,18 కింద వచ్చే ప్రజా వ్యవహారాలు, పోలీసు, భూమి మాత్రమే కేంద్రం పరిధిలో ఉంటాయి గనక లెఫ్టినెంట్ గవర్నర్ పరిధిలోకి వస్తాయన్నది. ఇవిగాక మరే విభాగాలపై పెత్తనం చేయడమైనా కుదరదని తేల్చింది. పాలనా వ్యవహారాలు రాష్ట్ర ప్రభుత్వమే నిర్ణయిస్తుందని, అధికారులెవరైనా దానికి లోబడి ఉండకపోతే అసలు జవాబుదారీ తనమే దెబ్బతిని అలసత్వం ప్రబలుతుందని హెచ్చరించింది. రాజ్యాంగం ఏడవ షెడ్యూల్‌లో పేర్కొన్న పాలనా వ్యవహారాలన్నీ పౌర పోలీసు అధికారులతో సహా ప్రభుత్వానికే నివేదించాలని నిర్దేశించింది. బదిలీలు కూడా వారి పనేనని చెప్పింది. కేంద్రం అండ చూసుకుని లెఫ్టినెంట్ గవర్నర్ చెలాయించిన ఆధిపత్యానికిది చెల్లుచీటీ. అదే సమయంలో సుప్రీం కోర్టు గవర్నర్‌కు సర్వాధికారాలు కట్టబెడితే సమాఖ్య విధానం ఏమవుతుందని ప్రశ్నించింది. పూర్తి రాష్ట్ర స్థాయిలేని ఢిల్లీ వంటి చోటనే సుప్రీం కోర్టు తీర్పు ఇంత తీక్షణంగా ఉంటే ఇక రాష్ట్రాల సంగతి ఏం చెప్పాలి? అందుకే ఇది మోడీకి పెద్ద ఎదురు దెబ్బ.

> ఢిల్లీ, మహారాష్ట్ర ఈ రెండు కేసుల్లోనూ గవర్నర్ల దుర్వినియోగం, నిబంధనల ఉల్లంఘనను సుప్రీం కోర్టు తప్పుపట్టిన ఇరు రాష్ట్రాల హక్కుల రక్షణ పోరాటంలోనూ ప్రభుత్వాల ఏర్పాటు, కూల్చివేత ప్రక్రియలోనూ చాలా కీలకమైన నిర్దేశాలు ఇచ్చింది. వాటిని గట్టిగా అమలు జరిగేలా చూడటం రాజకీయ పక్షాల, వ్యవస్థల బాధ్యత. తప్పు జరిగితే గట్టిగా పోరాడాలి గాని బేలగా లోబడిపోవడం కాదు. తెలంగాణ, కేరళ, తమిళనాడు, బెంగాల్ వంటి చోట్ల గవర్నర్ల రాజ్యాంగ విరుద్ధ పాత్రకు ఇదో చెంప దెబ్బ.

పార్టీల్లో తగాదాలు మీకెందుకు?

ఇక మహారాష్ట్ర తీర్పు మరింత కీలకమైంది. నిజానికి ఆ గవర్నర్ భగత్ సింగ్ కోషియారి ఇప్పుడు పదవిలో లేరు. ఆరెస్సెస్ వీరవిధేయుడైన కోషియారి అనేక విధాల ఉద్ధవ్ థాకరే ప్రభుత్వాన్ని ఇబ్బందులు పెట్టారు. ఆఖరుకు ముఖ్యమంత్రి థాకరేను శాసనమండలికి నామినేట్ చేయడానికి కూడా అడ్డుపడి ఉద్రిక్తతకు కారణమైనారు. మెజార్టీ లేకున్నా దేవేంద్ర ఫడ్నవిస్‌తో తెల్లవారుజామునే రహస్యంగా ప్రమాణ స్వీకారం చేయించి పట్టంకట్టారు. కర్నాటకలోనూ 2018లో యెడియూరప్పకు మెజార్టీ లేకున్నా అలాగే ప్రమాణ స్వీకారం చేయించారు. రెండు చోట్ల వారం తర్వాత వారు గద్దె దిగిపోవలసి వచ్చింది. కొత్త సంకీర్ణాలు అధికారం చేపట్టాయి. మహారాష్ట్రలో ఉద్ధవ్ థాకరే ప్రభుత్వం ఏర్పడ్డం గవర్నర్ ఎన్నడూ జీర్ణించుకోలేకపోయారు. అనేకసార్లు ఆ మంత్రులను, ఎంపీలను వేధించేందుకు సిబిఐని ఉపయోగించారు.



రోజుకో రణరంగంగా పాలన నడిచింది. చివరకు ఏక్‌నాథ్ షిండే ఆకస్మాత్తుగా కనిపించ కుండా పోవడంతో సంక్షోభం పరాకాష్టకు చేరుకుంది. సుప్రీం కోర్టు ఆ విషయమే తీర్పునిచ్చింది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌తో సహా అనేక చోట్ల ఇలాంటి పరిణామాలు చూశాం. ఎప్పుడూ చెప్పుకునే ఎస్ఆర్ బొమ్మై తీర్పు కూడా దీనికి సంబంధించిందే. 1989లో మెజార్టీ కోల్పోయారనే పేరుతో బొమ్మై ప్రభుత్వాన్ని నాటి గవర్నర్ సిఫార్సుపై ఏకపక్షంగా కేంద్రం రద్దుచేసింది. దీన్ని సుప్రీం కోర్టు తప్పు పట్టింది. మెజార్టీలు తేలవలసింది శాసనసభలో తప్ప రాజ్‌భవన్‌లో కాదని 1994లో తీర్పునిచ్చింది. అయితే దీన్ని కూడా ఆచరణలో దుర్వినియోగపర్చడానికి ఆస్కారముందని మోడీ ప్రభుత్వం చాలాసార్లు నిరూపించింది. ఫిరాయింపులను ప్రోత్సహించి ప్రభుత్వాలను బలపరీక్షకు పురికొల్పి కూల దోయడం ఒక రివాజుగా మారింది. మహారాష్ట్రలో కూడా అప్పటి గవర్నర్ ఏ కారణం లేకుండానే ఉద్ధవ్ ప్రభుత్వం మెజార్టీ కోల్పోయిందని, బలపరీక్ష కోరడం సరైంది కాదని సుప్రీంకోర్టు ఇటీవలి తీర్పులో తేల్చి చెప్పింది. షిండేవర్గం తిరుగుబాటు చేయడం వారి అంతర్గత వ్యవహారం. దాంట్లో తలదూర్చాల్సిన అవసరం, అవకాశం గవర్నర్‌కు లేవు. తాము ఉద్ధవ్‌పై విశ్వాసం కోల్పోయామని వారేమీ లేఖ రాయలేదు. అవిశ్వాసం నోటీసు ఇవ్వలేదు.

> రాజ్యాంగం ఏడవ షెడ్యూల్‌లో పేర్కొన్న పాలనా వ్యవహారాలన్నీ పౌర పోలీసు అధికారులతో సహా ప్రభుత్వానికే నివేదించాలని నిర్దేశించింది. బదిలీలు కూడా వారి పనేనని చెప్పింది. కేంద్రం అండ చూసుకుని లెఫ్టినెంట్ గవర్నర్ చెలాయించిన ఆధిపత్యానికిది చెల్లుచీటీ. అదే సమయంలో సుప్రీం కోర్టు గవర్నర్‌కు సర్వాధికారాలు కట్టబెడితే సమాఖ్య విధానం ఏమవుతుందని ప్రశ్నించింది. పూర్తి రాష్ట్ర స్థాయిలేని ఢిల్లీ వంటి చోటనే సుప్రీం కోర్టు తీర్పు ఇంత తీక్షణంగా ఉంటే ఇక రాష్ట్రాల సంగతి ఏం చెప్పాలి? అందుకే ఇది మోడీకి పెద్ద ఎదురు దెబ్బ.

పార్టీ అంటే పార్టీనే, సభాపక్షం కాదు

మరోవైపు కొత్తగా ఎన్నికైన స్పీకర్ రాహుల్ నార్వేకర్... ఏక్‌నాథ్ షిండే వర్గాన్ని అసలైన శివసేనగా గుర్తించడం, వారు ప్రతిపాదించిన గోగావాలేను చీఫ్‌విప్‌ను చేయడం చట్ట విరుద్ధం అని సుప్రీం తీర్పు తేల్చిచెప్పింది. విప్ ఎన్నిక శాసనసభా పక్షానిదే గాని సంబంధిత రాజకీయ పార్టీతో నిమిత్తం లేదని షిండే వర్గం స్పీకర్ చేసిన వాదనను తోసిపుచ్చింది. పదవ షెడ్యూలులోని ఫిరాయింపుల నిరోధక చట్టం సెక్షన్ 2లో పార్టీ అంటే రాజకీయ పార్టీ తప్ప శాసనసభా పార్టీ కాదని స్పష్టం చేసింది. ఒక రాజకీయ పార్టీకి దాని శాసనసభా పక్షానికి మధ్య బొడ్డు పేగు లాంటి పాత్ర చీఫ్ విప్‌దని అభివర్ణించింది. అభ్యర్థి ఓట్లు కోరేది పార్టీ తరఫున అయినప్పుడు శాసనసభా పక్షం వేరు కాబోదని ఈ కేసులో సుప్రీం ఇచ్చిన తీర్పు చాలా కీలకమైంది. గతంలో చాలాసార్లు ఈ సమస్య వచ్చింది. ఉమ్మడి ఏపీలో తెలుగుదేశం పార్టీ రెండు సార్లు ఈ సమస్యను ఎదుర్కొంది గాని అది వేరే చర్చ. గవర్నర్ బలపరీక్ష ఆదేశం, స్పీకర్ షిండే వర్గాన్ని గుర్తించి విప్‌గా నియమించడం రెండూ తప్పే గనక ఈ ప్రభుత్వ మార్పు చెల్లదు. అయితే అప్పటి ఉద్ధవ్ థాకరే ప్రభుత్వాన్ని పునరుద్ధరించడం సాధ్యం కాదని కూడా సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డివై చంద్రచూడ్ ఆధ్వర్యంలోని ధర్మాసనం నిర్ధారించింది. బలపరీక్షను థాకరే సవాలు చేసినా బహిష్కరించినా ఏం జరిగేదో గాని ఆయన ముందే తనకు తాను రాజీనామా చేసి కూర్చున్నారు. కాబట్టి ఆయనను మళ్లీ నియమించడం కుదిరేపని కాదు. థాకరే రాజీనామా చేయడంతో ముఖ్యమంత్రి పదవి ఖాళీ ఏర్పడింది గనక షిండేను నియమించడం కూడా తప్పు కాదని కోర్టు భావించింది. ఇది కూడా ఒక పెద్ద గుణపాఠం. రాజకీయాలలో అవసరమైన పోరాటం చేయకుండా దుర్బలంగా వ్యవహరించడం, ముందే తప్పుకోవడం ఎంత దెబ్బ తీస్తుందో చెప్పే ఉదాహరణ. తప్పులు జరిగినప్పుడు గతంలో కొన్నిసార్లు తొలగించిన వారిని సుప్రీం కోర్టు పునర్నియమించిన సందర్భాలున్నాయి. కాని ఉద్ధవ్ థాకరే రాజీనామాతో ఆ అవకాశం లేకుండా పోయిందట. మొత్తంపైన ఢిల్లీ, మహారాష్ట్ర ఈ రెండు కేసుల్లోనూ గవర్నర్ల దుర్వినియోగం, నిబంధనల ఉల్లంఘనను సుప్రీం కోర్టు తప్పుపట్టిన ఇరు రాష్ట్రాల హక్కుల రక్షణ పోరాటంలోనూ ప్రభుత్వాల ఏర్పాటు, కూల్చివేత ప్రక్రియలోనూ చాలా కీలకమైన నిర్దేశాలు ఇచ్చింది. వాటిని గట్టిగా అమలు జరిగేలా చూడటం రాజకీయపక్షాల, వ్యవస్థల బాధ్యత. తప్పు జరిగితే గట్టిగా పోరాడాలి గాని బేలగా లోబడిపోవడం కాదు. తెలంగాణ, కేరళ, తమిళనాడు, బెంగాల్ వంటి చోట్ల గవర్నర్ల రాజ్యాంగ విరుద్ధ పాత్రకు ఇదో చెంప దెబ్బ.

- పీపీ



'ప్రజా అవసరాలే ప్రధాన అజెండా కావాలి'

రాబోయే 2024 సార్వత్రిక, లోక్‌సభ ఎన్నికల్లో ప్రధాన రాజకీయ పార్టీలు, ప్రజల జీవితాలను మెరుగు పరిచే అంశాలను పరిగణనలోకి తీసుకోవాల్సిన అవసరం ఉన్నది. వారి అజెండాలను రూపుదిద్దుకుని, ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా చేసుకుని ముందుకు సాగాలి. ప్రజలు తమ కాళ్ళపై తాము స్వతంత్రంగా బతికే పరిస్థితి నెలకొనే విధంగా రాజకీయ పార్టీలు తమ మ్యానిఫెస్టోను సిద్ధం చేసుకోవాలి. ముఖ్యంగా భవిష్యత్ ఎన్నికల్లో యువ ఓటర్లే కీలకం. రాజకీయ పార్టీల భవితవ్యం నిర్ణయిస్తారనే విషయాన్ని గ్రహించాలి. ముఖ్యంగా 'నిరుద్యోగం రూపుమాపుతాం, ఉద్యోగ ఉపాధి అవకాశాలు మెరుగుపరుస్తాం' అనే భావన యువతలో కలిగించాలి. అలాగే 2004 సెప్టెంబర్ నుంచి దేశవ్యాప్తంగా చాలా రాష్ట్రాల్లో అమలు చేస్తున్న "నూతన పెన్షన్ విధానం" రద్దు చేసి, పాత పెన్షన్ విధానం పునఃప్రారంభం చేయుట ద్వారానే ఉద్యోగులు ఆయా పార్టీలకు మద్దతు ఇచ్చే పరిస్థితి కనపడుతోంది. తాజాగా హిమాచల్ ప్రదేశ్, కర్నాటక ఎన్నికలు ఈ విషయాన్ని రుజువు కూడా చేశాయి.

ఇక సామాన్య ప్రజలకు సంక్షేమ పథకాలు ఇబ్బడి ముబ్బడిగా వడ్డించడం తాత్కాలికంగా ఉపశమనే అవుతుంది. అవి కూడా ప్రజలకు ఎంతోకొంత ఉపయోగమే కానీ నిత్యావసర వస్తువులు ధరలు నియంత్రణ చేసే భరోసా కల్పించాలి. ముఖ్యంగా అందరికీ ఉచితంగా విద్యా, వైద్యం అందించేందుకు పార్టీలు సమాయత్తం కావాలి. అప్పుడు మాత్రమే ప్రజలు అండగా ఉండే అవకాశం ఉంది. ఈ దశాబ్ద కాలంగా పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలు భారీగా పెరిగి పేద, మధ్య తరగతి ప్రజలు జీవితాలు దుర్భరమవుతున్నాయి. ముఖ్యంగా కోవిడ్ కాలంలో ప్రజలు పడిన యాతన ముఖ్యంగా లాక్‌డౌన్ కాలంలో మొదలైన ఇబ్బందులు నేటికీ వెంటాడుతున్నాయి. ఉపాధి అవకాశాలు మెరుగు పరిచే విధంగా ప్రయత్నాలు చేయాలి. ప్రజల మధ్య కుల, మత, ప్రాంతీయ భాషా చిచ్చులు పెట్టే సంస్కృతికి అన్ని రాజకీయ పార్టీలు స్వస్తి పలకాలి. లౌకిక ప్రజాస్వామ్య విలువలకు పెద్దపీట వేయాలి. ప్రధానంగా భారతదేశంలో 'భిన్నత్వంలో ఏకత్వం' అనే భావనకు కట్టుబడి ఉంటేనే ఆయా పార్టీల వైపు ప్రజలు చూస్తారు అనే విషయం మరువరాదు. ఏ రాజకీయ పార్టీకైనా ఆయా ప్రాధాన్యతను బట్టి కొంత సాలిడ్ ఓటు బ్యాంకు ఉంటుంది. అయితే ఇటీవల కాలంలో వివిధ శాసన సభల ఎన్నికల్లో, (లేదా) లోక్ సభ ఎన్నికల్లో గెలిచిన వారిలో ఎక్కువగా స్వల్ప మెజారిటీతో విజయం సాధిస్తున్నారనే వాస్తవాన్ని గుర్తెరగాలి. ఈ నిర్ణయించే ఓటర్ల సంఖ్య మాత్రం మైనారిటీ వర్గాల ప్రజలు, మేధావులు, యువత, ఉద్యోగ ఉపాధ్యాయ కార్మికులే.

అందుచేతనే, రాబోయే ఎన్నికల్లో ప్రతీ రాజకీయ పార్టీలు తమ మ్యానిఫెస్టోను అందరికీ ఆమోదయోగ్యమైన రీతిలో తయారు చేసుకోవాలి. కేవలం విద్వేష ప్రసంగాలు, తాత్కాలిక ఉద్రేకాల ద్వారా రాజకీయ లబ్ధిపొందు తామంటే ఇక విజ్ఞాన సమాజంలో ఎంతమాత్రం చెల్లదు. భారతదేశాన్ని భవిష్యత్తులో ఒక అభివృద్ధి చెందిన దేశంగా నిర్మించాలంటే ముఖ్యంగా భారత రాజ్యాంగం ఆశయాలకు అనుగుణంగా పార్టీల పనితీరు, మ్యానిఫెస్టో ఉండాలి. ప్రభుత్వ రంగాలకు ప్రాధాన్యత ఇవ్వాలి. ప్రయివేటీకరణ, కార్పొరేటీకరణ మానుకోవాలి. కేవలం దేశ సంపద కొంతమంది పెట్టుబడిదారుల చేతిలో పెట్టడం చూస్తుంటే ఏలికలు వారికోసమే పనిచేస్తు న్నట్టుగా అర్థమవుతున్నది. ప్రజాస్వామ్య వ్యవస్థలో అధికార పక్షం, ప్రతిపక్ష పార్టీలను గౌరవించాలి. వారిచ్చే సూచనలు సలహాలు పాటించాలి. ప్రజాస్వామ్య పద్ధతిలో ఎన్నికైన వారు, అధికారం ఉందికదా! అని నియంతల వలే పాలన చేస్తే, భవిష్యత్తులో భంగపాటు తప్పదు. ఇది చరిత్ర చెబుతున్న వాస్తవాలు. ప్రస్తుత కాలంలో మనదేశంలో పాలకులు చరిత్రను తిరగరాసే పనిలో పడ్డారు. సంస్కృతి మీద, ప్రజల బతుకుల మీద దాడులు చేస్తున్నారు. లౌకికవాదానికి భిన్నంగా ముందుకు సాగుతున్నారు. ఇలా ఒంటెద్దు పోకడ పోతే, భవిష్యత్తులో వీరి చరిత్ర ప్రశ్నార్థకమే అవుతుంది.

చరిత్ర ద్వారా గత తప్పులు గ్రహించి, భవిష్యత్తు తీర్చి దిద్దుకోవాలి. ముఖ్యంగా మనదేశంలో ప్రజలు, ఓటర్లు సరైన సమయంలో సరైన నిర్ణయాలు తీసుకున్న సంఘటనలు గతంలో చాలా ఉన్నాయి. చాలామంది పాలకులను, పార్టీలను తమ ఓటు ద్వారా భవిష్యత్తు లేకుండా చేసిన విషయం తెలిసిందే. రాబోయే ఎన్నికల్లో ప్రతీ రాజకీయ పార్టీ తమ విజయానికి అనుగుణంగా, ప్రజల భవిష్యత్తును మార్చడంలో క్రియాశీలకంగా వ్యవహరించాలి. అందరికి భరోసా కల్పించాలి. అప్పుడు మాత్రమే ఆయా పార్టీల ద్వారా ప్రజలకు మంచి పాలన అందుతుంది.


- రావుశ్రీ

సైనిక కూటమిలోకి జారుతున్న భారత్!

అమెరికా, జపాన్, ఆస్ట్రేలియా, ఇండియా ఈ నాలుగు దేశాలతో కూడిన క్వాడ్ క్రమంగా భద్రతా కూటమిగా రూపు దిద్దుకుంటోంది. ఈ గ్రూపునకు మొదట పెట్టిన పేరు - క్వాడ్రిలేటరల్ సెక్యూరిటీ డైలాగ్ - ఉద్దేశ్యం కూడా ఇదే. మే 15-17 తేదీల్లో కాలిఫోర్నియాలోని సన్నీల్యాండ్స్‌లో నాలుగు క్వాడ్ దేశాల మిలిటరీ చీఫ్‌లు జరిపిన సమావేశం ద్వారా ఈ భద్రతా కోణం ప్రముఖంగా తెరపైకి వచ్చింది. భారత చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్ అనీల్ చౌహాన్ ఈ సమావేశానికి హాజరయ్యారు. 'ఇండో-పసిఫిక్ కమాండ్' కమాండర్ అడ్మిరల్ జాన్ సి.అక్విలినో అమెరికా తరపున పాల్గొన్నారు. హిరోషిమాలో జి-7 దేశాల శిఖరాగ్ర సమావేశం సందర్భంగా క్వాడ్ సదస్సును కూడా నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో మిలిటరీ చీఫ్‌ల మొదటి సమావేశం జరిగింది. తొలుత మే 24న ఆస్ట్రేలియాలో ఈ సదస్సు జరగాల్సి ఉంది. అయితే అమెరికా అధ్యక్షుడు బైడెన్ తన పర్యటనను రద్దు చేసుకోవాల్సి వచ్చింది. క్వాడ్ దేశాల నేతలు ముఖాముఖి సమావేశం కావడం ఇది మూడోసారి. ప్రధాని నరేంద్ర మోడీ కూడా ఈ సమావేశానికి హాజరవుతున్నారు. అమెరికాకు సంబంధించి నంతవరకు, క్వాడ్ అనేది చైనాకు వ్యతిరేకంగా నిర్దేశించబడిన భద్రతా కూటమిగా ఉద్దేశించబడింది. "స్వేచ్ఛా, బహిరంగ ఇండో-పసిఫిక్", సముద్ర జలాల భద్రత, మానవతా, విపత్తు సహాయ కార్యకలాపాలకు సహకారం వంటి సాధారణ సూత్రీకరణల చాటున భారత్ క్వాడ్‌లో చేరింది.

గతేడాది ఫిబ్రవరిలో క్వాడ్ దేశాల విదేశాంగ మంత్రుల సమావేశంలో భారత విదేశాంగ మంత్రి జై శంకర్ మాట్లాడుతూ... క్వాడ్ అనేది 'ఒకదాని కోసం, అంతేకానీ మరొకరికి వ్యతిరేకంగా కాదు' అని వ్యాఖ్యానించారు. కానీ ఇదంతా కేవలం కుతంత్రం. చైనాను ఒంటరిని చేసి, ఎదుర్కొనేందుకు అమెరికా అనుసరించిన ఇండో-పసిఫిక్ వ్యూహానికి అనుగుణంగా భారత్ ఆ వలలో పడిపోయిందన్నది వాస్తవం. ఈ ఏడాది ఆగస్టులో మలబార్ నావికా విన్యాసాలు నిర్వహించాలన్నది సైనిక సహకారం పొడిగింపునకు సంబంధించిన మరో అంశం. ఈ విన్యాసాల్లో ఆస్ట్రేలియాను కూడా కలుపుకోనున్నారు. కాలిఫోర్నియా సమావేశంలో భారత్ పాల్గొనడంపై భారత్ భద్రతా సంస్థకు సంబంధించిన అధికారి ఒకరు మీడియాకు వివరించారు. "సరిహద్దుల్లో చైనా దూకుడు వైఖరిని గమనంలోకి తీసుకుంటే సరిహద్దు సమస్యను ద్వైపాక్షికంగా పరిష్కరించుకునే ఉద్దేశ్యం లేనట్లు కనిపిస్తున్నందున, సరిహద్దుల్లో పిఎల్ఎ విశృంఖలమైన దూకుడుకు అడ్డుకట్ట వేసేందుకు క్వాడ్ వంటి బహుముఖ వేదికల నుండి సాయం తీసు కోవాలని భారత్ నిర్ణయించాల్సి వచ్చింది" అని చెప్పారు. అమెరికాతో, ఇండో-పసిఫిక్‌లోని అమెరికా మిత్ర దేశాలతో సైనిక సహకారంతో ముందుకు సాగడాన్ని భారత్ ఈ రకంగా సమర్థించుకుంది.

ఇండో-పసిఫిక్ వ్యూహంలో భారత్‌ను ఎందుకు కావాలనుకుందో, అసలు ఎలాంటి పాత్ర పోషించాలనుకుందో చెప్పడానికి అమెరికా వద్ద కచ్చితమైన కారణం లేదా సమాచారం లేదు. అమెరికాతో మోడీ ప్రభుత్వం పొత్తు పెట్టుకుంది కేవలం ఇండో-పసిఫిక్ ప్రాంతంలోనే కాదు, పశ్చిమాసియాలో ఏర్పాటు చేసిన క్వాడ్‌లోనూ భారత్ చేరింది. ఇందులో భారత్, ఇజ్రాయిల్, అమెరికా యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ ఉన్నాయి. దీన్నే ఐ2యు2గా కూడా పిలుస్తారు. మళ్లీ అమెరికా ఆధ్వర్యంలోనే మే 7న సౌదీ అరేబియాలో సమావేశం జరిగింది. ఈ సమావేశంలో సౌదీ ప్రధాని మహ్మద్ బిన్ సల్మాన్ అమెరికా, భారత్, యుఎఇ జాతీయ భద్రతా సలహాదారులతో భేటీ అయ్యారు. భారత్‌కు అనుసంధానించబడే ప్రాంతంలో మౌలిక వసతులను నిర్మించడం, సహకారాన్ని బలోపేతం చేయడం ఈ సమావేశం ఎజెండాగా ఉన్నాయి. చైనా ప్రభావం పెరుగుతుండడం, పైగా దౌత్య సంబంధాలను పునరుద్ధరించు కోవడానికి, సాధారణ సంబంధాలను నెలకొల్పుకునేందుకు సౌదీ అరేబియా, ఇరాన్‌ల మధ్య ఒప్పందం కుదిరేలా చైనా దౌత్యపరమైన జోక్యం చేసుకోవడం పట్ల అమెరికా ఆందోళన చెందుతున్న నేపథ్యంలో ఈ చర్యను చూడాల్సి ఉంది.



చైనాకు వ్యతిరేకంగా అమెరికా తీసుకుంటున్న దూకుడు విన్యాసాలకు, భారత్‌ను కట్టడి చేసేందుకు తీసుకుంటున్న చర్యలకు వ్యూహాత్మక నిపుణులు, కార్పొరేట్ మీడియాలోని వ్యాఖ్యాతల నుండి ప్రశంసలు వచ్చాయి. భారత్-అమెరికా కూటమి ప్రయోజనాల గురించి, వారి ఆసక్తులు కలవడం గురించి ఆర్భాటంగా చెప్పుకుంటున్నారు. కానీ దానికి విరుద్ధంగా ప్రత్యామ్నాయ వైఖరికి ప్రజా కార్యాచరణలో ఎలాంటి స్థానం దక్కడం లేదు. ఇండో-పసిఫిక్ ప్రాంతంలో తన గుత్తాధిపత్యాన్ని పరిరక్షించుకోవడంలోనే అమెరికా ఆసక్తి కనబరుస్తోందన్నది ఇక్కడ గ్రహించాలి. ఎందుకంటే, చైనాకు పెరుగుతున్న బలం, దాని ప్రభావంతో అమెరికా గుత్తాధిపత్యం రాన్రానూ అధికంగా సవాలు చేయబడుతోంది. ప్రపంచంలో బహుళ ధ్రువ ప్రభావం పెరుగుతున్నప్పుడు, అమెరికాకు మిత్రపక్షాలుగా ఉన్న ఒక మోస్తరు దేశాలు కూడా తమ వ్యూహాత్మక స్వయంప్రతిపత్తిని ధృఢంగా చెప్పుకోవాలని భావిస్తున్నప్పుడు, అమెరికా నేతృత్వంలోని వ్యూహంలో, భద్రతా కూటముల్లో చిక్కుకోవడమంటే భారత్‌కు దూరదృష్టి లేకపోవడమే అవుతుంది. చైనాతో భారత్‌కు ఉన్నది ప్రాథమికంగా సరిహద్దు వివాదమే. చైనా ఇటీవల తీసుకున్న చర్యల కారణంగా వాస్తవాధీన రేఖ వద్ద శాంతి భద్రతల పరిరక్షణ అనేది దిగజారుతోంది. రెండు దేశాలు కూర్చుని మాట్లాడుకుని, పరస్పరం పరిష్కరించుకోవాల్సిన సమస్యే ఇది. అయితే ఓపికతో, కృత నిశ్చయం, దృఢదీక్షతో ఈ ప్రక్రియను అనుసరించాల్సి ఉంటుంది.

అంతర్జాతీయ ఆర్థిక, వాణిజ్య సంబంధాల్లో చైనా చాలా కీలక పాత్ర పోషిస్తున్నదన్న వాస్తవాన్ని గమనంలోకి తీసుకుంటే చైనాతో వాణిజ్యం, ఆర్థిక సంబంధాలు బలహీనపడడం వల్ల భారత్‌కు కలిసొచ్చేది ఏమీ లేదు. గల్వాన్ ఘర్షణల అనంతరం కూడా సంబంధాల్లో కాస్తంత విరామం వచ్చినప్పటికీ 2022లో ద్వైపాక్షిక వాణిజ్యం పెరిగి 135.98 బిలియన్ల డాలర్లుగా ఉంది. చైనా ఆర్థిక వ్యవస్థ నుండి విడిపోవడం గురించి, బదులుగా ముప్పులేని ఆర్థిక సంబంధాల గురించి అమెరికా కూడా మాట్లాడడం ఆపేసింది. అయితే చైనాతో ఆర్థిక సంబంధాలను తెగతెంపులు చేసుకోవాలని భారత్‌లోని కొన్ని వర్గాల్లో నెలకొన్న ప్రస్తుత ఆలోచనా ధోరణి కచ్చితంగా మనకే హాని కలిగిస్తుంది.

> అమెరికా నేతృత్వంలోని వ్యూహంలో, భద్రతా కూటముల్లో చిక్కుకోవడమంటే భారత్‌కు దూరదృష్టి లేకపోవడమే అవుతుంది. చైనాతో భారత్‌కు ఉన్నది ప్రాథమికంగా సరిహద్దు వివాదమే. చైనా ఇటీవల తీసుకున్న చర్యల కారణంగా వాస్తవాధీన రేఖ వద్ద శాంతి భద్రతల పరిరక్షణ అనేది దిగజారుతోంది. రెండు దేశాలు కూర్చుని మాట్లాడుకుని, పరస్పరం పరిష్కరించుకోవాల్సిన సమస్యే ఇది. అయితే ఓపికతో, కృత నిశ్చయం, దృఢదీక్షతో ఈ ప్రక్రియను అనుసరించాల్సి ఉంటుంది.

ప్రధానంగా అభివృద్ధి చెందుతున్న దేశంగా భారత్‌కు అపారమైన ఆర్థిక అవకాశాలు ఉన్నాయి. తన స్వంత ప్రయోజనాలను మరింత ముందుకు తీసుకుని వెళ్ళేందుకు బహుళ ధ్రువ ప్రభావాన్ని పెంచుకుంటూ, ఇతర అన్ని ప్రధాన దేశాలతో, ప్రాంతాలతో ఫలవంతమైన సంబంధాలు నెలకొల్పుకునే స్థానంలో భారత్ ఉంది. అంతేకానీ అమెరికా ఒక్క దేశానికే కట్టుబడి ఉండిపోవడమనేది ముందుకు సాగే మార్గం కాదు.

('పీపుల్స్ డెమొక్రసీ' సంపాదకీయం)



సమాజంలో మహిళ ఇష్టానికి గౌరవం లేదు. తనకు నచ్చని పని చెయ్యను అంటే తప్పు. నచ్చింది చేస్తానంటే ఒప్పుకోరు. అదే పెండ్లయిన మహిళ అయితే మనసు చంపుకొని భర్త చెప్పినట్లు వినాల్సిందే. వినకపోతే పరిణామాలు ఎంత ఘోరంగా ఉంటాయో కదా! ఇక ఒంటరి మహిళైతే సమాజం చేయూత నివ్వకపోగా సూటి పోటి మాటలతో వేధిస్తుంది. అలాంటి కథే సుజాతది.

ఆమె ఇష్టానికి విలువ లేదా?

సుజాతకు 17 ఏండ్లు ఉన్నప్పుడు పెండ్లి జరిగింది. అప్పుడు భర్తకు 20 ఏండ్లు. ఆ ఇంట్లో మొత్తం ఎనిమిది మంది ఉంటారు. అందరికీ పెండిండ్లు జరిగాయి. ఎవరి సంసారాలు వారివి. సుజాతకు 20 ఏండ్లు వచ్చేసరికి ఒక పాప, ఇద్దరు బాబులు పుట్టారు. అప్పటి వరకు అంతా బాగానే ఉంది. కొంత కాలానికి అనుకోకుండా తోటికోడలు చనిపోయింది. అసలు సమస్య అప్పుడు మొదలైంది.

భార్య పోయిన దగ్గర నుండి మరిది సుజాతను లైంగికంగా వేధించడం మొదలు పెట్టాడు. ఆ విషయం భర్తకు చెప్పినా లాభం లేదు. "మేమందరం కలిసి హాయిగా ఉంటున్నాం. ఈ చిన్న విషయానికే నువ్వెందుకింత ఫీలవుతున్నావు. వేరెవరితోనో సంబంధం పెట్టుకోవడానికి బాధపడాలి. సొంత మరిదితో పెట్టుకుంటే తప్పేం లేదు. నేనే ఒప్పుకుంటుంటే ఇక నీకెందుకు బాధ" అనేవాడు.

ఇక తన సమస్య ఎవరికి చెప్పుకోవాలో అర్థం కాక పిల్లల్ని తీసుకొని పుట్టింటికి వచ్చేసింది. దాంతో భర్త సుజాతపై తప్పుగా ప్రచారం మొదలు పెట్టాడు. ఎవరితోనో సంబంధం పెట్టుకుని పిల్లలను తీసుకొని వచ్చేసిందని సుజాత ఇంట్లో చెప్పాడు. దాంతో ఎంత చెప్పిన వినకుండా తల్లిదండ్రులు ఆమెను తిరిగి భర్త దగ్గరికి పంపించారు. అప్పటి నుండి ఆమె పరిస్థితి మరింత దారుణంగా తయారయింది. అన్నదమ్ములు ఒకరి తర్వాత ఒకరు ఆమెను వేధించే వారు. తమకు అడ్డు చెబితే తన కూతురికి కూడా ఇదే గతి పడుతుందని బెదిరించేవారు.

కూతుర్ని ఎలాగైన అక్కడి నుండి పంపించేయాలని నిర్ణయించుకుంది. వెంటనే గురుకుల హాస్టల్లో చేర్పించింది. ఇద్దరు కొడుకుల్ని తీసుకొని హైదరాబాద్ వచ్చేసింది. అయినా కష్టాలు తప్పలేదు. ఏ ఆధారం లేక మూడు రోజులు రైల్వే స్టేషన్‌లోనే ఉండిపోయింది. పిల్లల్ని పెంచే స్థోమత తన దగ్గర లేదని భర్త వచ్చి పోలీస్ స్టేషన్‌లో కేసు పెట్టి వాళ్ళను తీసుకుపోయాడు. ఏదైనా ఉద్యోగం చూసుకుంటే పిల్లల్ని నీతో ఉంచుకోవచ్చు అన్నారు. దాంతో ఇక తనకు ఈ ప్రపంచంలో ఎవరూలేరనే భావన వచ్చింది. ఒంటరి తనంతో విలవిలలాడింది.

సుజాత కోసం ఎవరూ రాలేదు. శరీరం కూడా సహకరించడం లేదు. తినడానికి తిండిలేదు. పక్కన కొంతమంది కూలి పనులకు వెళుతుంటే వాళ్ళతో కలిసి తనూ వెళ్ళింది. వాళ్ళు తెచ్చుకున్న భోజనం లోనే సుజాతకు కూడా కొద్దిగ పెట్టారు. పని దొరికిందిగానీ ఉండటానికి ఇల్లు లేదు. రోడ్డుపైన, స్టేషన్‌లో కొన్ని రోజులు గడిపింది. తర్వాత తను పని చేసే చోట ఏజెంట్ ఓ రూం కిరాయికి తీసుకొని అందులో పెట్టాడు. ఓనర్ అడిగితే నా భార్య అని చెప్పాడు. ఆ విషయం సుజాతకు ముందు తెలియదు.

తెలిసిన తర్వాత అతన్ని అడిగితే 'అవును, చెప్పాను. ఒంటరి మహిళకు ఎవ్వరూ రూం ఇవ్వరు. అందుకే చెప్పాను' అన్నాడు. ఇక తను ఏమీ మాట్లాడ లేకపోయింది. పని దొరకడంతో పిల్లల్ని తెచ్చుకుందామనుకుంది. కానీ పిల్లలు ఆమెతో రావడానికి ఇష్టపడలేదు. 'మీ అమ్మ ఎవరితోనే సంబంధం పెట్టుకొని నన్ను వదిలేసి వెళ్ళిపోయిందని' నేర్పించాడు. భర్త సుజాతకు విడాకులు ఇచ్చేశాడు. మళ్ళీ హైదరాబాద్ వచ్చేసింది.

ఇప్పటికి సుజాత హైదరాబాద్ వచ్చి 15 ఏండ్లు అవుతుంది. తన బతుకు తాను బతుకుతున్నా చుట్టుపక్కల వారు సూటి పోటి మాటలు అనేవారు. కూలి దగ్గర ఏజెంట్ 'నాకు భార్యా, పిల్లలు ఎవరూ లేరు. నాతో ఉంటే బాగా చూసుకుంటా' అన్నాడు. తన గత జీవితం మొత్తం తెలిసిన వ్యక్తి కాబట్టి అతనితో ఉండేందుకు అంగీకరించింది. 'ఇక నుంచి నువ్వూ నేను భార్యభర్తల్లాగే కలిసి ఉండాలి' అని వేరే ఇల్లు అద్దెకు తీసుకున్నాడు.

సుజాతతో పాటు అతను 15 రోజులు కలిసి ఉన్నాడు. తర్వాత తన తల్లిదండ్రులను కలిసి వస్తానని వెళ్ళేవాడు. వారంలో ఒకటి, రెండు రోజులు మాత్రమే ఆమెతో ఉండేవాడు. తాను సంపాదించుకున్న డబ్బుతో సుజాత నగలు చేయించుకుంది. చిట్టీలు వేసి వేరే ఊరిలో కొంత స్థలం కూడా కొనుక్కుంది. అయితే ఆ ఏజెంట్‌కు పెండ్లయి, ఇద్దరు పిల్లలు ఉన్నారని సుజాతకు తెలిసింది. ఇదే విషయం అతన్ని అడిగితే 'నిజం చెప్తే నువ్వు నాతో ఉండవు కదా, అందుకే అబద్ధం చెప్పా' అన్నాడు.

'నాకు నువ్వూ కావాలి, నా భార్యా కావాలి. ఇద్దరిలో నేను ఎవరినీ వదులుకోలేను' అన్నాడు. కొన్ని రోజులు సుజాత జీవితం అలా గడిచిపోయింది. వీరిద్దరి సంబంధం గురించి భార్యకు తెలిసింది. ఆమె సుజాతకు ఫోన్ చేసి బాగా తిట్టేది. ఇదంతా సుజాతకు ఇబ్బందిగా ఉండేది. ఆమె తిట్టడం కరక్టే అనిపించింది. ఇక తను అతనితో ఉండ కూడదని నిర్ణయించుకుంది. ఇదే విషయం అతనికి చెప్పింది. కానీ అతను మాత్రం 'నువ్వు లేకుండా నేను ఉండలేను' అంటూ బాధపడేవాడు.

అప్పుడప్పుడు వస్తూపోత్తు ఉండేవాడు. సుజాత కూడా అడ్డు చెప్పలేకపోయింది. అలా ఏడాది గడిచిపోయింది. 'ఊరిలో పొలం ఇబ్బందుల్లో ఉంది. నాకు డబ్బులు కావాలి, ఏం చేయాలో అర్థం కావడం లేదు' అంటూ సుజాత దగ్గర బాధపడ్డాడు. సుజాత తన నగలు తీసి ఇచ్చింది. తన చిట్టీ డబ్బులు సుమారు మూడు లక్షల వరకు అతనే తీసుకుని వెళ్ళిపోయాడు. సుజాత ఉంటున్న ఇంటి కిరాయి కూడా ఆరు నెలల నుండి కట్టలేదు. అలా అతను వెళ్ళి దాదాపు ఎనిమిది నెలలు అయినా రాలేదు. ఫోన్ కూడా లేదు. వేరే ఫోన్‌తో చేస్తే తీశాడు.

'ఏం జరిగింది. నా దగ్గరకు ఎందుకు రావడం లేదు' అడిగింది. 'ఇక నీకూ నాకూ ఎలాంటి సంబధం లేదు. నా భార్య రానివ్వడం లేదు' అన్నాడు. పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసినా ఎలాంటి ప్రయోజనం లేదు. ఇప్పుడు ఆమెకు ఏం చేయాలో అర్థం కావడం లేదు. ఇలాంటి పరిస్థితుల్లో ఐద్వా లీగల్‌సెల్‌కు వచ్చింది.

జరిగిందంతా చెప్పి 'ఇప్పుడు నా జీవితం సర్వ నాశనం అయ్యింది' అంటూ బాధపడింది. లీగల్‌సెల్ సభ్యులు అతన్ని పిలిచి మాట్లాడితే 'ఆమె ఏమైనా నా భార్యనా. ఆమె బాధ్యత నాకు ఎందుకుంటుంది. అవసరమైనపుడు ఆమెకు అండగా ఉన్నాను. అయినా ఆమె నా ఒక్కడితోనే ఉందా? చాలా మందితో సంబంధాలు ఉన్నాయి. అయినా నా భార్య ఇప్పుడు రానివ్వడం లేదు. మా పిల్లలు కూడా పెద్దయ్యారు. మా పాపకు పెండ్లి చేశాను. ఇప్పుడు నేను ఆమెతో సంబంధం పెట్టుకుంటే ఎలా, అందుకే నేను రావడం లేదు. ఆమె జీవితం ఆమెది, నా జీవితం నాది' అన్నాడు.

దాంతో సుజాత 'నా వల్ల ఒకరి జీవితం నాశనం కావడం నాకూ ఇష్టం లేదు. కాకపోతే నా డబ్బు, నగలు ఇప్పించండి చాలు' అంది. దానికి అతను 'నేను ఇన్ని రోజులు చుశాను కదా, ఇప్పుడు నేను ఆ డబ్బులు నీకు ఎందుకివ్వాలి, ఇవ్వను' అన్నాడు. దాంతో లీగల్ సెల్ సభ్యులు 'నీ దగ్గర నుండి డబ్బు ఎలా తీసుకోవాలో మాకు తెలుసు' అంటూ హెచ్చరించారు.

దాంతో అతను 'ఇప్పుడు నా దగ్గర లేవు, కొంచెం టైం కావాలి' అన్నాడు. అతనికి రెండు వారాలు టైం ఇచ్చారు. ఇచ్చిన సమయంలో సుజాత డబ్బులు, నగలు తెచ్చి ఇచ్చాడు. ఇక ఒకరితో ఒకరికి ఎలాంటి సంబంధం లేదు అనుకున్నారు. అతను వెళ్ళి పోయాడు. 'ఇక ఎవరిని నమ్మాలి. ఈ వయసులో నన్ను ఎవరు చూస్తారు. ఈ డబ్బులు, నగలు తీసుకొని ఏదైన వృద్ధాశ్రమంలో చేరతాను' అంటు సుజాత కూడా వెళ్ళిపోయింది.

> 'నాకు నువ్వూ కావాలి, నా భార్యా కూడా కావాలి. ఇద్దరిలో నేను ఎవరిని వదులుకోలేను' అన్నాడు. కొన్ని రోజులు సుజాత జీవితం అలా గడిపోయింది. వీరిద్దరి సంబంధం గురించి భార్యకు తెలిసింది. ఆమె సుజాతకు ఫోన్ చేసి బాగా తిట్టేది. ఇదంతా సుజాతకు బాగా ఇబ్బందిగా ఉండేది. ఆమె తిట్టడం కరక్టే అనిపించింది. ఇక తను అతనితో ఉండకూడదని నిర్ణయించు కుంది. ఇదే విషయం అతనికి చెప్పింది. కానీ అతను మాత్రం 'నువ్వు లేకుండా నేను ఉండలేను' అంటూ బాధపడేవాడు.

– వరలక్ష్మి, 9948794051

ఆహారంలో జాగ్రత్తలు తప్పనిసరి...



రోజురోజుకూ భానుడి ప్రతాపం తీవ్రంగా ఉంటోంది. ఉదయం నుంచే వేడి అల్లాడిస్తోంది. ఇక మధ్యాహ్న సమయం గురించి చెప్పాల్సిన పని లేదు. ఎండ వేడిని తట్టుకోవాలంటే ఈ పరిస్థితిలో తీసుకునే ఆహారంలో తప్పకుండా జాగ్రత్తలు పాటించాలి. బలమైన ఆహారాన్ని తీసుకోవడం ద్వారా ఎండ తీవ్రత నుంచి శరీరాన్ని రక్షించు కోవచ్చు... రోజువారీ భోజనం తో పాటు పండ్లు, ఆకుకూరలను ఆహారంలో భాగం చేసుకోవడం ద్వారా శరీర తాపానికి చెక్ పెట్టవచ్చునని ఆరోగ్య నిపుణులు సూచిస్తున్నారు.

- ఉదయాన్నే దానిమ్మ జ్యూస్ తాగడం వల్ల ఫలితం ఉంటుంది.
- రెండుసార్లు కొబ్బరి నీళ్లు తప్పనిసరిగా తాగాలి.
- స్ప్రౌన్ మెంతుల్ని ఆహారంలో చేర్చుకోవాలి.
- వ్యాయమం చేసిన తర్వాత ద్రాక్షలను తీసుకుంటే అలసిపోయిన శరీరానికి వెంటనే శక్తి వస్తుంది. అలసటలో ఉన్న శరీరానికి ద్రాక్ష వెంటనే ఉత్తేజాన్ని కలిగిస్తుంది.
- పుదీనా, కీరా దోసకాయ, పెరుగు, లస్సీ వంటివి తీసుకోవడం వల్ల శరీర వేడి తగ్గుతుంది. మజ్జిగను తీసుకుంటే వేడి నుంచి ఉపశమనం లభిస్తుంది.
- గ్లాస్ గోరువెచ్చని పాలల్లో తేనె కలుపుకొని రోజూ తాగితే చాలా మంచిది.
- గసగసాలను పొడిచేసి వేడి పాలలో కలుపుకొని తాగాలి.
- పుచ్చకాయ, కర్భూజ వంటివి శరీరాన్ని చల్లబరుస్తాయి.
- లిచీ పండ్లలో విటమిన్-సి పుష్కలంగా ఉంటుంది. ఇది శరీరంలో వ్యాధి నిరోధక శక్తిని పెంచడంలో సహాయపడుతుంది. ఇన్‌ఫెక్షన్స్, వైరస్‌లతో పోరాడే శక్తిని శరీరానికి అందిస్తుంది. శరీరానికి కావాల్సిన యాంటీ ఆక్సిడెంట్స్‌ను సరఫరా చేసి అధిక బరువును కూడా తగ్గిస్తుంది.

తగ్గిస్తేనే మంచిది...



ప్రస్తుత వాతావరణంలో అందరూ ఆరోగ్యం విషయలో శ్రద్ధ తీసుకో వడం తప్పనిసరి... రోజువారీ తినే పదార్థాలలో కొన్ని ఎక్కువగా తీసుకోవల్సినవి ఉంటాయి. కొన్ని తక్కువగా తీసుకో వల్సినవి ఉంటాయి. అలాంటి వాటిల్లో ఉప్పు కూడా ఒకటి. కొంత మందికి అన్నం తినేటప్పుడు పైన కొంచెం ఉప్పు చల్లుకుని కలుపు కుని తినే అలవాటు ఉంటుంది. కొన్ని సార్లు కూరల్లో ఉప్పు తగ్గితే తినే సమయంలో కలుపుకుని తింటుంటాం. కానీ ఉప్పును ఒక మోతాదులో మాత్రమే తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు. ఎక్కువ తీసుకున్నా, తక్కువ తీసుకున్నా సమస్యనే. అందువల్ల ఉప్పు విషయంలో చాలా జాగ్రత్తగా ఉండాలి. మోతాదు మించిన ఉప్పుతో మానవ శరీరంలో రోగ నిరోధక శక్తి కూడా సన్నగిల్లుతుందని పరిశోధనల్లో వెల్లడైంది. ఒక వ్యక్తి రోజుకు ఐదు గ్రాములకు మించకుండా ఉప్పును వాడాలని సూచిస్తోంది. ఉప్పును అధికంగా వాడటం వల్ల రక్తపోటు పెరిగే ప్రమాదముంటుంది. ఇందులో ఉండే సోడియం క్లోరైడ్ వల్ల రక్తపోటు పెరగడమే కాకుండా, గుండె జబ్బులకు కూడా దారి తీస్తుందని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. రక్తంలో రోగనిరోధక కణానికి చెందిన అత్యంత సాధారణ రకం గ్రాన్యులోసైట్స్ పనితీరును దెబ్బతీస్తుంది. కాబట్టి ఉప్పును జాగ్రత్త వాడటం ఆరోగ్యకరం.

దశాబ్ది ఉత్సవాలు ఎన్నికల స్టంట్

(మొదటిపేజీ తరువాయి)

ప్రకటనలకే పరిమితమవుతుందని విమర్శించారు. దళిత బంధు పథకం ప్రకటనలో ఆర్భాటం చేసిన కేసీఆర్ దాని అమలులో చిత్తశుద్ధి ప్రదర్శించలేదన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలు ప్రజలు మార్చిపోతారని అనుకుంటున్నారా? అని కేసీఆర్‌ను ప్రశ్నించారు. ఎస్సీ, ఎస్టీ వర్గాలకు బడ్జెట్‌లో కేటాయించిన నిధుల్లో రూ. 50వేల కోట్లు దారి మళ్లించారని విమర్శించారు. ప్రజలు ఇప్పటికైనా వాస్తవాలను గ్రహించాలనీ, కేసీఆర్ మాయ మాటలు నమ్మవద్దని విజ్ఞప్తి చేశారు.

జీవో 111 రద్దు వెనుక భారీ కుంభకోణం : కిసాన్ కాంగ్రెస్ చైర్మెన్ కోదండరెడ్డి

రాష్ట్ర ప్రభుత్వం జీవో 111 ను రద్దు చేయడం వెనుక భారీ కుంభకోణం దాగి ఉందని కిసాన్ కాంగ్రెస్ చైర్మెన్ కోదండరెడ్డి ఆరోపించారు. 111 పరిధిలో ఉన్న 80 శాతం భూముల్లో ఇప్పటికే రాజకీయ నాయకులు, రియల్ ఎస్టేట్ వ్యాపారులు, అధికారులు, అనధికారికంగా తక్కువ ధరకు సొంతం చేసుకున్నారని చెప్పారు. మంత్రులు, మాజీ మంత్రులు, పార్టీ నాయకులు ఫామ్‌హౌస్‌లు నిర్మించుకున్నారని చెప్పారు. పేదలకు కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని చెప్పారు. ఈ ప్రభుత్వం భూదాన బోర్డును రద్దు చేసి, లక్ష 45 వేల ఎకరాల భూమిని చట్ట విరుద్ధంగా పారిశ్రామిక వేత్తలకు అమ్ముతున్నదని విమర్శించారు. దళితులకు చెందిన అసైన్డ్ భూములు వేలం వేసి అమ్ముతున్నారని చెప్పారు.

బీజేపీ బీసీ డిక్లరేషన్ చిత్తుకాగితం

- సీఎం కేసీఆర్‌కు బీఆర్ఎస్ ఎమ్మెల్యేల కృతజ్ఞతలు

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

కులవృత్తుల వారికి ఆర్థిక చేయూత ఇవ్వాలని రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో నిర్ణయించి, అమల్లోకి తెస్తున్నందుకు ముఖ్యమంత్రి కే చంద్రశేఖరరావుకు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కృతజ్ఞతలు తెలిపారు. శుక్రవారంనాడిక్కడి బీఆర్ఎస్ శాసనసభాపక్ష కార్యాలయంలో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కేపీ వివేకానంద, కాలేరు వెంకటేష్ విలేకరుల సమావేశంలో మాట్లాడారు. బీజేపీ బీసీ డిక్లరేషన్ పేరిట కొత్త నాటకానికి తెర లేపిందనీ, అది చిత్తు కాగితంతో సమానమని విమర్శించారు. బీసీల కోసం బీజేపీ ఎంపీలు పార్లమెంటులో ఎన్నడైనా మాట్లాడారా...అని ప్రశ్నించారు. తెలంగాణలో బీసీల కోసం అమలవుతున్న పథకాలు బీజేపీ పాలిత రాష్ట్రాల్లో ఎందుకు అమలు కావడం లేదో బీజేపీ ఎంపీ డాక్టర్ కే లక్ష్మణ్ చెప్పాలని డిమాండ్ చేశారు. ఆయన వాస్తవాలు తెలుసుకోవాలని సూచించారు. కర్నాటకలో కాంగ్రెస్ గెలవడం సిద్ధరామయ్య గొప్పతనం తప్ప, ఆ పార్టీది కాదన్నారు. తెలంగాణలో సిద్ధ రామయ్యలు లేరనీ, గాంధీభవన్‌లో గాడ్సేలు ఉన్నారని విమర్శించారు.

బీసీ ద్వేషి బీజేపీ

- కేంద్రం వారికి చేసింది ఏమీ లేదు : మంత్రి వీ శ్రీనివాస్‌గౌడ్ విమర్శ

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం పూర్తిగా బీసీ వ్యతిరేక పార్టీ అనీ, ప్రధాని నరేంద్రమోడీ హయాంలో వారికోసం చేసింది ఏమీ లేదని రాష్ట్ర ఎక్సైజ్‌శాఖ మంత్రి వీ శ్రీనివాస్ గౌడ్ విమర్శించారు. శుక్రవారంనాడిక్కడి బీఆర్ఎస్ శాసనసభాపక్ష కార్యాలయంలో ఎమ్మెల్యేలు జైపాల్ యాదవ్, అంజయ్య యాదవ్‌లతో కలిసి ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం కనీసం బీసీ కులగణన కూడా చేయడం లేదనీ, వారికోసం కేవలం రూ.2వేల కోట్లు మాత్రమే కేటాయించారని చెప్పారు. రాష్ట్రంలో గొర్రెల పంపిణీ పథకానికే సీఎం కేసీఆర్ అంతకంటే ఎక్కువ నిధులు కేటాయించారని ఎద్దేవా చేశారు. కేంద్రంలో బీసీ మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయలేని అసమర్థ ప్రభుత్వం ఉన్నదని అన్నారు. బీజేపీ డిక్లరేషన్ ఓ ఎన్నికల స్టంట్ అనీ, దాన్ని బీజేపీ పాలిత రాష్ట్రాల్లో అమలు చేస్తున్నారా...అని ప్రశ్నించారు. కాంగ్రెస్, బీజేపీలు బీసీలను ఓట్ బ్యాంక్‌గానే చూస్తున్నారనీ, బీఆర్ఎస్ మాత్రమే వారికోసం చిత్తశుద్ధితో పని చేస్తున్నదని వివరించారు.

బీజేపీ ఎంపీని అరెస్టు చేయాల్సిందే

న్యూఢిల్లీ : క్రీడాకారులపై లైంగిక వేధింపులకు పాల్పడినందుకు బీజేపీ ఎంపీ, రెజ్లింగ్ సమాఖ్య అధ్యక్షుడు బ్రిజ్‌భూషణ్‌ను అరెస్టు చేయాలని రెజ్లర్లు, రైతులు పోలీసులకు ఇచ్చిన అల్టిమేటం ఆదివారంతో ముగియనుంది. బ్రిజ్‌భూషణ్‌ను రహస్యంగా విచారించినట్టు చెబుతున్నప్పటికీ, తదుపరి చర్యలు తీసుకోలేదు. కాగా, ఈ నెల 21న జంతర్‌మంతర్‌లో జరిగే రైతు సంఘాల సమావేశంలో భవిష్యత్ ఆందోళనను ప్రకటించనున్నారు. అయితే ఈ సమావేశానికి రైతులను రానివ్వకుండా పోలీసులు సరిహద్దుల్లోనే అడ్డుకోవాలని చూస్తున్నారు. ఆయా ప్రదేశాల్లో పికెట్లు కూడా ఏర్పాటుచేశారు. ట్రాక్టర్లు జంతర్‌మంతర్ వద్దకు చేరుకుంటాయన్న సమాచారంతో భారీ స్థాయిలో బారికేడ్లు ఏర్పాటుచేశారు. రెజ్లర్ల పతకాలు వేలం వేస్తే కేవలం రూ.15 వేలు మాత్రమే లభిస్తాయన్న బ్రిజ్‌భూషణ్ ఆరోపణపై సాక్షి మాలిక్ స్పందించారు. బీజేపీ ఎంపీ తమ 15 ఏండ్ల కష్టాన్ని ఎగతాళి చేశారని, దేశానికి సాధించిన పతకాలు ఎవరి దాతృత్వం కాదని ఆమె అన్నారు. జంతర్ మంతర్‌లోనే రెజ్లర్ల ఆందోళన శుక్రవారం కూడా కొనసాగింది. దీంతో రెజ్లర్ల ఆందోళన 27 రోజులు పూర్తిచేసుకుంది. వామపక్ష మహిళా సంఘాలు నాయకులు నిరసన వేదిక వద్దకు చేరుకుని మల్లయోధులకు మద్దతు ప్రకటించాయి.

వారి న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలి : సచిన్ పైలట్

కాంగ్రెస్ నేత సచిన్ పైలట్ నిరసన ప్రదేశాన్ని సందర్శించారు. కాంగ్రెస్ నేత సచిన్ పైలట్ మాట్లాడుతూ నిరసన తెలిపిన మల్లయోధుల 'న్యాయబద్ధమైన డిమాండ్'ను వీలైనంత త్వరగా పరిష్కరించాలనీ. చట్టం పరిధిలో "నిష్పాక్షిక" విచారణ జరగాలని అన్నారు. 'గత 26-27 రోజులుగా మన అగ్రశ్రేణి క్రీడాకారులు చాలా బాధలో ఉన్నారు. తమపై జరిగిన అకృత్యాలకు కారకులైన వారిపై చర్య తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. వారు ఇన్ని రోజులుగా వేడుకుంటున్నారు. తమకు తగిన గౌరవం లభించేలా వేచి ఉన్నారు. వారికి న్యాయం చేయాలని కోరుతున్నా' అని పైలట్ అన్నారు. దేశంలోని యువ తరం, రైతులు, మల్లయోధులు సంతోషంగా లేనప్పుడు దేశం సంతోషంగా ఉండదన్నారు. అథ్లెట్లు దేశానికి పతకాలు తెస్తే యావత్ దేశం ఆనందిస్తోందని, అదే ప్రజలు ఇప్పుడు ఎందుకు మౌనంగా ఉన్నారని ప్రశ్నించారు.

రైతుల ఆందోళన నేపథ్యంలో భారీ భద్రత

నిరసన చేస్తున్న మల్లయోధులకు మద్దతుగా ఆదివారం రైతుల సమావేశం దృష్ట్యా ఢిల్లీ పోలీసులు జంతర్ మంతర్ వద్ద, దేశ రాజధాని సరిహద్దుల్లోని భారీ భద్రతా ఏర్పాట్లుచేసినట్టు ఒక అధికారి తెలిపారు. ఢిల్లీలోకి ప్రవేశించే వాహనాలను తనిఖీ చేయడంతోపాటు సరిహద్దు ప్రాంతాల్లో పికెట్లను పెంచుతున్నట్టు తెలిపారు. 24 గంటలూ పరిస్థితిని పర్యవేక్షించేందుకు ఆ ప్రాంతమంతా సీసీటీవీ కెమెరాలతో ఏర్పాటు చేసినట్టు తెలిపారు.

ఎన్నాళ్లీ తన్లాట?

(మొదటిపేజీ తరువాయి)

పరిష్కారంలో ఆ పార్టీ ఏనాడూ చిత్తశుద్ధి చూపలేదని విమర్శించారు. మహారాష్ట్రలోని నాందేడ్‌లో బీఆర్ఎస్ కార్యకర్తల రెండ్రోజుల శిక్షణా శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. కర్నాటక అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు చూసి, రాజకీయ అజ్ఞానులు ఏదేదో మాట్లాడుతున్నారనీ, దేశంలో దశాబ్దాలుగా కాంగ్రెస్‌పార్టీ గెలిచి, సాధించింది ఏంటని ప్రశ్నించారు. 75 ఏండ్లుగా దేశ రైతాంగ సమస్యలు పరిష్కరించడంలో ఎవరూ చిత్తశుద్ధి చూపలేదన్నారు. ఎన్నికల్లో గెలవాల్సింది పార్టీలు కాదనీ, ప్రజలు గెలవాలని చెప్పారు. దేశానికి తెలంగాణ మోడల్ పాలన అవసరమన్నారు. పుష్కలంగా ఉన్న ప్రకృతి వనరులను సమర్థవంతంగా వినియోగించలేకపోతున్నారని విమర్శించారు. ఓవైపు సాగుకు నీరులేక రైతులు ఆత్మహత్యలకు పాల్పడుతుంటే, మరోవైపు ఏటా వేల టీఎంసీల నీరు సముద్రంలో కలుస్తున్నదని అన్నారు. అకోలా, ఔరంగాబాద్‌లో వారానికోసారి తాగునీరు ఇస్తున్నారనీ, దాదాపు దేశం మొత్తం ఇదే తరహా పరిస్థితులు ఉన్నాయని చెప్పారు. దేశంలోని అన్ని రాష్ట్రాల్లో తీవ్రమైన రైతు ఉద్యమాలు జరిగాయనీ, అనేక ఆందోళనల్లో ఎందరో రైతులు ప్రభుత్వ తూటాలకు బలయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులంటే కేంద్రంలోని ప్రభుత్వానికి గౌరవం లేదనీ, వారు నిత్యం పోరాడుతూనే ఉంటున్నారని అన్నారు. ఈ పరిస్థితులు మారాలని ఆకాంక్షించారు. అప్పటి వరకు బీఆర్ఎస్ రైతుల పక్షాన పోరాటం ఆపబోదని స్పష్టం చేశారు. కృష్ణా, గోదావరి నదులు పుట్టిన మహారాష్ట్రలో నీటి కొరత ఎందుకని ప్రశ్నించారు. రాష్ట్రంలో ఇంటింటికి పుష్కలంగా తాగునీరు అందిస్తున్నామని చెప్పారు. స్వరాష్ట్రం సిద్ధించాక స్వల్పకాలంలోనే అనేకరంగాల్లో అభివృద్ధి సాధించామన్నారు. మహారాష్ట్రలో ఇప్పటికీ అనేక ప్రాంతాల్లో వారానికి ఒకసారి మాత్రమే తాగునీరు వచ్చే దుస్థితి ఉందని ఎద్దేవా చేశారు. కర్నాటకలో బీజేపీ విద్వేష రాజకీయాలు చేసి, ఘోర పరాజయాన్ని చవిచూసిందనీ, అక్కడి ఫలితాల చూసి, కొందరు ఏదేదో మాట్లాడుతున్నారనీ, వారి కలలు నెరవేరబోవని తేల్చిచెప్పారు. కార్యక్రమంలో మహారాష్ట్రకు చెందిన పలువురు నేతలు పాల్గొన్నారు.

జానెడు జాగా కోసం.. అలుపెరుగని సమరం..!

(మొదటిపేజీ తరువాయి)

సాగిస్తున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం ఇల్లు కట్టించకపోయినా కనీసం జాగానైనా కేటాయించాలని కోరుతున్నారు.

భూమి కాజేసేందుకు కబ్జాదారుల ప్రయత్నం

తమకు జాగాలు కేటాయించిన పేదలు పోరాడుతున్న ప్రభుత్వ భూమిలో పదేండ్ల నుంచి ఎలాంటి పంటలూ సాగు చేయడం లేదు. పడావుగా ఉంది.

కానీ పేదల భూపోరాటం మొదలైన నాటి నుంచి దాన్ని కాజేసేందుకు కొందరు కబ్జాదారులు కుట్రలకు తెరలేపారు. బినామీ లబ్దిదారులు పుట్టుకొస్తూ ఈ భూమిని చేజిక్కించుకునేందుకు పావులు కదుపుతున్నారు. మహిళలు గుడారాలు వేసుకొని ఉంటున్న ఈ స్థలంలో ట్రాక్టర్లను పంపించి దున్నుతున్నారు. రాత్రి వేళలో ఎవరూ అక్కడ లేని సమయంలో ట్రాక్టర్లతో సాగు చేస్తున్నట్టు కనిపించేలా కుటిల యత్నాలకు పాల్పడుతున్నట్టు పేదలు చెబుతున్నారు. సమస్యను పరిష్కరించాల్సిన అధికారులు కూడా అక్రమార్కులకే వంతపాడుతున్నట్టు ఆరోపణలు న్నాయి. నిరుపేదలు చేపట్టిన ఈ పోరాటానికి సీపీఐ(ఎం) అండగా నిలిచింది. ఈ పోరాటంలో ప్రత్యక్షంగా పాల్గొంటూ పేదలకు ఇంటి స్థలాలు పంపిణీ చేయాలని డిమాండ్ చేస్తోంది.

తాజాగా డీవైఎఫ్ఐ నాయకులు సైతం భూ పోరాటానికి మద్దతు ప్రకటించారు. ప్రభుత్వం, అధికారులు ఈ భూమిని పేదలకు పంచి న్యాయం చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

సమగ్ర దర్యాప్తు చేయాలి
పైళ్ల ఆశయ్య, సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యుడు

బావురావుపేట శివారులో ప్రభుత్వ భూమికి సంబంధించి సమగ్ర విచారణ జరిపించాలి. సర్వే నెం.8లోని 27 ఎకరాల అసైన్డ్ భూమిని 1973-74లో పేదలకు పంపిణీ చేసినప్పటికీ ప్రస్తుతం అక్కడ అసైన్డ్ చేసిన పేదలు లబ్దిదారులుగా లేరు.

ఆక్రమణకు గురైన ఈ భూమిని కాజేసేందుకు కొందరు భూ వ్యాపారులు కాచుకొని కూర్చుకున్నారు. పేదలకు చెందాల్సిన అసైన్డ్ భూమిలో లోపాయికారీగా క్రయవిక్రయాలు జరిపి ఇతరులు ధరణి రికార్డుల్లోకి చొరబడ్డారు. ఈ భూమిలో ఇంటి స్థలాల కోసం పోరాడుతున్న పేదలకు ఇవ్వకుండా బెదిరింపు ధోరణి అవలంబిస్తున్నారు.

ప్రభుత్వం దిగొచ్చే వరకు పోరాటం : రేణుక

తమ పోరాటం ఇండ్ల స్థలాలు సాధించేవరకు కొనసాగుతుంది. ప్రభుత్వం, ఉన్నతాధికారులు వచ్చి భూ పంపిణీ చేపట్టాలి. అప్పటి దాకా మా పోరాటం ఆపేది లేదు. మమ్మల్ని బెదిరించడం సరికాదు. మాకు మద్దతుగా నిలిచిన సీపీఐ(ఎం) నాయకులపై కేసులు నమోదు చేయడం బాధాకరం.

ఎర్రటెండలు..వడగాల్పులు

(మొదటిపేజీ తరువాయి)

ఉండాలని సూచించారు.

రాష్ట్రంలో అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదైన ప్రాంతాలు

దామరచర్ల(నల్లగొండ)	45.4 డిగ్రీలు
వీణవంక(కరీంనగర్)	45.4 డిగ్రీలు
కడెం ప్రాజెక్టు (నిర్మల్)	45.1 డిగ్రీలు
జన్నారం(మంచిర్యాల్)	44.9 డిగ్రీలు
రాయినిగూడెం(సూర్యాపేట)	44.8 డిగ్రీలు
జీహెచ్ఎంసీ పరిధిలో	
ఖైరతాబాద్	42.5 డిగ్రీలు
కాప్రా	41.3 డిగ్రీలు
ఉప్పల్	41.2 డిగ్రీలు
చార్మినార్, గచ్చిబౌలి, కుత్బుల్లాపూర్	41.1 డిగ్రీలు

ఆగ్నేయ బంగాళాఖాతంలోకి నైరుతి రుతుపవనాలు

నైరుతి రుతుపవనాలు ఆగ్నేయ బంగాళాఖాతం, నికోబార్ ఐలాండ్స్, దక్షిణ అండమాన్ సముద్రంలోని కొన్ని భాగాలకు నైరుతి రుతుపవనాలు విస్తరించాయని ఐఎమ్‌డీ తెలిపింది. తూర్పు మధ్యప్రదేశ్ నుంచి విదర్భ మీదుగా ఉత్తర ఇంటీరియర్ కర్నాటక వరకు సగటు సముద్ర మట్టానికి 0.9 కిలోమీటర్ల ఎత్తులో ద్రోణి విస్తరించి ఉంది. తెలంగాణ మీదుగా దిగువ స్థాయిలో వాయువ్య దిశ నుంచి గాలులు వీస్తున్నాయి.

రూ.2,000 నోట్లు వెనక్కి

(మొదటిపేజీ తరువాయి)

నోట్లు 2,272 పట్టుబడగా.. 2020లో వీటి సంఖ్య ఏకంగా దాదాపు 2.45 లక్షలకు చేరిందని నేషనల్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో (ఎన్‌సీఆర్‌బీ) గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి.

ఢిల్లీలో దోస్తీ..గల్లీలో కుస్తీ

(మొదటిపేజీ తరువాయి)

అందరూ భావించగా అది జరగలేదని చెప్పారు. ఈ విషయంలో బీజేపీ, బీఆర్ఎస్ మధ్య ఏదో అవగాహన ఒప్పందం జరిగిందని ప్రజలు అనుకుంటున్నారని తెలిపారు. లిక్కర్ కేసులో అరెస్టు పక్కా అని తరుచూ తమ పార్టీ నేతలు కామెంట్లు చేయడం, ఇప్పుడు ఆమె అరెస్టు కాకపోవడం వల్ల బీజేపీ బ్లేమ్ అవుతున్నదన్నారు. దీని వల్లనే తెలంగాణలో తమ ఉధృతికి బ్రేకులు పడ్డాయని చెప్పారు. బీజేపీ ఎప్పుడూ ఒక్కసారే స్పీడ్‌గా వెళ్లడం లేదనీ, అలా అని మరీ మెల్లగా కూడా వెళ్లట్లేదని చెప్పారు. ఎన్నికల సమయంలో ఈ స్పీడ్ సరిపోదనీ, కొన్ని మార్పులు రావాల్సిన అవసరం ఉందని తన అభిప్రాయాన్ని వ్యక్తపరిచారు. కేసీఆర్‌ను, ఆయన కుటుంబాన్ని ఢీకొట్టేది తామే అనే విషయాన్ని సీరియస్‌గా ప్రజల్లోకి తీసుకెళ్లడంతో బీజేపీ కాస్త వెనుకబడిందని తెలిపారు. ఈటల రాజేందర్ ఎన్నికల సమయంలో ఎంత గట్టిగా పనిచేశాడో, ఇప్పుడూ అంతే గట్టిగా పనిచేస్తున్నాడని చెప్పారు. తానూ, ఈటల స్లో కాలేదని చెప్పారు. అయితే, చేరికల కమిటీ పనితీరు స్లోగా ఉందని అభిప్రాయపడ్డారు. పొంగులేటి, జూపల్లిలతో పాటు పలువురి నేతలతో సంప్రదింపులు చేస్తున్నామన్నారు.

జీ7 సమ్మిట్‌కు నిరసన సెగ

(మొదటిపేజీ తరువాయి)

అన్నారు. " మేము జీ7 అజెండాకు వ్యతిరేకంగా ఉన్నాం. ఎందుకంటే దాని అజెండా సంపన్న దేశాల కోసం. ఇది శాంతి, స్థిరత్వానికి సంబంధించిన అజెండా కాదు" అని ఆయన తెలిపారు. ఈ నిరసనలు ఒక్క హిరోషిమాలోనే కాదు.. జపాన్‌లోని ఇతర నగరాల్లో అనేక ప్రదేశాల్లో జరిగాయి. ఆందోళనకారులు ర్యాలీలు నిర్వహించారు. సమావేశాన్ని వ్యతిరేకిస్తూ స్వదేశీ, విదేశీ నిరసనకారులు వీధుల్లోకి వచ్చారు. ఈ ఏడాది జీ7 సమావేశానికి జపాన్‌లోని హిరోషిమా ఆతిథ్యం ఇవ్వడంపై అక్కడి ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతున్నది. రెండో ప్రపంచ యుద్ధంలో ఒకప్పుడు యూఎస్ అణు బాంబు దాడిలో నాశనమైన నగరం పేరుతో తన స్వంత రాజకీయ ప్రయోజనాలను కోరుకున్నందుకు జపాన్ ప్రధాని కిషిదాపై ఆ దేశ ప్రజలలో చాలా మంది ఆగ్రహంతో ఉన్నారు. జీ7 దేశాలలో యూఎస్, బ్రిటన్, ఇటలీ, ఫ్రాన్స్, జర్మనీ, కెనడా, జపాన్‌లు ఉన్నాయి. భారత్‌తో పాటు దక్షిణ కొరియా, బ్రెజిల్, ఆస్ట్రేలియా, వియత్నాం, ఇండోనేషియా, కొమొరోస్, కుక్ దీవులు, కొన్ని అంతర్జాతీయ సంస్థల నుంచి నాయకులు శిఖరాగ్ర సమావేశానికి ఆహ్వానించబడ్డారు.

యువతకు క్రీడా సామగ్రి అందజేత



నవతెలంగాణ - హస్తినాపురం

హస్తినాపురం డివిజన్ పరిధిలోని సప్తగిరి హిల్స్ కాలనీ యువతకు జీహెచ్ఎంసీ ద్వారా వచ్చిన స్పోర్ట్స్ కిట్లను కార్పొరేటర్ బి.సుజాతా నాయక్ శుక్రవారం అందజేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ బస్తీల్లో ఉండే యువతకు క్రీడల పట్ల అవగాహన కల్పిస్తూ మెరుగైన క్రీడాకారులను తయారు చేసే విధంగా ప్రభుత్వం నుండి ప్రోత్సాహం ఉంటుందని అన్నారు. క్రీడలు శారీరక, మానసిక ఉల్లాసానికి ఎంతో మేలు చేస్తాయని అన్నారు. ఈ కార్యక్రమంలో కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు గణేష్ రెడ్డి, బీఆర్ఎస్ పార్టీ నాయకులు చంద్రమౌళి చారి, గోపిరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చెన్నయ్య జ్ఞాపకార్థం అన్నదానం



నవతెలంగాణ- బడంగ్‌పేట్

మాతృదేవోభవ అనాథ ఆశ్రమంలో మతిస్థిమితం కోల్పోయిన 112 మంది అనాథలకు, అభాగ్యులకు గురువారం అమ్మ హెల్పింగ్ హ్యాండ్స్-కువైట్ సంస్థ ఆధ్వర్యంలో కీ.శే. నేతగాని చెన్నయ్య జ్ఞాపకార్థంగా వారి కుమారులు బాలచంద్ర, చంద్రశేఖర్ కుటుంబ సభ్యులు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాతృ దేవోభవ అనాథ ఆశ్రమ ట్రస్టు చైర్మన్ గట్టు గిరి మాట్లాడుతూ మహేశ్వరం నియోజకవర్గం బడంగ్ పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఉన్న నాదర్ గుల్ గ్రామంలోని ఆశ్రమంలో అన్నదానం చేయడం హర్షనీయమన్నారు. కువైట్‌లో ఉన్న అమ్మ హెల్పింగ్ హ్యాండ్స్-కువైట్ గ్రుపు అధ్యక్షులు పెరుగు ప్రభాకర్ ఒక సంస్థ ద్వారా తెలంగాణలో, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో ఎన్నో స్వచ్ఛంద సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. అనంతరం వారికి గట్టుగిరి ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలియజేశారు.

'ఈడబ్ల్యూఎస్ కాలనీ స్థలాలను జీవో 59 కింద క్రమబద్ధీకరించాలి'



నవతెలంగాణ -ఘట్కేసర్

ఘట్కేసర్ మున్సిపల్ పరిధి ఈడబ్ల్యూఎస్ కాలనీలోని సర్వే నంబర్ 132లో ఉన్న స్థలాలను జీవో 59 కింద క్రమబద్ధీకరణకు కృషి చేసి పట్టాలు ఇవ్వాలని ఘట్కేసర్ మున్సిపల్ చైర్ పర్సన్ ముల్లి పావని జంగయ్య యాదవ్ కోరారు. ఈ మేరకు ఘట్కేసర్ మున్సిపల్ చైర్ పర్సన్ ముల్లి పావని జంగయ్య యాదవ్..వైస్ చైర్మన్ పలుగుల మాధవరెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి చామకూర మల్లారెడ్డి, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ఇంచార్జి మర్రి రాజశేఖర్ రెడ్డిలను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా మున్సిపాలిటీలోని సర్వే నెంబర్132 లో ప్రభుత్వ స్థలంలో ఇల్లు నిర్మించుకొని పట్టాలు ఉన్నవారికి క్రమబద్దీకరణ, అదేవిధంగా 1976-77 సంవత్సరం లో 18 ఎకరాల 23 గుంటల ప్రభుత్వం భూమి పట్టాలు ఇచ్చి.. ఏపీ కార్పోరేషన్ ద్వారా ఇల్లు నిర్మించుకున్న వారికి మున్సిపాలిటీలో క్రమబద్దీకరణ చేయుటకు ప్రభుత్వం ఇచ్చిన 120 గజాల స్థలానికి 59 జీవో, ఎంఎస్ ప్రకారం మాకు రిజిస్ట్రేషన్ చేసేందుకు మంత్రికి వినతి పత్రాన్ని అందజేసినట్లు తెలిపారు. మంత్రి సానుకూలంగా స్పందించి వెంటనే జిల్లా కలెక్టర్‌కు మున్సిపాలిటీ లో వెంటనే పేరు మార్పిడి జరిగేలా చర్యలు చేపట్టాలని ఆదేశించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఈ డబ్ల్యూఎస్ కాలనీ అభివృద్ధి సంఘం అధ్యక్షుడు కేషవపట్నం ఆంజనేయులు, కౌన్సిలర్ కడుపొల్లా మల్లేష్, మీసాల మల్లేష్, మాజీ వార్డు సభ్యుడు బర్ల దేవేందర్, ఈడబ్ల్యూఎస్ కాలనీ అభివృద్ధి సంఘం ప్రధాన కార్యదర్శి శశిధరన్, నాయకులు అంకం సురేష్ యాదవ్, నాగరాజు గౌడ్, మెరుగు నరేష్ గౌడ్, నజీర్, మున్న, నగేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రాథమికోన్నత పాఠశాలగా మార్చాలని వినతి



నవతెలంగాణ-బడంగ్‌పేట్

మహేశ్వరం నియోజకవర్గం జల్‌పల్లి మున్సిపల్ పరిధిలోని శ్రీరాం కాలనీలో ఉన్న ప్రాథమిక పాఠశాలను ప్రాథమికోన్నత పాఠశాలగా మార్చాలని కోరుతూ కౌన్సిలర్లు కే.లక్ష్మి నారాయణ, పల్లపు శంకర్‌లు శుక్రవారం విద్యా శాఖ మంత్రి పి.సబితా ఇంద్రారెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎంతో కాలంగా ప్రాథమిక పాఠశాలగా కొనసాగుతుందని తెలిపారు. ఉన్నత చదువుల కోసం విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. స్పందించిన మంత్రి పాఠశాల అప్గ్రేడ్ చేయాలని ఉన్నత అధికారులను ఆదేశించారని తెలిపారు. అనంతరం మంత్రికి కౌన్సిలర్లు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు.

బడంగ్‌పేట్

కేసీఆర్ నాయకత్వంలో ఆలయాల అభివృద్ధి

సీఎం కేసీఆర్ నాయకత్వంలో దేవాలయాల అభివృద్ధికి పెద్ద పీట వేస్తున్నారని విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి తెలిపారు. మహేశ్వరం నియోజకవర్గ దేవాలయాల అభివృద్ధికి ఇప్పటికే రూ. 5 కోట్లు విడుదలయ్యాయని..మరో రూ.3 కోట్ల నిధులు మంజూరైనట్లు తెలిపారు. రెండు విడతలుగా మంజూరు అయిన సుమారు రూ.8 కోట్ల నిధులతో మహేశ్వరం నియోజకవర్గ పురాతన దేవాలయాలను అభివృద్ధి చేయటం జరిగిందన్నారు. నియోజకవర్గంలోని 8 ప్రాచీన దేవాలయాల్లో కోట్ల రూపాయల నిధులతో మౌలిక సదుపాయాల కల్పన, ఇతర పనులు చేపట్టనున్నట్లు మంత్రి తెలిపారు.

మాసబ్ చెరువును కాపాడాలని వినతి



నవతెలంగాణ-తుర్కయాంజల్

తుర్కయాంజల్ పరిధిలోని మాసబ్ చెరువును కబ్జాదారుల నుండి రక్షించాలని కోరుతూ తుర్కయాంజల్ మున్సిపాలిటీ అఖిలపక్షం నాయకులు శుక్రవారం భువనగిరి ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డికి మెమోరాండం అందజేశారు. స్పందించిన ఎంపీ మాట్లాడుతూ ఏది ఏమైనా చెరువును కబ్జాదారుల నుండి రక్షిస్తానని హామీనిచ్చారు. రెండు రోజుల్లో తానే స్వయంగా చెరువును సందర్శించి..అక్రమార్కుల పని పడతానని అన్నారు. ఎంపీని కలిసిన వారిలో ఎల్బీనగర్ కాంగ్రెస్ పార్టీ కో-ఆర్డినేటర్ మల్ రెడ్డి రాంరెడ్డి, టీపీసీసీ కార్యదర్శి కొత్తకుర్మ శివకుమార్, బీజేపీ దళిత మోర్చా జిల్లా అధ్యక్షుడు బచ్చిగళ్ళ రమేష్, తుర్కయాంజల్ మున్సిపాలిటీ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు కొత్తకుర్మ మంగమ్మ, కాంగ్రెస్ ఫ్లోర్ లీడర్ కౌశిక ఐలయ్య, బీఆర్ఎస్ ఫ్లోర్ లీడర్ కళ్యాణ్ నాయక్, కౌన్సిలర్ కొంద్రు మల్లేష్, టీడీపీ మున్సిపాలిటీ అధ్యక్షుడు రావుల విరేశం, తుర్కయాంజల్ బీఎస్పీ అధ్యక్షుడు వద్దిగళ్ళ బాబు, నాయకులు పుల్లగురం విజయానంద్ రెడ్డి, కొంతం యాదిరెడ్డి రెడ్డి, గుత్తా మహేందర్ రెడ్డి, గుడ్ల అర్జున్, బొక్క వంశీధర్ రెడ్డి, మైలారం బాబు, అజయ్, భూపాల్ రెడ్డి, కుమార్ గౌడ్, మల్లెల ఉపేందర్‌లు ఉన్నారు.

సుందరయ్య స్ఫూర్తితో ఉద్యమించాలి

- సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జాన్ వెస్లీ



నవతెలంగాణ-తుర్కయాంజల్

కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య స్ఫూర్తితో ప్రజా సమస్యలపై ఉద్యమించాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జాన్ వెస్లీ పిలుపునిచ్చారు. సీపీఎం పార్టీ ఉద్యమ నిర్మాత, బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి, నిరాడంబర జీవి కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య 38వ వర్ధంతి సభను తుర్కయాంజల్ మున్సిపాలిటీ రాగన్న గూడలోని సీపీఎం కార్యాలయంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన జాన్ వెస్లీ ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి మాట్లాడారు. సుందరయ్య ఉన్నత కుటుంబంలో జన్మించినప్పటికీ ప్రజా శ్రేయస్సు, సమసమాజ స్థాపనల కోసం, అసమానతలు అంటరానితనానికి, కుల వివక్షతకు వ్యతిరేకంగా పోరాటాలను తన ఇంటి నుండి ప్రారంభించారని గుర్తుచేశారు. దేశ స్వాతంత్రం కోసం చిన్న వయసులోనే చదువును కూడా త్యాగం చేసి స్వాతంత్ర ఉద్యమంలో క్రియాశీలకంగా పనిచేసిన గొప్ప దేశభక్తుడని కొనియాడారు. ఉత్తమ పార్లమెంటేరియన్‌గా శాసనసభలో నికార్సైన ప్రతిపక్ష నేతగా ప్రజా గొంతుకగా సుందరయ్య నిలిచారని అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై సుందరయ్యను స్ఫూర్తిగా తీసుకొని పనిచేయాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ముఖ్యంగా ఇండ్ల స్థలాల కోసం పట్టణ, గ్రామీణ ప్రజలు తిరుగుబాటుకు సిద్ధం అవ్వాలని కోరారు. సీపీఎం ఆధ్వర్యంలో రాబోయే రోజుల్లో గుడిసెల పోరాటం చేయబోతున్నట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం111 జీవో ఎత్తేసి..రంగారెడ్డి జిల్లాలో పెద్ద ఎత్తున ప్రభుత్వ భూములను సేకరిస్తున్నదని, ఇదే అదనుగా అందరూ భూ పోరాటానికి సిద్ధంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం రంగారెడ్డి జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు పగడాల యాదయ్య, సీపీఎం తుర్కయాంజల్ మున్సిపాలిటీ కన్వీనర్ డి కిషన్, నాయకులు సత్యనారాయణ, పెంటయ్య, ప్రకాష్ కారత్, కొండిగారి శంకర్, ఐ. కృష్ణ, కే. శారద, బి.శంకరయ్య, జే ఆశీర్వాదం, శివ ప్రసాద్, మాల్యాద్రి, డి శ్రీధర్, రత్నమ్మ కల్పన, యాదయ్య, అంజి సాయి తదితరులు పాల్గొన్నారు.

డివిజన్ సమస్యలు తీర్చడమే ధ్యేయం

- కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి



నవతెలంగాణ-వనస్థలిపురం

బీఎన్‌రెడ్డి నగర్ డివిజన్ ఓటర్ల సమస్యలు తీర్చడమే తన ధ్యేయం అని కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి అన్నారు. ఈ మేరకు శుక్రవారం ఆయన నవతెలంగాణ ప్రతినిధితో మాట్లాడారు. బీఎన్‌రెడ్డి కార్పొరేటర్‌గా ప్రజలు తనను నమ్మి గెలిపించినందుకు వారి సమస్యల పరిష్కారం కోసం ఏ పోరాటమైనా చేయడానికి సిద్ధంగా ఉన్నానని చెప్పారు. తెలంగాణ కల సాకారమై తొమ్మిదేళ్లు గడుసున్నా ఎల్బీనగర్ నియోజకవర్గం బీఎన్‌రెడ్డి నగర్ డివిజన్ అభివృద్ధిలో ఎంతో వెనుకబడి ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. నేటికీ సమస్యలపై అధికారులు, కాంట్రాక్టర్లతోనూ పోరాడుతూనే ఉన్నానని తెలిపారు. తనను నమ్మి ఓటు వేసిన ఓటర్లకు న్యాయం చేయటమే తన లక్ష్యంగా ముందుకు సాగుతున్నానని పేర్కొన్నారు. డివిజన్‌లోని అభివృద్ధితో పాటు సామాజిక కార్యక్రమాల్లో తన వంతు సహాయ సహకారాలు అందిస్తున్నట్లు తెలిపారు. డివిజన్‌లో ఎన్నో కొత్త కాలనీలు ఏర్పడుతున్న తరుణంలో కూడా జీహెచ్ఎంసీ తగిన నిధులు కేటాయించలేని పరిస్థితి నెలకొందన్నారు. ఇప్పటికీ ఎప్పటికీ డివిజన్ వాసుల సమస్యలపై పార్టీలకు అతీతంగా పోరాటం చేస్తూ ముందుకు సాగుతానని, వారి అభిమానమే తనకు శ్రీరామరక్ష అని కార్పొరేటర్ అన్నారు.

సీసీ కెమెరాల ఏర్పాటుకు రూ.4 లక్షలు మంజూరు



నవతెలంగాణ - ఎల్బీనగర్

మల్కాజిగిరి ఎంపీ రేవంత్ రెడ్డి నిధుల నుండి ప్రగతి నగర్ కాలనీలో సీసీ కెమెరాల ఏర్పాటుకు రూ. 4 లక్షలు మంజూరైనట్లు ఎల్బీనగర్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి మల్ రెడ్డి రాంరెడ్డి తెలిపారు. చంపాపేట్ డివిజన్ పరిధిలోని ప్రగతి నగర్ బైరమల్ గూడా ఓల్డ్ విలేజ్‌లో శుక్రవారం చంపాపేట్ డివిజన్ అధ్యక్షుడు శ్రీపాల్ రెడ్డి ఆధ్వర్యంలో మల్ రెడ్డి రామ్ రెడ్డి పర్యటించారు. ఈ సందర్భంగా కాలనీవాసులు తమ సమస్యలను రాంరెడ్డి దృష్టికి తీసుకొచ్చారు. డ్రైనేజ్, విద్యుత్ సమస్యలను పరిష్కరించాలని కోరారు. అనంతరం మల్‌రెడ్డి మాట్లాడుతూ టీపీసీసీ అధ్యక్షుడు, మల్కాజిగిరి ఎంపీ రేవంత్ రెడ్డితో మాట్లాడి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. తర్వాత ఎంపీ రేవంత్ రెడ్డి నిధుల నుంచి సీసీ కెమెరాల ఏర్పాటుకు నాలుగు లక్షల రూపాయల మంజూరు లెటర్ ను కాలనీవాసులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో శ్రవణ్, పరమేష్, వెంకటేష్, రాముయాదవ్, యాదయ్య, నారాయణ, కిరణ్, రణధీర్ రెడ్డి, తిరుపతి, వెంకటేష్, కమల్, కాలనీవాసులు కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

అన్నదానం మహాదానం : ఎమ్మెల్సీ దయానంద్ గుప్తా



నవతెలంగాణ- చైతన్యపురి

అన్నదానం మహాదానం అని ఎమ్మెల్సీ బొగ్గారపు దయానంద్ గుప్తా అన్నారు. ఆర్కేపురం డివిజన్‌లోని శ్రీ కృష్ణ మందిరం వద్ద శుక్రవారం రంగారెడ్డి జిల్లా ఆర్యవైశ్య మహాసభ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. ఈ కార్యక్రమాన్ని తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడు అమరవాది లక్ష్మీనారాయణ, అష్టలక్ష్మీ టెంపుల్ మాజీ చైర్మన్ దామోదర్, సంగం జిల్లా అధ్యక్షుడు తాడేపల్లి వెంకటేశం, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర యువజన నాయకుడు చిలుక ఉపేందర్ రెడ్డిలతో పాటు ఎమ్మెల్సీ హాజరై ప్రారంభించారు. నిర్వాహకులు మాట్లాడుతూ దాదాపు 400 మందికి అన్నదానం చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా యువజన అధ్యక్షుడు కొత్త రవి, ఆర్కేపురం డివిజన్ అధ్యక్షుడు పొద్దుటూరు శ్రీనివాస్ గుప్త, శ్రీ వాసవీ అన్నపూర్ణ ఎడ్యుకేషన్ ట్రస్ట్ చైర్మన్ మంచుకొండ సురేందర్ గుప్త, నాగేంద్రయ్య, బాలశ్యామ్, పెద్ది శ్రీనివాస్, రాజేంద్రప్రసాద్, ఎర్రం శ్రీనివాస్, తాళ్ల వంశీ, కాశెట్టి పాండు తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్‌లో 'మాస్టర్ మైండ్' ప్రభంజనం



నవతెలంగాణ-బడంగ్ పేట్

మహేశ్వరం నియోజకవర్గం బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లోని మాస్టర్ మైండ్ కళాశాల విద్యార్థులు ఇంటర్ ఫలితాల్లో రాష్ట్ర స్థాయిలో 4వ ర్యాంకులు సాధించి ప్రభంజనం సృష్టించారని బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొ రేషన్ డిప్యూటీ మేయర్ ఇబ్రహీం శేఖర్ తెలిపారు. మాస్టర్ మైండ్ కళాశాలలో స్టేట్ ర్యాంక్ సాధించిన విద్యార్థులను కళాశాల చైర్మన్ జగన్ మోహన్ రావు, సెక్రటరీ డా.రమావత్ పాండు, డైరెక్టర్లు, ప్రిన్స్‌పాల్, అధ్యాపక బృందంతో డిప్యూటీ మేయర్ పూల మాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు. కళాశాలలో ఐఐటీ, ఎన్ ఐటీ, ట్రిబుల్ ఐటీలో సీట్లు సాధించటంతో పాటు సీఏలో కూడా అర్హత సాధించినట్లు తెలిపారు. 2023 ఏప్రిల్, మే నెలలో నిర్వహించిన జేఈఈ మెయిన్స్, నీట్, ఎంసెట్ పరీక్షల్లో విద్యార్థులు ర్యాంకులు సాధించడం అభినందనీయమని చెప్పారు. ఈ కార్యక్రమంలో కళాశాల యాజమాన్యం, విద్యార్థులు, అధ్యాపక బృందం తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన ఇంద్రప్రస్త కాలనీ వాసులు



నవతెలంగాణ - ఎల్బీనగర్

ఎల్బీనగర్ నియోజకవర్గ పరిధి హస్తినపురం డివిజన్ పరిధిలోని ఇంద్రప్రస్త కాలనీ ఫేస్-2 వాసులు శుక్రవారం ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవి రెడ్డి సుధీర్ రెడ్డిని మర్యాద పూర్వ కంగా కలిశారు. ఈ సందర్భంగా కాలనీ వాసులు మాట్లా డుతూ ఇంద్రప్రస్త కాలనీ ఫేస్ 2లో ఉన్న కమ్యూనిటీ హాల్ నందు నూతనంగా వార్డు ఆఫీస్ ఏర్పాటు చేయాలని అధికారులు నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. కమ్యూనిటీ హాల్ నందు వార్డు ఆఫీస్ పెడితే కొన్ని ఇబ్బందులు వస్తాయని కాలనీ వాసులు ఆవేదన వ్యక్తం చేశారు.

అన్ని డివిజన్లలో వార్డు ఆఫీస్ ఏర్పాటు..

స్పందించిన సుధీర్ రెడ్డి మాట్లాడుతూ నగరంలో అన్ని డివిజన్ల నందు ఒక వార్డు ఆఫీస్ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. దీని ముఖ్య ఉద్దేశం ఏమిటంటే..ప్రజలకు మెరుగైన సేవలు అనగా ..శానిటేషన్, చిన్న చిన్న పనులు అందించేందుకు వార్డు ఆఫీస్ పెట్టడం జరుగుతుందన్నారు. దీంతో జీహెచ్ఎంసీ ఆఫీసుకు రాకుండా ఏ వార్డుకు సంబంధించిన వారు ఈ వార్డు ఆఫీస్ లో తమ సమస్యలను పరిష్కరించుకోవచ్చు అని వివరించారు. తర్వాత పక్కనే వృధాగా ఉన్న భవనాన్ని అధికారులు, కాలనీ సంఘాల సభ్యులతో ఎమ్మెల్యే పరిశీలించారు. అయితే ఆ భవనంలో వార్డు ఆఫీస్ ఏర్పాటుకు అధికారులు ఒప్పుకున్నారు. అలాగే ఎఫ్‌సీఐ కాలనీలో కూడా ఇలాగే వార్డు ఆఫీసు ఏర్పాటుకు సమస్య ఎదురైందని ఎమ్మెల్యే తెలిపారు. అక్కడ రెండు అంతస్తుల సీనియర్ సిటిజన్స్ భవనం ఉండడంతో..కింద సీనియర్ సిటిజన్లకు, రెండో అంతస్తులోవార్డు కార్యాలయం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు అధికారులు, నాయకులు, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

సుందరయ్య నేటితరానికి స్ఫూర్తి ప్రదాత

- సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు యాదయ్య



నవతెలంగాణ-ఘట్కేసర్

పుచ్చలపల్లి సుందరయ్య నేటితరానికి స్ఫూర్తి ప్రదాత అని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు చింతల యాదయ్య అన్నారు. పోచారం మున్సిపాలిటీ పరిధిలోని రాజీవ్ గృహకల్పలో శుక్రవారం అమరజీవి పుచ్చలపల్లి సుందరయ్య 38వ వర్ధంతిని నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన చిత్రపటానికి సీపీఎం జిల్లా నేతలు పూలమాలల వేసి నివాళులర్పించారు. అనంతరం చింతల యాదయ్య మాట్లాడుతూ సుందరయ్య నిరుపేదల పక్షాన నిరంతరం పోరాటం చేసిన త్యాగమూర్తి అని కొనియాడారు. సీపీఎం మండల కార్యదర్శి ఎన్ సబిత మాట్లాడుతూ ప్రస్తుత బూర్జువా రాజకీయ నాయకులు ప్రజలను దోచి ప్రజా సంపాదను కొల్లగొడుతున్నారని చెప్పారు. కమ్యూనిస్టుల త్యాగాల ఫలితంగానే ఈ మేరకు పేదలకు హక్కులు నిలిచాయని గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మండల కమిటీ సభ్యురాలు కె అలివేల, రాజీవ్ గృహకల్ప, గ్రామ శాఖ కార్యదర్శి బీహార్ సునీత, నాయకులు చల్లగొండ అరుణ, కె. అనసూయ, లక్ష్మి, కె. అరుణ, జె ప్రమీల, రేణుక, కొండమ్మ ప్రగతి పాల్గొన్నారు.

పరమ శివుడికి విశేష పూజలు



నవతెలంగాణ-సంతోష్ నగర్

ఆర్యవైశ్య సంఘం లాల్ దర్వాజ గౌలిపుర వారు ప్రతి నెల నిర్వహించే అమావాస్య అన్నప్రసాద కార్యక్రమంలో భాగంగా శుక్రవారం గౌలిపుర బతుకమ్మ బావి వద్ద గల లక్ష్మీనారాయణ స్వామి దేవాలయంలో వైశాఖ అమావాస్య సందర్భంగా పరమశివుడికి విశేష పూజలు రుద్రాభిషేకం చేశారు. తర్వాత ఛత్రీనాక పాత పోలీస్ స్టేషన్ వద్ద అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో చైర్మన్ శ్రీరాం కోటయ్య గుప్త, సలహాదారులు చీల రాములు గుప్త, సరాబు విశ్వశ్వరయ్య గుప్త, అధ్యక్షుడు శ్రీధర మల్లికార్జున్ గుప్త, ప్రధాన కార్యదర్శి సరాబు సంతోష్ గుప్త, కోశాధికారి కొల్కూరి నర్సింహులు గుప్త, ఆర్గనైజింగ్ సెక్రటరీ ఇరుకుల్ల భక్షపతి గుప్త, సభ్యులు బ్రహ్మాండండి విశ్వనాథం, ముక్క శేఖర్, శిరంగి సంతోష్, లోకనాథ్, గౌరిశెట్టి విశ్వనాథం తదితరులు పాల్గొన్నారు.

హస్తినాపురంలో కామ్రేడ్ సుందరయ్య వర్ధంతి



నవతెలంగాణ - హస్తినాపురం

కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య 38వ వర్ధంతి కార్యక్రమాన్ని సీపీఎం పార్టీ నందనవనం శాఖకార్యదర్శి రామావత్ పాండు నాయక్ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం నాయకులు సుందరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం ఎల్బీనగర్ సర్కిల్ కార్యదర్శి ఆలేటి ఎల్లయ్య, సీఐటీయూ నాయకులు లక్ష్మయ్య, శ్రీను, జంగయ్య, శాంతమ్మ, బాలు, లలిత, సాలమ్మ, రాజేశ్వరి, సైదులు, పరెంగన్, రాజునాయక్ పాల్గొన్నారు.

దేశంలో ఎక్కడా లేని విధంగా సంక్షేమ పథకాలు

- ఎమ్మెల్యే అహ్మద్ బిన్ అబ్దుల్లా బలాల



నవతెలంగాణ - సంతోష్ నగర్

దేశంలో ఎక్కడా లేని విధంగా తెలంగాణ రాష్ట్రంలో అనేక సంక్షేమ పథకాలు అమలవుతున్నాయని ఎమ్మెల్యే అహ్మద్ బిన్ అబ్దుల్లా బలాల అన్నారు. మలక్‌పేట్ నియోజకవర్గం అంబర్ పేట్, సైదాబాద్ మండలం పరిధిలోని డివిజన్ ఓల్డ్ మలక్ పేట్, వహీద్ నగర్, శంకర్ నగర్, ఆనంద్ నగర్, కలాడర్ కాలనీ, ఎల్ఐసీ కాలనీలకు చెందిన లబ్దిదారులకు కల్యాణ లక్ష్మీ, షాదీ ముబారక్ చెక్కులను శుక్రవారం ఎమ్మెల్యే అహ్మద్ బిన్ అబ్దుల్లా బలాల, డివిజన్ కార్పొరేటర్లు, అధికారులు కలిసి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం బడుగు, బలహీన వర్గాల కోసం అనేక సం క్షేమ పథకాలను ప్రవేశపెట్టిందని గుర్తుచేశారు. అర్హులు ఈ పథకాలను వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, సిబ్బంది లు పాల్గొన్నారు.


అంతర్జాతీయ కరాటే పోటీల్లో పతకాలు సాధించిన వీఎన్ అకాడమీ



నవతెలంగాణ-తుర్కయాంజల్

ఇంటర్ నేషనల్ ఒకినావా గోజురాయ్ కరాటే ఫెడరేషన్ ఆధ్వర్యంలో మలేషియాలో జరిగిన అంతర్జాతీయ స్థాయి కరాటే పోటీల్లో వీఎస్ కరాటే అకాడమీ క్రీడాకారులు బెస్ట్ టీమ్ కప్ తో పాటు పతకాలు సాధించారని ఆ అకాడమీ ఇండియా చీఫ్, తెలంగాణ కరాటే అసోసియేషన్ కోశాధికారి వి.నరేందర్ తెలిపారు. శుక్రవారం తుర్కయాంజల్ లో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ఈ నెల 12, 13, 14 తేదీల్లో మలేషియాలోని ఐపోలో జరిగిన అంతర్జాతీయ కరాటే పోటీల్లో రంగారెడ్డి జిల్లా కేంద్రానికి చెందిన వీఎస్ కరాటే అకాడమీ నుండి 15 మంది క్రీడాకారులు పాల్గొన్నారని తెలిపారు. సీనియర్, జూనియర్, సబ్ జూనియర్ క్యాటగిరి, కటా, కమిటీ విభాగాల్లో వి.వెంకటేష్ - గోల్డ్, కాంస్య పతకాలు సాధించారని అన్నారు. అలాగే జె.అక్షయరెడ్డి - సిల్వర్, బీ.మౌనిషా - కాంస్యం, కె.అద్వైత్ రెడ్డి - గోల్డ్, ఎస్. పల్లవి - కాంస్యం, ఎస్ లయ - 2 గోల్డ్, కె.సన్ హిత్ రెడ్డి - 2గోల్డ్, కె.సంహిత్ రెడ్డి - కాంస్యం, జె.కృతి రెడ్డి - గోల్డ్,సిల్వర్, జె.ఇషాన్ రెడ్డి - సిల్వర్, కాంస్యం, కె.జశ్వంత్ గోల్డ్, పి.సంజన - కాంస్యం, డి.కృషిత - 2 గోల్డ్, డి.సంస్కృతి - 2 గోల్డ్, ఐ.జోష్ణవి - సిల్వర్ పతకాలను సాధించారని తెలిపారు. మొత్తం 12 గోల్డ్, 04 సిల్వర్, 06 బ్రాంజ్ పతకాలను సాధించినట్లు చెప్పారు. ఈ ఈవెంట్‌లో మొత్తం 22 దేశాలు పాల్గొన్నాయని తెలిపారు. ఈ మెగా ఈవెంట్‌లో అద్భుత ప్రతిభ కనబరిచినందుకు వీఎస్ కరాటే అకాడమీ టీమ్‌కు కప్ బహూకరించారన్నారు. ఈ టోర్నమెంట్‌లో టీమ్ మేనేజర్‌గా ఎమ్.నర్సింగ్, కె.గణేష్, కోచ్ కె.సంపత్ కుమార్ తదితరులు వెళ్లారని తెలిపారు

'ప్రభుత్వానికి వడ్డెర్లు కనబడడం లేదా..?'



నవతెలంగాణ - సంతోష్ నగర్

తెలంగాణ ప్రభుత్వానికి వడ్డెర్లు కనబడడం లేదా.. అని వడ్డెర రిజర్వేషన్ పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు, అడ్వకేట్ గుంజి సంతోష్ కుమార్, రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ నెంబర్ తమ్మిశెట్టి శివకృష్ణలు ప్రశ్నించారు. శుక్రవారం వారు విలేకరులతో మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం వడ్డెర్ల మీద తీవ్ర వివక్ష చూపుతుందని విమర్శించారు. వెనుకబడిన కులాలుగా ఉన్న తమ సోదర కులాలాను ప్రస్తావిస్తూ వారి అభివృద్ధికి నిధులు మంజూరు చేయబోతున్నాం అని మంత్రి హరీశ్ రావు చెప్పారని అన్నారు. ఇందులో భాగంగా గతంలో గొర్రెలు, మేకలు, బర్లు, చేపలు, వృత్తి కులాలకు అందజేశారని చెప్పారు. మళ్ళీ నేడు అది రెండో విడతగా అందించనున్నారని తెలిపారు. సోదర కులాలకు వారి కులవృత్తులలో సహాయం చేయడం సంతోషించ దగ్గ విషయమని అన్నారు. కానీ అతి ప్రమాదకారమైన వడ్డెర వృత్తిదారులకు తెలంగాణ ప్రభుత్వం అన్యాయం చేస్తుందని ఆరోపించారు. ఎన్నికల సమయంలో అయినా న్యాయం చేయాలని కోరారు. వడ్డెర్లకు సరైన న్యాయం చేయకపోతే సీఎం క్యాంపు ఆఫీస్ ముట్టడిస్తామని హెచ్చరించారు.

బ్లాక్ అండ్ డెకర్‌తో ఇండ్‌కల్ టెక్నాలజీస్ భాగస్వామ్యం

నవతెలంగాణ - హైదరాబాద్

ఈ బ్లాక్ ఫ్లస్ డెకర్ బ్రాండ్, పవర్ టూల్స్. ఇంటి ఉత్పత్తులు, బయటి పవర్ ఎక్విప్మెంట్లో ప్రపంచ అగ్రగామి బెంగళూరు -మూలమైన కంపెనీ, ఇండకల్ టెక్నాలజీస్, అగ్రగామిగా ఉన్న సాంకేతిక, ఇన్నోవేషన్ కంపెనీ, ఏదైతే భారతదేశంలోని వినియోగదారుల వద్దకి పెద్ద ఉపకరణల ప్రీమియమ్ పరిధిని తీసుకువస్తుందో దానితో, లైసెన్సింగ్ భాగస్వామ్యాన్ని ప్రకటించింది. ఈసందర్భంగా స్టాన్లీ బ్లాక్ అండ్ డెకర్ కమర్షియల్ డైరెక్టర్ లైసెన్సింగ్ అమిత్ దత్త మాట్లాడుతూ... ఇంటి ఉత్పత్తుల్లో ప్రపంచంలో అగ్రగామిగా తాము ప్రాంతీయంగా లభ్యతని విస్తరించడం ద్వారా తమ వినియోగదారులకు ప్రాముఖ్యతని ఇవ్వడం కొనసాగిస్తున్నానన్నారు. బ్రాండ్ పోర్ట్ఫోలియోని పెంచడం ద్వారా, ఈ కొత్త ఉత్పత్తులు అందించేవాటితో అన్ని ఇంటి పనులు సులువుగా అయ్యేట్లుగా చేసుకోవడంలో వినియోగదారు ఆవశ్యకతలను చేరడానికి తాము కట్టుబడి ఉన్నామన్నారు. ఇండ్కల్ టెక్నాలజీస్ సీఈఓ ఆనంద్ దూబే మాట్లాడుతూ... ఈ ఆసక్తికరమైన వెంచర్లో స్టాన్లీ బ్లాక్ అండ్ డెకర్తో కలసి పని చేస్తునందుకు తాము చాలా ఆనందంగా ఉన్నామన్నారు. ఈ బ్లాక్ అండ్ డెకర్ బ్రాండ్ సాంకేతికత, డిజైన్ చక్కని కలయికతో ఉన్నాయో ఆ ఫినామినల్ ఉత్పత్తులకు పెట్టింది పేరన్నారు.

కిరణ్ నాడార్ మ్యూజియం ఆఫ్ ఆర్ట్ కొత్త భవనం నిర్మాణ నమూనా విడుదల

నవతెలంగాణ - హైదరాబాద్

కిరణ్ నాడార్ మ్యూజియం ఆఫ్ ఆర్ట్ తమ కొత్త భవనం నిర్మాణ నమూనాను విడుదల చేసింది. స్థానిక ఆర్కిటెక్ట్ ఆఫ్ రికార్డ్ ఎస్.ఘోష్ అండ్ అసోసియేట్స్ స హకారంతో ప్రఖ్యాత ఘనాయన్-బ్రిటీష్ ఆర్కిటెక్ట్ సర్ డేవిడ్ అడ్జాయే రూపొందించిన ఈ భవనం, ఢిల్లీలో తమ తలుపులు 2026లో తెరిచినప్పుడు భారతదేశంలో అతిపెద్ద సాంస్కృతిక కేంద్రంగా అవతరిస్తుంది. న్యూఢిల్లీలోని ఈ భవన నిర్మాణ ప్రాంగణం వద్ద జరిగిన భూమిపూజ కార్యక్రమంలో ఈ నమూనా విడుదల చేశారు. కేఎన్ఎంఏ ను 2010లో భారతదేశం, ఉపఖండం నుండి ఆధునిక, సమకాలీన ఆర్ట్ కలెక్టర్ లలో ఒకరిగా గుర్తింపు పొందిన కిరణ్ నాడార్ ఏర్పాటు చేశారు. ఇది భారతదేశంలో మార్గదర్శక ప్రైవేట్ మ్యూజియంగా గుర్తింపు పొందింది.

బీఎల్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా సరుకులు అందజేత

నవతెలంగాణ-కాప్రా



ఏఎస్ రావు నగర్ డివిజన్ జమ్మిగడ్డ భరత్ నగర్ కాలనీకి చెందిన లక్ష్మి క్యాన్సర్ తో బాధపడుతూ మరణించడంతో వారి కుటుంబానికి బీఎల్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు బండారి లక్ష్మారెడ్డి ఆదేశాల మేరకు ట్రస్ట్ సభ్యులు నిత్యావసరాల సరుకులు అందజేశారు. ఈ సందర్భంగా గడ్డం శ్రీను మాట్లాడుతూ ట్రస్ట్ ద్వారా అనేక సేవా సామాజిక కార్యక్రమాలు చేపట్టినట్టు తెలిపారు. ఆపదలో ట్రస్టు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటుందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో గుమ్మడి రాజు, పంతులు నరసింహా, టైలర్ శ్రీను తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణహిత జీవనశైలి పై అవగాహన ర్యాలీ

నవతెలంగాణ-కాప్రా



పర్యావరణహిత జీవనశైలి పై కాప్రా సర్కిల్ హెల్త్ ఆఫీసర్ ఆధ్వర్యంలో సానిటేషన్ సిబ్బంది ఎంటమాలజీ సిబ్బంది, హార్టికల్చర్ సిబ్బంది కలసి ఏఎస్ రావు నగర్ వార్డ్ ఆఫీసు నుంచి రాధికా చౌరస్తా వరకు ర్యాలీ నిర్వహించారు. పర్యావరణహిత జీవనశైలి పై స్థానిక ప్రజలకు, కమర్షియల్ షాపింగ్ యజమాన్యానికి, అందులో పనిచేసే కార్మికులకు ప్లాస్టిక్ వాడకం పైన అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో హెల్త్ ఆఫీసర్ డాక్టర్ స్వప్న రెడ్డి, అసిస్టెంట్ ఎంటమాలజిస్ట్ రమేష్ రాంకీ, అనిల్, జవాన్లు రామకష్ణ ,శ్రీనివాస్ అశోక్, ఆరోన్ తదితరులు పాల్గొన్నారు.

స్టాండింగ్ కమిటీలో 11 ఎజెండా అంశాలకు ఆమోదం

నవతెలంగాణ-సిటీబ్యూరో

జీహెచ్ఎంసీ స్టాండింగ్ కమిటీ సమావేశంలో 11 అంశాలకు ఆమోదం లభించింది. నగర మేయర్ గద్వాల్ విజయలక్ష్మి అధ్యక్షతన జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో శుక్రవారం స్టాండింగ్ కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో సమావేశంలో కమిషనర్ డీ.ఎస్. లోకేష్ కుమార్, స్టాండింగ్ కమిటీ సభ్యులు శాంతి సైజెన్ శేఖర్, సయ్యద్ మిన్హా జుద్దీన్, సయ్యద్ సోహెల్ ఖాద్రి, సమీనా బేగం, అబ్దుల్ వాహెబ్, మహమ్మద్ అబ్దుల్ ముక్తాదర్, మహమ్మద్ మాజీద్ హుస్సేన్, వనం సంగీత యాదవ్, పండాల సతీష్ బాబు, ఇ.ఎస్. రాజ్ జితేంద్ర నాథ్, టి. మహేశ్వరి పాల్గొన్నారు.



ఆమోదం పొందిన ఎజెండా

రోడ్ నెం.92 జూబిహిల్స్ నుంచి రోడ్ నెం.12 బంజారా హిల్స్ వరకు ఆర్.డీ.పీ. కింద 18 మీటర్ల లింక్ రోడ్డు వెడల్పునకు మాస్టర్ ప్లాన్‌లో చేర్పుట, ప్రభుత్వ ఆమోదానికి సిఫార్స్‌తో పాటుగా 15 ఆస్తుల సేకరణకు కమిటీ ఆమోదం తెలిపింది.

- ఎల్బీనగర్ జంక్షన్ కు తెలంగాణ అమరవీరుడు శ్రీకాంత చారి జంక్షన్ గా నామకరణం కోసం ప్రభుత్వానికి సిఫార్స్ చేయగా వెంటనే మున్సిపల్ పరిపాలన పట్టణాభివద్ధి శాఖ ద్వారా గత ఏప్రిల్4న ప్రభుత్వ ఉత్తర్వు 54ను జారీ చేసినందున కమిటీ ఆమోదం లభించింది.

- ఎస్.ఆర్.డీ.పీ ద్వారా నిర్మించిన ఎల్బీనగర్ ఆర్.హెచ్.ఎస్ ఫ్లైఓవర్ కు మాల్ మైసమ్మ ఫ్లైఓవర్‌గా నామకరణం చేసేందుకు మున్సిపల్ పరిపాలన పట్టణాభివద్ధి శాఖ ద్వారా ప్రభుత్వ ఉత్తర్వు 53ను జారీ చేసినందున కమిటీ ఆమోదం తెలిపింది.

- రంగారెడ్డి జిల్లా కుత్బుల్లాపూర్ మండలం గాజుల రామారం గ్రామం పెరికి చెరువు వద్ద డ్రయినేజీ డైవర్షన్‌ను రూ.3కోట్ల వ్యయంతో నిర్మించేందుకు పరిపాలన ఆమోదంతో పాటు టెండర్ అనుమతికి కమిటీ ఆమోదించింది.

- జీహెచ్ఎంసీ ఐటీ సెక్షన్ ద్వారా కాల్ సెంటర్ (040-2111 1111) నిర్వహణ జీ.వీ.కే. - ఇ.ఎం.ఆర్.ఐ ద్వారా 2023 జూన్ 1 నుంచి 2026 మే 31 వరకు మూడు సంవత్సరాల పాటు నిర్వహించేందుకు ఇ.ఎం.ఆర్.ఐ గ్రీన్ హెల్త్ సర్వీసెస్ కు రూ. 2,27,02,061 ఇచ్చేందుకు పరిపాలన ఆమోదానికి కమిటీ ఆమోదం లభించింది.

- కూకట్ పల్లి జోన్ కుత్బుల్లాపూర్ సర్కిల్ జీడిమెట్ల వార్డు నెం.132, పేట్ బషీరాబాద్‌లో అపర్ణ కన్స్ట్రక్షన్ అండ్ ఎస్టేట్ ప్రయివేటు లిమిటెడ్ ద్వారా కార్పొరేట్ సోషల్ రెస్పాన్స్‌బీలిటీ ద్వారా రోడ్డు నిర్మించేందుకు కూకట్ పల్లి జోనల్ కమిషనర్‌తో ఎం.ఓ.యు చేసుకొనుటకు కమిటీ ఆమోదించింది.

- శేరిలింగంపల్లి జోన్ యు.బి.డి ద్వారా సెంట్రల్ మీడియన్స్/ ట్రాఫిక్ ఐల్యాండ్‌లను 'ఐఐఐటీ' జంక్షన్ నుంచి రెడిజాన్ హెూటల్ (డి.ఎల్.ఎఫ్ ఎదురుగా) వరకు సీ..ఎస్.ఆర్ కింద డీ.ఎల్.ఎఫ్ ఫౌండేషన్‌కు 2023 మే 29 నుండి 2026 మే 28 వరకు మూడు సంవత్సరాల పాటు మెయింటెనెన్స్ చేయడానికి శేరిలింగంపల్లి జోనల్ కమిషనర్‌తో ఎం.ఓ.యు చేసుకొనేందుకు కమిటీ అనుమతించింది.

- రోడ్ డెవలప్ మెంట్‌ప్లాన్ కింద 30మీటర్లు, 18 మీటర్ల రోడ్డు వెడల్పు కోసం కొండాపూర్ జంక్షన్ నుంచి పోలీస్ కాలనీ వరకు, 30 మీటర్ల రోడ్డు వెడల్పునకు సఫారీ నగర్ నుంచి కొండాపూర్ జానీ మజీద్ వయా హెచ్.టి లైన్ పోలీస్ గ్రౌండ్ వరకు పొడగించేదుకు 43 ఆస్తుల సేకరణకు కమిటీ ఆమోదించారు.

- ఆర్.డీ.పీ కింద 30మీటర్ల రోడ్డును 48 మీటర్ల వెడల్పునకు పొడిగించి టీ.వీ టవర్ జంక్షన్ మూసారాంబాగ్ నుంచి అలీ కేఫ్ జంక్షన్ (1.4 కిలోమీటర్ల పొడవు), మూసి రివర్ అంబర్ పేట్ కాజ్ వే (0.6 కిలోమీటర్ల) 48 మీటర్ల వెడల్పు నకు మొత్తం 109 ఆస్తుల సేకరణకు కమిటీ ఆమోదం తెలిపింది.

- ఆర్.డీ.పీ కింద టీ.కే.ఆర్ కమాన్ నుంచి నాగార్జున సాగర్ రోడ్ వయా జెడ్‌పీ రోడ్ వరకు 30 మీటర్ల రోడ్డు వెడల్పునకు 282 ఆస్తుల సేకరణకు అమోదం లభించింది.

- సికింద్రాబాద్ జోన్ బేగంపేట్ సర్కిల్ దనియాల గుట్టలో మహాపరినిర్వాన (గ్రేవ్ యార్డ్)ను ఆపరేషన్, మెయింటెనెన్స్ కోసం మహాప్రస్థానం ట్రస్ట్‌కు ఐదు సంవత్సరాల పాటు సీ.ఎస్.ఆర్. కింద నిర్వహించేందుకు కమిటీ అనుమతించింది.

ఈ సమావేశంలో అడిషనల్ కమిషనర్లు ప్రియాంక అలా, ఇ.ఎన్.సి జియా ఉద్దీన్, సిసిపి దేవేందర్ రెడ్డి, సి.ఇ దేవానంద్, అడిషనల్ కమిషనర్ విజయలక్ష్మి, జయరాజ్ కెనడీ, జోనల్ కమిషనర్లు మమత, పంకజ, రవికిరణ్, శంకరయ్య, శ్రీనివాస్ రెడ్డి, సామ్రాట్ అశోక్, హౌసింగ్ ఓ.ఎస్.డి. సురేష్, చీఫ్ ఎగ్జామినర్ వెంకటేశ్వర్ రెడ్డి, చీఫ్ ఎంటమాలజిస్ట్ డా.రాంబాబు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులను ప్రారంభించిన ఎమ్మెల్యే



నవతెలంగాణ-కాప్రా

చర్లపల్లి డివిజన్ లోని పలు కాలనీల సుమారు ఒక కోటి 62 లక్షల వ్యయంతో చేపట్టనున్న అభివృద్ధి పనులను 2 రెండో విడత తాగునీరు పైపులైన్ పనులు, ఈసీ నగర్ లో రూ. 65 లక్షల వ్యయంతో సీసీ రోడ్డు పనులు, వీఎస్ రెడ్డి నగర్ లో రూ. 33 లక్షల వ్యయంతో ఆర్‌సీసీ పైప్ లైన్, భాగ్య నగర్‌లో రూ. 64 లక్షల వ్యయంతో సీసీ రోడ్ల పనులు చేపట్టనున్నట్టు తెలిసింది. అదేవిధంగా సీఎం ఆర్ఎఫ్ లబ్దిదారులకు చెక్కులు అందజేశారు. ఏం. బాల కృష్ణారెడ్డికి రూ. 58,000, ధాన్జి నాయక్‌కు రూ. 27,000 అందజేశారు. ఈ కార్యక్రమంలో జలమండలి డివిజినల్ జనరల్ మేనేజర్ సతీష్ , మేనేజర్ రోహిత్ , కాప్రా మున్సిపల్ సర్కిల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ హరిలాల్ , ఏఈ స్వరూప, సబ్ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్, బీఆర్ఎస్ చర్లపల్లి డివిజన్ అధ్యక్షుడు డప్పు గిరిబాబు, ప్రధాన కార్యదర్శి సార అనిల్ ముదిరాజ్, నాగిళ్ల బాల్‌రెడ్డి, కడియాల బాబు, నరసింహ ముదిరాజ్, ఇన్నయ్య గౌడ్ సత్తిరెడ్డి, కనకరాజు గౌడ్, నా రెడ్డి రాజేశ్వర్ రెడ్డి , సప్పిడి శ్రీనివాస్ రెడ్డి, గంప కృష్ణ సారా వినోద్ తదితరులు పాల్గొన్నారు.

మంత్రిని కలిసిన మాజీ మేయర్, గౌడ సంఘం సభ్యులు

కాప్రా : హైదరాబాద్ నగర మాజీ మేయర్ బొంతు రామ్మోహన్ శుక్రవారం ఉప్పల్ నియోజకవర్గ గౌడ సంఘం సభ్యులతో కలిసి మంత్రి శ్రీనివాస్ గౌడ్‌ను కలిశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. చర్లపల్లి డివిజన్ పరిధిలోని చెరువు వద్ద తాటి, ఈత వనం కోసం గౌడ సంఘం సభ్యులు ఎన్నో ఏండ్లుగా గత పాలకుల చుట్టూ తిరిగిన ప్రయోజనం లేకపోయిందన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో గత ప్రభుత్వం నామమాత్రంగా 5 ఎకరాల భూమిని ప్రకటించింది కానీ ఆ ప్రకటన కేవలం పత్రాల పైన ఉండిపోయిందన్నారు. అనంతరం ప్రత్యేక రాష్ట్రంలో తొలి మేయర్ గా చేసిన బొంతు రామ్మోహన్ దృష్టికి తీసుకు వెళ్లగా వారు ప్రత్యేక చొరవతో ఆ స్థలాన్ని గుర్తించి, ఆ స్థలంలోని అక్రమ కట్టడాన్ని తొలగించి హద్దులను నిర్ణయించి గౌడ సంఘానికి అప్పగించారని తెలిపారు. ఆ స్థలంలో నూతన ఈతవనం ఏర్పాటుకు బొంతు రామ్మోహన్



దృష్టికి మరోసారి గౌడ సంఘం సభ్యులు తీసుకురాగ అందుకు సానుకూలంగా స్పందించిన ఆయన గురువారం ఆ స్థలాన్ని పరిశీలించి మంత్రి శ్రీనివాస్ గౌడ్ దగ్గరికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా గౌడ సోదరుల కోసం మాజీ మేయర్ బొంతు రామ్మోహన్ చేస్తున్న కృషిని మంత్రి ప్రశంసించారు. ఈ సమస్యను అతి త్వరగా పరిష్కరిస్తామని మంత్రి గౌడ సంఘం సభ్యులకు హామీ ఇవ్వడం జరిగింది.

సుందరయ్య వర్ధంతి సందర్భంగా ఉచిత మెడికల్ క్యాంప్



నవతెలంగాణ-కాప్రా

సుందరయ్య 38వ వర్ధంతి సందర్భంగా సీఐటీయూ కమలానగర్ ఆఫీసులో పీపుల్స్ వెల్ఫేర్ ట్రస్ట్, యశోద హాస్పిటల్స్ సోమాజిగూడ ఆధ్వర్యంలో ఉచిత మెడికల్ క్యాంప్‌ను శుక్రవారం నిర్వహించారు. ఈ క్యాంప్‌లో బీపీ, షుగర్ టెస్ట్ తో పాటు ఈసీజీ, 2డీ ఎకో టెస్టులు ఉచితంగా నిర్వహించారు. ఈ క్యాంపునకు డాక్టర్ గురుజు ప్రమోద్, గుండె వైద్య నిపుణులు డాక్టర్ సునీల్ దాచేపల్లి, ఆర్థోపెడిక్ డాక్టర్, యశోద హాస్పిటల్స్ నుంచి ల్యాబ్ టెక్నీషియన్స్ కే వెంకట్, వైస్ చైర్మెన్ రఘు చంద్, సీనియర్ మేనేజర్ మార్కెటింగ్ సురేష్, క్యాంప్ ఇన్‌చార్జ్ గణేష్, యశోద హాస్పిటల్ నుంచి పాల్గొన్నారు, ఈ క్యాంపునకు. 250 మంది హాజరైనారు. ఈ విధమైన సేవా కార్యక్రమాల్లో పాల్గొన్న డాక్టర్స్ కు, యశోద హాస్పిటల్ సిబ్బందికి పీపుల్స్ వెల్ఫేర్ ట్రస్ట్ చైర్మెన్ సీహెచ్ ప్రసాద్ అభినందనలు తెలియజేశారు. కార్యక్రమంలో పీపుల్స్ వెల్ఫేర్ టెస్ట్ కార్యదర్శి జి ఉదయభాస్కర్, ట్రస్ట్ సభ్యులు జీ వెంకటేశ్వరరావు, కే వెంకట్, సీహెచ్ దేవి రెడ్డి , జీవి రెడ్డి పాల్గొన్నారు. క్యాంపు ప్రారంభానికి ముందు ప్రముఖ స్వతంత్ర సమరయోధులు, సీపీఐ(ఎం) అగ్ర నాయకులు పుచ్చలపల్లి సుందరయ్య చిత్రపటానికి నివాళు లర్పించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి జే.చంద్రశేఖర్, ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి రాథోడ్ సంతోష్ పాల్గొన్నారు.

మంత్రి శ్రీనివాస్ గౌడ్‌పై కాంగ్రెస్ నాయకులు ఫిర్యాదు

నవతెలంగాణ-నాచారం

మంత్రి శ్రీనివాస్ గౌడ్ మహబూబ్ నగర్ జిల్లాలో జరిగిన బహిరంగ సభలో దళితులను అవమానపరచారంటూ ఉప్పల్ నియోజకవర్గం దళిత కాంగ్రెస్ అధ్యక్షులు హెచ్ఆర్ మోహన్ ఆధ్వర్యంలో నాచారం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఇన్‌స్పెక్టర్ నందీశ్వర్ రెడ్డిని కలిసి మంత్రిపై ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశవ్యాప్తంగా బడుగు బలహీన వర్గాలు ఐక్యతగా నిలబడి దేశంలో బీజేపీని, రాష్ట్రంలో దొరల పాలనను తరిమికొట్టాలని కషి చేస్తుంటే బీసీ కులంలో పుట్టిన శ్రీనివాస్ గౌడ్ దొరగారి పాలేరుగా దళితులపై కారు కూతలు కూస్తూ యావత్ దళిత సమాజాన్ని అవమానపరచడం బాధాకరమని అన్నారు. కండకావరమెక్కి మంత్రి.. పదవిని అడ్డం పెట్టుకొని దళితులను అవహేళన చేస్తున్న శ్రీనివాస్ గౌడ్ తన మాటలు తక్షణమే వెనక్కి తీసుకొని దళిత సమాజానికి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో రాష్ట్రవ్యాప్తంగా మంత్రి ఎక్కడికి వెళ్లినా దళిత సమాజం తరిమికొట్టే రోజులు దగ్గరలోనే ఉన్నాయని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో దళిత కాంగ్రెస్ వైస్ చైర్మన్లు నరేష్, మహేష్, జిల్లా కోఆర్డినేటర్ పీజీ సుదర్శన్



,సేవాదళ్ రాష్ట్ర నాయకుడు సద్గుణ రావు, నాయకులు బండారి రఘు, జహంగీర్, శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

క్రమబద్ధీకరణకు దరఖాస్తు చేసుకోండి



- సీపీఐ(ఎం) నాయకులు యాదగిరి

నవతెలంగాణ-కంటోన్మెంట్

సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డు పరిధిలోని రెండో వార్డ్ ఇందిరమ్మ నగర్ మురికివాడ వాసులు వారి ఇండ్లను క్రమబద్దీకరణ చేయించుకోవాలని సీపీఐ(ఎం) నాయకులు యాదగిరి అన్నారు. శుక్రవారం సీపీఐ(ఎం) నాయకులు ఇందిరమ్మ నగర్ బస్తీలలో ఇండ్ల క్రమబద్దీకరణకు దరఖాస్తులను పంపిణీ చేశారు. అనంతరం యాదగిరి, స్థానికులు మాట్లాడుతూ ఇందిరమ్మ నగర్, శ్రీలంక బస్తీ, శివానగర్, అర్జున్ నగర్, అన్నా నగర్, సీబీఎన్ నగర్ బస్తీలలో గత 40 సంవత్సరాల నుంచి ఇక్కడే నివసిస్తున్నామని తెలిపారు. అయినా ఇప్పటివరకు ఇండ్ల పట్టాలు గానీ రెగ్యులేషన్స్ గాని చేయలేదని.. ఎటువంటి డాక్యుమెంట్స్ లేకుండా నివసిస్తు న్నామని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన 58 జీవో కింద ఈ ఇండ్లన్నీ రెగ్యులేషన్ చేయాలని కోరారు. ఈ అప్లికేషన్ ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునేందుకు మే నెల మొత్తం టైం పొడిగిం చారని తెలిపారు. కావున తొందరగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు. దరఖాస్తు ఫారాలు స్థానిక సీపీఐ(ఎం) కార్యాలయాల్లో ఇస్తారని తెలి పారు. బీ నారాయణ, ఎం సత్యనారాయణ, యూ చేరాల్, ఏ శంకర్, సిహెచ్ బిక్షపతి, ఏ రాజు, డి యాదగిరి, శాంతమ్మ తదితరులు పాల్గొన్నారు.

యశోద హాస్పిటల్ స్పెషల్ "వాకథాన్"



- ప్రపంచ ఐబీడీ డేను పురస్కరించుకుని పీపుల్స్ ప్లాజాలో నిర్వహణ

నవతెలంగాణ-బేగంపేట్

ప్రపంచ ఐబీడీ (ఇన్‌ఫ్లామేటరీ బోవెల్ డిసీజ్) దినోత్సవం సందర్భంగా యశోద హాస్పిటల్స్ సోమాజిగూడ, ఎస్ఏఐఏ (సౌత్ ఏషియన్ ఐబీడీ అలయన్స్) సహకారంతో హైదరాబాద్ నెక్లెస్ రోడ్‌లోని పీపుల్స్ ప్లాజాలో అవగాహన వాకథాన్ శుక్రవారం నిర్వహించారు. శోథ ప్రేగు వ్యాధి (అల్సరేటివ్ కొలిటిస్, క్రోన్స్ డిసీజ్) గురించి అవగాహన కల్పించేందుకు దాదాపు 500 మందికి పైగా ఐబీడీ పేషెంట్లు, వాలంటీర్లు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా యశోద హాస్పిటల్స్ సోమాజిగూడ సీనియర్ గ్యాస్ట్రో ఎంటరాలజిస్ట్, ఐబీడీ స్పెషలిస్ట్ డాక్టర్ కిరణ్ పెద్ది మాట్లాడుతూ దేశంలో గత దశాబ్దకాలంలో ఐబీడీ కేసులు గణనీయంగా పెరిగాయన్నారు. ప్రపంచవ్యాప్తంగా చుస్తే ప్రస్తుతం భారతదేశంలోనే అత్యధిక సంఖ్యలో ఐబీడీ కేసులు నమోదవుతున్నయని తెలిపారు. రెగ్యులర్ లైఫ్ స్టైల్‌తో పాటు ఒత్తిడి స్థాయిలను తగ్గించుకోవడం వల్ల ఐబీడీ పేషెంట్లు వారి కొన్ని ఇబ్బందికర లక్షణాలను అధిగమించడానికి సహాయపడుతుందని చెప్పారు. డాక్టర్. శారదా పసంగులపాటి, సీనియర్ గ్యాస్ట్రోఎంటరాలజిస్ట్, ఐబీడీ స్పెషలిస్ట్ మాట్లాడుతూ.. గత రెండు సంవత్సరాల్లో ఐబీడీ చికిత్సలో అత్యాధునిక చికిత్స విధానాలు అందుబాటులోకి వచ్చాయని, కొత్త మందులు, బయోలాజికల్ ఏజెంట్ల లభ్యతతో, ముందుగానే గుర్తించి చికిత్స చేస్తే, 90 శాతం కంటే ఎక్కువ మంది రోగులలో మంచి స్పందన సాధించవచ్చని వివరించారు. అనేక అత్యాధునిక చికిత్స విధానాలు అందుబాటులో ఉన్నందున, తక్కువ శాతం మంది మాత్రమే శస్త్రచికిత్సల వరకు వెళ్లవలసి వస్తుందన్నారు. ఐబీడీ రోగులలో అంటువ్యాధుల నివారణ చాలా ముఖ్యమని.. సరైన టీకా కార్యక్రమంతో దీనిని సాధించవచ్చన్నారు. యశోద ఆస్పత్రులలో, చాలా మంది పేషెంట్లు స్పైరల్ ఎంట్రోస్కోపీతో ప్రయోజనం పొందుతున్నారని, ఇది చిన్న ప్రేగు క్రోన్‌లను గుర్తించడం, చికిత్స చేయడం చాలా సులభం చేస్తుందని తెలిపారు.

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన యశోద గ్రూప్ హాస్పిటల్స్ డైరెక్టర్ డాక్టర్. పవన్ గోరుకంటి మాట్లాడుతూ.. విరేచనాలు, బరువు తగ్గడం వంటి లక్షణాలు ఉన్నవారు ఆలస్యం చేయకుండా పరీక్షలు చేయించుకోవడం ఎంతో అవసరమన్నారు. ఐబీడీతో బాధపడుతున్నట్టు నిర్ధారణ అయిన తర్వాత క్రమం తప్పకుండా డాక్టర్ ను సంప్రదించడం చాలా మంచిదన్నారు. యశోద హాస్పిటల్స్ ఇతర సీనియర్ గ్యాస్ట్రోఎంటరాలజిస్టులు డాక్టర్. చంద్ర శేఖర్ రెడ్డి, డాక్టర్ శ్రీ రామ్, డాక్టర్. సంతోష్ ఎనగంటి, పారామెడికల్ సిబ్బంది, ఇతరులు పాల్గొని ఈ అవగహన వాకథాన్ ను విజయవంతం చేశారు.

సియోమి బ్రాండ్ అంబాసిడర్ పంకజ్ త్రిపాఠి

నవతెలంగాణ - హైదరాబాద్

సియోమి ఇండియా, దేశం అగ్రగామి స్మార్ట్ఫోన్స్, స్మార్ట్ టీవి బ్రాండ్, ప్రముఖ నటుడు పంకజ్ త్రిపాఠిని భారతదేశంలోని దాని స్మార్ట్ఫోన్ వర్గానికి బ్రాండ్ అంబాసిడర్గా స్వాగతించింది. ఇన్నోవేషన్ పైన దృష్టి, యుజర్-సెంట్రిక్ డిజైన్తో, సియోమి భారతీయ వినియోగదారులలో చెప్పలేనంత ప్రాముఖ్యతని సంపాదించుకుంది. ఈసందర్భంగా సియోమి చీఫ్ మార్కెటింగ్ ఆఫీసర్ అంజు శర్మ మాట్లాడుతూ... సియోమి కుటు ంబంలో పంకజ్ త్రిపాఠిని సరికొత్త సభ్యునిగా పొందినందుకు తాము చాలా ఉత్సాహంగా ఉన్నామన్నారు. సియోమి వద్ద తమ యూజర్స్కి అత్యుత్తమమైన పనితీరు, లాగ్-రహిత వాడకంతో సాధికారతనివ్వడానికి తాము ఎల్లప్పుడూ మంచి ఫీచర్సని నిజాయితి గల ధరల వద్ద అందించేందుకు కట్టుబడి ఉన్నామన్నారు. పంకజ్ త్రిపాఠి తమ బ్రాండ్ విషన్లోని సారాన్ని పుణికిపుచ్చుకున్నారన్నారు. పంకజ్ త్రిపాఠి మాట్లాడుతూ సియోమి ఇండియాతో అనుబంధం చాలా ఆనందానిచ్చిందన్నారు. ఈ బ్రాండ్ భారతీయ వినియోగదారుల నాడి అర్థం చేసుకుంటుందన్నారు. వారికి వారి స్మార్ట్ఫోన్స్ నుంచి నిజంగా ఏమి కావాలో తెలుసునన్నారు. ఇన్నోవేషన్, నాణ్యత, భరించతగ్గ వాటితో సమానంగా ఉన్న బ్రాండికి ప్రాతినిథ్యం వహిస్తునందుకు తాను ఉత్సాహంగా ఉన్నానన్నారు.

స్మార్ట్ కపుల్ మ్యాట్రెస్‌ని లాంచ్ చేసిన ద స్లీప్ కంపెనీ

నవతెలంగాణ - హైదరాబాద్

భారతదేశంలో స్లీప్ టెక్ మూవ్ మెంట్‌కు కారణ మైన ప్రముఖ బ్రాండ్ ద స్లీప్ కంపెనీ. ఇప్పటికే ఎన్నో అద్భుతమైన ఉత్పత్తులతో వినియోగదారుల ఆదరాభిమా నాలను సంపాదించుకున్న స్లీప్ కంపెనీ ఇప్పుడు తాజాగా స్మా కపుల్ మ్యాట్రెసెస్ ని మార్కెట్ లో లాంచ్ చేసింది. ఈ సందర్భంగా ది స్లీప్ కంపెనీ సహ వ్యవస్థాపకురాలు ప్రియాంక సలోట్ మాట్లాడుతూ... ద స్లీప్. కంపెనీలో తాము విభిన్నంగా ఆలోచించి చేసే ప్రతి ఆవిష్కరణ వినియోగదారుల అవసరాల నుంచి పుట్టింద న్నారు. ఒక బ్రాండ్గా తాము వినియోగదారుల అభిరుచులను నిరంత రం తనిఖీ చేస్తూనే ఉంటామ న్నారు. వారి అభివృద్ధి చెందుతున్న అవసరాలను ముందుగానే ఊహించి వాటిని పరిష్కరించేందుకు ప్రయత్నిస్తామన్నారు. నిద్ర ప్రాధాన్యతల్లో తేడాల కారణంగా నిద్రపోయేందుకు ఇబ్బందులు పడుతున్న దంపతులున్నారని తాము గుర్తిం చామన్నారు. తమ ఈ స్మార్ట్ కపుల్ మ్యాట్రెస్ ను అలాంటి వారి కోసం ప్రత్యేకంగా రూపొందించా మన్నారు. ప్రపంచ వ్యాప్తంగా నిద్ర లేమితో ఇబ్బందులు పడుతున్న వ్యక్తులకు మెరుగైన, ప్రశాంతమైన నిద్రను అందించే మ్యాట్రెస్ ఉత్పత్తుల రూపకల్పనను కొనసాగించాలని తాము లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు.

రెజిమెంటల్ బజార్‌లో పర్యటించిన కార్పొరేటర్ దీపిక

నవతెలంగాణ-కంటోన్మెంట్



మోండా డివిజన్‌లో శుక్రవారం కార్పొరేటర్ కొంతం దీపిక అధికారులతో కలిసి పర్యటించారు. ముఖ్యంగా పాత గోపాలపురం ప్రాంతంలో మురుగు కాలువలను, అలాగే మారుతివీధిలో బండలు ఏర్పాటు చేస్తున్న పనులను ఆమె పరిశీలించారు. అయితే పాత గోపాలపురం ప్రాంతంలో హెూటల్ల నిర్వాహకుల నిర్లక్ష్యం వల్ల తరచూ మురుగు కాలువలు పొంగుతున్నాయని కార్పొరేటర్ గుర్తించారు. ఈ మేరకు పర్యటనలో పాల్గొన్న మున్సిపల్ సివరేజ్ వాటర్ వర్క్స్ అధికారులకు విషయాన్ని చెప్పారు. అయితే గతంలోనే ఇక్కడ కొన్ని హెూటల్స్‌కు నోటీసులు ఇవ్వడం జరిగిందని ఆయన వారు స్పందించడం లేదంటూ వివరణ ఇచ్చారు. కాగా నోటీస్ ఇవ్వటమే కాదు.. నిర్లక్ష్యం చేస్తున్న వారిపై తగిన చర్యలు తీసుకోవాలని కార్పొరేటర్ అధికారులకు సూచించారు. అలాగే మారుతి వీధిలో నల్ల కనెక్షన్‌లు ఇవ్వటం పూర్తయిన దశలో తిరిగి బండలు వేస్తుండగా స్థానికులు కాంట్రాక్టర్ ను అడ్డుకుంటున్నారని తెలిసి అధికారులతో ఆమె పర్యటించారు ఈ సందర్భంగా స్థానికులను. అడిగి సమస్య తెలుసుకున్నారు. అందుకు స్థానికులు.. కాంట్రాక్టర్ విరిగిపోయిన బండలే వేస్తున్నార... కొత్త బండలు వేయడం లేదని చెప్పారు. అయితే తమ వర్క్ ఆర్డర్‌లో కొత్త బండలు వేయాలని సూచించలేదని తిరిగి పాత బండలే వేయాలని చెప్పారని కాంట్రాక్టర్ సమాధానం ఇచ్చారు. దాంతో కార్పొరేటర్ తాను స్వచ్ఛందంగా బండలను ఇప్పిస్తామని హామీ ఇచ్చారు. కాంట్రాక్టర్లను ఇబ్బంది పెట్టొద్దని, పనులకు ఆటంకం కలిగించవద్దని స్థానికులకు ఆమె సూచించారు. పాత గోపాలపురం మురుగు నీరు వదిలే విషయంలో మున్సిపల్ సూచనలు పాటించని హెూటల్ యజమానుల పై చర్యలు తీసుకోవాలని అధికారులకు చెప్పారు. ఈ విషయంపై వారు సివరేజ్ ఉన్నతాధికారులను ఆమె వివరించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఓబీసీ స్పోకెన్ పర్సన్ అంజన్ కుమార్ , సందీప్, సురేష్ ,నర్సింగ్, వినయ్ యాదగిరి సజ్జన్, వికాస్, బస్తీవాసులు, వాటర్ వాక్స్ అధికారులు డీజీఎం కష్ణ , మేనేజర్ హకీమ్, ఫీల్డ్ ఇన్‌స్పెక్టర్ ఇమ్రాన్ తదితరులు పాల్గొన్నారు.

IN THE COURT OF THE HON'BLE II ADDITIONAL SENIOR CIVIL JUDGE, MEDCHAL MALKAJGIRI DISTRICT AT : MALKAJGIRI O.S.NO.841 OF 2022

BETWEEN:
K. SHANKAR BABU ... PLAINTIFF
AND
K. LAXMINARYANA and another ... DEFENDANTS

To,
1. K.LAXMINARYANA
S/o K.Venkata Reddy
Aged about: 44 years, Occ. Service
R/o F.No. 109, Tejo Enclave,
Tirumalanagar, Meerpet,
Uppal Mandal, Ranga Reddy District
2. K. ANURADHA,
W/o. K. laxminarayana, aged about 37 years, Occ: Housewife, R/o.F.No.109, Tejo Enclave, Tirumalanagar, Meerpet, Uppal Mandal, Ranga Reddy District.

NOTICE

Please take notice that the Plaintiff herein had filed the above suit for Specific Performance with O.S.No.841 OF 2022 against Defendants, which is posted to 01.06.2023 by the Hon'ble Court for your appearance.
Hence make it convenient to appear before the Hon'ble Court on **01.06.2023 at 10:30 A.M.** either personally or through authorized person of law or otherwise the matter will be decided in due process of law.
Hence this NOTICE,
//BY ORDER OF THE COURT//
J GOVARDHAN REDDY
K.SNIGDHA
Advocates
#104, Monte Cristo Apartments, Vayupuri, Sainikpuri, Secunderabad - 94

PUBLIC NOTICE

The General Public is hereby informed that our client M/s. Shriram Finance Limited, Chikkadpally Branch, Hyderabad is dealing with financing business. In the course of business, **Smt. V. Venkata Sunita, W/o. Vegesna V.S.S.S.Rama Raju, aged about 50 years, Occupation: Housewife, R/o. Flat No.901, Block No.B, ARK Tower, Mayuri Nagar, Miyapur, Hyderabad,** has approached our client for trade finance and accepted to deposit her title deeds in the respect of the property

SCHEDUE OF PROPERTY:-

All that the Residential Flat No.902, on 9th Floor, in Block-A of "ARK TOWERS", bearing municipal House No.1-67/ARK/A/902 (PTIN No.1129948153) with a plinth area of 1749 square feet (including common area) along with an undivided share of land admeasuring 54.46 square yards or equivalent to 45.61 square meters, out of total land admeasuring Ac.5-00 guntas, on land in Survey No.202/2, Situated at Madenaguda Village, Serilingampally Mandal, under GHMC Serilingampally Circle, Ranga Reddy District and bounded by:- **North** : Open to Sky, **South** : Open to Sky, **East** : Corridor/Open to Sky, **West** : Corridor/Open to Sky, as security for the loan availed by her. If any person or persons having any claim or interest in the above property may approach the undersigned within seven days from the date of this publication or else our client will proceed with the transaction.

M.VANAMA RAJU
ADVOCATE
HYDERABAD. Mobile No.9963874156

PUBLIC NOTICE

The general public are hereby informed that **Smt B.Anjamma W/o B.Muthyalu**, has approached M/s Shriram Finance Ltd, **Basheerbagh Branch, Hyderabad** for depositing her title deeds by way of equitable mortgage in respect of schedule property for securing her future liability towards the loan amount. If any person or persons are having any objections, right, claim, title, interest over the schedule property they shall approach the undersigned with certified copies of documents in support of their claim within (3) Three days from today, failing which the loan amount will be sanctioned Smt **B.Anjamma W/o B.Muthyalu,** and no claim or no objection of any nature thereafter will be entertained thereafter. Hence the notice.

SCHEDULE OF THE PROPERTY

All that the North-Eastern Part of House No 9-3-130 (PTIN No. 1140901416) admeasuring 93.00 Sq.yds equivalent to 77.74 Sq.mtrs with Built-up area of 500 Sq.ft (ACC) in Sy No. 1/2, Situated at Hasmathpet (Village), Balanagar (Mandal), Under GHMC Kukatpally Circle, Medchal-Malkajgiri District and Bounded as Follows: **NORTH** : House No- 9-3-2 **SOUTH** : Southern part of H-No:- 9-3-130 **EAST** : House No. 9-3-128 **WEST** : Road

For NomosVistas, The Lawyers,
Govardhan Venu,
Advocate & CEO
C-701 Skyline & Sterling Residency, Basheerbagh, Hyderabad - 29.
Mob:- 9849091266

IN THE COURT OF THE HON'BLE ADDL. JUNIOR CIVIL JUDGE: R.R.DISTRICT. AT: HAYATHNAGAR. O.S.NO. 265 OF 2021.

Between:
Bondalapati Subhadra & others .....Plaintiffs
And
Palakurthy Sujatha ... Defendant

To,
Palakurthy Sujatha, W/o.P.Sadanandam, Aged about 48 Years, Occ: House Wife, R/o.C/o.Apna Bazar, Pentionpur, Post: Mamnoor Camp, Warangal District. ... Defendant

Please take notice that the Plaintiffs have filed the above suit against you for Specific Performance. The above suit is posted to 09-06-2023. You are hereby summoned to appear before the Hon'ble Court on **09-06-2023, at about 10.30 A.M.** either in person or through an Advocate, failing which the matter will be decided as per law. Hence this notice.

SCHEDULE OF THE PROPERTY

ALL that piece and parcel of the open land bearing Plot No.630, admeasuring 200 Sq.Yards, in Survey Nos.116, 117 and 118, Situated at Torrur Revenue Village, erstwhile under Torrur Gram Panchayat, Presently under Turkayamjal Municipality, erstwhile under Hayathnagar Mandal, Presently under Abdullapurmet Revenue Mandal, Ranga Reddy District and bounded by:
NORTH: Plot No.629
SOUTH: Plot No.631
EAST : Plot No.617
WEST :30' Wide Road

(BY ORDER OF THE COURT)
M/s.HEMANTH PRAVEEN KUMAR
Advocate & Associates
Plot No.71, Raghavendra Nagar, Hayathnagar, Hyderabad
Counsel for the Petitioners.

BEFORE THE HON'BLE SENIOR CIVIL JUDGE CUM XVI MM: R R DIST, AT: EBRAHIMPATNAM O.S No. 210 /2023

Between:
1. Kintali Appala Ramulu & 4 others ... Plaintiffs
And
1. The Tahsildar, O/o.M.R.O, Ebrahimpatnam, R.R.Dist.
2. To all concerned. ......Defendant

TO
Whom so ever it may concern, the plaintiffs herein are filed the above suit for declaration to declare the legal heirs of deceased named Kintali Tulisemma and same is posted on **14-06-2023,** for appearance in the said court at 10:30 A.M, in default the matter will be taken up, heard and decided ex-parte in your absence. This notice is issued as per the direction of the Hon'ble court.

"BY ORDER OF THE COURT"
Sd/-
P.S.BHRAMARAMBA DEVI
ADVOCATE
Ph: 9848589564

AUCTION NOTICE
IN THE COURT OF THE HON'BLE 1st SENIOR CIVIL JUDGE CITY CIVIL COURT, AT : HYDERABAD I.A . NO. 560 OF 2009 IN O.S. NO. 3417 OF 2004

BETWEEN:-
K. J. Buddeshwar Rao & Others .....Petitioners/Plaintiffs
AND
K. Uma Maheshwara Rao & Others .....Respondents/Defendants

TO,
THE PUBLIC AT LARGE
Whereas the above named petitioners/ plaintiffs filed the above I.A.NO. 560 OF 2009. for passing final decree in the above partition suit. whereas the petitioners / plaintiffs and requesting the Hon'ble Court to sell away the property covered by the schedules appended hereunder as the property is not divisible. The Hon'ble Court on 01-06-2023 ordered for publication and open auction/sale of properties, covered by the A & B schedules described hereunder on **06-06-2023 at 10:30 A.M.** onwards at Court premises of I Senior Civil Judge, City Civil Court, Hyderabad. Therefore, the public at large are hereby informed that the interesting parties may participate in the above said auction/sale, subject to the terms and conditions as laid down in C.P.0 .and C.R.P. The other particulars and information can be had from the Advocate, whose address particulars area given hereunder or from the Court, during office hours on all working days.

SCHEDULE 'A' PROPERTY

All that of house bearing No. 12-11-514, situated at Warasiguda to an extent of 300 Sq. Yards is bounded by: **North**: Neighbours House, **South** : Neighbours House, **East** : Road, **West** : Neighbours House.

SCHEDULE 'B' PROPERTY

All that of House bearing No. 1-7-230 86 231, old house at Bakaramto an extent of 885q. Yards, Musheerabad Mandal, Hyderabad District, is bounded by : **South** : Road, **West** : H.No. 1-7-232, **West** : H.No. 1-7-229, **North** : House.

B. SRINIVASULU B Com, LL.M
ADVOCATE
Cell: 9849097394, 9493470015
Ph: 040-24530015
Address: Flat No 211, 2nd Floor Santosh Plaza, Opp. Amber Biscuit Factory, Santosh Nagar'X' Road, Hyderabad - 500 859. E- mail: srinivasulu211@gmail.com

బాధిత కుటుంబానికి రూ.2లక్షల పరిహారం చెక్కు అందజేత

నవతెలంగాణ-సిటీబ్యూరో



రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన పారిశుధ్య కార్మికురాలు జె.దుర్గమ్మ కుటుంబ సభ్యులకు శుక్రవారం నగర మేయర్ గద్వాల్ విజయలక్ష్మి రూ.2 లక్షల పరిహారాన్ని అందజేశారు. శానిటేషన్ కార్మికురాలు దుర్గమ్మ జనవరి 4న హయత్‌నగర్ సర్కిల్ ఆటో నగర్ హైవేపై ఊడుస్తుండగా జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రగాయాలయ్యాయి. అప్పటి నుంచి సనత్‌నగర్ ఈ.ఎస్.ఐ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న దుర్గమ్మ జనవరి 14న మృతి చెందింది. ఈ మేరకు బాధిత కుటుంబ సభ్యులకు రూ.2 లక్షల చెక్కును జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలోని తన ఛాంబర్ లో మేయర్ పంపిణీ చేశారు.

డిప్యూటీ స్పీకర్ బంధువునంటూ రూ.లక్షల్లో మోసం

నవతెలంగాణ-బంజారాహిల్స్



డిప్యూటీ స్పీకర్ పద్మా రావు గౌడ్ బంధువునని చెప్పి ఎక్సైజ్ శాఖలో ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ రూ.లక్షల్లో వసూలు చేశారని బాధితులు ఆరోపించారు. శుక్రవారం సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో బాధితులు ఆవేదన వ్యక్తపరిచారు. డిప్యూటీ స్పీకర్ బంధువునని చెప్పి ప్రభుత్వ ఉద్యోగాలు ఇప్పిస్తానని రూ.లక్షల్లో వసూలు చేసి మోసం చేసినట్టు తెలిపారు. గతేడాది ఎమ్మెల్యే కార్యాలయంలో పని చేస్తున్న యువకుడు ఎక్సైజ్ శాఖలో స్పెషల్ ఆఫీసర్ ఉద్యోగాల నియామకానికి సంబంధించి ఫేక్ నియామక పత్రాలు అందజేసినట్టు తెలిపారు. ఎక్సైజ్ శాఖకు వెళ్లి ఈ పత్రాలు చూపిస్తే ఇవి నకిలీ అని చెప్పడంతో మోసపోయినట్టు భావించి పలుమార్లు చిలకలగూడ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని తెలిపారు. రూ.లక్షలు వసూలు చేసి దర్జాగా తిరుగుతున్నారనీ, తమకు ప్రభుత్వం న్యాయం చేయాలని కోరారు.

సుందరయ్య స్ఫూర్తితో పోరాటాలు చేయాలి

- తెలంగాణ రైతు సంఘం సీనియర్ నాయకులు సారంపల్లి మల్లారెడ్డి
- పుచ్చలపల్లి సుందరయ్య 38వ వర్థంతి

నవతెలంగాణ-అడిక్‌మెట్

కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య స్ఫూర్తితో కేంద్ర బీజేపీ, ఆర్ఎస్ఎస్ పాలనకు వ్యతిరేకంగా ప్రజలను సమీకరించి పెద్ద ఎత్తున ఉద్యమాలు, పోరాటాలు చేయాలని తెలంగాణ రైతు సంఘం సీనియర్ నాయకుడు సారంపల్లి మల్లారెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యాలయంలో తెలంగాణ రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘం సంయుక్త ఆధ్వర్యంలో పుచ్చలపల్లి సుందరయ్య 38వ వర్ధంతి కార్యక్రమం సందర్భంగా ఆయన చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మల్లారెడ్డి మాట్లాడుతూ దక్షిణ భారతదేశంలో 1936లో వ్యవసాయ కార్మిక





సంఘాన్ని ఏర్పాటు చేసి అణిచివేతకు గురవుతున్న పేదలను ఒక వేదిక పైకి తీసుకొచ్చి కూలీ రేట్ల పెంపుదల, కుల అణిచివేతకు వ్యతిరేకంగా ఉద్యమాలు కొనసాగించారని గుర్తు చేశారు. ఆ రోజుల్లోనే సహపంక్తి భోజనాలు ఏర్పాటు చేసి కుల వివక్షతపై తిరుగుబాటు చేశారన్నారు. తెలంగాణలో నిజాంలకు వ్యతిరేకంగా జరిగిన తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటానికి న్యాయకత్వం వహించారని గుర్తు చేశారు. చదువు రాని అనేక మందిని పోరాట నాయకులుగా తయారు చేశారని కొనియాడారు. భారత కమ్యూనిస్టు పార్టీ మార్క్సిస్ట్ కార్యదర్శిగా పని చేశారనీ, భూ సమస్య, ఉపాధి, సాంఘిక సమస్యలు, ప్రాంతీయ విభేదాలు తదితర సమస్యలకు పార్లమెంట్, శాసన సభల్లో చర్చించి అమలు చేశారని వివరించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎం.శోభన్, అరిబండి ప్రసాద్ రావు, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్.వెంకట్రాములు, ఉపాధ్యక్షురాలు బొప్పని పద్మ, కమిటీ సభ్యులు ఆర్.ఆంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

సుందరయ్య స్ఫూర్తితో మతోన్మాదంపై పోరాటం చేయాలి : సీపీఐ(ఎం) నగర కార్యదర్శి ఎం.శ్రీనివాస్

ధూల్‌పేట్ : కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య స్ఫూర్తితో మతోన్మాదంపై పోరాటం చేయాలని సీపీఐ(ఎం) నగర కార్యదర్శి ఎం.శ్రీనివాస్ పిలుపునిచ్చారు. సుందరయ్య 38 వ వర్ధంతి సందర్భంగా సీపీఐ(ఎం) నాంపల్లి జోన్ కమిటీ ఆధ్వర్యంలో పార్టీ నాంపల్లి జోన్ కన్వీనర్ సి.మల్లేష్ అధ్యక్షతన జాతీయ రాజకీయాలు-ప్రస్తుత సవాళ్లపై మల్లెపల్లి కమిటీ హాల్‌లో సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు శ్రీనివాస్ ముఖ్య అతిథిగా పాల్గొని జోన్ కమిటీ నాయకులతో కలిసి సుందరయ్య చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించిన అనంతరం మాట్లాడారు. ఈ సదస్సులో పార్టీ నగర కార్యదర్శివర్గ సభ్యులు ఎం.వెంకటేష్, నగర కమిటీ సభ్యులు ఆర్.వెంకటేష్, సీపీఐ(ఎం) నాంపల్లి జోన్ కమిటీ సభ్యులు బి.శంకర్, సీహెచ్ వెంకటస్వామి, అలీ, ఇబ్రహీం, యాదయ్య, సీనియర్ నాయకులు కుమార్, లక్ష్మణ్, శ్రీరాములు, అర్షద్, తదితరులు పాల్గొన్నారు.

మతోన్మాద, ఫాసిస్టు సంఘ పరివార్ కు వ్యతిరేకంగా పోరాడటమే సుందరయ్యకు నిజమైన నివాళి : సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎండీ అబ్బాస్

మతోన్మాద, ఫాసిస్టు సంఘ్ పరివార్‌కు వ్యతిరేకంగా పోరాడటమే సుందరయ్యకు నిజమైన నివాళి అని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎండి అబ్బాస్ అన్నారు. సీపీఐ(ఎం) గ్రేటర్ హైదరాబాద్ సౌత్ జిల్లా ఆధ్వర్యంలో సుందరయ్య 38వ వర్ధంతి కార్యక్రమాన్ని జిల్లా కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులతో కలిసి సుందరయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఆరో దశకంలోనే దేశానికి సంఘ్ పరివార్ ఫాసిస్టు శక్తుల నుంచి రానున్న ప్రమాదాన్ని గుర్తించి, పార్టీని అప్రమత్తం చేసిన గొప్ప దార్శనికుడు సుందరయ్య అన్నారు. మతోన్మాదానికి,



ఫాసిస్టు సంఘ్ పరివార్ శక్తుల నిరంకుశ విధానాలకు వ్యతిరేకంగా పోరాడటమే ఆయనకు అసలైన నివాళి అవుతుందన్నారు. ప్రస్తుత ప్రభుత్వాలు మత్సోన్మాద శక్తులు, కార్పోరేట్ సంస్థలతో కుమ్మక్కై దేశాన్ని నిలువునా దోచుకుంటున్నాయన్నారు. మత మౌఢ్యం పెంచి ప్రజల్లో చీలిక తీసుకురావడం ద్వారా ఎన్నికల్లో గెలిచి ఎంతటి దుర్మార్గానికైనా పాల్పడ వచ్చనే నేటి నాయకులు భావిస్తున్నారన్నారు. సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎం.మీనా అధ్యక్షత జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు శ్రావణ్ కుమార్, అబ్దుల్ సత్తార్, కిషన్ నాయక్, నాయకులు మహేష్ దుర్గే, షేక్ యాకుబ్, జయమ్మ పాల్గొన్నారు.

వైద్య సేవలను మరింత చేరువ చేయడానికే బస్తీ దవాఖానలు

- మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్
- సుందర్‌నగర్ బస్తీలో బస్తీ దవాఖాన ప్రారంభం



నవతెలంగాణ-అంబర్‌పేట

పేద ప్రజలకు ప్రభుత్వ వైద్య సేవలను మరింత చేరువ చేయాలనే సీఎం కేసీఆర్ ఆలోచనల మేరకే ప్రభుత్వం బస్తీ దవాఖానలను ఏర్పాటు చేసిందని రాష్ట్ర పశు సంవర్ధక, మత్స్య, పాడి పరిశ్రమల అభివృద్ధి, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ తెలిపారు. శుక్రవారం గోల్నాక డివిజన్‌లో గల సుందర్‌నగర్ బస్తీలో నూతనంగా ఏర్పాటు చేసిన బస్తీ దవాఖానను మంత్రి తలసాని అంబర్‌పేట కాలేరు వెంకటేశ్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి బీపీ చెక్ చేయించుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పేదల ఆర్థిక పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని పేదలు అధికంగా నివసించే బస్తీలలోనే బస్తీ దావాఖానలను ఏర్పాటు చేస్తున్న విషయాన్ని వివరించారు. జీహెచ్ఎంసీ పరిధిలో 350 బస్తీ దవాఖాన ద్వారా ప్రజలకు వైద్య సేవలు అందిస్తున్నట్టు చెప్పారు. హైదరాబాద్ జిల్లాకు నూతనంగా మరో 14 బస్తీ దవాఖానలు మంజూరైనట్టు చెప్పారు. బస్తీ దవాఖానాల్లోనే అన్ని రకాల వైద్య పరీక్షలు, మందులు అందుబాటులో ఉండటం వల్ల ప్రధాన ప్రభుత్వ హాస్పిటల్స్‌కు వెళ్ళే వారి సంఖ్య గణనీయంగా తగ్గిందనీ, బస్తీ దవాఖానల పనితీరుకు ఇదే నిదర్శనమన్నారు. ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తర్వాత రూ.వందల కోట్లతో ప్రభుత్వ హాస్పిటల్స్‌ను కార్పొరేట్ హాస్పిటల్స్‌కు దీటుగా అభివృద్ధి చేసి అన్ని రకాల వైద్య సేవలను ఉచితంగా అందుబాటులోకి తీసుకొచ్చినట్టు తెలిపారు. కరోనా సమయంలో గాంధీ హాస్పిటల్‌కు పేదలే కాకుండా ఆర్థికంగా ఉన్న వారు కూడా వైద్యం కోసం వచ్చారనీ, ప్రభుత్వ హాస్పిటల్స్ అభివృద్ధి చెందాయని అనడానికి ఇంతకంటే ఇంకా ఏం రుజువు కావాలన్నారు. వైద్య ఆరోగ్య శాఖ మంత్రిగా హరీష్ రావు బాధ్యతలు చేపట్టిన తర్వాత ప్రభుత్వ హాస్పిటల్స్‌లో సిటీ స్కాన్, ఎమ్మారైట్కు, క్యాత్ ల్యాబ్ వంటి అత్యాధునిక పరికరాలను సమకూర్చి రూ.వేల విలువైన టెస్ట్‌లను కూడా ఉచితంగా అందిస్తున్నట్టు చెప్పారు. నిమ్స్ హాస్పిటల్‌ను 2 వేల పడకల హాస్పిటల్‌గా అభివృద్ధి చేసే పనులు జరుగుతున్నాయని పేర్కొన్నారు. కొత్తపేట, ఎర్రగడ్డ, అల్వాల్ తదితర ప్రాంతాల్లో ప్రభుత్వ మల్టీ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్స్ నిర్మాణం చేపట్టినట్టు తెలిపారు. రానున్న రోజుల్లో హైదరాబాద్ మెడికల్ హబ్‌గా అభివృద్ధి చెందనున్నట్టు తెలిపారు. అన్ని రకాల వైద్య సేవలు ప్రభుత్వ హాస్పిటల్స్‌లో అందుబాటులో ఉన్నందున సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రయివేటు హాస్పిటల్స్ కు వెళ్ళి ఆర్థిక ఇబ్బందులు పడవద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో హైదరాబాద్ జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ వెంకటి, కార్పొరేటర్ దూసరి లావణ్య శ్రీనివాస్‌గౌడ్, డాక్టర్ దీప్తి పటేల్, తదితరులు పాల్గొన్నారు.

పుచ్చలపల్లి సుందరయ్య 38వ వర్ధంతి

నవతెలంగాణ-జూబ్లీహిల్స్



వెంగళరావునగర్ డివిజన్, మధురానగర్‌లో కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య 38వ వర్ధంతిని సీపీఐ(ఎం) జూబ్లీహిల్స్ జోన్ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా జూబ్లీహిల్స్ కన్వీనర్ రాపర్తి అశోక్ మాటాడారు. ఈ కార్యక్రమంలో ప్రసాద్, పుల్లయ్య, కృష్ణ, ముత్యయ్య, కుమార్, రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.

ముషీరాబాద్ : దక్షిణ భారతదేశ కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాత పుచ్చలపల్లి సుందరయ్య అని సీపీఐ(ఎ)



ముషీరాబాద్ నియోజకవర్గ కన్వీనర్ ఎం.దశరథ్ పేర్కొన్నారు. శుక్రవారం ముషీరాబాద్ డివిజన్ అంబేద్కర్ నగర్‌లో పుచ్చలపల్లి సుందరయ్య 38వ వర్ధంతిని పార్టీ ముషీరాబాద్ నియోజకవర్గం కార్యదర్శివర్గ సభ్యులు ఆర్వపల్లి శ్రీరాములు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా దశరథ్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) నగర కమిటీ సభ్యురాలు అనపర్తి పద్మ, బస్తీ నాయకులు బి.ఆంజనేయులు, రామానుజన్, రాఘవేంద్ర, సరిత, జయమ్మ, తదితరులు పాల్గొన్నారు.

ఓయూ : దక్షిణ భారత ఉద్యమ నేత కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య 38వ వర్ధంతిని శుక్రవారం అడ్డగుట్టలో సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎం.అజయ్ బాబు మాట్లాడుతూ నేటి నాయకులు, కార్యకర్తలకు సుందరయ్య జీవితం ఆదర్శం అన్నారు. సుందరయ్య స్ఫూర్తితో ముందుకెళ్లి ఉద్యమించలన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) నాయకులు పాల్గొన్నారు.



రామకృష్ణ హఠాన్మరణం కార్మిక సంఘానికి తీరని లోటు

నవతెలంగాణ-ధూల్‌పేట్



బీసీడబ్ల్యుయూ (సీఐటీయూ) హైదరబాద్ సౌత్ జిల్లా నాయకుడు సీహెచ్.రామకృష్ణ హఠాన్మరణంతో గోషామహల్ నియోజక వర్గంలో కార్మిక సంఘానికి తీరనిలోటని బీసీడబ్ల్యుయూ రాష్ట్ర నాయకులు కె.రామన్‌గౌడ్, కె.జంగయ్య అన్నారు. అనారోగ్యం, గుండెపోటుతో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి చనిపోయిన రామకృష్ణ నివాసానికి వెళ్లి స్థానిక కార్మిక యూనియన్‌తో కలిసి నివాళులు అర్పించారు. వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లడుతూ భవన నిర్మాణ కార్మికుల సమస్యల పరిష్కారానికి ఆయన చేసిన సేవలు మరువలేనివి అన్నారు. 44 ఏండ్లకే గుండెపోటుకు గురై చనిపోవడం విచారం వ్యక్తం చేశారు. అనంతరం అంత్యక్రియలు పురనాపుల్ శ్మశానవాటికలో నిర్వహించారు. ఈ అంత్య క్రియలో బీసీడబ్ల్యుయూ జిల్లా నాయకులు తుపాకీ ఆంజనేయులు, బి.గంగపూరి, ఎన్.కిరణ్, ఎం.రాజు, ఎన్.గోపాల్, సీఐటీయూ హైదరాబద్ సౌత్ జిల్లా నాయకులు ఎం.శ్రావణ్, ఎం.మీన, పీ.నాగేశ్వర్, బేగం బజార్ లేబర్ అడ్డా నాయకులు కే.శివ, అర్.రమేష్, యు.బాబు రావు, యు.సంగీత, గ్యార వెంకటేష్, పి.రామ్, ఎర్ర పద్మ, ఎన్.బిక్షపతి, ఎన్.సైదులు, గౌలిగూడ చమన్ లేబర్ అడ్డా కార్యదర్శి ఎన్.వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.



21న వాక్ యోగాపై సెమినార్

నవతెలంగాణ-బంజారాహిల్స్

గురుమహారాజ్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నగరంలో వాక్ యోగాపై సెమినార్ నిర్వహించనున్నట్టు ట్రస్ట్ చైర్మన్ సాయి శ్రీనివాస్ తెలిపారు. సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో సెమినార్ బ్రోచర్‌ను ఆవిష్కరించిన వారు మాట్లాడారు. సమాజంలో అందరం బాగుండాలంటే వాక్కు బాగుండాలన్నారు. నూతనత్వాన్ని సమాజానికి అందించాలన్నదే వాక్ యోగా ఉద్దేశం అన్నారు. బొగ్గులకుంటలోని తెలంగాణ సార్వత్రిక పరిషత్‌లో జరగనున్న ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి హాజరై సెమినార్లు ప్రారంభిస్తారని తెలిపారు. డాక్టర్ బీవీకే శాస్త్రి, డాక్టర్ ప్రభాకర్, కాశ్యకులు ప్రసంగిస్తారని చెప్పారు. ఈ సమావేశంలో మాల్యాద్రి, సంజయ్ విడియాల, రాజేష్ మిరియాల, బచ్చు శ్రీనివాస్, చేదెళ్ల నాగేశ్వర రావు, తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ ఆటో రిక్షా డ్రైవర్స్ యూనియన్ హైదరాబాద్ జిల్లా కమిటీ ఎన్నిక





నవతెలంగాణ-హిమాయత్‌నగర్

తెలంగాణ ఆటో రిక్షా డ్రైవర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) హైదరాబాద్ జిల్లా నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. శుక్రవారం హిమాయత్ నగర్‌లోని ఎస్.సత్యనారాయణరెడ్డి భవన్‌లో యూనియన్ హైదరాబాద్ జిల్లా నిర్మాణ మహాసభలో యూనియన్ సలహాదారుడిగా ఎ.బిక్షపతి యాదవ్, గౌరవ అధ్యక్షులుగా ఎండి.ఒమర్ ఖాన్, అధ్యక్షులుగా కొంరెల్లి బాబు, కార్యనిర్వాహక అధ్యక్షులుగా బైరగోని రాజుగౌడ్, ఉపాధ్యక్షులుగా జె.రాములు, కె.రవి, కృష్ణమూర్తి, నాగిరెడ్డి, మనోజ్, ఎండి.ఖాజా, ప్రధాన కార్యదర్శిగా సీహెచ్.జంగయ్య, సహాయ ప్రధాన కార్యదర్శిగా ఎస్.కె.లతీఫ్, సంయుక్త కార్యదర్శులుగా జె.శ్యామ్‌లాల్ నాయక్, రాజు, కోశాధికారిగా ఎండి.ఫరూక్ సహా 26 మంది ఆఫీస్ బేరర్లు, 90 మంది సమితి సభ్యులుగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్ష, కార్యదర్శులు మాట్లాడుతూ అడ్డు అదుపు లేకుండా ఇంధన, నిత్యావసర వస్తువుల ధరలు పెరిగి ఆటో డ్రైవర్ల బతుకులు దయనీయ స్థితిలో కొనసాగుతున్నాయన్నారు. సీఎం కేసీఆర్ వెంటనే స్పందించి పెరిగిన ధరలకు అనుగుణంగా ఆటో మీటర్ చార్జీలు పెంచాలని కోరారు. ఆటో అడ్డాల సమస్యలు, ట్రాఫిస్ పోలీసుల అక్రమ చలాన్లు, ఆర్టీఏ జరిమానాలు, కోర్టు ఫైన్లు, ఇన్సూరెన్స్ ఫీజు పెంపుతో ఆటో డ్రైవర్లు తీవ్ర కష్టాలు ఎదుర్కొంటున్నారన్నారు. ఆటో డ్రైవర్లకు హెల్త్ కార్డులు, ప్రావిడెంట్ ఫండ్ సౌకర్యాలు కల్పించి, ఇండ్లు లేని పేద ఆటో డ్రైవర్లకు డబుల్ బెడ్ రూం ఇండ్లు కేటాయించాలని కోరారు. తొమ్మిదేండ్లుగా పెండింగ్‌లో ఉన్న తమ డిమాండ్లను పరిష్కరించకుంటే రాబోయే రోజుల్లో ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

విద్యుత్ ద్విచక్ర వాహన పరిశ్రమను విప్లవాత్మకం చేస్తోన్న అథర్ ఎనర్జీ

నవతెలంగాణ - హైదరాబాద్

ఇండియాలోని అగ్రగామి ఎలెక్ట్రిక్ స్కూటర్ తయారీదారు అయిన అథర్ ఎనర్జీ, తన వినూత్న సాంకేతికతను ఉపయోగించడం ద్వారా భారతీయ ఎలెక్ట్రిక్ వెహికల్ (ఇవి) పరిశ్రమను పరివర్తన చేయడంలో ముందువరుసలో ఉంటోంది. విద్యుత్ వాహన టూ వీలర్ల కోసం ఇండియాలో క్రమేపీ గిరాకీ పెరుగుతోంది. ఏడాది తర్వాత ఏడాదిగా పెరుగుతూ ఏప్రిల్ 2023 లో గణనీయమైన 41శాతం స్థాయిని చేరుకొంది. అథర్ 450 అనే తమ మొదటి ఎలెక్ట్రిక్ స్కూటర్ని పరిచయం చేయడంతో వారి విప్లవాత్మక ప్రభావం 2018 లో మొదలైంది. సవారీలను సాధ్యమైనంత సౌకర్యవంతంగా, అంతరాయం లేనివిగా చేయాలనే ధ్యేయ ముతో అథర్, ఇండియాలో దానిని మొదటి స్మార్ట్ స్కూటరుగా చేస్తూ, విద్యుత్ వాహనాల్లో ఒక కొత్త శకానికి బాటలు వేస్తూ గూగుల్ మ్యాప్స్, టచ్‌స్క్రీన్ డ్యాష్ బోర్డ్, పార్కింగ్ అసిస్ట్ తో పాటుగా అధునాతన ఫీచర్ల శ్రేణిని పరిచయం చేసింది. అథర్ టచ్ స్క్రీన్ డ్యాష్ బోర్డ్ గూగుల్ సమర్పణతో ఆన్బోర్డ్ న్యావిగేషన్ క రీడా అందిస్తుంది. ఇది అచ్చం స్మార్ట్ ఫోన్‌పైన ఉండే గూగుల్ మ్యాప్స్ లాగానే ఉంటుంది. ఇది లైవ్ ట్రాఫిక్ అప్డేట్లను సానుకూలం చేస్తుంది. త్వరగా ప్రాప్యత కోసం సవారీదారు లోకేషన్లను సేవ్ చేసుకోవడానికి, ఛార్జింగ్ పాయింట్ల త్వరిత ప్రాప్యతకు వీలు కలిగిస్తుంది. ట్రాఫిక్ గుండా మంచి రూట్లను కనుగొనడానికి సహాయపడుతుంది.

రేవంత్‌రెడ్డి క్షమాపణ చెప్పకపోతే 23న గాంధీభవన్ ముట్టడి



నవతెలంగాణ-ఓయూ

ఈనెల 24వ తేదీ లోపు రేవంత్ రెడ్డి గొల్ల కురుమలు, మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్‌కి క్షమాపణ చెప్పకపోతే 25న గాంధీభవన్‌ను ముట్టడిస్తామని ఓయూ జేఏసీ, గొల్ల కురుమ విద్యార్థి సంఘాల నేతలు హెచ్చరించారు. శుక్రవారం ఓయూలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో విద్యార్థి నాయకులు మాట్లాడుతూ రేవంత్ రెడ్డి కండకావరం, అహంకారం, బలుపుతో గొల్ల కురుమ జాతిని, వారి వృత్తిని, వారి జీవనశైలిని కించపరిచే విధంగా మాట్లాడటం సరికాదన్నారు. బడుగు, బలహీన వరాల జాతులకు చెందిన మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ పై దురహంకారం, నోటి దురుసుతో అవహేళన చేస్తూ సంస్కారహీనంగా మాట్లాడటం ఎంతవరకు సమంజసం అని ప్రశ్నించారు. మంత్రి శ్రీనివాస్ యాదవ్ పెండ పిసికేటోడు అని మాట్లాడం సరికాదన్నారు. మంత్రి వ్యక్తిగతం కాకుండా మొత్తం గొల్ల కురుమ జాతిని కించపరిచే మాటలు ఎలా మాట్లాడుతారు అని ప్రశ్నించారు. రేవంత్ నీలా నీచపు రాజకీయాలు శ్రీనివాస్ యాదవ్ చేయలేదనీ, తన జాతుల కోసం వెనకబడిన వర్గాల కోసం 27 ఏండ్లకే మంత్రి, 30 ఏండ్ల సుదీర్ఘ పోరాటం తన జాతుల కోసం చేస్తున్న గొప్ప వ్యక్తి శ్రీనివాస్ యాదవ్ అనీ, అంత పెద్ద వ్యక్తిని నోటి దురుసుతో అవహేళన చేయడం తగదన్నారు. 24వ తేదీ లోపు క్షమాపణ చెప్పకపోతే గాంధీభవన్ గోడలు బద్దలు కావడం తప్పదన్నారు. ఈ సమావేశంలో టీజీబీపీ రాష్ట్ర అధ్యక్షులు నక్క శ్రీశైలం యాదవ్, ఓయూ జేఏసీ చైర్మన్ కావటి సతీష్ యాదవ్, టీఎస్ జేఏసీ అధ్యక్షులు పోగుల చిరంజీవి యాదవ్, తలసాని యువసేన అధ్యక్షులు రెమడాల శ్రీకాంత్ యాదవ్, బీఆర్ఎస్వీ రాష్ట్ర కార్యదర్శి బొల్లు నాగరాజ్ యాదవ్, ఓయు జేఏసీ నాయకులు వేల్పు కొండ రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

ఒప్పోతో కలిసి పని చేయనున్న టీఎస్ఐజీ

నవతెలంగాణ - హైదరాబాద్

తెలంగాణలోని సంగారెడ్డి జిల్లా హైదరాబాద్ లోని ఒడియా వలస కార్మికుల జీవితాలను మార్చడానికి ఉద్దేశించిన ఉడాన్ ప్రాజెక్టుకు మద్దతు ఇవ్వడానికి ప్రముఖ గ్లోబల్ స్మార్ట్ డివైజ్ బ్రాండ్ ఒప్పో టి-సిగ్ (తెలంగాణ సోషల్ ఇంపాక్ట్ గ్రూప్)తో ఇండియా వీపీ, ఆర్ అండ్ డి హెడ్ తస్లీమ్ ఆరిఫ్ మాట్లాడుతూ... సంగారెడ్డి జిల్లాలో ఉడాన్ వలస కార్మికుల ప్రాజెక్టుకు మద్దతు ఇవ్వడానికి టి-ఎస్ఐజీతో ఒప్పో సహకారాన్ని ప్రకటించడం తమకు సంతోషంగా ఉందన్నారు. మానవాళికి సాంకేతికత, ప్రపంచం కోసం దయ అనే తత్వంతో ఒప్పో బలంగా నిలబడుతుంది కాబట్టి, ఈ భాగస్వామ్యం తమ కొనసాగుతున్న సిఎస్ఆర్ ప్రయత్నాల ప్రయాణంలో ఒక ముఖ్యమైన మైలురాయిని సూచిస్తుందన్నారు. టి-ఎస్ఐజీతో జట్టుకట్టడం ద్వారా 2500 మందికి పైగా భాగస్వామ్యాన్ని ప్రకటించింది. ఈసందర్భంగా ఒప్పో వలస కార్మికులకు సాధికారత కల్పించడంలో, ఆరోగ్యం,విద్య,వేతనాలు, జీవన పరిస్థితులు వంటి క్లిష్టమైన అంశాలను పరిష్కరించడం ద్వారా వారి జీవితాలలో అర్థవంతమైన ప్రభావాన్ని సృష్టించడంలో తాము ఒక పాత్ర పోషిస్తున్నందుకు గర్విస్తున్నామన్నారు. పరిశ్రమలు, వాణిజ్యం, ఐటీ, ఈ అండ్ సీ ప్రిన్సిపల్ సెక్రటరీ జయేశ్ రంజన్ మాట్లాడుతూ... టీ-ఎస్ఐజీ, ఒప్పో మధ్య ఈ సీఎస్ఆర్ సహకారాన్ని ప్రకటించడం సంతోషంగా ఉందన్నారు. ప్రపంచంలోని ప్రముఖ స్మార్ట్ డివైజ్ తయారీదారుగా, ఆవిష్కర్తగా, ఒప్పో ఈ చొరవ ద్వారా తెలంగాణలో వేలాది మంది ఇటుక బట్టీ కార్మికులకు సాధికారత కల్పిస్తోందన్నారు. ప్రాజెక్ట్ ఆవిష్కృతమవుతున్న కొద్దీ భాగస్వామ్యాన్ని బలోపేతం చేయడానికి తాము ఎదురుచూస్తున్నామన్నారు.

డ్రయినేజీ వ్యవస్థ ఆధునీకరణకు ప్రత్యేక చర్యలు

- ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్



నవతెలంగాణ-ముషీరాబాద్

ముషీరాబాద్ నియోజకవర్గంలోని ప్రతి బస్తీలో డ్రయినేజీ ఆధునీకరణ కోసం ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్టు ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ పేర్కొన్నారు. శుక్రవారం ముషీరాబాద్ డివిజన్‌లోని ఆజామాబాద్ గల్లీ, అరుణ సొసైటీలో రూ.4 లక్షలా 50 వేలతో చేపట్టిన డ్రయినేజీ పైపులైను పనులకు స్థానిక కార్పొరేటర్ సుప్రియ నవీన్ గౌడ్‌తో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ డివిజన్ల వారిగా డ్రయినేజీ సమస్య పరిష్కారమైన తర్వాత ప్రతి బస్తీలో అవసరమైన చోట నూతన వీడిసిసి రోడ్లను, ఫుట్ పాత్ లను నిర్మించనున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర యువజన నాయకులు ముఠా జై సింహ, డివిజన్ అధ్యక్షులు నర్సింగ్ ప్రసాద్, రావులపాటి మోజస్, శివ ముదిరాజ్, దీన్ దయాల్ రెడ్డి, కొండా శ్రీధర్ రెడ్డి, పూసా గోరఖ్ నాథ్, బీజేవైఎం ముషీరాబాద్ కన్వీనర్ గడ్డం నవీన్ పాల్గొన్నారు.

బీసీ ఉద్యోగులకు ప్రమోషన్లలో రిజర్వేషన్లు కల్పించాలి

- బీసీ రిజర్వేషన్లపై క్రిమిలేయర్ తొలగించాలి
- బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు, రాజ్యసభ సభ్యులు ఆర్.కృష్ణయ్య

నవతెలంగాణ-అడిక్‌మెట్



బీసీ ఉద్యోగులకు ప్రమోషన్లలో రిజర్వేషన్లు కల్పించాలనీ, బీసీ రిజర్వేషన్లపై ఉన్న క్రిమిలేయర్ తొలగించాలి అని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు, రాజ్యసభ సభ్యులు ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. విద్యానగర్ బీసీ భవన్‌లో బీసీ నాయకుల సమావేశం జరిగింది ఈ సమావేశానికి కృష్ణయ్య హాజరై మాట్లాడారు. బీసీల ఉద్యమానికి బీసీ ఉద్యోగులు నాయకత్వం వహించాలని పిలుపునిచ్చారు. ఉద్యోగులు ఐకమత్యంగా ఉద్యమిస్తే సమస్యలు పరిష్కారం అవుతాయన్నారు. దేశ జనాభాలో 56 శాతం జనాభా గల బీసీలు కులాల పేరు మీద విడిపోవడం వల్ల న్యాయమైన డిమాండ్లు సాధించలేకపోతున్నారు. బీసీల్లో భావధ్యనం, దాని ఆలోచన విధానం పోవాలన్నారు. బీసీలు తెగించి పోరాడకపోతే దానిస బతుకులు, బిక్షపు బతుకులు బ్రతకాల్సి వస్తుందన్నారు. 75 ఏండ్ల తర్వాత రాజ్యాంగ బద్ధమైన హక్కులు కల్పించకపోతే ఇదేమీ ప్రజా స్వామ్యమని ప్రశ్నించారు. బీసీ కోటా కింద ఉద్యోగాలు వచ్చాయి. ఈ కులాల నుంచి వచ్చినందున ఈ కులాల అభివృద్ధి కోసం పోరాడే సాంఘిక బాధ్యత భుజాన వేసుకోవాలని పిలుపునిచ్చారు.కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జు కృష్ణ, భూపేష్ సాగర్, నీల వెంకటేష్, సుధాకర్ వేముల రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

సోమవారం నుంచి టీఎస్ సర్టిఫికెట్ జారీ

నవతెలంగాణ-ఓయూ

ఉస్మానియా విశ్వవిద్యాలయం స్టేట్ ఎల్జీబులిటి టెస్ట్ (టీఎస్ సెట్) ను విజయవంతంగా నిర్వహించిన విషయం తెల్సిందే. అర్హత సాధించిన సుమారు 2,809 మంది అభ్యర్థులకు ఈ నెల 22 లేదా 23వ తేదీ నుంచి సర్టిఫికెట్స్ ప్రదానం చేయనున్నారు. ఇప్పటికే అర్హత సాధించిన అభ్యర్థుల సర్టిఫికెట్స్ వేరిపికేషన్ పక్రియ కూడా పూర్తి అయ్యింది. వీరికి సర్టిఫికెట్ ఇవ్వనున్నారు.

జీహెచ్ఎంసీలో భారీఎత్తున బదిలీలు

నవతెలంగాణ-సిటీబ్యూరో

జీహెచ్ఎంసీ పరిధిలోని వార్డు కార్యాలయ ఏర్పాట్లలో భాగంగా జీహెచ్ఎంసీలో భారీ స్థాయిలో బదిలీలు చోటు చేసుకున్నాయి. వివిధ విభాగాల్లో పని చేస్తున్న ఏఎంసీలు, సూపరింటెండెంట్లను బదిలీ చేస్తూ శుక్రవారం జీహెచ్ఎంసీ కమిషనర్ డీ.ఎస్.లోకేష్ కుమార్ ఆదేశాలు జారీ చేశారు. ఏఎంసీలు 56 మంది బదిలీ కాగా 83 మంది సూపరింటెండెంట్లు బదిలీ అయ్యారు. బదిలీ అయిన వారు వెంటనే విధుల్లో చేరాలని కమిషనర్ లోకేష్ కుమార్ ఆదేశాలు జారీ చేశారు.

పల్లా రాజేశ్వర్‌రెడ్డి, బండ ప్రకాశ్‌కు కృతజ్ఞతలు



నవతెలంగాణ-ముషీరాబాద్

వీఆర్ఏలు ఎదుర్కొంటున్న సమస్యలను ఎప్పటికప్పుడు ముఖ్యమంత్రి కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లి, వారిని రెగ్యులరైజ్ చేయడంలో కీలక పాత్ర పోషించిన రైతుబంధు రాష్ట్ర చైర్మన్ పల్లా రాజేష్ రెడ్డి, శాసనమండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాష్ ను శుక్రవారం వీఆర్ఏల హక్కుల సాధన సమితి రాష్ట్ర చైర్మన్ ఆర్.విజయ్ కుమార్ నేతృత్వంలో కలిసి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం విజయకుమార్ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 23 వేల మంది వీఆర్ఏలను ప్రభుత్వ శాఖల్లో సర్దుబాటు చేసి వారిని రెగ్యులరైజ్ చేసినందుకు ప్రభుత్వానికి రుణపడి ఉంటామన్నారు. మండల స్థాయి నుండి వీఆర్ఏల సమాచారాన్ని వీలైనంత త్వరగా కలెక్టర్ల ద్వారా సిసిఎల్ఐకి పంపాలనీ, దశాబ్ది ఉత్సవాల్లోపే వీఆర్ఏల సమస్యలను జీవో రూపంలో పరిష్కరిస్తామని హామీ ఇచ్చినట్టు తెలిపాలని వారు కోరారు.



నేడు యుఎస్ఏ, కెనడా, ఆస్ట్రేలియా, యూకే కన్సల్టేషన్ డే



నవతెలంగాణ-కేపీహెచ్‌బీ

యునైటెడ్ స్టేట్స్ ఆఫ్ అమెరికా, యూకే, కెనడా, ఆస్ట్రేలియా దేశాలలో ఉన్నత విద్యను అభ్యసించి స్థిరపడాలనుకునే విద్యార్థుల కోసం శనివారం యూని ఎక్స్ పర్ట్స్ ఆధ్వర్యంలో యూఎస్ఏ, యుకె కెనడా కన్సల్టేషన్ డేను నిర్వహిస్తున్నట్టు సంస్థ ప్రతినిధి బన్నూరు ఇంతియాజ్ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం కూకట్ పల్లి లోని సంస్థ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ కన్సల్టేషన్ లో పాల్గొనే విద్యార్థులు ఎటువంటి ప్రాసెసింగ్ ఫీజు లేకుండా అన్ని కోర్సులకు ప్రాసెసింగ్ చేసుకోవడంతో పాటు వీసా ప్రాసెసింగ్ కూడా పొందవచ్చునని తెలిపారు. విదేశాలకు వెళ్లే విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాల్సిందిగా కోరారు. పూర్తి వివరాల కోసం 99123 28645 నెంబర్ ను సంప్రదించాలని కోరారు.

మెగా జాబ్ మేళా ఏర్పాట్లపై ఎమ్మెల్యే సమీక్ష



నవతెలంగాణ - కుత్బుల్లాపూర్

కుత్బుల్లాపూర్ మున్సిపల్ గ్రౌండ్ వద్ద ఈనెల 22వ తేదీన నిర్వహించనున్న "మెగా జాబ్ మేళా" ఏర్పాట్లపై ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ శుక్రవారం సెట్విన్, పోలీస్ అధికారులతో కలిసి సమీక్షించారు.100 కు పైగా కంపెనీలు, పదివేలకు పైగా ఉద్యోగ అవకాశాలు ఉన్న నేపథ్యంలో పెద్ద ఎత్తున వచ్చే నిరుద్యోగ యువతకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని ఎమ్మెల్యే ఆదేశించారు. ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా చర్యలు చేపట్టాలని పోలీస్ అధికారులకు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సెట్విన్ ఎండి వేణుగోపాల్ , సీఐలు పవన్, వెంకట్ రెడ్డి, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

అందరి సహకారంతో ఆదర్శవంతంగా అభివృద్ధి



- ఎమ్మెల్యే కేపీ వివేకానంద్
- గాజులరామారం డివిజన్‌లో ప్రగతి యాత్ర

నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

రాజకీయాలకతీతంగా అందరి సహకారంతో ఆదర్శవంతంగా అభివృద్ధి చేస్తానని ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ అన్నారు. శుక్రవారం గాజులరామారం డివిజన్ పరిధిలోని చంద్రగిరి నగర్‌లో 'ప్రగతి యాత్ర'లో భాగంగా 63వ రోజు పర్యటించారు. పూర్తిచేసిన సీసీ రోడ్లు, చేపడుతున్న హిందూ స్మశానవాటిక అభివృద్ధి పనుల ను పరిశీలించారు. కాగా తమ బస్తీ అభివృద్ధికి ఎల్లవేళలా సహాయ సహకారాలు అందించినందుకు ఎమ్మెల్యేకు ప్రజలు ఘన స్వాగతం పలికి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం మిగిలిన భూగర్భ డ్రయినేజీ, సీసీ రోడ్లు, అందుబాటులో ఉన్న స్థలంలో కమిటీ హాల్ ఏర్పాటు, స్మశాన వాటికలో ప్రహరి గోడ నిర్మాణానికి కృషి చేయాలని ఎమ్మెల్యేను కోరారు. అందుకు స్పందించిన ఎమ్మెల్యే అక్కడే ఉన్న అధికారులకు ఆదేశించారు. త్వరలోనే వాటిని పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో డీజీఎం విష్ణు, ఏఈ కళ్యాణ్, సీనియర్ నాయకులు రషీద్ బేగ్, కస్తూరి బాలరాజ్, ప్యాక్స్ డైరెక్టర్ పరుష శ్రీనివాస్ యాదవ్, నవాబ్, చందు ముదిరాజ్, ఇబ్రహీం, మూసా కాన్, సింగారం మల్లేష్, తెలంగాణ సాయి, దిలీప్, చిన్నా చౌదరి, శివ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

కుత్బుల్లాపూర్ : పైరవీలు దళారుల మోసాలకు తావు లేకుండా అర్హులైన వారి ఇంటింటికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతున్నాయని ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ తెలిపారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధికి చెందిన 781 మంది కల్యాణ లక్ష్మి , షాదీ ముబారక్ పథకం లబ్దిదారులకు రూ.7,81,90,596/- విలువ చేసే చెక్కులను



ఎమ్మెల్యే శుక్రవారం షాపు నగర్ లోని ఎంజే గార్డెన్ లో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి కేసీఆర్ సుపరిపాలనలో అన్ని వర్గాల ప్రజలకు మేలు జరుగుతుందన్నారు.కార్యక్రమంలో నిజాంపేట్ మేయర్ కొలన్ నీలా గోపాల్ రెడ్డి, కొంపల్లి మున్సిపాల్టీ చైర్మెన్ సన్న శ్రీశైలం యాదవ్ , ఎమ్మార్వోలు, డిప్యూటీ ఎమ్మార్వోలు, నిజాంపేట్ కార్పొరేటర్లు, మాజీ ప్రజా పతినిధులు, నియోజకవర్గం బీఆర్ఎస్ యూత్ అధ్యక్షుడు, బీఆర్ఎస్ జీహెచ్ఎంసీ డివిజన్ అధ్యక్షులు, సీనియర్ నాయకులు మహిళా నాయకురాళ్లు పాల్గొన్నారు.

స్పెషల్ డ్రైవ్‌తో పారిశుధ్యం మరింత మెరుగు



- మేయర్ నీలా గోపాల్ రెడ్డి

నవతెలంగాణ-దుండిగల్

నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లో 10 రోజుల పాటు ప్రత్యేక పారిశుధ్య పనులతో మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని అన్ని డివిజన్లలో పారిశుధ్యం మెరుగవుతుందని నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ నీలా గోపాల్ రెడ్డి తెలిపారు. శానిటేషన్ స్పెషల్ డ్రైవ్ లో భాగంగా శుక్రవారం బచుపల్లి మెడికుంట చెరువు వద్ద శానిటేషన్ స్పెషల్ డ్రైవ్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ రానున్న వర్షాకాలం నేపథ్యంలో సీజనల్ వ్యాధులు రాకుండా పారిశుధ్య పనులను సక్రమంగా జరిగేలా చర్యలు చేపట్టాలని సిబ్బందికి ఆదేశించారు. డోర్ టు డోర్ చెత్త సేకరణ వాహనలను ప్రతీరోజు నడిపేలా చూడాలని, ఈరోజు నుంచి మే 27వ తేదీ వరకు నిర్వహిస్తున్న శానిటేషన్ స్పెషల్ డ్రైవ్ లో రోడ్ల వెంబడి ఉన్న చెత్తను, పిచ్చి మొక్కలను తొలగించి, డ్రయినేజీలను ఎప్పటికప్పుడు శుభ్రపరుస్తూ సీజనల్ వ్యాధులకు దూరం ఉండాలంటే వ్యక్తిగత శుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత పాటించాలని ప్రజలకు తెలియజేయలని శానిటేషన్ అధికారులు సిబ్బందిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు , విజయ లక్ష్మి సుబ్బారావు , సీనియర్ నాయకులు వేంగయ్య చౌదరీ , బీఆర్ఎస్ ఎన్ఎంసీ యూత్ ప్రెసిడెంట్ ప్రవీణ్ గౌడ్ వైస్ ప్రెసిడెంట్ రాము , 14వ డివిజన్ అధ్యక్షుడు బొబ్బా శ్రీనివాస్ రావు,16 వ డివిజన్ మహిళా అధ్యక్షురాలు రజిత రెడ్డి శానిటేషన్ అధికారులు

సుందరయ్య ఆశయ సాధనకు అందరూ కృషి చేయాలి

- సీపీఐ(ఎం) మండల కార్యదర్శి కీలుకాని లక్ష్మణ్



నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య జీవితం నేటి తరానికి ఆదర్శప్రాయమని ఆయన ఆశయ సాధనకు ప్రతి ఒక్కరు కషి చేయాలని సీపీఐ(ఎం) కుత్బుల్లాపూర్ మండల కార్యదర్శి కీలు కాని లక్ష్మణ్ అన్నారు. శుక్రవారం గాజులరామారం డివిజన్ రోడా మేస్త్రి నగర్ 'బి' లోని భగత్ సింగ్ విగ్రహం ప్రాంగణం సుందరయ్య 3వర్ధంతి పురస్కరించుకొని డివిజన్ కార్యదర్శి ఎస్.కె. బురాన్ అధ్యక్షతన కార్యక్రమం నిర్వహిం చారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా కమిటీ సభ్యులు రావుల వరప్రసాద్ పార్టీ జెండాను ఆవిష్కరించగా మండల కార్య దర్శి కీలుకానీ లక్ష్మణ్, పలువురు నాయకులు సుందరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా పార్టీ మండల కార్యదర్శి కీలుకాని లక్ష్మణ్ , జిల్లా కమిటీ సభ్యులు రావుల వరప్రసాద్ మాట్లాడుతూ సుంద రయ్య భూస్వామ్య కుటుంబంలో పుట్టినప్పటికీ సామాన్య సగటు జీవిలా మెలిగేవాడని తెలిపారు.వ్యవసాయ కార్మిక సంఘాన్ని స్థాపించి వ్యవసాయ కార్మికుల సమస్యలపై నిరంతరం ఉద్య మించిన యోధుడని అన్నారు. పార్టీ సీనియర్ నాయ కులు ఎండీ సలీం, పార్టీ మండల కమిటీ సభ్యులు పసుల అంజ య్య, ముక్తార్, జాకీర్, మల్లారెడ్డి ,కరుణాకర్ ,బీరయ్య , షఫీ, బస్తీ నాయకులు గబ్బర్ సింగ్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలి



- కార్పొరేటర్ పండాల సతీష్ గౌడ్

నవతెలంగాణ - బాలానగర్

అభివద్ధి సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలని ఫతే నగర్ కార్పొరేటర్ పండాల సతీష్ గౌడ్ అన్నారు. మూసాపేట సర్కిల్ ఫతేనగర్ డివిజన్ పరిధిలో బస్తీలు, కాలనీలలో అభివద్ధి తో పాటు అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు ముఖ్యమంత్రి నేతత్వంలో ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు సహకారంతో అందజేస్తున్నటు తెలిపారు. అన్ని విభా గాల అధికారులతో కలసి శుక్రవారం డివిజన్ పరిధిలోని పిట్టల బస్తీలో పాదయాత్ర నిర్వహించారు. ఇంటింటికి తిరుగుతూ సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అంతేగాక బీఆర్ఎస్ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తూ అవగాహన కల్పించారు. బస్తీలో సుమారు అన్ని విధాలా అభివృద్ధి పనులను పూర్తి చేశామని, మిగిలి ఉన్న సీసీ రోడ్డు పనులను త్వరలో పూర్తి చేస్తామని తెలిపారు. అనంతరం బస్తీలో నిర్మాణంలో ఉన్న ప్రభుత్వ పాఠశాల భవనాన్ని అధికారులతో కలిసి పర్యవేక్షించారు. కమ్యూనిటీ హాల్ పునరుద్ధరణ పనులను వేగవంతం చేయాలని, జిమ్ సామగ్రి కూడా సమకూర్చాలని అధికారులను ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఎన్నో లక్షలు వెచ్చించి నిర్మిస్తున్న కమ్యూనిటీ హాల్, జిమ్, పార్కులను ప్రజల సద్వినియోగపరుచుకోవాలని కార్పొరేటర్ కోరారు. ఈ కార్యక్రమంలో లక్ష్మణ్, జయమ్మ, చమన్, గణేష్, బబ్లూ, శోభన్‌బాబు, సరిత, ముంతాజ్, సురేందర్ నాయుడు, శివ రామ్, శేఖర్ పాల్గొన్నారు.

ఇడికూడ నిర్మాలానందంకు డాక్టరేట్

నవతెలంగాణ-హైదరాబాద్



"సాహితీ మేఖల సంస్థ సాహిత్య సేవ " పై పరిశోధన చేసిన ఇడికూడ నిర్మలానందానికి ఉస్మానియా విశ్వవిద్యా లయం డాక్టరేట్ ను ప్రకటించింది. తెలుగు శాఖ ఆచార్యులు సాగి కమలాకర శర్మ పర్యవేక్షణలో ఈ పరిశోధన కొనసా గింది. నల్లగొండ జిల్లా చండూరులో 1936 లో స్థాపిం చబడిన సాహితీ మేఖల తెలంగాణాలోనే తొలి సాహిత్య సంస్థ అని ఈ పరిశోధన లో నిర్మలానందం సప్రమాణంగా నిరూపించారు. ఈ సంస్థ గత ఎనిమిది దశాబ్దాల్లో ప్రచురించిన 130 గ్రంథాలపై నిర్మలానందం విపుల పరిశోధన చేశారు. కవిరత్న అంబటిపూడి వెంకట రత్నం స్థాపించిన దరిద్ర నారాయణ సేవా సమితి, సాహితీ మేఖల సంస్థలు చేపట్టిన సామాజిక, సాహిత్య సేవల గురించి ఈ సిద్ధాంత గ్రంథంలో కూలంకషంగా పరిశీలించారు. యూని వర్సిటీ గ్రాంట్స్ కమీషన్ జూనియర్ రీసెర్చ్ ఫెలోషిప్ తో నిర్మలానందం ఐదేండ్ల పాటు ఈ పరిశోధన చేశారు



అయ్యప్ప స్వామి ఆలయ నిర్మాణానికి సీనియర్ సిటీజన్ల విరాళం

నవతెలంగాణ-దుండిగల్

నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని శ్రీనివాస్ నగర్ కాలనీలో నూతనంగా నిర్మిస్తున్న అయ్యప్ప స్వామి దేవాలయ భవన నిర్మాణానికి తమ వంతు సహాయంగా నిజాంపేట్ శ్రీనివాస్ నగర్ సీనియర్ సిటిజన్స్ రూ.20,116/-ను డిప్యూటీ మేయర్ ధనరాజ్ యాదవ్‌కు శుక్రవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో అయ్యప్ప స్వామి ఆలయ కమిటీ సభ్యులు, హరి, కాలనీ వాసులు, తదితరులు పాల్గొన్నారు.

నవవధువు ఆత్మహత్య



- అత్తింటి వేధింపులే కారణమని మృతురాలి తల్లిదండ్రుల ఆరోపణ

నవతెలంగాణ - కుత్బుల్లాపూర్

మేడ్చల్ జిల్లా పేట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలోని బాపు నగర్ లో విషాదం చోటుచేసుకుంది. 15 రోజుల క్రితమే పెండ్లయిన ఓ నవవధువు ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం నిలీష (25) అనే యువతికి 15 రోజుల క్రితమే సంతోష్ రెడ్డి అనే వ్యక్తితో వివాహం జరిగింది. అయితే గురువారం రాత్రి పుట్టింటికి వచ్చి ఆమె.. రాత్రి 11 గంటల సమయంలో ఉరివేసుకొని బలవన్మరణానికి పాల్పడింది. మృతదేహాన్ని గాంధీ ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు పేట్ బషీరాబాద్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. తమ కుమార్తె ఆత్మహత్యకు అత్తింటి వేధింపులే కారణమని ఆమె తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు.

అనుమానాస్పదస్థితిలో గృహిణి..

బాలానగర్ : అనుమానస్పద స్థితిలో ఓ గృహిణి మృతి చెందింది. ఈ



దాంతో ఇద్దరు చిన్నారులకు తల్లి ప్రేమ దూరమయ్యింది. బాలానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో పరిధిలో ఈ ఘటన వెలుగు చూసింది. సీఐ కె.భాస్కర్ తెలిపిన వివరాల ప్రకారం గిరినగర్ కు చెందిన పి.లక్ష్మి(30), పరశురామ్ లకు 12 ఏండ్ల క్రితం పెండ్లయింది. వీరికి ఐదు, ఎనిమిదేండ్ల వయస్సున్న ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారు. వేసవి సెలవులు కావడంతో పిల్లలు ఇటీవల స్వగ్రామమైన జనగామకు వెళ్లారు. భర్త సొంత మేనబావ అయినప్పటికీ కొంతకాలంగా భార్యాభర్తల మధ్య గొడవలు జరుగుతున్నాయి. కాగా వీరి మధ్య మరల ఘర్షణ జరగడంతో భర్త బయటికి వెళ్లగానే లక్ష్మి ఇంట్లో సీలింగ్ ఫ్యాన్‌కు చీరతో ఉరేసుకుంది. మధ్యాహ్న సమయంలో భార్యకు భర్త ఫోన్ చేయగా ఎంతకీ ఫోన్ తీయకపోవడంతో ఇంటికి వచ్చి చూడగా గడియపెట్టి ఉంది. కిటికీ నుంచి చూడగా లోపల భార్య లక్ష్మి ఉరేసుకుని వేలాడుతూ కనిపించింది. తలుపు పగలగొట్టి లోపలికి వెళ్లి భార్యను కిందికి దించగా అప్పటికే మృతి చెందింది. గొడవల కారణమా? లేక ఆత్మహత్యకు ఇంకేమైనా కారణాలు ఉన్నాయా అని మృతురాలి తల్లిదండ్రులు ఫిర్యాదు ఇస్తే విచారణలో తెలుస్తుందని పోలీసులు తెలిపారు. ప్రాథమికంగా అనుమానాస్పద మృతిగా పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

పేదింటి ఆడపడుచు వివాహానికి ఆర్థికసాయం

నవతెలంగాణ - కూకట్ పల్లి



ఆల్విన్ కాలనీ డివిజన్ ఎల్లమ్మబండ పరిధిలోని ఎన్టీఆర్ నగర్‌లో నివాసముంటున్న నిరుపేద కుటుంబానికి చెందిన మనోహర్, యశోదల కుమార్తె మానస వివాహానికి, డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ కుమారుడు దొడ్ల రామకష్ణ గౌడ్ రూ. 5 వేల ఆర్థిక సహాయం అందజేశారు. కార్యక్రమంలో సమ్మారెడ్డి, చిన్నోళ్ల శ్రీనివాస్, గుడ్ల శ్రీనివాస్, మల్లేష్, అర్వరవి, కటికరవి, నాగరాజు పాల్గొన్నారు.

ట్రాఫిక్ కోన్స్‌ను తొలగించి ట్రాఫిక్‌ను నియంత్రించండి

- కౌన్సిలర్ కందాడి జ్యోత్స్నా శివారెడ్డి

నవతెలంగాణ - బాలానగర్



ట్రాఫిక్ కోన్స్‌ను తొలగించి ట్రాఫిక్‌ను నియంత్రించాలని కొంపల్లి మున్సిపల్ కౌన్సిలర్ కందాడి జ్యోత్స్నా శివారెడ్డి సైబరాబాద్ ట్రాఫిక్ పోలీస్ అధికారులను కోరారు. శుక్రవారం కుత్బుల్లాపూర్ మున్సిపాల్టీ పరిధిలోని కొంపల్లి జాతీయ రహ దారి సర్వీస్ రోడ్డు పక్కన ఉన్న మినర్వా గ్రాండ్ హొటల్ ముందున్న స్థలాన్ని ఆమె పరిశీలిం చారు. హొటల్ యాజమాన్యంపై కౌన్సిలర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ హొటల్ యాజమాన్యం ప్రధాన రహదారిని ఆక్రమిస్తూ, తమ సొంత లాభాల కోసం ట్రాఫిక్ కోన్స్‌ను ఏర్పాటు చేసి ప్రజలకు పార్కింగ్ సౌకర్యం లేకుండా చేస్తున్నదన్నారు. రహదారిపై రోజు రోజుకు ట్రాఫిక్ సమస్య పెరిగి వాహనాదారులకు, పాదాచారులు తీవ్ర ఇబ్బందులు గురి చేస్తున్నారని తెలిపారు. ఈ విషయమై సైబరాబాద్ ట్రాఫిక్ పోలీస్ అధికారులు తక్షణమే స్పందించి సమస్యను పరిష్కరించాలని డిమాండు చేశారు.

పుచ్చలపల్లి సుందరయ్యకు నివాళ్లు

నవతెలంగాణ-దుండిగల్



కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య 38వ వర్ధంతి సుందరయ్య భవనం నిర్వహణ కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం సుందరయ్య భవన్ నిర్వహణ కమిటీ సభ్యులు, కార్పొరేటర్ బి వెంకట రామయ్య అధ్యక్షతన నిర్వహించారు ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆకెళ్ళ రాఘవేంద్ర ప్రముఖ విద్యావేత్త,విశిష్ట అతిథి డి.దయాకర్ రెడ్డి ప్రగతి నగర్ రూపకర్త పూర్వ సర్పంచ్ లు హాజరై సుందరయ్య చిత్రపటాని కి పూలమాలలు వేసి నివాళులర్పించారు .అనంతరం వారు మాట్లాడుతూ దక్షిణ భారతదేశం గాంధీగా పిలవబడి ,అనేక పోరాటాలు నిర్వహించి పరిష్కారం చూపిన నిస్వార్థ కమ్యూనిస్టు నాయకుడు సుందరయ్య అని అన్నారు. ఆయన ఆశయ మార్గంలో నడవడమే కార్యకర్తలుగా మనం సుందరయ్యకి అర్పించే నిజమైన నివాళి అన్నారు. నేటి పాలకులు ప్రజా సమస్యలు పక్కనపెట్టి పదవులే ఏజెండాగా పనిచేస్తూ ప్రజాసంక్షేమాన్ని విస్మరిస్తున్నారని అన్నారు. సుందరయ్య స్ఫూర్తిని ఆదర్శంగా తీసుకొని ప్రతీ కమ్యూనిస్టు కార్యకర్త పోరాట మార్గంలో ప్రయాణించాలని అన్నారు. ఈ కార్యక్ర మంలో స్వతంత్ర కార్పొరేటర్లు శ్రీరాములు ,లక్ష్మికుమారి ,సత్యవాణి, మాధవి ,సుజాత , సుందరయ్య భవ నిర్వహణ కమిటీ నాయకులు బాల వెంకటేశ్వరరావు, మల్లాచారి ,ఎన్ బాలపీరు, తదితరులు పాల్గొన్నారు.

బాచుపల్లి ఇండస్ట్రియల్ ఏరియా కమిటీ ఆధ్వర్యంలో సుందరయ్య వర్ధంతి సందర్భంగా బాచుపల్లి లోని ఇంద్రా నగర్ కార్మికవాడలో పలుచోట్ల ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ముఖ్యఅతిథిగా సీఐటీయూ జిల్లా నాయకులు కే కృష్ణ నాయక్ పాల్గొని సహపంక్తి భోజనాలను ప్రారంభించారు. ఎమ్ చంద్ర శేఖర్, మాణిక్యం ,యాదగిరి ,ప్రవీణ్ ,శ్రీనివాస్ రెడ్డి కాలనీలోని పలు కంపెనీ కార్మికులు పాల్గొన్నారు.



సుందరయ్య జీవితం నేటి తరాలకు ఆదర్శం

- సీపీఐ(ఎం) బాలనగర్ మండల కార్యదర్శి రాజశేఖర్



నవతెలంగాణ-కూకట్ పల్లి

పుచ్చలపల్లి సుందరయ్య 38వ వర్ధంతి సందర్భంగా సీపీఐ(ఎం) కూకట్‌పల్లి కార్యాలయంలో పార్టీ నాయకులు ఆ మహానేతకు పూలమాలవేసి నివాళ్లర్పిం చారు. ఈ సందర్భంగా పార్టీ బాలనగర్ మండల కార్యదర్శి రాజశేఖర్, పార్టీ నాయకులు కృష్ణ నాయక్‌లు పాల్గొని ప్రసంగించారు. సుందరయ్య జీవితం నేటి తరానికి ఆదర్శం అని, ఆయన చూపిన ఆ ఎర్రని బాట, కార్మిక, కర్షక పేద ప్రజల విముక్తి కోసం వేసిన పూలబాట అని కొనియా డారు. వారి జీవితం పేద ప్రజలకు అంకితం ఇచ్చారని, నిరంతరం బడుగు బలహీన వర్గాల హక్కుల కోసం కొట్లాడిన మహానేతగా తెలంగాణ సాయుధ పోరాటాన్ని నడిపి అన్ని వర్గాల ప్రజలకు విముక్తి చేసిన మహా నాయకుడు సుందరయ్య అని పేర్కొన్నారు, పార్లమెంటు కు సైకిల్ పై వెళ్లిన ఆదర్శ కమ్యూనిస్టు నాయకుడిగా నిలిచారన్నారు. అలాగే కుల ,మత, సామరస్యం కోసం, పేద ప్రజల అభ్యున్నతి కోసం సీపీఐ(ఎం) ఎల్లప్పుడు కృషి చేస్తుందని నిజాయితీ నిస్వార్థంతో ముందుకెళ్లి ప్రజల ఆలోచన విధానానికి అనుకూలంగా పనిచేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు రాజులు, లక్ష్మమ్మ యాదగిరి, రాములు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా దంపనబోయిన శ్రీనివాస్ జన్మదిన వేడుకలు



నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

శెట్టి బలిజ సంఘం జంట నగరాల అధ్యక్షులు (వై. ఎఫ్. సి .ఏ) ,ప్రముఖ సంఘ సేవకులు, మల్లారెడ్డి నగర్ సంక్షేమ సంఘం మాజీ అధ్యక్షులు దంపనబోయిన శ్రీనివాస్ జన్మదిన వేడుకలు గురువారం గాజులరామారం డివిజన్ పరిధిలో మల్లారెడ్డి నగర్‌లో గల ఆయన నివాసం వద్ద కుటుంబ సభ్యులు, శెట్టి బలిజ సంఘం సభ్యుల ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. తెలుగు రాష్ట్రాలతో పాటు జంట నగరాల నుంచి అన్ని సంఘాల పెద్దలు, కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలోని పలు ప్రాంతాలకు చెందిన శెట్టిబలిజ కుల బంధువులు, శ్రేయోభిలాషులు, పుష్పగుచ్ఛాలు అందజేసి శాలువాతో సన్మానిస్తూ కేక్ కట్ చేయించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన జన్మదిన వేడుకలు అందరి మధ్య జరుపుకోవడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. శెట్టిబలిజ కులస్తులు ఐక్యంగా ఉంటే అన్నీ సాధించుకోగలమని తెలిపారు. కుల సంఘాన్ని బలోపేతం చేసేందుకు శక్తి వంచన లేకుండా కషి చేస్తానన్నారు .సామాజిక సేవలు మరింత విస్తతం చేస్తానని వ్యాఖ్యానించారు. తనకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన ప్రతీ ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు.

మురికి కూపంలా ఉన్న అలీ తలబ్ చెరువుకు మహర్దశ

- కార్పొరేటర్ నార్నె శ్రీనివాస రావు



నవతెలంగాణ-కేపీహెచ్‌బీ

ఒకప్పుడు మురికి కూపం లాగా ఉన్న అలీ తలబ్ చెరువు కు మహర్దశ వచ్చిందని హైదర్‌నగర్ డివిజన్ కార్పొరేటర్ నార్నె శ్రీనివాస రావు అన్నారు. డివిజన్ పరిధిలోని అలీ తలబ్ చెరువు సుందరీకరణలో భాగంగా రూ.1. 83 కోట్ల వ్యయంతో చేపడుతున్న అలుగు (తూము) నిర్మాణం, చెరువులో కలుషిత, వ్యర్థ జలాలు కలవకుండా మళ్లింపు పైప్ లైన్ నిర్మాణ పనులను ఇరిగేషన్ అధికారులతో కలిసి శుక్రవారం కార్పొరేటర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ సహకారంతో చెరువు సుందరీకరణ, సంరక్షణ,అభివృద్ధి పనులు చేపట్టడం జరిగిందన్నారు. చెరువు కట్ట పటిష్టం పరిచేలా పునరుద్ధరణ, మురుగు నీరు చెరువు లో కలవకుండా ప్రత్యేకంగా చెరువు చుట్టూ నిర్మించే మురుగు నీటి కాల్వ నిర్మాణం, అలుగు మరమ్మత్తులు, చెరువు కట్ట బలోపేతం, పునరుద్ధరణ పనులు, వాకింగ్ ట్రాక్ వంటి పనులు చేపడుతున్నామని పేర్కొన్నారు. చెరువు సంరక్షణలో భాగంగా చెరువు చుట్టూ ఫెన్సిగ్ (కంచె) నిర్మాణం , చెరువు అలుగు నిర్మాణము , చెరువు సుందరీ కరణ పనులు చేపడుతున్నామన్నారు. చెరువు సుందరీకరణ , అభివృద్ధి పనులు ప్రణాళికతో, నాణ్యత ప్రమాణా లతో చేపట్టాలన్నారు. నాణ్యత విషయంలో ఎక్కడా రాజీ పడకూడదని, త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులో కి తీసుకురావాలని అధికారులకు తెలియచేశారు. ఈ కార్యక్రమంలో అధికారులు ఏఈ రాజీవ్, వర్క్ ఇన్‌స్పెక్టర్ రతన్, డివిజన్ ఉపాధ్యక్షుడు పోతుల రాజేందర్, నాయకులు సత్యనారాయణ, రాఘవేందర్ రెడ్డి, బ్రహ్మయ్య, కృష్ణ రెడ్డి, మహేందర్ రెడ్డి, మాధవ్, కుమార స్వామి తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు ఎలక్ట్రికల్ వాహనాలు ఎంతో ఉపయోగం



- మేయర్ విజయలక్ష్మి
- ఎలక్ట్రికల్ వాహనాల ప్రదర్శనను సందర్శించిన మేయర్

నవతెలంగాణ-సిటీబ్యూరో

జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో రెండు రోజుల పాటు ఏర్పాటు చేసిన ఎలక్ట్రికల్ వాహనాల ప్రదర్శనను శుక్రవారం సాయంత్రం గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ విజయలక్ష్మి సందర్శిం చారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మేయర్‌కు వాహ నాల వివరాలు గురించి వివరించారు. ఎలక్ట్రికల్ వాహనాన్ని మేయర్ డ్రైవ్ చేసి పరిశీలించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ కాలుష్య రహిత పర్యావరణ పరిరక్షణకు ఎలక్ట్రికల్ వాహనాలు ఎంతగానో ఉపయో గపడుతుయన్నారు. రానున్న రోజుల్లో ఎలక్ట్రికల్ వాహనాల వాడకం పెరుగునున్న నేపథ్యం లో వినియోదారులను దష్టిలో పెట్టుకొని మారుతున్న సాంకేతికతో ఎలక్ట్రికల్ వాహ నాలను తయారీ చేయాలని కోరారు. ప్రధాన కార్యాల యంలో పనిచేస్తున్న ఉద్యోగులందరూ ఈ ప్రదర్శన తిలంకించాలని కోరారు.



తిరుమలలో కుటుంబ సమేతంగా శ్రీ వెంకటేశ్వర స్వామి వారిని గురువారం దర్శించుకున్న ప్రభుత్వ విప్, బీఆర్ఎస్ మేడ్చల్ జిల్లా అధ్యక్షులు, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు
నవతెలంగాణ-దుండిగల్

మతరాజ్యంతో సమాజ విచ్ఛిన్నం



(మొదటి పేజీ తరువాయి)

సమావేశాలే సరిగ్గా జరగడం లేదని, ప్రతిపక్షాలకు మాట్లాడే అవకాశమివ్వడం లేదని, వాయిదాలతో సరిపోతున్నదని అన్నారు. చర్చ లేకుండానే బిల్లులు ఆమోదం పొందుతున్నాయని, చివరికి ఆర్థిక వ్యవస్థకు కీలకమైన ద్రవ్య వినిమయ బిల్లు వంటి వాటిపై ఐదు లేదా పది నిమిషాలు చర్చించి ఆమోదిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. గతంలో ప్రతిపక్ష పార్టీల నాయకులతో ప్రధాని నేరుగా సంప్రదించే వారని గుర్తు చేశారు. ఇప్పుడు ఆ పరిస్థితి లేదని, ప్రతిపక్ష సభ్యులను శత్రువులుగా భావిస్తున్నారని అన్నారు. ప్రజాస్వామ్యం కార్యనిర్వాహకవర్గం చేతుల్లో బందీ అయ్యిందన్నారు. పార్లమెంటును, ఇతర స్వతంత్ర వ్యవస్థలను అది నియంత్రిస్తోందని చెప్పారు. ప్రజాస్వామ్యానికి నాలుగో స్తంభంగా ఉండాల్సిన మీడియాను ప్రభుత్వానికి బాకాగా మారేలా అనేక ఒత్తిళ్లకు గురిచేస్తున్నదని విమర్శించారు. లౌకికత్వంలోనే ఈ దేశానికి మనుగడ సాధ్యమని అన్నారు. మత ఛాంద రాజ్యం అంతిమంగా దేశాన్ని, సమాజాన్ని విచ్ఛిన్నం చేస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. మతం వ్యక్తిగతమని చెప్పారు. పరిపాలనలో మతాన్ని చొప్పించొద్దని కోరారు. మత రాజ్యంతో రాజ్యాంగ విలువలైన లౌకికత్వం, స్వేచ్ఛ, సమానత్వం, సామాజిక న్యాయం వంటివి కోల్పోయే ప్రమాదముందన్నారు. ఈ పాలకులకు చరిత్ర అంటే గౌరవం లేదన్నారు. తప్పుడు చరిత్రను సృష్టించడానికి వాస్తవాలను తలకిందులు చేయడానికి నేటి పాలకులు సన్నద్ధులేనని వివరించారు.

ప్రజాస్వామ్యం విలువ అర్థమైతేనే రాజ్యాంగ విలువలను రక్షించుకోవడానికి ప్రజలు సన్నద్ధమవుతారని చెప్పారు. కేంద్రంలో పాలకుల తీరును ఉపేక్షించే స్వేచ్ఛ, స్వాతంత్ర్యాలను హరిస్తున్నా స్పందించలేని పరిస్థితికి చేరుకుంటామని అన్నారు. నాగరికత ప్రస్థానంలో ఏ ఒక్క తరం నిస్తేజంగా మారినా ఫాసిస్టు రాజ్యం ఏర్పడే ప్రమాదం పొంచి ఉంటుందని ఆందోళన వ్యక్తం చేశారు. పార్లమెంటరీ ప్రజాస్వామ్యానికి, లౌకికత్వానికి వచ్చే పెనుప్రమాదాన్ని ప్రజలు తిప్పికొట్టాలని కోరారు.

బీజేపీని ఓడిస్తేనే దేశం ముందుకు

బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్, సంఘ్‌పరివార్ కుట్రలను తిప్పికొట్టాలి : సీపీఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యులు బీవీ రాఘవులు



బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్, సంఘ్‌పరివార్ శక్తులను రానున్న పార్లమెంటు ఎన్నికల్లో ఓడిస్తేనే దేశం ముందుకెళ్లడం సాధ్యమవుతుందని సుందరయ్య విజ్ఞాన కేంద్రం ట్రస్టు చైర్మెన్ బివి రాఘవులు పిలుపునిచ్చారు. బీజేపీ పాలనలో రాజ్యాంగం, ప్రజాస్వామ్యం మీద దాడి జరుగుతున్నదని చెప్పారు. మనుధర్మం, ఫాసిస్టు పాలన తేవాలని మోడీ ప్రభుత్వం చూస్తున్నదని ఆందోళన వ్యక్తం చేశారు. లౌకికత్వం, ప్రజాస్వామ్యం, ఆర్థిక స్వావలంబన, సామాజిక న్యాయం ప్రమాదంలో పడ్డాయని అన్నారు. ఎన్నికల కమిషన్, పార్లమెంటు, న్యాయవ్యవస్థ వంటి రాజ్యాంగ వ్యవస్థలను మోడీ ప్రభుత్వం ధ్వంసం చేస్తున్నదని విమర్శించారు. ఈ విషయాల నుంచి ప్రజల దృష్టి మరల్చేందుకు మతం, మత విశ్వాసాలను ముందుకు తెస్తున్నదని అన్నారు. దేశంలో వైషమ్యాలను రెచ్చగొడుతున్నదని చెప్పారు. రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని, లౌకికత్వాన్ని, సమైక్యతను కాపాడుకోవాలని కోరారు. దేశంలో అధ్యక్ష తరహా పాలన తెచ్చేందుకు వాజ్‌పేయి హయాం నుంచే ప్రయత్నాలు జరుగుతున్నాయని విమర్శించారు. మరోరూపంలో పంచాయతీ నుంచి పార్లమెంటు వరకు ఒకేసారి జమిలి ఎన్నికలను నిర్వహించేందుకు కేంద్రం సిద్ధమవుతున్నదని చెప్పారు. స్థానిక, రాష్ట్ర అంశాలు చర్చకు రాకుండా జాతీయ అంశాలకే ప్రాధాన్యత ఇస్తే ఫెడరలిజం నాశనమవుతుందన్నారు. వ్యక్తి ప్రాతిపదిక మీద ఎన్నికలు జరుగుతాయని వివరించారు. ప్రస్తుతం రాజ్యాంగాన్ని రక్షించుకోవడం అందరి కర్తవ్యమని అన్నారు.

ఈ కార్యక్రమంలో సుందరయ్య విజ్ఞాన కేంద్రం మేనేజింగ్ కమిటీ కార్యదర్శి ఎస్ వినయకుమార్, ట్రస్టు సభ్యులు సి సాంబిరెడ్డి తదితరులు పాల్గొన్నారు. పిడిటి చారి ప్రసంగాన్ని ప్రముఖ రాజకీయ విశ్లేషకులు తెలకపల్లి రవి తెలుగులోకి అనువాదం చేశారు.

ఆదర్శమైన కమ్యూనిస్టు సుందరయ్య

ఆయన అడుగుజాడల్లో నడవడమే ఉత్తమమార్గం : సుందరయ్య 38వ వర్ధంతి సభల్లో సీపీఐ(ఎం) నేతలు

'ప్రజల మనిషిగా నిలిచిన పుచ్చలపల్లి సుందరయ్య ఆదర్శనీయమైన కమ్యూనిస్టుగా నిలిచారు. జీవితాంతం నిరాడంబర జీవితం గడిపారు.. ఆయన స్ఫూర్తిగా నేటి పాలకుల ప్రజావ్యతిరేక విధానాలపై పోరాడాలి" అని సీపీఐ(ఎం) నేతలు పిలుపునిచ్చారు. సుందరయ్య 38వ వర్ధంతి సందర్భంగా రాష్ట్ర వ్యాప్తంగా సభలు నిర్వహించారు.



మాట్లాడుతున్న చుక్కరాములు


మాట్లాడుతున్న బి. వెంకట్, వేదికపై జూలకంటి, సాగర్ తదితరులు


నివాళి అర్పిస్తున్న జాన్‌వెస్లీ

నవతెలంగాణ- విలేకరులు

కష్టాల్లో ఉన్నప్పుడు ఎలా అధిగమించాలో కార్యకర్తలకు సుందరయ్య నేర్పించాలని సీపీఐ(ఎం) కేంద్ర కమిటీ సభ్యులు బి.వెంకట్ అన్నారు. శుక్రవారం నల్లగొండ జిల్లా మిర్యాలగూడ మండలం ఈదులగూడెంలో బైక్ ర్యాలీ తీశారు. సుందరయ్య విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎస్వీ గార్డెన్‌లో ఏర్పాటు చేసిన సుందరయ్య 38వ వర్ధంతి సభలో ఆయన మాట్లాడారు. మతోన్మాదాన్ని పెంచి పోషిస్తున్న మోడీ ప్రభుత్వాన్ని 2024లో ఓడించి తీరుతామని స్పష్టం చేశారు. సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు, మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి మాట్లాడుతూ.. చట్టసభల్లో కమ్యూనిస్టుల అవసరం ఎంతైనా ఉందని చెప్పారు. తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తీగల సాగర్ మాట్లాడుతూ.. పోరాటాల గడ్డగా పేరుగాంచిన మిర్యాలగూడలో రానున్న ఎన్నికల్లో పోటీ చేయడం ఖాయమని చెప్పారు. ప్రజలందరూ పుచ్చలపల్లి సుందరయ్య జీవితాన్ని అధ్యయనం చేయాలని.. ఆయన చూపిన మార్గంలో రాజకీయాల్లో నూతన ఒరవడిని సృష్టించాలని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు చుక్క రాములు అన్నారు. సంగారెడ్డి జిల్లా కేంద్రంలోని కే.కే భవన్‌లో నిర్వహించిన పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతి సభలో ఆయన మాట్లాడారు. నేటి రాజకీయాల్లో పదవులపై ఆశ తప్పా.. ప్రజల సంక్షేమం కోసం పని చేసే పరిస్థితి లేదన్నారు. రంగారెడ్డి జిల్లా తుర్కయంజాల్ మున్సిపాల్టీ రాగన్నగూడలోని సీపీఐ(ఎం) కార్యాలయంలో సుందరయ్య వర్ధంతి జరిపారు. సుందరయ్య చిత్రపటానికి పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జాన్‌వెస్లీ పూలమాలలు వేసి నివాళులర్పించారు. సుందరయ్య ఉత్తమ పార్లమెంటేరియన్‌గా, శాసనసభలో నికార్సైన ప్రతిపక్ష నేతగా నిలిచారని కొనియాడారు. నేడు పార్లమెంట్‌లోగానీ శాసనసభలోగానీ ప్రజాసమస్యలపై మాట్లాడే ప్రజానాయకులే కరువయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. యాచారం మండల కేంద్రంలో నిర్వహించిన సుందరయ్య వర్ధంతి కార్యక్రమంలోనూ జాన్‌వెస్లీ పాల్గొన్నారు. రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని బద్వేల్ చౌరస్తాలో నిర్వహించిన వర్ధంతి కార్యక్రమంలో తెలంగాణ భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.రామ్మోహన్‌రావు పాల్గొ న్నారు.మంచిర్యాల జిల్లా చెన్నూరు మండలంలో భూపోరాట కేంద్రం వద్ద సుందరయ్య వర్ధంతి సభను సీపీఐ(ఎం) నాయకులు బోడేంకి చందు అధ్యక్షతన నిర్వహించారు. రాష్ట్ర కమిటీ సభ్యుడు పైళ్ల ఆశయ్య పాల్గొన్నారు. హైదరాబాద్ ఐఎస్ సదన్ చౌరస్తాలో సీపీఐ(ఎం) హైదరాబాద్ సౌత్ జిల్లా కమిటీ కార్యాలయంలో సుందరయ్య చిత్రపటానికి రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎండి.అబ్బాస్ పూలమాల వేసి నివాళులు అర్పించారు. హైదరాబాద్ ఆర్టీసీ క్రాస్ రోడ్డులోని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యాలయంలో తెలంగాణ రైతు సంఘం, వ్యకాస సంయుక్త ఆధ్వర్యంలో సుందరయ్య వర్ధంతి నిర్వహించారు.

సీనియర్ నాయకులు సారంపల్లి మల్లారెడ్డి మాట్లాడుతూ.. సుందరయ్య స్ఫూర్తితో బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్ పాలనకు వ్యతిరేకంగా ప్రజలను సమీకరించి పెద్దఎత్తున ఉద్యమాలు, పోరాటాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎం.శోభన్ పాల్గొన్నారు.

బీజేపీని ఎదుర్కొనే సత్తా ఎర్రజెండాకే ఉంది

సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం

- దేశాన్ని కార్పొరేట్లకు కట్టబెడుతున్న మోడీని గద్దె దించాలి



నవతెలంగాణ-ముదిగొండ

పేదవాడి కష్టంతోనే ప్రపంచం బతుకుతుందని, పేదవాళ్లు తలుచుకుంటే ప్రపంచాన్ని మార్చేస్తారని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం అన్నారు. ఖమ్మం జిల్లా ముదిగొండ మండలం చిరుమర్రిలో పుచ్చలపల్లి సుందరయ్య 38వ వర్ధంతి సందర్భంగా పార్టీ గ్రామ శాఖ కార్యదర్శి సామినేని రామారావు అధ్యక్షతన శుక్రవారం జరిగిన బహిరంగసభకు ఆయన హాజరై మాట్లాడారు. అణిచివేత, వివక్షతకు వ్యతిరేకంగా ఉద్యమించిన సుందరయ్య.. వ్యక్తి కాదు మహాశక్తి అని అన్నారు. ఎర్రజెండా ఉన్నంతవరకు భూపోరాటాలు ఉంటాయని స్పష్టంచేశారు. దేశాన్ని కార్పొరేట్లకు కట్టబెడుతున్న బీజేపీని గద్దె దించాలని పిలుపునిచ్చారు. బీజేపీని ఎదుర్కొనే సత్తా ఎర్రజెండాకే ఉందన్నారు. చిరుమర్రి గ్రామం ఉద్యమాలకు పేరొందిన గ్రామమని, చైతన్యవంతమైన యువత, యువకులు, ప్రజలు ఎర్రజెండాకు అండగా ఉండాలని ముందుకు రావటం హర్షనీయమన్నారు. రానున్న ఎన్నికల్లో రాష్ట్రం, జిల్లాలో సీపీఐ(ఎం) సత్తా చాటాలన్నారు. మిగతా పార్టీల కంటే ఎర్రజెండా పార్టీలో ఉన్న వారికే గౌరవం దక్కిందన్నారు. సభలో సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పోతినేని సుదర్శన్‌రావు, పార్టీ జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు మాట్లాడుతూ.. మతోన్మాద అరాచక శక్తులను ఎర్రజెండాతోనే తరిమికొట్టాలన్నారు. సభలో సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పాలడుగు భాస్కర్, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పొన్నం వెంకటేశ్వరరావు, బండి రమేష్, బుగ్గవీటి సరళ, నాయకులు బండి పద్మ, మచ్చా లక్ష్మీ, రాయల వెంకటేశ్వర్లు, మండల కార్యదర్శి బట్టు పురుషోత్తం, వైస్‌ఎంపీపీ మంకెన దామోదర్, నాయకులు, పార్టీ కార్యకర్తలు, యువతీ, యువకులు, అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

నవచిత్రం


పవన్ కళ్యాణ్

బ్రో..

పవన్ కళ్యాణ్ ఫ్యాన్స్‌తో పాటు ప్రేక్షకులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న ప్రాజెక్ట్ నుంచి టైటిల్, ఫస్ట్ లుక్‌ని విడుదల చేసి మేకర్స్ సర్‌ప్రైజ్ చేశారు. తన మేనల్లుడు, హీరో సాయి ధరమ్ తేజ్‌తో కలిసి పవన్ కళ్యాణ్ మొదటిసారి స్క్రీన్ షేర్ చేసుకుంటున్న చిత్రమిది. ఈ చిత్రాన్ని పీపుల్ మీడియా ఫ్యాక్టరీ పతాకంపై జీ స్టూడియోస్‌తో కలిసి టి.జి. విశ్వప్రసాద్ నిర్మిస్తున్నారు. వివేక్ కూచిభొట్ల సహ నిర్మాత.పి.సముద్రఖని దర్శకుడు. దర్శకులు త్రివిక్రమ్ స్క్రీన్‌ప్లే, డైలాగ్స్ అందిస్తున్నారు. తాజాగా విడుదలైన ఫస్ట్‌లుక్ మోషన్ పోస్టర్ అందరి అంచనాలను రెట్టింపు చేసేలా ఉండటం విశేషం. ఈ సినిమాకి 'బ్రో' అనే ఆసక్తికరమైన టైటిల్‌ను పెట్టారు. బ్యాక్ గ్రౌండ్‌లో పరమేశ్వరుడి రూపం కనిపిస్తుండగా.. 'కాలః త్రిగుణ సంశ్లేశం.. కాలః గమన సంకాశం.. కాలః వర్జయేత్ చారణం.. కాలః జన్మనాజాయతే జయం స్వయం శ్రియం ద్వయం.. బ్రో బ్రోదిన జన్మలేషం..' అనే శ్లోకం వినిపిస్తుండగా.. మెడలో ఓం లాకెట్ ధరించి స్టైలిష్ గాడ్‌లా కనిపిస్తున్న పవన్‌కళ్యాణ్ రూపాన్ని పరిచయం చేసిన తీరు రోమాలు నిక్కబొడుచుకునేలా ఉంది. గీత రచయిత కళ్యాణ చక్రవర్తి సాహిత్యం అందించారు. అలాగే ఈ చిత్రాన్ని జులై 28న ప్రపంచవ్యాప్తంగా భారీస్థాయిలో విడుదల చేస్తున్నట్లు మేకర్స్ ప్రకటించారు. ఈ చిత్ర నిర్మాణ పనులు శరవేగంగా సాగుతున్నాయి. దాదాపు చిత్రీకరణ పూర్తయింది. ఇంకా పది రోజుల షూటింగ్ మాత్రమే మిగిలి ఉంది. ఆ మిగిలిన భాగంతో పాటు ఇతర కార్యక్రమాలు కూడా త్వరగా పూర్తి చేసి.. ప్రేక్షకులను కొత్త అనుభూతిని పంచే అద్భుతమైన చిత్రాన్ని అందించాలని చిత్ర బృందం ఎంతో ఉత్సాహంగా ఉంది.

దేవరగా ఎన్టీఆర్

ఎన్టీఆర్, కొరటాల శివ కాంబోలో రూపొందుతున్న పాన్ ఇండియా చిత్రానికి ఏ టైటిల్‌ని ఖాయం చేస్తారా అని ఎదురు చూసిన ఎన్టీఆర్ అభిమానులకు, ప్రేక్షకులకు మేకర్స్ శుక్రవారం సర్‌ప్రైజ్ చేశారు. నేడు (శనివారం) ఎన్టీఆర్ బర్త్‌డే. ఈ నేపథ్యాన్ని పురస్కరించుకుని ఎన్టీఆర్ 30 చిత్రానికి 'దేవర' అనే పవర్‌ఫుల్ టైటిల్‌ని ఫిక్స్ చేశారు. వచ్చే ఏడాది ఏప్రిల్ 5న ఈ చిత్రాన్ని ప్రపంచ వ్యాప్తంగా విడుదల చేస్తున్నట్టు రిలీజ్ చేసిన పోస్టర్‌లో మేకర్స్ తెలిపారు.

ఎగసి పడుతున్న అలలు.. తీరంలో రక్తం మడుగులో గుట్టలుగా పడి ఉన్న శవాలు.. ఈ నేపథ్యంలో సముద్రమంత గంభీరంగా రక్తంకారుతున్న పదునైన ఆయుధంతో ఉన్న ఎన్టీఆర్ గెటప్‌ని చూస్తుంటే, 'ఈ కథలో మనుషుల కన్నా ఎక్కువ మృగాలు ఉంటారు. భయమంటే ఏంటో తెలియని మృగాలుంటారు. దేవుడంటే భయం లేదు. చావంటే భయం లేదు. కానీ, ఒకే ఒకటంటే భయం వారికి. ఆ భయమేంటో మీ అందరికీ తెలిసే ఉంటుంది. భయం ఉండాలి. భయం అవసరం. భయపెట్టడానికి ఈ సినిమాలో నా ప్రధాన పాత్ర ఏ రేంజ్‌కి వెళ్తుందనేది ఎమోషనల్ రైడ్' అని దర్శకుడు కొరటాల శివ ఈ సినిమా ప్రారంభోత్సవంలో ఏమైతే చెప్పారో దాన్ని రిప్రజెంట్ చేస్తూ ఉందనటంలో ఏమాత్రం అతిశయోక్తి లేదు.


నందమూరి కళ్యాణ్ రామ్ సమర్పణలో ఎన్టీఆర్ ఆర్ట్స్, యువ సుధ ఆర్ట్స్ బ్యానర్స్‌పై కొసరాజు హరికృష్ణ, సుధాకర్ మిక్కిలినేని ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. జాన్వీ కపూర్ హీరోయిన్‌గా నటిస్తోంది.


ఎన్టీఆర్

నకిలీ విత్తనాల విక్రేతలపై ఉక్కుపాదం మోపండి

ఎస్పీలు, సీపీలను ఆదేశించిన హోం మంత్రి

నవతెలంగాణ-ప్రత్యేక ప్రతినిధి



రాష్ట్రంలో వర్షాకాల పంటలు వేయడానికి రైతులు సిద్ధమవుతున్న దశలో నకిలీ విత్తనాలను విక్రయించే అక్రమార్కుల ఆగడాలు సాగకుండా వారిపై ఉక్కుపాదం మోపాలని పోలీసు ఉన్నతాధికారులను రాష్ట్ర హోం మంత్రి మహమూద్ అలీ ఆదేశించారు. నకిలీ విత్తనాల సరఫరా, అక్రమ మద్యం సరఫరాలను నిరోధించడానికి తీసుకోవాల్సిన చర్యలపై ఆయన శుక్రవారం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సచివాలయం నుంచి నగర కమిషనర్లు, జిల్లాల ఎస్పీలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. రాష్ట్రంలో రైతుల సంక్షేమం పట్ల ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యతనిస్తూ పని చేస్తున్నదనీ, ఈ విషయంలో ఎక్కడ ఏ చిన్న లోపం జరిగినా సహించే ప్రసక్తే లేదని హోం మంత్రి అన్నారు. వర్షకాలంలో లక్షలాది ఎకరాల్లో రైతులు పంటలు వేస్తారనీ, దీనిని ఆసరా చేసుకొని నకిలీ విత్తనాలను సరఫరా చేసి రైతులను మోసం చేసే శక్తులు తెగబడే ప్రమాదమున్నదని ఆయన అన్నారు. ఈ శక్తులపై గట్టి నిఘా ఏర్పాటు చేసి రైతులను అన్ని విధాల ఆదుకోవాల్సిన బాధ్యత పోలీసు శాఖపై ఉన్నదని చెప్పారు. అదేవిధంగా సరిహద్దు రాష్ట్రాల నుంచి అక్రమ మద్యం రాష్ట్రంలోకి సరఫరా కాకుండా సరిహద్దులలో గట్టి నిఘాను ఏర్పాటు చేయాలని కూడా ఆయన ఆదేశించారు.

డీజీపీ అంజనీ కుమార్ మాట్లా డుతూ.. గత 8 ఏండ్లలో నకిలీ విత్తనాలు విక్రయించేవారిపై 986 కేసులను నమోదు చేయడం జరిగిందని తెలిపారు. అలాగే, 1389 మంది నిందితులను అరెస్టు చేశామనీ, ఇందులో 86 మందిపై పీడీ చట్టాన్ని ప్రయోగించామని తెలిపారు.

ఈ సమావేశంలో హోం శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ జితేందర్‌తో పాటు పలువురు సీనియర్ అధికారులు పాల్గొన్నారు.

నేడు ఎన్టీఆర్ శతజయంతి వేడుకలు

- జయప్రదం చేయాలి:కాసాని జ్ఞానేశ్వర్

నవతెలంగాణ-హైదరాబాద్

ఎన్టీఆర్ శతజయంతి ఉత్సవాలు హైదరాబాద్‌లో ఘనంగా నిర్వహించేందుకు టీటీడీపీ భారీ ఏర్పాట్లు చేసింది. ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు కాసాని జ్ఞానేశ్వర్ ఆధ్వర్యంలో సన్నాహాలు చేపట్టారు. 'ఎన్టీఆర్ లిటరేచర్, సావనీర్ అండ్ వెబ్‌సైట్ కమిటీ' శతజయంతి ఉత్సవాలను జయప్రదం చేసేందుకు పనిచేస్తున్నది. శనివారం సాయంత్రం ఐదు గంటలకు హైదరాబాద్, కూకట్‌పల్లి హౌసింగ్ బోర్డులోని కైతలాపూర్ మైదానంలో అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న వేడుకలకు ముఖ్య అతిథిగా తెలుగుదేశంపార్టీ జాతీయ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు హాజరవుతున్నారు. ప్రముఖ సినీ నటుడు నందమూరి బాలకృష్ణ ప్రత్యేక అతిథిగా పాల్గొంటున్నారు. ఈ వేడుకలలో భాగంగా ఎన్టీఆర్ సమగ్ర సినీ, రాజకీయ జీవితంలో ఆయనతో సన్నిహితంగా మెలిగిన సహచర నటీనటులు, సాంకేతిక నిపుణులు, నిర్మాతలు, దర్శకులు, పాత్రికేయులు, సహచర రాజకీయ నాయకులు, వివిధ పార్టీల నేతలు, ఎడిటర్లు వెలిబుచ్చిన అభిప్రాయాలు, ప్రత్యేకంగా రాసిన వ్యాసాలను సంకలనం చేసిన 'శక పురుషుడు' పేరుతో ప్రత్యేక సావనీర్‌ను, అలాగే ఎన్టీఆర్ సమగ్ర జీవితానికి సంబంధించిన విశేషాలు, సినీ పాటలు, సినిమాలు, ఉపన్యాసాలు తదితర పూర్తి సమాచారంతో రూపొందించిన 'జై ఎన్టీఆర్' వెబ్‌సైట్ ఆవిష్కరించనున్నారు.

ప్రముఖులకు ఆహ్వానం

ఈ వేడుకల్లో ప్రముఖ సినీ, రాజకీయ నాయకులు పాల్గొంటున్నారు. ముఖ్యఅతిథులుగా హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ, సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారామ్ ఏచూరి, సీపీఐ జాతీయ కార్యదర్శి డి. రాజా,బీజేపీ జాతీయ నేత పురందీశ్వరి , జనసేన అధ్యక్షులు పవన్ కళ్యాణ్, కన్నడ చిత్ర హీరో శివకుమార్, ప్రముఖ తెలుగు హీరోలు జూనియర్ ఎన్టీఆర్, అల్లు అర్జున్ , ప్రభాస్, దగ్గుబాటి వెంకటేష్, సుమన్ , మురళీమోహన్, నందమూరి కళ్యాణ్‌రామ్, ప్రముఖ హీరోయిన్, మాజీ పార్లమెంట్ సభ్యులు జయప్రద, ప్రముఖ దర్శకుడు కె. రాఘవేంద్రరావు, ప్రముఖ నిర్మాతలు జి. ఆదిశేషగిరి రావు, సి. అశ్వనీదత్ ఇతర సినీ, రాజకీయ ప్రముఖులు పాల్గొంటున్నారు.

Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangna Printers Private Limited, Printed At M.H Bhavan, 1st Floor, Plot No. 21/1, Azamabad Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020,Telangana State, Published at Navatelangana Printers Private Limited, M.H Bhavan,1st Floor No.21/1, Azamabad, Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020, Telangana State, Editor : R.Sudha Bhaskar TELTEL/2014/59462.

నిలువ నీడ.. తాగేందుకు నీళ్లు లేవు..!

ఎండ తీవ్రతకు అల్లాడుతున్న 'ఉపాధి' కూలీలు

- కేంద్రం విధానంతో ఇబ్బందులు
- పని ప్రదేశాల్లో కనీస సౌకర్యాలు కరువు
- మౌలిక వసతులపై దృష్టిసారించని యంత్రాంగం





నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

ఉపాధి హామీ పని ప్రదేశాల్లో కాసేపు సేద తీరేందుకు నీడ.. తాగేందుకు నీళ్లు ఉండటం లేదు. పెరుగుతున్న ఎండ తీవ్రతతో కూలీలు అల్లాడుతున్నారు. కొందరు అస్వస్థతకు గురవుతున్నారు. ఇండ్ల నుంచే తాగునీరు పట్టుకెళ్లాల్సిన దుస్థితి. అవి అయిపోతే దప్పికతో ఇబ్బందులు పడాల్సిందే. కనీస సౌకర్యాలు కల్పించాల్సిన అధికారులు నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారు. కూలీలు పని చేసే ప్రాంతాలవైపు కనీసం కన్నెత్తి చూడటం లేదు. కొలతల్లో తేడాలుంటున్నాయని డబ్బుల్లో కోత విధిస్తున్న అధికారులు.. చట్టపరంగా వారికి కల్పించాల్సిన సౌకర్యాలపై మాత్రం దృష్టిసారించడం లేదు. ఫలితంగా రాష్ట్ర వ్యాప్తంగా అనేక మంది ఉపాధి కూలీలు వడదెబ్బ బారినపడుతున్నారు. ఎండ తీవ్రతకు అస్వస్థతకు గురైతే ప్రాథమిక వైద్యం కూడా అందని పరిస్థితి.

వేసవి కావడంతో ఉపాధిహామీలు పనులు ఊపందుకున్నాయి. మరోపక్క కేంద్రం ఇటీవల తీసుకొచ్చిన నూతన నిబంధనల ప్రకారం ఉదయం, సాయంత్రం రెండు సార్లు కూలీల ఫొటోలు తీసుకొని యాప్‌లో అప్‌లోడ్ చేయాల్సి వస్తోంది. అలా అయితేనే కూలీలకు రోజువారీ పూర్తి వేతనం అందుతుంది. దీంతో కూలీలు ఉదయం నుంచి సాయంత్రం వరకు పని ప్రదేశంలోనే ఉండాల్సి వస్తోంది. ఈ క్రమంలో తప్పనిసరిగా ఆయా ప్రదేశాల్లో తాగునీరు, నీడ కోసం టెంట్, ప్రాథమిక చికిత్స పెట్టె తదితర సౌకర్యాలు తప్పనిసరిగా ఉండాలనే నిబంధనలు ఉన్నాయి. ఈ సౌకర్యాలను కల్పించేందుకు ప్రత్యేకంగా మెట్‌లకు బాధ్యతలు అప్పగించేవారు. రెండేండ్ల కిందట కొంత వరకు ఈ సౌకర్యాలు బాగానే అమ లైనా.. క్రమక్రమంగా ఈ చట్టానికి కేంద్రం నిధుల్లో కోతలు విధిం చుకుంటూ పోతుం డటంతో.. సౌక ర్యాలు కుచించుకు పోతు న్నాయి. పర్యవేక్షిం చాల్సిన గ్రామీణా భివృద్ధి శాఖ అధికారులు పట్టిం చుకోక పోవడం.. ఉన్నతాధికారులు సైతం దృష్టి సారించకపోవడం మూలంగా కూలీలు అవస్థలు పడుతున్నారు.

> **ఎలాంటి సౌకర్యాలు కల్పించడం లేదు**
>
> ఉపాధిహామీ పని ప్రదేశంలో ఎలాంటి సౌకర్యాలూ కల్పించడం లేదు. ఉదయం పనులకు వెళ్తే సుమారు నాలుగు గంటలు ఎండలోనే పనిచేయాల్సి వస్తోంది. తాగునీరు, టెంట్, ప్రాథమిక చికిత్స పెట్టె కూడా ఉండటం లేదు. ఇంటి నుంచే తాగునీటిని తీసుకెళు తున్నాం. ఇప్పటికైనా అధికారులు స్పందించి పని ప్రదేశాల్లో సౌకర్యాలు కల్పించాలి.
>
> – కేంద్రె గజానంద్, తాడిహత్నూర్

ఉమ్మడి జిల్లాలో జాబ్‌కార్డులు.. ఉపాధికూలీల

జిల్లా	జాబ్‌కార్డులు	కూలీలు	పనిచేస్తున్న కూలీలు
ఆదిలాబాద్	1.69లక్షలు	3.04లక్షలు	1.50లక్షలు
మంచిర్యాల	1.21లక్షలు	2.38లక్షలు	1.10లక్షలు
కుమురంభీం	1.20లక్షలు	2.44లక్షలు	1.30లక్షలు
నిర్మల్	1.73లక్షలు	3.34లక్షలు	1.45లక్షలు

పిట్టల్లా రాలుతున్న కూలీలు

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ఎండలు ఉగ్ర రూపం దాల్చుతు న్నాయి. రాష్ట్రంలోనే జిల్లాలో అత్య ధిక ఉష్ణోగ్రతలు నమోదవు తున్నాయి. ఈ క్రమంలో ఉపాధిహామీ పని ప్రదేశాల్లో కనీస సౌకర్యాలు కరువ య్యాయి. మంచిర్యాల, కుమురం భీం, ఆదిలాబాద్ జిల్లాలో 45 డిగ్రీల పైనే ఉష్ణోగ్రతలు నమోదు కావడంతో జనం ఇండ్ల నుంచి బయటకు రాలేని పరిస్థితి ఉంది. ఈ తరుణంలో రోజువారీ కూలీ పనులు చేసుకొని జీవించే పేదలకు ఉపాధిహామీ పనులే కుటుంబానికి ఆసరాగా నిలుస్తున్నాయి.

ఎండ తీవ్రత ఉన్నప్పటికీ పనికి వెళ్లాల్సిన పరిస్థితి ఉంటుంది. ఈ క్రమంలో ఇప్పటి వరకు సుమారు ఐదు నుంచి పది మంది వరకు వడదెబ్బ కారణంగా మృతిచెందారు. రెండు రోజుల కిందట ఉట్నూర్‌కు చెందిన సురేష్ ఉపాధిహామీ పనులకు వెళ్లి ఇంటికి తిరిగిరాగానే అస్వస్థతకు గురై మృతిచెందాడు.

ఇప్పటికే ఆయా మండలాల్లో పలువురు మరణించిన సంఘటనలు ఉన్నాయి. ఎండలో పనిచేస్తూ అనేక మంది అస్వస్థతకు గురై ఆస్పత్రి పాలవుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదనే ఆరోపణలున్నాయి.

> **నిలిచిపోయిన అదనపు భత్యం..!**
>
> ఉపాధిహామీ పనుల కోసం అవసరమైన పరికరాలను ప్రభుత్వం ఇది వరకు సరఫరా చేసింది. గడ్డపారలు, పారలు, ఇనుప తట్టలు, గొడ్డళ్లు, కొడవళ్లను సైతం అందించింది. క్రమంగా వాటి సరఫరా నిలిపివేయడంతో కూలీలే సొంతంగా ఆయా పరికరాలను సమకూర్చుకుంటున్నారు. తాగునీటి కోసం గతంలో కూలీలకు రూ.5 చెల్లించేవారు. ఏప్రిల్, మే నెలల్లో ఎండల్లో పనిచేసే కూలీలకు 20శాతం అదనపు భత్యం కూడా చెల్లించేవారు. కానీ కేంద్రం ఇటీవల నూతన సవరణలు తీసుకొచ్చి ఈ రెండు ప్రయోజనాలను నిలిపివేసింది. దీంతో కనీస సౌకర్యాలు లేకపోవడం.. ప్రయోజనాలు దూరం కావడంతో కూలీలు సైతం పనులకు వెళ్లేందుకు అయిష్టత వ్యక్తం చేస్తున్నట్టు తెలుస్తోంది. ఇదే ఉపాధి కూలీల సంఖ్య తగ్గుముఖం పట్టేందుకు కారణమవుతోంది.

నగర శివారులో ఘోర రోడ్డు ప్రమాదం

- ఆర్టీసీ బస్సును ఓవర్‌టెక్ చేయబోయి లారీని ఢీకొట్టిన కారు
- నలుగురు విద్యార్థులు మృతి



నవతెలంగాణ-గండిపేట్

హైదరాబాద్ నగర శివారులో ఘోర రోడ్డు ప్రమాదం శుక్రవారం చోటుచేసుకుంది. రంగారెడ్డి నార్సింగి శివారులో ఆర్టీసీ బస్సును ఓవర్‌టెక్ చేయబోయి ఆగి ఉన్న లారీని కారు ఢీకొట్టింది. ఈ ఘటనలో నలుగురు విద్యార్థులు మృతిచెందారు. మరొకరి పరిస్థితి విషమంగా ఉంది. పలువురు తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘట నపై నార్సింగి డీసీపీ మీడియాకు వివరించారు. నిజాంపేట ప్రాంతా నికి చెందిన 12 మంది విద్యార్థులు శంకర్‌పల్లి నుంచి గండిపేట వైపు ఉసెన్ పార్క్ వెళ్తున్నారు. నార్సింగి వద్దకు రాగానే ఆర్టీసీ బస్సును ఓవర్‌టెక్ చేస్తూ ముందు ఆగి ఉన్న లారీని కారు ఢీకొట్టింది. ఈ ఘటనలో అంకిత (17), నితిన్ (20), అమృత్ (18) ఆర్షిత (18) మృతి చెందారు. కారు డ్రైవర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. కారు ముందు సీట్లో కూర్చున్న ప్రసాద్ స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. క్షతగాత్రులను నగరంలోని ఓ ఆస్పత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న రాజేంద్రనగర్ డీసీపీ జగదీశ్వర్‌రెడ్డి, నార్సింగి పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియాకు తరలించారు.. కాగా, ఈ ప్రమాదానికి అతివేగం, అజాగ్రత్తతో కారును నడపడటమేనని పోలీసులు ప్రాథమిక అంచనాకు వచ్చినట్టు తెలిపారు. మృతులంతా నిజాంపేట ప్రాంతానికి చెందిన వారని గుర్తించినట్టు చెప్పారు. పూర్తి సమాచారం సేకరించి, కేసు దర్యాప్తు చేస్తున్నట్టు డీసీపీ తెలిపారు.

పుష్ప సినిమాను తలదన్నేలా.. ఇసుక లారీలో టేకు కలప రవాణా

- రూ.15 లక్షల కలప పట్టివేత, పరారీలో డ్రైవర్



నవతెలంగాణ - వెంకటాపురం

పుష్ప సినిమాను తల దన్నేలా అక్రమ కలప వ్యాపారానికి పాల్పడ్డాడు ఓ అక్రమార్కుడు. ఏజెన్సీలో ఇసుక క్వారీలో ఇసుక తరలిస్తున్న లారీలపై నిఘా లేకపోవడం, జిల్లా అధికారులు లారీలను ఎక్కడా తనిఖీ చేయకపోవడం గుర్తించిన ఓ లారీ యజమాని అక్రమ కలప వ్యాపారానికి తెరలేపినట్టు తెలుస్తోంది. చత్తీస్‌గడ్ నుంచి ఇసుక తరలింపు పేరుతో తెలంగాణకు భారీస్థాయిలో అక్రమ టేకు కలప రవాణా జరుగుతున్నట్టు ములుగు జిల్లా వెంకటాపురం అటవీశాఖ అధికారులకు సమాచారం అందింది. ఈ మేరకు అటవీశాఖ అధికారి చంద్రమోళి ఆధ్వర్యంలో అటవీశాఖ సిబ్బంది వాజేడు మండలం లోటపేట గండి సమీపంలోని తెలంగాణ సరిహద్దుల్లో కాపు కాసారు. ఛత్తీస్‌గడ్ నుంచి తెలంగాణకు ఇసుక లోడుతో వస్తున్న లారీని తనిఖీ చేసేందుకు అటవీశాఖ అధికారులు ప్రయత్నం చేశారు. గమనించిన లారీ డ్రైవర్, క్లీనర్ పరారయినట్టు అటవీశాఖ అధికారులు తెలిపారు. అనుమానం వచ్చిన అధికారులు ఇసుకను తొలగించగా భారీస్థాయిలో టేకు కలప ఉన్నట్టు గుర్తించారు. సెక్షన్ అధికారి నారాయణ సహాయంతో లారీని వెంకటాపురం అటవీశాఖ కార్యాలయానికి తరలించారు. 12 టైర్ల లారీలో టేకు కలప దుంగలు, చెక్కలు పేర్చి అనుమానం రాకుండా వాటిపై ఇసుకను పోశారు. పట్టుబడ్డ కలప విలువ సుమారు రూ.15 లక్షలకు పైగా ఉంటుందని అటవీశాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. లారీని వొదిలి డ్రైవర్ పరారీ కావడంతో లారీ ఎవరిది.. ఎక్కడ నుండి వచ్చింది, ఎన్నేండ్లుగా అక్రమ కలప రవాణా జరుగుతుందని అటవీశాఖ అధికారులు ఆరా తీస్తున్నారు. లారీపై ములుగు జిల్లా లారీ అసోసియేషన్ అని స్టిక్కర్ ఉండటంతో ములుగు జిల్లాలోని ఒక మండలంకు చెందిన లారీగా అధికారులు నిర్ధారించుకొని విచారణ చేపట్టారు. ఈ దాడుల్లో వికాస్, ప్రసాదరావు, జగన్, హరిప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

భగ్గుమంటున్న రామగుండం

సింగరేణి ఓపెన్ కాస్టుల వద్ద అధిక ఉష్ణోగ్రతలు

- తగ్గుతున్న కార్మికుల హాజరు శాతం





నవతెలంగాణ- గోదావరిఖని

వేసవి ఎండలతో రామగుండం పారిశ్రామిక ప్రాంతం భగ్గుమంటోంది. ఎన్టీపీసీ, సింగరేణి భారీ పరిశ్రమలు, బొగ్గుగనుల క్షేత్రాలు ఉన్న కారణంగా రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా రామగుండంలో అత్యధికంగా ఉష్ణోగ్రత నమోదవుతుంది. ఈసారి మే 15నాటికే 45డిగ్రీల ఉష్ణోగ్రతలు దాటాయి. ఇప్పుడు 47డిగ్రీల వరకు భానుడు ప్రతాపం చూపుతున్నాడు. సింగరేణి వ్యాప్తంగా బొగ్గుగనులు, ఎన్టీపీసీల్లో పని చేసే కార్మికులు పనులకు వెళ్లేందుకు జంకుతున్నారు. వారికి సౌకర్యాలు కల్పించడంలో యజమాన్యాలూ నిర్లక్ష్యంగా ఉంటున్నాయి. రామగుండం నగర వీధులు, కార్మిక ప్రదేశాలు మధ్యాహ్నం 12గంటలకల్లా నిర్మానుష్యంగా మారుతున్నాయి.

వేసవి ప్రారంభం మే 1 నుంచి కొన్ని రోజుల వరకు అకాల వర్షాలు, ఈదురు గాలులతో ఈ ప్రాంతంలో కొంత ఎండ నుంచి ఉపశమనం లభించినా.. 10 రోజులుగా ఎండలు తీవ్రమవడంతో జనం బయటకు వెళ్లేందుకు జంకుతున్నారు. నిత్యం బిజీగా ఉండే లక్ష్మినగర్, ప్రధాన చౌరస్తా, ఫైవ్ ఇంక్లయిన్, తిలక్ నగర్ చౌరస్తా, బస్టాండ్ ఏరియా, ఎన్టీపీసీలోని మేడిపల్లి చౌరస్తా, ఎఫ్‌సిఐ కార్నర్, రామగుండంలోని మజీద్ చౌరస్తా, రైల్వే స్టేషన్ ఏరియాలో జన సంచారం లేక పూర్తి నిర్మానుష్యంగా కనిపిస్తున్నాయి. ఇక రోడ్లు నిప్పులు కక్కుతున్నాయి.

ఓపెన్‌కాస్టుల్లో అడుగుపెట్టలేని పరిస్థితి

సింగరేణి ఓపెన్ కాస్టుల వద్ద ఉష్ణోగ్రతలు అధికంగా ఉన్నాయి. ఇక్కడ 50డిగ్రీలపైనే ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఆ గనుల్లో పని చేసే కార్మికులు తమ పగటి సమయాలను మార్చాలని కోరుతున్నారు. రామగుండం రీజియన్‌లోని ఆయా ఏరియాల జీఎంల ఆదేశాలతో సింగరేణి ఏరియా ఆస్పత్రి వైద్య బృందం వేసవిలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై కార్మికులకు అవగాహన కల్పించారు. అక్కడక్కడా రక్షణ చర్యలూ తీసుకుంటోంది. అయినప్పటికీ కార్మికులు వేడిని తట్టుకోలేని పరిస్థితులు ఉన్నాయి.

ఈ క్రమంలో కార్మికుల హాజరు శాతం తగ్గుతోంది. ప్రభుత్వము, యాజమాన్యాలు కనీసం చలివేంద్రాలు కూడా ఏర్పాటు చేయకపోవడం శోచనీయం. కార్పొరేషన్ ఆధ్వర్యంలో గతంలో పలుచోట్ల చలివేంద్రాలు గతంలో ఏర్పాటు చేసేవారు. ఇప్పుడు ఒక్క చలివేంద్రమూ ఏర్పాటు చేయలేదు. కార్మికుల హాజరు శాతంపై ప్రభావం చూపుతుందన్న కారణంగా ఓపెన్‌కాస్టులు ఏరియాలో 50డిగ్రీలపైనే ఎండలు నమోదువు తున్నా.. తగ్గించి చెబుతున్నారనే వాదనా ఉంది.

దశాబ్ది ఉత్సవాలను ఘనంగా నిర్వహిద్దాం

- ఉన్నతాధికారులతో మంత్రి కొప్పుల సమీక్ష
- ఆవిర్భావం తర్వాత చేపట్టిన ప్రగతిపై చర్చ



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

రాష్ట్ర దశాబ్ది ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని ఎస్సీ అభివృద్ధి, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ ఉన్నతాధికారులకు సూచించారు. శుక్రవారం హైదరాబాద్‌లోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో ఎస్సీ, మైనార్టీ, వికాలాంగు శాఖ కార్పొరేషన్ ఉన్నతాధికారులు, చైర్మెన్లతో సమీక్ష నిర్వహించారు. రాష్ట్ర ఆవిర్భావం తర్వాత చేపట్టిన ప్రగతిపై చర్చించారు. అభివృద్ధి సంక్షేమ పథకాలను దశాబ్ది ఉత్సవాల సందర్భంగా ప్రజలకు వివరించాలని సూచించారు. రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ, మండల స్థాయిల్లో లబ్దిదారులను భాగస్వాములను చేస్తూ కార్యక్రమాలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఎస్సీ కార్పొరేషన్, మైనార్టీ, వికలాంగుల శాఖల ద్వారా చేపట్టిన అభివృద్ధి ప్రజల్లోకి తీసుకెళ్లే విధంగా కార్యాచరణ రూపొందించాలన్నారు.

రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలు దేశానికే రోల్ మోడల్‌గా నిలిచిన విషయాన్ని విస్తృతంగా ప్రచారం చేయాలన్నారు. దళిత బంధు, గురుకుల విద్యా విధానం, ఓవర్సీస్ స్కాలర్ షిప్ పథకాలపై డాక్యుమెంటరీ, ఫొటో ఎగ్జిబిషన్స్ నిర్వహించాలని అధికారులకు సూచించారు. ఫ్లెక్సీల ద్వారా ప్రచార కార్యక్రమాలు చేపడుతూ.. లబ్దిదారులతో ప్రదర్శనలు, కళాకారులతో నృత్యప్రదర్శనలు నిర్వహించాలన్నారు.

శునకాల దాడిలో బాలుడు మృతి

- కుటుంబ సభ్యులను పరామర్శించిన చీఫ్ విప్, మేయర్
- పెరుగుతున్న కుక్కల దాడులు
- మున్సిపల్ అధికారుల నిర్లక్ష్యం అంటున్న ప్రజలు
- స్థానిక ప్రజాప్రతినిధులపై ప్రజల ఆగ్రహం



నవతెలంగాణ-కాజీపేట

మూత్ర విసర్జనకు వెళ్ళిన బాలుడిపై శునకాలు దాడి చేసి చంపిన సంఘటన కాజీపేటలో శుక్రవారం ఉదయం చోటు చేసుకుంది. పొట్ట కూటి కోసం రెండు రోజుల కిందట రైలులో ఉత్తర ప్రదేశ్‌లోని వారణాసి నుంచి కాజీపేటకు వచ్చిన మల్కాన్, సునిత దంపతులతో పాటు వారి ఇద్దరు కొడుకులు, ఒక కూతురుతో కాజీపేట రైల్వే చిల్డ్రన్స్ పార్క్ సమీపంలో చెట్టు కింద నివాసం ఉంటున్నారు. శుక్రవారం ఉదయం వారి చిన్న కొడుకు చోటు(8) పై వీధికుక్కలు దాడి చేయగా తీవ్ర గాయాలపాలై అక్కడికక్కడే మృతి చెందాడు. గుంపుగా ఉన్న కుక్కలు బాలుడిపై దాడి చేసి మెడ, గొంతుపై తీవ్రంగా గాయపరిచాయి. ప్రాణ భయంతో బాలుడు కేకలు వేయగా అరుపులు విన్న కుటుంబ సభ్యులు అక్కడికి చేరుకునే సరికే తీవ్ర గాయాలతో బాలుడు పడిఉన్నాడు. సమాచారం అందుకున్న కాజీపేట పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని బాలుడి మృతదేహాన్ని ఎంజీఎంకు తరలించారు.

వారణాసికి చెందిన మూడు సంచార జాతి కుటుంబాలు రోడ్లపై బొమ్మలు, చిన్న చిన్న వస్తువులు అమ్ముకొని జీవించడానికి కాజీపేటకు వచ్చినట్టు తెలుస్తోంది. కాగా, ఇటీవల కాలంలో ప్రజలపై కుక్కల దాడులు పెరుగుతున్నాయి. కుక్కల బెడదతో రాత్రి వేళ కాజీపేట రైల్వే క్వార్టర్స్ నుంచి ప్రయాణించాలంటే వాహనదారులు, ప్రజలు ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని వెళ్తున్నారు. సమస్య అధికంగా ఉందని తెలిసినప్పటికీ స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు పట్టించుకోక పోవడంతో ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేశారు.

> **బాధిత కుటుంబానికి నేతల పరామర్శ**
>
> కుక్కల దాడిలో మరణించిన బాలుడి మృతదేహాన్ని ఎంజీఎంలో ప్రభుత్వ చీఫ్ విప్ దాస్యం వినయ్ భాస్కర్, మేయర్ గుండు సుధారాణి, కుడా చైర్మెన్ సుందర్‌రాజ్‌యాదవ్ తదితరులు పరిశీలించారు. బాధిత కుటుంబాన్ని ఆదుకుంటామని హామీ ఇచ్చారు. ఇందులో భాగంగా మున్సిపల్ కార్పొరేషన్ నుంచి బాలుడి కుటుంబానికి మేయర్ గుండు సుధారాణి రూ.ఒక లక్ష పరిహారం అందించారు. ఈ సందర్భంగా చీఫ్ విప్ వినయ్ భాస్కర్, మేయర్ గుండు సుధారాణి మాట్లాడుతూ.. నగరంలోని డివిజన్లలో ఒక్కోవాడలో 200 వరకు కుక్కలు ఉన్నాయన్నారు. కుక్కలను చంపడం నేరమని, అందుకే వాటి బర్త్ కంట్రోల్ చేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. కుటుంబాన్ని అన్ని విధాలా ఆదుకుంటామని తెలిపారు.

ధాన్యం కొనాలంటూ రోడ్డెక్కిన రైతన్న

కొనుగోలు చేసినా.. మిల్లులకు తరలించట్లేదు..

- మెదక్‌లో ధాన్యం తగలబెట్టి నిరసన



నవతెలంగాణ-ఎల్లారెడ్డి/ నర్సాపూర్/ తూప్రాన్ రూరల్/ కాటారం

ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తరలించినా కాంటా వేయడం లేదని, లారీలు లేవంటూ మిల్లులకు తరలించడం లేదని, కొన్ని చోట్ల అస్సలు కొనుగోలు కేంద్రాలే ప్రారంభించలేదని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తూ రోడ్డెక్కారు. కామారెడ్డి జిల్లా ఎల్లారెడ్డి పట్టణంలోని కొనుగోలు కేంద్రంలో ధాన్యం కాంటా వేసి వారం పది రోజులు గడుస్తున్నా.. తరలించడం లేదని రైతులు వాపోయారు. లారీలను పంపి ధాన్యం తరలించాలని డిమాండ్ చేస్తూ మెయిన్‌రోడ్డుపై రాస్తారోకో చేపట్టారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ.. కొనుగోలు కేంద్రం వద్ద సుమారు వారం రోజుల నుంచి వడ్లు అలాగే ఉన్నాయని తెలిపారు. లారీలు రావడం లేదంటూ కాంటా పెట్టడం లేదని వాపోయారు. అధికారులు చొరువ చూపి వడ్ల కొనుగోలు కేంద్రానికి లారీలు పంపేలా చూడాలని డిమాండ్ చేశారు. సుమారు గంట పాటు రైతులు రాస్తారోకో చేపట్టడంతో ఇరువైపులా వాహనాలు నిలిచిపోయాయి. సమాచారం అందుకున్న పోలీసులు.. అక్కడికి చేరుకొని రైతులను సముదాయించి ఆందోళన విరమింపజేశారు.

మెదక్ జిల్లా నర్సాపూర్ పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో ధాన్యాన్ని కొనుగోలు చేయాలంటూ రైతులు రాస్తారోకో, ధర్నా చేపట్టారు. ధాన్యాన్ని తగుల బెట్టి.. చావు డప్పు కొడుతూ ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ ఆందోళన చేపట్టారు. సుమారు రెండు గంటల పాటు రాస్తారోకో కొనసాగింది. తహసీల్దార్ ఆంజనేయులు ఘటన స్థలానికి చేరుకుని.. కలెక్టర్‌తో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తామని స్పష్టమైన హామీ ఇచ్చారు. దాంతో రైతులు ఆందోళన విరమించారు.

మెదక్ జిల్లా తూప్రాన్ పట్టణంలో ధాన్యం కొనుగోలు చేసినప్పటికీ నెల రోజులుగా కొనుగోలు కేంద్రాల్లోనే ఉంటున్నదని.. దాంతో ధాన్యం మొత్తం మొలకెత్తే పరిస్థితి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. ధాన్యాన్ని తరలించకుండా నిర్లక్ష్యం వహించిన తహసీల్దార్‌పై తగిన చర్యలు తీసుకోవాలని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఘటనా స్థలానికి చేరుకున్న ఎస్‌ఐ.. లారీలను పంపిస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

జయశంకర్-భూపాలపల్లి జిల్లా కాటారం మండలం విలాసాగర్ గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని వెంటనే ప్రారంభించాలని రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... వరి కోతలు ప్రారంభమై 20 రోజులు కావస్తున్నా ఇప్పటివరకు ధాన్యం కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయలేదని వాపోయారు. కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తామని అధికారులు చెప్పడంతో కేంద్రానికి ధాన్యం తీసుకువచ్చి పడిగాపులు కాస్తున్నామన్నారు. అకాల వర్షాలతో ధాన్యం తడిచి నష్టపోయే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. వెంటనే కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేయకుంటే జిల్లా కలెక్టర్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు.

సులభతర వాణిజ్యమే లక్ష్యంగా నూతన విదేశీ వాణిజ్య విధానం

- ఎఫ్‌టీసీసీఐ ఆధ్వర్యంలో అవగాహన సదస్సులో: జాయింట్ డైరెక్ట్ జనరల్ ఆఫ్ ఫారెన్ ట్రేడ్ సంభాజీ చవాన్



నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

సులభతర వాణిజ్యాన్ని ప్రోత్సహించే లక్ష్యంతో భారతదేశ నూతన విదేశీ వాణిజ్య విధానం-2023 పాలసీని రూపొందించినట్టు జాయింట్ డైరెక్టర్ జనరల్ ఆఫ్ ఫారిన్ ట్రేడ్ సంభాజీ చవాన్ తెలిపారు. ఈ విధానం రూపాంతరం చెందిందని, భవిష్యత్తుకు సంబంధించిందని అన్నారు.విశ్వాసం, ఎగుమతిదారులతో భాగస్వామ్యం సూత్రాలపై నిర్మించబడిందని అన్నారు. ఫెడరేషన్ ఆఫ్ తెలంగాణ ఛాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ (ఎఫ్‌టీసీసీఐ) డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ ఫారిన్ ట్రేడ్(డీజీఎఫ్‌టీ) సహకారంతో హైదరాబాద్ ప్రధాన కార్యాలయంలో 'భారతదేశ కొత్త విదేశీ వాణిజ్య విధానం-2023' అంశంపై గురువారం రాత్రి అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమం డిజిటలైజేషన్, ఎగుమతి ప్రమోషన్ క్యాపిటల్ గూడ్స్(ఈపీసీజీ), అమ్నెస్టీ స్కీమ్, ఇండియా ట్రేడ్ హబ్, రూపాయిని గ్లోబల్ కరెన్సీగా హైలైట్ చేసింది.

ఫారిన్ ట్రేడ్ డిప్యూటీ డైరెక్టర్ జనరల్ డాక్టర్ బి. పున్నంకుమార్ మాట్లాడుతూ పాలసీకి సంబంధించిన వివిధ అంశాలను పరిచయం చేశారు. కొత్త విదేశీ వాణిజ్య విధానం నుంచి ఎగుమతిదారులు పొందగలిగే ఆమ్నెస్టీ స్కీమ్ డిజిటలైజేషన్, వివిధ పథకాల సౌలభ్యాన్ని ఆయన వివరించారు. విదేశీ వాణిజ్య విధానంలో ప్రకటించిన క్షమాభిక్ష పథకం ప్రకారం, అడ్వాన్స్, మూలధన వస్తువులకు ఎగుమతి ప్రమోషన్ అధికార పథకం కింద ఎగుమతి బాధ్యతను చేరుకోవడంలో విఫలమైన వ్యాపారులు కస్టమ్స్ సుంకం, వడ్డీని చెల్లించడం ద్వారా క్లీన్‌గా రావచ్చని తెలిపారు. నూతన విదేశీ వాణిజ్య విధానం-2023ని విడుదల చేస్తున్నప్పుడు, అడ్వాన్స్ ఆథరైజేషన్ స్కీమ్(ఏఏఎస్), ఎగుమతి ప్రమోషన్ క్యాపిటల్ గూడ్స్(ఈపీసీజీ), ఎగుమతి ఆబ్లిగేషన్(ఈఓ) డిఫాల్ట్ కేసులను క్రమబద్ధీకరించడానికి ఒక అమ్నెస్టీ స్కీమ్ యోచిస్తున్నట్టు ప్రకటించారని గుర్తుచేశారు. అమెజాన్ ఇండియా ప్రతినిధి కార్తీక్ ప్రసన్న మాట్లాడుతూ భారతదేశం తన వస్తువులు, సేవలను ఎగుమతి చేయడానికి ఈ-కామర్స్, డిజిటలైజేషన్ ప్రధాన అవసరాన్ని గురించి వివరించారు. ప్రపంచంలో ఈ-కామర్స్ వ్యాపారంలో చైనాతో పోల్చితే భారత్ 5-8శాతమే చేస్తోందని ఆయన పేర్కొన్నారు. చైనా కంటే దేశం చాలా వెనుకబడి ఉందని, ఈ-కామర్స్‌ను పెంచుకోవాల్సిన అవసరం ఉందని తెలిపారు. ఎఫ్‌టీసీసీఐ అధ్యక్షులు అనిల్ అగర్వాల్ స్వాగతోపన్యాసం చేస్తూ తెలంగాణ రాష్ట్రానికి చెందిన చాలా మంది యువ ఔత్సాహికులు తమ వస్తువులు, సేవలను ఎగుమతి చేసుకునేందుకు కొత్త విదేశీ వాణిజ్య విధానం అవకాశం కల్పించిందని అన్నారు. తెలంగాణ ఐటి ఎగుమతులు 2022లో మైలురాయిని సాధించాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎఫ్‌టీసీసీఐ సీఈఓ కీర్తి అమోల్‌నరవణే, ఇంటర్నేషనల్ ట్రేడ్ అండ్ బిజినెస్ రిలేషన్స్ కమిటీ కో-చైర్ రూపేష్ అగర్వాల్, పలువురు వాణిజ్యవేత్తలు తదితరులు పాల్గొన్నారు.

కేసీఆర్‌కు బీసీలు గుర్తుకొచ్చేది ఎన్నికలప్పుడే.. : వైఎస్ షర్మిల



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

ఎన్నికలు సమీపిస్తుండటంతో కేసీఆర్‌కు బీసీలు గుర్తొచ్చారని వైఎస్‌ఆర్‌టీపీ అధ్యక్షులు వైఎస్ షర్మిల శుక్రవారం ఒక ప్రకటనలో విమర్శించారు. ఓట్ల కోసం లక్ష రూపాయల సాయమంటూ 'నయ'వంచనకు తెరలేపారని పేర్కొన్నారు. దళితబంధు పేరుతో ఇప్పటికే దళితులను దగా చేశారని గుర్తుచేశారు. గిరిజనబంధు అంటూ గిరిజనులను ఊరిస్తున్నారనీ, ఇప్పుడు బీసీలను మోసం చేసేందుకు సిద్ధమయ్యారని విమర్శించారు. తొమ్మిదేండ్లుగా బీసీలకు కేటాయించిన నిధులెందుకు పక్కదారి పట్టించారో చెప్పాలని ప్రశ్నించారు. స్వయం ఉపాధి రుణాల కోసం 6 లక్షల మంది బీసీ యువత ఎదురుచూస్తున్నా.. ఒక్కరికి కూడా లోన్లు ఇవ్వలేదని తెలిపారు. ఎంబీసీ కార్పొరేషన్‌కు రూ.3 వేల కోట్లు కేటాయిస్తే రూ.3 కోట్లు కూడా ఖర్చు చేయలేదని విమర్శించారు. బీసీ సబ్‌ప్లాన్ ఏమైందని ప్రశ్నించారు.

నవతెలంగాణ

బిజినెస్

మెటాలో మళ్లీ 6,000 మందిపై వేటు



న్యూయార్క్‌ : ఫేస్‌బుక్‌, వాట్సాప్‌, ఇన్‌స్టాగ్రామ్‌ మాతృ సంస్థ మెటా మరోసారి వేలాది మంది ఉద్యోగుల తొలగింపునకు పాల్పడింది. వచ్చే వారం నుంచి 6000 మంది ఉద్యోగులను ఇంటికి పంపించనున్నట్లు స్పష్టం చేసింది. ఈ ఏడాది మేలో తదుపరి దశ ఉద్వాసనలు ఉంటాయని మెటా సిఇఒ మార్క్‌ జుకర్‌బర్గ్‌ ఇటీవల ప్రకటించిన నేపథ్యంలో.. ఆ దిశగా నిర్ణయం తీసుకుందని రిపోర్టులు వస్తున్నాయి. పొదుపు చర్యల్లో భాగంగా గతేడాది నవంబర్‌లో 11,000 మంది ఉద్యోగులను మెటా తొలగించింది. మరో 10,000 మంది ఉద్యోగులపై వేటు వేస్తున్నట్లు ఈ ఏడాది మార్చి లోనే ప్రకటించింది. మూడో దఫా తొలగింపు ప్రక్రియ వచ్చే వారం నుంచే ప్రారంభమవుతాయని తెలిపింది.

పిఎన్‌బి ఫలితాలు అదుర్స్‌

- ఐదు రెట్లయిన లాభాలు



ముంబయి : ప్రభుత్వ రంగంలోని పంజాబ్‌ నేషనల్‌ బ్యాంక్‌ (పిఎన్‌బి) ఆకర్షణీయ ఆర్థిక ఫలితాలు ప్రకటించింది. 2023 మార్చితో ముగిసిన త్రైమాసికంలో ఏకంగా 474 శాతం వృద్ధితో రూ.1,158.61 కోట్ల నికర లాభాలు సాధించింది. ఇంతక్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో రూ.201.57 కోట్ల లాభాలు నమోదు చేసింది. ఇదే సమయంలో రూ.21,095 కోట్లుగా ఉన్న మొత్తం ఆదాయం.. క్రితం త్రైమాసికంలో రూ.27,269 కోట్లకు చేరింది. 2022 మార్చి నాటికి 11.78 శాతంగా ఉన్న బ్యాంక్‌ స్థూల నిరర్థక ఆస్తులు.. ప్రస్తుత ఏడాది మార్చి ముగింపు నాటికి 8.74 శాతానికి తగ్గాయి. నికర నిరర్థక ఆస్తులు 4.8 శాతం నుంచి 2.72 శాతానికి పరిమితమయ్యాయి.

తగ్గిన బంధన్‌ బ్యాంక్‌ లాభాలు

న్యూఢిల్లీ : గడిచిన ఆర్థిక సంవత్సరం 2022-23 మార్చితో ముగిసిన నాలుగో త్రైమాసికం (క్యూ4)లో బంధన బ్యాంక్‌ నికర లాభాలు 57.51 శాతం తగ్గి రూ.808 కోట్లుగా నమోదయ్యింది. ఇంతక్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో రూ.1,902 కోట్ల నికర లాభాలు సాధించింది. క్రితం క్యూ4లో బ్యాంక్‌ నికర వడ్డీపై ఆదాయం 18.8 శాతం పెరిగి రూ.2,472 కోట్లుగా చోటు చేసుకుంది. క్యూ3లో రూ.2,080 కోట్ల ఎన్‌పిఎ నమోదయ్యింది. 2022-23గాను ప్రతీ రూ.10 ఈక్విటీ షేర్‌పై రూ.1.50 డివిడెండ్‌ను ప్రకటించింది.

వబాగ్‌కు రూ.926.86 కోట్ల అమ్మకాలు

న్యూఢిల్లీ : దేశీయ టెక్నలాజీ కంపెనీ విఎ టెక్‌ వబాగ్‌ 2023 మార్చితో ముగిసిన త్రైమాసికంలో 3.92 శాతం వృద్ధితో రూ.926.86 కోట్ల నికర అమ్మకాలు సాధించింది. 2022 ఇదే త్రైమాసికంలో రూ.891.86 కోట్ల విక్రయాలు చేసింది. కాగా.. ఇదే సమయంలో రూ.46.07 కోట్లుగా ఉన్న లాభాలు.. గడిచిన త్రైమాసికంలో రూ.110.10 కోట్ల నష్టాలు చవి చూసింది. శుక్రవారం ఎన్‌ఎస్‌ఇలో విఎ టెక్‌ వబాగ్‌ షేర్‌ 1.21 శాతం తగ్గి రూ.421.40 వద్ద ముగిసింది. గడిచిన ఆరు మాసాల్లో ఈ సూచీ 39 శాతం పెరిగింది.

మరింత మెరుగైన భవితవ్యం !

చైనా-సెంట్రల్‌ ఆసియా దేశాల సదస్సు ప్రారంభం

- సమాన అవకాశాలు, సహకారమే కీలకం
- నేతలను స్వాగతించిన జిన్‌పింగ్‌ దంపతులు

జియాన్‌ : చైనా, సెంట్రల్‌ ఆసియా దేశాల శిఖరాగ్ర సమావేశం గురువారం ప్రారంభమైంది. ఈ తరహాలో మైలురాయి అనదగ్గ ఈ ఉన్నత స్థాయి సదస్సు ప్రారంభమైన తీరు, చైనా దౌత్య ఎజెండాలో సెంట్రల్‌ ఆసియాకు పెరుగుతున్న ప్రాముఖ్యతను తెలియచేస్తోందని నిపుణులు వ్యాఖ్యానిస్తున్నారు. సంక్లిష్టమైన అంతర్జాతీయ, ప్రాంతీయ పరిస్థితుల నేపథ్యంలో చైనా ఇంధనం, వ్యూహాత్మక భద్రతకు పెరుగుతున్న ప్రాముఖ్యతను తెలియచేస్తోందన్నారు. జియాన్‌లో టాంగ్‌ వంశానికి చెందిన ఇంపీరియల్‌ గార్డెన్‌లోని టాంగ్‌ ప్యారడైజ్‌ వద్ద సెంట్రల్‌ ఆసియా నేతలు, వారి సతీమణులను చైనా అధ్యక్షులు జిన్‌పింగ్‌ దంపతులు సాదరంగా స్వాగతించారు. అంతర్జాతీయంగా ఎన్ని మార్పులైనా జరగనీ, దానితో నిమిత్తం లేకుండా చైనా, సెంట్రల్‌ ఆసియా దేశాలు ఎల్లప్పుడూ పరస్పరం గౌరవించుకుంటారని జిన్‌పింగ్‌ పేర్కొన్నారు. ఇరుగు పొరుగు దేశాల మధ్య వుండే స్నేహ సంబధాలను కొనసాగిస్తామన్నారు. సమాన అవకాశాలు, సహకారానికి కట్టుబడతామన్నారు. ఇరుగు పొరుగు దేశాల స్థాయి నుండి వ్యూహాత్మక భాగస్వాములు అక్కడ నుండి భవితవ్యాన్ని పంచుకునే కమ్యూనిటీ స్థాయికి చైనా సంబంధాలు అభివృద్ధి చెందాయన్నారు. ఇటువంటి సంబంధా లెప్పుడూ ప్రాంతీయ శాంతి, అభివృద్ధికి సానుకూల శక్తిని చొప్పిస్తాయన్నారు. అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న చైనా ఎక్స్‌ప్రెస్‌లోకి ఎక్కాల్సిందిగా సెంట్రల్‌ ఆసియా దేశాలకు స్వాగతం పలుకుతున్నామన్నారు. చైనా-సెంట్రల్‌ ఆసియా సహకారానికి మరింత మెరుగైన భవితవ్యాన్ని కలిసి సృష్టిద్దామన్నారు. కజక్‌, తజక్‌, కిర్గిజ్‌ అధ్యక్షులు బుధవారానికే జియాన్‌ చేరుకోగా, ఉజ్బెక్‌, తుర్క్‌మెనిస్తాన్‌ అధ్యక్షులు గురువారం చేరుకున్నారు. వారందరితో విడివిడిగా గురువారమే చర్చలు జరిపారు. అనంతరం కిర్గిస్తాన్‌, తజకిస్తాన్‌, ఉజ్బెకిస్తాన్‌ నేతలతో జిన్‌పింగ్‌ సంయుక్త డిక్లరేషన్‌లపై సంతకాలు చేశారు.

సుప్రీంకోర్టుకు ఇద్దరు కొత్త జడ్జీలు

- ప్రశాంత్‌కుమార్‌, విశ్వనాథన్‌ ప్రమాణస్వీకారం

న్యూఢిల్లీ: భారత సర్వోన్నత న్యాయస్థానంలో ఇద్దరు న్యాయమూర్తులు కొత్తగా కొలువుదీరారు. జస్టిస్‌ ప్రశాంత్‌కుమార్‌ మిశ్రా, సీనియర్‌ న్యాయవాది కేవీ విశ్వనాథన్‌లతో శుక్రవారం ప్రధాన న్యాయమూర్తి జస్టిస్‌ డివై చంద్ర చూడ్‌ సుప్రీం కోర్టు న్యాయమూర్తులుగా ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ ఇద్దరు జడ్జీల నియామకంతో సుప్రీం కోర్టులో మొత్తం జడ్జీల సంఖ్య గరిష్ఠ పరిమితి 34కు (సీజేఐతో కలిపి) చేరింది. అయితే, సుప్రీం కోర్టులో ఈ పూర్తిస్థాయి జడ్జీల సంఖ్య కొద్ది కాలం మాత్రమే కొనసాగనుంది.

జస్టిస్‌ కేఎం జోసెఫ్‌, జస్టిస్‌ అజయ్‌ రస్తోగి, జస్టిస్‌ వీ రామసుబ్రమణియన్‌లు వచ్చే నెలలోనే పదవీ విరమణ చేయనున్నారు. సుప్రీం కోర్టు జడ్జీలుగా జస్టిస్‌ మిశ్రా, సీని యర్‌ న్యాయవాది విశ్వనాథన్‌ పేర్లను సిజెఐ నేతృత్వంలోని కొలీజియం ఈ నెల 16న కేంద్రానికి సిఫారసు చేసింది. రెండు రోజుల్లోనే ఈ నియామ కాలకు కేంద్ర ప్రభుత్వం అనుమతి లభించింది. వీరిద్దరి నియామకానికి రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము గురువారం ఆమోదముద్ర వేశారు.

ఎపి హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి నుంచి..

ఛత్తీస్‌గఢ్‌కు చెందిన జస్టిస్‌ ప్రశాంత్‌ కుమార్‌ మిశ్రా ఛత్తీస్‌గఢ్‌ హైకోర్టు న్యాయమూర్తిగా, ఆంధ్రప్రదేశ్‌ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా విధులు నిర్వహించారు. హైకోర్టు న్యాయమూర్తిగా 13 ఏళ్లకుపైగా అనుభవం ఉంది. హైకోర్టుల న్యాయమూర్తుల ఆల్‌ ఇండియా సీనియారిటీ జాబితాలో 21వ స్థానంలో ఉన్నారు.

బార్‌ కౌన్సిల్‌ నుంచి నేరుగా సుప్రీంకు..

తమిళనాడుకు చెందిన సీనియర్‌ న్యాయవాది విశ్వనాథన్‌ బార్‌ కౌన్సిల్‌ నుంచి నేరుగా సుప్రీం కోర్టు జడ్జిగా ఎంపికయ్యారు. సీనియార్టీ ప్రకారం 2030 ఆగస్టు 11న జస్టిస్‌ జేబీ పార్దీవాలా పదవీ విరమణ అనంతరం జస్టిస్‌ విశ్వనాథన్‌ సీజేఐగా నియమితులు కానున్నారు. 2031 మే 25వరకు ఆ పదవిలో ఉంటారు. న్యాయవాదిగా అనేక కీలక కేసులు వాదించిన జస్టిస్‌ విశ్వనాథన్‌ ఇటీవల స్వలింగ వివాహాలకు చట్టబద్ధత కేసులోనూ పిటిషనర్ల తరఫున వాదనలు వినిపించారు.

ద్వితీయ శ్రేణి పట్టణాల్లో 2500 ఐటీ ఉద్యోగాలు

కంపెనీల ఏర్పాటుకు అంగీకారం

- వాషింగ్టన్‌ డీసీలో ఐటీ కంపెనీల ప్రతినిధుల సమావేశంలో మంత్రి కేటీఆర్‌

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్‌

తెలంగాణలోని ద్వితీయ శ్రేణి పట్టణాల్లో2500 ఐటీ ఉద్యోగాలు రానున్నాయని, ఆ పట్టణాల్లో కంపెనీలను ఏర్పాటు చేయడానికి సదరు ప్రతినిధులు అంగీకరించారని మంత్రి కేటీఆర్‌ తెలిపారు. హైదరాబాద్‌ ఆవల అపార ఐటీ ఉద్యోగ ఉపాధి అవకాశాలు రానున్నాయని అన్నారు. అమెరికా పర్యటనలో ఉన్న ఆయన వాషింగ్టన్‌ డీసీలో 30కిపైగా ఐటీ కంపెనీ యాజమాన్యాలతో శుక్రవారం సమావేశయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డీ కాంజెస్ట్‌, డీ కార్బోనైజ్‌, డీ సెంట్రలైజ్‌ అనే త్రీడీ మంత్రతో తమ ప్రభుత్వం పనిచేస్తోందని అన్నారు. హైదరాబాద్‌ నగరం ఆవల ద్వితీయ శ్రేణి నగరాలలోనూ విస్తతమైన ఉపాధి అవకాశాలు కల్పించాలన్న లక్ష్యంతో పనిచేస్తున్నామని పేర్కొన్నారు. తెలంగాణలోని ద్వితీయ శ్రేణి పట్టణాల్లో ఐటీ పరిశ్రమ అభివద్ధికి తమ ప్రభుత్వం తీసుకుంటున్న చర్యల గురించి వివరించారు. రాష్ట్రంలో అనుకూలతలు, కల్పించిన మౌలిక వసతులపై గురించి చెప్పారు. ఇప్పటికే వరంగల్‌, కరీంనగర్‌, ఖమ్మం, మహబూబ్‌నగర్‌లో ఐటీ టవర్లను ప్రారంభించుకున్నామని గుర్తుచేశారు. త్వరలోనే సిద్దిపేట, నిజామాబాద్‌, నల్గొండలోనూ ఐటీ టవర్ల నిర్మాణం పూర్తి కాబోతుందని చెప్పారు. అదిలాబాద్‌లోనూ మరొక ఐటీ టవర్‌ నిర్మిస్తున్నామని తెలిపారు. మంచిర్యాల జిల్లా బెల్లంపల్లిలో ఏర్పాటు చేసిన రెండు ఐటీ కంపెనీలను పరిశీలించానని,



బెల్లంపల్లి లాంటి చిన్న పట్టణంలోనే ఐటీ కంపెనీలు ఏర్పాటు చేసి విజయవంతంగా నడుపుతున్నప్పుడు తెలంగాణలోని ఏ పట్టణంలోనైనా ఐటీ కార్యాలయాలను ఏర్పాటు చేసి నడపడం సులభమమేనని అన్నారు. కరోనా సంక్షోభం తర్వాత ఐటీ కార్యకలాపాలను నిర్వహించడంలో కంపెనీలు వినూత్న పంథాను అనుసరిస్తున్నాయని, ప్రస్తుతం పెరిగిన ఇంటర్నెట్‌ కనెక్టివిటీతో ద్వితీయ శ్రేణి నగరాల్లో కార్యాలయాలు ఏర్పాటు చేయడం సులభం అయిందని అన్నారు.

కంపెనీలతో ఒప్పందం

సమావేశం అనంతరం పలు కంపెనీల సీఈవోలు, ఐటీ కంపెనీల ప్రతినిధులు తెలంగాణ ద్వితీయ శ్రేణి నగరాల్లో ఐటి కంపెనీలను ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వంతో అవగాహన ఒప్పందాన్ని కుదుర్చుకున్నారు. ఈ ఒప్పందాల ఫలితంగా తెలంగాణలోని ద్వితీయ శ్రేణి నగరాల్లో సుమారు 2500 ఐటి ఉద్యోగాలు రాబోతున్నాయి. పరోక్షంగా మరో పది వేల మందికి ఉపాధి అవకాశాలు ఏర్పడనున్నాయి. తెలంగాణలోని పట్టణాల్లో ఐటీ కార్యాలయాలు ఏర్పాటుచేసేందుకు తెలుగు ఎన్‌ఆర్‌ఐలతో పాటు అనేకమంది నాన్‌ తెలుగు ఎన్‌ఆర్‌ఐలు కూడా ముందుకొచ్చారు. ఐటీ సర్వ్‌ అలయన్స్‌ సంస్థ సహకారంతో ఈ సమావేశాన్ని టెక్నోజెన్‌ ఇంక్‌ సీఈఓ లక్స్‌ చేపూరి, మహేష్‌బిగాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. ఖమ్మం, వరంగల్‌, కరీంనగర్‌లో ఏర్పాటు చేసిన ఐటీ హబ్‌లు విజయవంతంగా నడపడానికి తమ వంతు సహకారం అందిస్తున్న లక్స్‌ చేపూరి, వంశీరెడ్డి, కార్తీక్‌ పొలసానిలను కేటీఆర్‌ అభినందించారు. ఈ సమావేశంలో ఐటీ, పరిశ్రమల శాఖల ముఖ్యకార్యదర్శి జయేశ్‌ రంజన్‌, ఇన్వెస్ట్‌మెంట్‌ ప్రమోషన్‌ అండ్‌ ఎన్‌ఆర్‌ఐ వ్యవహారాల ప్రత్యేక కార్యదర్శి విష్ణువర్ధన్‌రెడ్డి, చీఫ్‌ రిలేషన్స్‌ ఆఫీసర్‌ అమర్‌నాథ్‌రెడ్డి ఆత్మకూరి పాల్గొన్నారు.

జీనోం వ్యాలీలో విస్తరణ ప్రణాళికలు

- జెనేసిస్‌ బయో టెక్నాలజీ ప్రకటన
- 50-60 మిలియన్‌ డాలర్ల పెట్టుబడి

జెనేసిస్‌ బయోటెక్నాలజీ సంస్థ తన విస్తరణ ప్రణాళికలను శుక్రవారం ప్రకటించింది. అమెరికా పర్యటన లో ఉన్న మంత్రి కేటీఆర్‌తో జరిగిన సమావేశం అనంతరం కంపెనీ ఓ ప్రకటన విడుదల చేసింది. జెనసిస్‌ కంపెనీ విస్తరణ ప్రణాళికల పట్ల కేటీఆర్‌ హర్షం వ్యక్తం చేశారు. ఈ నిర్ణయంతో ఇన్సులిన్‌ ధరలు అందుబాటులోకి రావడంతో పాటు కోట్లాది మంది డయాబెటిస్‌ పేషెంట్లకు ఎంతో ఉపయోగంగా ఉంటుందని తెలిపారు.

ఇప్పటికే జీనోమ్‌ వ్యాలీలో 50 మిలియన్‌ డాలర్లను పెట్టుబడిగా పెట్టిన కంపెనీ తాజాగా మరో 50 నుంచి 60 మిలియన్‌ డాలర్ల అదనపు పెట్టుబడితో రీకాంబినెంట్‌ బల్క్‌ మ్యానుఫాక్చరింగ్‌ కేంద్రాన్ని ఏర్పాటు చేయడం పట్ల మంత్రి కేటీఆర్‌ హర్షం వ్యక్తం చేశారు. ఇప్పటికే సంస్థకు 250 మందికిపైగా ఉద్యోగులు ఉన్నారని, తాజా విస్తరణ ద్వారా మరో 300 మందికి ఉద్యోగాలు వచ్చే అవకాశం ఉందని తెలిపారు.

హైదరాబాద్‌లో జాప్‌కామ్‌ గ్రూప్‌ సెంటర్‌ ఆఫ్‌ ఎక్సలెన్సీ
కరీంనగర్‌లో ఎక్లాట్‌ మెడికల్‌ కోడింగ్‌ సేవల కేంద్రం

ఆర్టిఫిషియల్‌ ఇంటెలిజెన్స్‌, ఎన్‌ఎల్‌పీ ఆధారిత ఉత్పత్తులను తయారీలో పేరొందిన జాప్‌కాం కంపెనీ హైదరాబాద్‌లో తన కేంద్రాన్ని ఏర్పాటు చేసేందుకు ముందుకొచ్చింది. ఫైనాన్స్‌, టెక్నాలజీ, రిటైల్‌ రంగాలకు సంబంధించిన సాఫ్ట్‌వేర్‌ ఉత్పత్తులను ఈ కేంద్రం నుంచి తయారు చేయనుంది. అమెరికాతో పాటు భారత దేశంలోనూ జాబ్‌కాం తన కార్యకలాపాలను నిర్వహిస్తున్నది. ప్రస్తుతం ఏర్పాటు చేస్తున్న ఈ సెంటర్‌ ఆఫ్‌ ఎక్సలెన్స్‌తో ముందుగా 500 మందిని సంవత్సరంలోగా మొత్తంగా 1000 మందికి ఉద్యోగ అవకాశాలు లభించబోతున్నాయి. మంత్రి కేటీఆర్‌తో జాఫ్‌కాం ఫౌండర్‌, సీఈఓ కిషోర్‌ పల్లంరెడ్డి సమావేశం అయ్యాక సెంటర్‌ ఆఫ్‌ ఎక్సలెన్స్‌ ఏర్పాటు తాలూకు ప్రకటన చేశారు.

కరీంనగర్‌లో మెడికల్‌ కోడింగ్‌ కేంద్రం

ప్రపంచ ప్రఖ్యాత హెల్త్‌ కేర్‌ కంపెనీ 3ఎంకు మెడికల్‌ కోడింగ్‌ క్లినికల్‌ డాక్యుమెంటేషన్‌ సేవలను అందించేందుకు ఎక్లాట్‌ హెల్త్‌ సొల్యూషన్స్‌ ఒక అవగాహన ఒప్పందాన్ని కుదుర్చుకున్నది. ఈ కేంద్రాన్ని కరీంనగర్‌లో ప్రత్యేకంగా ఏర్పాటు చేస్తామని ప్రకటించింది. తొలుత 100 మంది ఉద్యోగులతో ప్రారంభమయ్యే ఈ కేంద్రం భవిష్యత్తులో 200 మంది పనిచేయనున్నారు. కరీంనగర్‌లో తమ మెడికల్‌ కోడింగ్‌, సంబంధిత టెక్నాలజీ సర్వీసుల కేంద్రం ఇప్పటికే పనిచేస్తుందని, అనేక భారీ కంపెనీలకు పెద్ద ఎత్తున సేవలను అందిస్తున్నామని ఎక్లాట్‌ హెల్త్‌ సొల్యూషన్స్‌ గ్రూప్‌ సీఈవో, ఫౌండర్‌ కార్తీక్‌ పోలసాని తెలిపారు.

ఏరోస్పేస్‌ రంగంలో తెలంగాణ అద్భుత ప్రగతి
ఏరోస్పేస్‌ డిఫెన్స్‌ రౌండ్‌ టేబుల్‌ సమావేశంలో మంత్రి కేటీఆర్‌

ఏరోస్పేస్‌ రగంలో తెలంగాణ రాష్ట్ర అద్భుత ప్రగతిని సాధించిందని మంత్రి కేటీఆర్‌ అన్నారు. అమెరికా పర్యటనలో ఉన్న మంత్రి కేటీఆర్‌ ఎరోస్పేస్‌, డిఫెన్స్‌ రంగాల్లో పనిచేస్తున్న కంపెనీలు, ఏరోస్పేస్‌, డిఫెన్స్‌ స్టార్టప్‌లు పాల్గొన్న రౌండ్‌ టేబుల్‌ సమావేశంలో మాట్లాడారు. ఈ రంగాల్లో తెలంగాణలో ఉన్న పెట్టుబడి అవకాశాలను వివరించారు. గత తొమ్మిది సంవత్సరాల్లో ఏరోస్పేస్‌ రంగంలో తెలంగాణ అద్భుత ప్రగతిని సాధించిందని, అనేక అమెరికన్‌ కంపెనీలు తెలంగాణలో ఇప్పటికే పెట్టుబడులు పెట్టిన అంశాన్ని ప్రత్యేకంగా ప్రస్తావించారు.

తెలంగాణ రాష్ట్రంలో ప్రత్యేకంగా ఏరోస్పేస్‌, డిఫెన్స్‌ రంగాల కోసం ఏర్పాటు చేసిన మౌలిక వసతులు, ఆదిభట్ల ఏరోస్పేస్‌ సెజ్‌ గురించి ఈ సమావేశంలో మంత్రి కేటీఆర్‌ ప్రత్యేకంగా ప్రస్తావించారు. ఇప్పటికే ప్రపంచ ప్రఖ్యాత ఏరోస్పేస్‌, డిఫెన్స్‌ కంపెనీలు తెలంగాణ రాష్ట్రంలో కార్యకలాపాలు నిర్వహిస్తున్న విషయాన్ని తెలిపారు. రాష్ట్రం ప్రభుత్వ టీఎస్‌ఐపాస్‌ విధానాన్ని వివరించారు. తెలంగాణ ప్రభుత్వానికి ఏరోస్పేస్‌, డిఫెన్స్‌ రంగం అత్యంత ప్రాధాన్యత రంగం అని అన్నారు. 2018, 2020 రెండేండ్లలో ఏరోస్పేస్‌ రంగానికి సంబంధించి తెలంగాణ ఉత్తమ రాష్ట్ర అవార్డుని అందుకుందని గుర్తుచేశారు.

ఈ రంగంలో తెలంగాణ రాష్ట్రానికి వచ్చిన అనేక అవార్డులతో ఏరోస్పేస్‌ రంగంలో పెట్టుబడులకు తెలంగాణనే అత్యుత్తమ గమ్యస్థానం అన్న విషయం నిరూపితమైందని తెలిపారు. ఇప్పటికే హైదరాబాద్‌ నగరంలో కార్యకలాపాలు నిర్వహిస్తున్న అమెరికన్‌ ఏరోస్పేస్‌, డిఫెన్స్‌ కంపెనీల ప్రతినిధులు తెలంగాణ రాష్ట్రంలో తమ కార్యకలాపాల పట్ల సానుకూలపైన అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. తెలంగాణ రాష్ట్రం ప్రభుత్వ విధానాలను పెట్టుబడులకు రాష్ట్రం ఇస్తున్న ప్రాధాన్యతను ప్రత్యేకంగా ప్రశంసించారు. తమతోపాటు తమ సప్లై చైన్‌లో ఉన్న ఇతర కంపెనీలను కూడా తెలంగాణ రాష్ట్రానికి పరిచయం చేస్తామని తెలిపారు.

కార్పొరేట్ల చేతుల్లో మీడియా

మొబైల్‌ ఉన్న ప్రతిఒక్కరూ జర్నలిస్టే

- జాతీయ సెమినార్‌లో సోషల్‌ సైన్సెస్‌ డీన్‌ ప్రొఫెసర్‌ స్టీవెన్సన్‌

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్‌

మీడియా రంగం రాజకీయ నేతలు, కార్పొరేట్లు, మాఫియా చేతుల్లోకి పోయిందని ఉస్మానియా యూనివర్సిటీ సోషల్‌ సైన్సెస్‌ డీన్‌ ప్రొఫెసర్‌ స్టీవెన్సన్‌ అన్నారు. కార్పొరేట్ల చేతుల్లోకి పోయిన తర్వాత మీడియా పరిస్థితి మారిపోయిందని, వార్తల కంటే యాడ్స్‌కే ప్రాధాన్యత ఇస్తున్నారని తెలిపారు. యాడ్స్‌ కోసం ఎగ్జిక్యూటీవ్‌ ఎడిటర్లను నియమిస్తున్నారని గుర్తుచేశారు. శుక్రవారం హైదరాబాద్‌లోని అంబేద్కర్‌ విద్యాసంస్థల ఆధ్వర్యంలో 'రోల్‌ ఆఫ్‌ మీడియా ఇన్‌ ఛేంజింగ్‌ సోషియో, పొలిటికల్‌, ఎకానమిక్‌, అండ్‌ టెక్నాలాజికల్‌ ఎన్వీరాన్‌మెంట్‌' అంశంపై నిర్వహించిన జాతీయ సెమినార్‌లో ఆయన మాట్లాడారు. మీడియా రంగంలో అనేక మార్పులు వచ్చాయని తెలిపారు. మొబైల్‌ ఉన్న ప్రతి ఒక్కరూ జర్నలిస్టేనని, సెకన్‌లో తమకు సంబంధించిన పోస్టులు, రీల్స్‌ రూపంలో సోషల్‌ మీడియాలో అప్‌లోడ్‌ చేస్తున్నారని తెలిపారు. ప్రపంచం అస్థిరత, అనిశ్చితి, సంక్లిష్టత, అస్పష్టమైన పరిస్థితిల్లో ఉందని చెప్పారు. దేశ సామాజిక, ఆర్థిక, భవిష్యత్‌కు, దేశాభివృద్ధికి సాంకేతిక విద్య ఎంతో అవసరమని అన్నారు. ఏ సమాజంలోనైనా మేధోపరమైన విజ్ఞానాన్ని ప్రజలకు అందించడంలో మీడియా ప్రముఖ పాత్ర పోషిస్తున్నదని తెలిపారు. మీడియా రెండు వైపులు పదునైనా కత్తి లాంటిదని అన్నారు. రాజకీయ నినాదాలను, సంచలనాత్మక విషయాలను ప్రచారం చేయడం ద్వారా ప్రజల్లో విద్యాపరమైన తాత్విక ఆలోచనలను రేకెత్తించగలదని వివరించారు. దీంతోపాటు ప్రతికూలమైన వాతావరణం, గందరగోళం, అనిశ్చితి, నిరాశలను కూడ మీడియా సృష్టించగలదని చెప్పారు. వాస్తవ పరిస్థితులను అంచనావేయడంతోపాటు సమాజంలోని లోపాలనూ ఎత్తిచూపగలదని అన్నారు. విజ్ఞానం, సాంకేతికత సమాజ శ్రేయస్సుకు, పురోగతికి దోహదం చేస్తున్నదని అన్నారు. ఇది ప్రజాస్వామ్యానికి నాలుగో స్తంభంగా ఉందని, సామాజిక, ఆర్థిక, రాజకీయ, అంతర్జాతీయ వ్యవహారాల్లో కీలకపాత్ర పోషిస్తున్నదని తెలిపారు. ప్రజాస్వామ్యంలో పత్రికా స్వేచ్ఛ ప్రధానమైనదని అన్నారు. ప్రజాస్వామ్య మనుగడ, అభివృద్ధి, సంరక్షణ, పారదర్శకపాలనకు పత్రికా స్వేచ్ఛ ముఖ్యమని అన్నారు. పత్రిక స్వేచ్ఛలో భారతదేశం 130స్థానంలో ఉందని గుర్తుచేశారు. రాజకీయ రంగంలోనూ అనేకమార్పులు వచ్చాయని తెలిపారు. ఒక పార్టీ గుర్తుతో గెలిచి మరొక పార్టీలో చేరుతున్నారని, ఇది సమాజానికి మంచిది కాదని అన్నారు. ఐటీ రంగంలో రాత్రికి రాత్రే కంపెనీలను ఎత్తేసినట్టు ప్రకటనలు వస్తున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో అంబేద్కర్‌ విద్యాసంస్థల జాయింట్‌ సెక్రటరీ రమణ, ఎంబీఏ కాలేజ్‌ ప్రిన్సిపాల్‌ భవాని, ప్రొగ్రామ్‌ కన్వీనర్‌ గుంటి కృష్ణకుమార్‌, తురాగ్‌ ఫౌండేషన్‌ ప్రతినిధి శైలజ, సత్యప్రకాష్‌ తదితరులు పాల్గొన్నారు.

మీడియాపై అవినాష్‌రెడ్డి అనుచరుల దాడికి ఫెడరేషన్‌ ఖండన

నవతెలంగాణ-హైదారాబాద్‌

ఏబీఎన్‌ ఆంధ్రజ్యోతి, హెచ్‌ఎంటీవి రిపోర్టర్లు, ఇతర సిబ్బందిపై శుక్రవారం మాసాబ్‌ ట్యాంక్‌ సమీపంలో కడప ఎంపీ వైఎస్‌ అవినాష్‌రెడ్డి అనుచరులు దాడికి పాల్పడి, వాహనాలు, కెమేరాలు ధ్వంసం చేయడాన్ని తెలంగాణ వర్కింగ్‌ జర్నలిస్ట్స్‌ ఫెడరేషన్‌ (టీడబ్ల్యూజేఎఫ్‌) తీవ్రంగా ఖండించింది. ఈ మేరకు ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.బసవ పున్నయ్య శుక్రవారం ఒక ఒక ప్రకటన విడుదల చేశారు. ఆయా ఛానెళ్ల ప్రసారాల పట్ల, వ్యక్తుల ప్రవర్తన పట్ల ఏవైనా అభ్యంతరాలు ఉంటే ప్రెస్‌ కౌన్సిల్‌ లేదా పోలీసులకు ఫిర్యాదు చేయాలి కానీ, భౌతికదాడులకు పాల్పడటం సరికాదని వ్యాఖ్యానించింది. విధి నిర్వహణలో ఉన్న జర్నలిస్టుల పై దాడులకు పాల్పడటం ద్వారా బెదిరించాలనుకోవడం, మీడియాను నియంత్రించాలనుకోవడం భ్రమేనని అభిప్రాయపడ్డారు. ప్రజలకు అవసరమైన అన్ని రకాల వార్తలను స్వేచ్ఛగా అందించే హక్కు, బాధ్యత మీడియాకు రాజ్యాంగం కల్పించిందని గుర్తు చేశారు. తన అనుచరులకు ఎంపీ అవినాష్‌రెడ్డి బుద్ధిచెప్పుకోవాలనీ, ఎవరూ రాజ్యాంగానికి, చట్టానికి అతీతులు కారని చెప్పారు. దాడికి పాల్పడిన నిందితులను వెంటనే గుర్తించి చట్టపరమైన కేసులు నమోదు చేసి, అరెస్ట్‌ చేయాలని పోలీసులను డిమాండ్‌ చేశారు. రాష్ట్ర హోంమంత్రి మహమూద్‌ అలీ ఈ విషయమై దృష్టిసారించి గట్టిచర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

రష్యాను మరింత కట్టడి చేసే చర్యలు

ప్రకటించిన జి-7 నేతలు

- హిరోషిమా అణు స్మారకం వద్ద నివాళి ఘటించిన నాయకులు

హిరోషిమా: రష్యాపై కొత్తగా ఆంక్షలు విధించేందుకు జి 7 దేశాలు శుక్రవారం అంగీకరించాయి. రష్యాకు యుద్ధానికి సహకరించగల సాంకేతికతలు, పారిశ్రామిక పరికరాలు, సేవలపై మరిన్ని కఠినమైన ఆంక్షలను విధించనున్నట్లు తెలిపాయి. ఉక్రెయిన్‌పై యుద్ధం ప్రారంభమై 15మాసాలైన నేపథ్యంలో మాస్కోను మరింత కట్టుదిట్టం చేసేందుకు తాజా చర్యలు చేపడుతున్నట్లు అమెరికా, బ్రిటన్‌, యురోపియన్‌ యూనియన్‌లు ప్రకటించిన తరుణంలో ఈ ప్రకటన వెలువ డింది. జి-7 ఆర్థిక వ్యవస్థలను రష్యా ఉపయోగించు కునే అవకాశాలను మరింత నియంత్రించాలని భావిస్తున్నట్లు జి-7 తెలిపింది. రష్యా దాడికి కీలకమైన ఉత్పత్తుల ఎగుమతులన్నింటినీ జి 7 దేశాల వ్యాప్తంగా నియంత్రించేందుకు మరింత విస్తృతంగా చర్యలు తీసుకుంటున్నట్లు జి 7 దేశాల నేతలు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సాంకేతికతలు, పారిశ్రామికోత్పత్తులు, సేవలు ఇలా యుద్ధానికి అవసరమైన వాటన్నింటినీ రష్యాకు అందకుండా చేయాలన్నది తమ లక్ష్యమని పేర్కొన్నారు. ప్రస్తుత మున్న ఆంక్షల వ్యవస్థనుండి తప్పించు కోకుండా నివారించడానికి కూడా తాము చర్యలను కట్టుదిట్టం చేయనున్నట్లు తెలిపారు. అంతకుముందు అమెరికా సహా జి 7 దేశాలు తాము స్వంతంగా తీసుకునే చర్యలను ప్రకటించాయి. రష్యా, ఇతర దేశాలకు చెందిన మరో 70 సంస్థలను అమెరికా బ్లాక్‌ లిస్ట్‌లో పెట్టనున్నట్లు అమెరికా సీనియర్‌ ప్రభుత్వాధికారి వెల్లడించారు. అలాగే రష్యాతో జరిగే వజ్రాల వ్యాపారాన్ని బ్రిటన్‌ లక్ష్యంగా చేసుకుంది. రాగి, అల్యూమినియం, నికెల్‌తో పాటూ రత్నాల దిగుమతులపై నిషేధం విధించనున్నట్లు ప్రకటించింది. రష్యాలో దొరికే, ఉత్పత్తయ్యే లేదా ప్రాసెసయ్యే వజ్రాలను వినియోగించడం, వాటి వ్యాపారం ఆంక్షలు విధిస్తున్నట్లు జి 7 ప్రకటన పేర్కొంది. చర్చలు ప్రారంభానికి ముందుగా జి 7 దేశాల నేతలు హిరోషిమా నగరంలోని శాంతి పార్క్‌ వద్దకు చేరుకున్నారు. అక్కడ జపాన్‌ ప్రధాని ఫ్యుమియో కిషిదా వారికి స్వాగతం పలికారు. ఆనాటి అణు దాడిలో అశువులు బాసిన లక్షలాదిమందికి గుర్తుగా ఏర్పాటు చేసిన స్మారక స్థూపం వద్ద నేతలు నివాళి ఘటించారు.

2001 నుంచి అమెరికా యుద్ధాలతో
45 లక్షల మంది ప్రజలు మృతి



బ్రౌన్‌ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో నిర్వహించిన "యుద్ధం ఖరీదు" అనే రీసెర్చ్‌ ప్రోజక్టు ఈ వారంలో విడుదల చేసిన నివేదిక ప్రకారం 2001లో అమెరికాలోని వరల్డ్‌ ట్రేడ్‌ సెంటర్‌ పై, పెంటగాన్‌పై టెర్రరిస్టు దాడి జరిగిన తరువాత అమెరికా సైన్యం వివిధ దేశాలపై చేసిన యుద్ధాలలో 45 లక్షల మంది చనిపోయారు. ఈ రీసెర్చ్‌ ప్రోజక్టు యుద్ధాలలో ప్రత్యక్షంగా చనిపోయినవారి సంఖ్యకు సంబంధించిన అంచనాలను తరచుగా విడుదల చేస్తుంది. అంతేకాకుండా యుద్ధాల వల్ల వ్యవసాయం, ఆరోగ్య సంరక్షణ, రవాణా, ఒక్కమాటలో చెప్పాలంటే ఆర్థిక వ్యవస్థ విచ్ఛిన్నం కావటం వల్ల పరోక్షంగా చనిపో యినవారి సంఖ్యను అంచనా వేస్తుంది. అఫ్ఘానిస్తాన్‌, ఇరాక్‌, లిబియా, సోమాలియా, సిరియాలలో జరిగిన యుద్ధాలలో మరణించినవారు ఈ 45లక్షల హతులలో ఉన్నారు. యుద్ధాలలో చనిపోయిన అమెరికా సైనికులు, కాంట్రాక్టర్స్‌, యుద్ధం పర్యవసానంగా చనిపోయిన వారిపై ఈ నివేదిక తన దృష్టిని సారించలేదు. ఉక్రెయిన్‌లో జరుగుతున్న యుద్ధం స్వేచ్ఛ, ప్రజాస్వామ్యం, మానవ హక్కుల కోస మని అమెరికా చేస్తున్న ప్రచారం ఎంతటి మోసమో ఈ నివేదిక తేటతెల్లం చేస్తోంది. భూగ్రహం మీద అత్యంత హింసాత్మకమైన, పరుల రక్తంతో తడిసిన శక్తి ఏదైనా ఉందంటే అది అమెరికానే అవుతుంది. రష్యాపై అమె రికా, దాని మిత్ర నాటో కూటమి దేశాలు ఉక్రెయిన్‌లో చేస్తున్న పరోక్ష యుద్ధం గనుక మరింత తీవ్ర రూపం దాలిస్తే అప్పుడు గత 22 ఏండ్లలో అమెరికా చేసిన యుద్ధాలలో చనిపోయిన వారి సంఖ్యను దాటి మరణాలు ఉంటాయి. అమెరికా చేసిన యుద్ధాల వల్ల 45 లక్షల మరణాలు సంభవించాయనే అంచనాలో పొరపాటు శాతం కొద్దోగొప్పో ఉన్నప్పటికీ ప్రాణ నష్టం ఊహాతీతంగా ఉంది. "21వ శతాబ్దపు యుద్ధాలు" అని పేర్కొన్న జార్జి డబ్ల్యు బుష్‌ అఫ్ఘానిస్తాన్‌, ఇరాక్‌ దేశాలలో యుద్ధాలను మొదలెట్టాడు. ఆ తరువాత బారక్‌ ఒబామా ఈ రెండు యుద్ధాలను కొనసాగిస్తూ లిబియా, సిరియా, యెమెన్‌లలో యుద్ధాలను పరోక్షంగాను, ప్రత్యక్షంగాను ఆరంభించాడు. డోనాల్డ్‌ ట్రంప్‌, జో బిడెన్‌ ఆ ఐదు యుద్ధాలను ఏదో ఒక రూపంలో కొనసాగించారు. అమెరికా చేసిన ఆరో యుద్ధం సోమాలియాలో జరిగింది. అమెరికా దురాక్రమణ గురైన దేశాల న్నింటికంటే నాశనమైన దేశం అఫ్ఘానిస్తాన్‌. అఫ్ఘానిస్తాన్‌ను అమెరికా 20 ఏండ్లపాటు దురాక్రమించింది. అఫ్ఘానిస్తాన్‌ ఆర్థిక వ్యవస్థ పూర్తిగా పతనమైంది. దేశంలోని సగం జనాభా తీవ్ర దారిద్ర్యంలో మగ్గుతోంది. సామ్రాజ్య వాదానికి, యుద్ధానికి అవినాభావ సంబంధం ఉంటుంది. యుద్ధాలు లేకుండా పెట్టుబడిదారీ వ్యవస్థ మనజాలదు. అంతర్జాతీయ స్థాయిలో పెట్టుబడిదారీ వ్యవస్థకు ఒక ప్రత్యామ్నాయం ఏర్పడిందాకా ఇలా అమెరికా నేతృత్వంలో ఎక్కడో ఒక చోట సామ్రాజ్యవాద యుద్ధాలు జరుగుతూనే ఉంటాయి. సైనికులే కాకుండా సామాన్యులూ వేల సంఖ్యలో హతులౌతూనే ఉంటారు.

ఉక్రెయిన్‌లో శాంతి స్థాపనకు
కిసింజర్‌ ప్రతిపాదనపై స్పందించిన చైనా



ఉక్రెయిన్‌ నాటోలో చేరితే అది ఉక్రెయిన్‌ ప్రయోజనాలకు, రష్యా ప్రయోజనాలకు అనుకూలంగా ఉంటుందని అమెరికా దౌత్యవేత్త హెన్రీ కిసింజర్‌ చేసిన ప్రతిపాదనను చైనా త్రోసిపుచ్చింది. ఐరోపాలో శాంతి కోసం ఉక్రెయిన్‌ నాటోలో చేరకూడదని చైనా సూచించింది. నాటోలో ఉక్రెయిన్‌ చేరితే రష్యాకు, నాటో దేశాలకు మధ్య ఘర్షణలు పెరుగుతాయని చైనా విదేశాంగ శాఖ ప్రతినిధి వాంగ్‌ వెన్బిన్‌ వాదించాడు. "ప్రధాన దేశాల మధ్య ఘర్షణ వాతావరణం ఉన్నప్పుడు ఉక్రెయిన్‌ సరిహద్దుగా ఉండ కూడదు. ఒక దేశ భద్రతకు ఇతర దేశాల భద్రత ఫణం కారాదు" అని ఆయన అన్నాడు. ఎకనామిస్ట్‌ మ్యాగజైన్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో అమెరికా కూటమికి బయట ఉక్రెయిన్‌ ఉండటం ప్రమాదకరమని హెన్రీ కిసింజర్‌ అన్నాడు. ఉక్రెయిన్‌ నాటోలో సభ్యత్వం తీసుకోవటం ఉక్రెయిన్‌ కే కాకుండా రష్యాకు కూడా అనుకూలంగా ఉంటుందని ఆయన తన అభిప్రాయంగా చెప్పాడు. అయితే ఐరోపాలో భద్రతా నిర్మాణం పదిలంగా ఉండాలంటే శాంతియుత చర్చలే ఆధారమని చైనా అధికార ప్రతినిధి విశదీకరించాడు. ఉక్రెయిన్‌లో జరుగుతున్న యుద్ధాన్ని ఆపటానికి చైనా ఫిబ్రవరిలో 12 సూత్రాల శాంతి ప్రతిపాదన చేసింది. చైనా ప్రతిపాదన ఆధారంగా ఉక్రె యిన్‌తో చర్చలు జరపటానికి సిద్ధంగా ఉన్నానని పుతిన్‌ ప్రకటించాడు. అయితే అమెరికా నాయకత్వంలోని పశ్చిమ దేశాలు 12 సూత్రాల చైనా ప్రతిపాదనను త్రోసి పుచ్చాయి. చైనా సూచనలు ఊహాజనితంగా ఉన్నా యని యూరోపియన్‌ యూనియన్‌ విదేశాంగ విధాన అధినేత జోసెప్‌ బోరైల్‌ అన్నాడు. చైనా ప్రతిపాదన రష్యాకు అనుకూలంగా ఉన్నదని ఉక్రెయిన్‌ అధ్యక్షుడు వ్లాడిమీర్‌ జెలెన్‌స్కీ సలహాదారు వాదించాడు.